
సత్యమేవ జయతే

సాక్షి



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

2,000 నోటుకు చెల్లుచీటి



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనూహ్య నిర్ణయం

- క్లీన్ నోట్ పాలసీ ప్రకారం ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటన
- 23వ తేదీ నుంచి బ్యాంకుల్లో డిపాజిట్‌కు, మార్చుకునేందుకు ప్రజలకు అవకాశం
- సెప్టెంబర్ 30 వరకు గడువు
- ఒకదఫా రూ.20,000 పరిమితి వరకే ఇతర డినామినేషన్లలోకి మార్చుకునేందుకు చాన్స్

ముంబై: నల్లధనం కట్టడి పేరిట పెద్ద నోట్లను రద్దు చేసి రూ.2,000 నోటును తెచ్చిన మోదీ సర్కారు.. అనూహ్యంగా దానికి కూడా చెక్ చెప్పింది. రూ.2,000 నోటును చెలామణీ నుంచి పూర్తిగా ఉపసంహరిస్తున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) శుక్రవారం ప్రకటించింది. 'వివిధ అంశాలను దృష్టిలో ఉంచుకుని, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 'క్లీన్ నోట్ పాలసీ' (డిజిటల్ విధాన ప్రోత్సాహం) ప్రకారం రూ.2,000 డినామినేషన్ నోట్లను చెలామణీ నుంచి ఉపసంహరించుకోవాలని నిర్ణయించడం జరిగింది..' అని ప్రకటనలో పేర్కొంది. తక్షణమే రూ.2,000 నోట్లను జారీ చేయడాన్ని నిలిపివేయాల్సిందిగా బ్యాంకులను కోరినట్లు తెలిపింది. అయితే ఈ నోట్లను ఖాతాల్లో డిపాజిట్ చేసుకోవడానికి లేదా బ్యాంకుల్లో మార్చుకోవడానికి మే 23వ తేదీ నుంచి సెప్టెంబర్ 30 వరకు ప్రజలకు సమయం ఇచ్చింది. ఒకదఫా రూ.20,000 పరిమితి వరకూ (అంటే రూ.2,000 నోట్లు 10) ఇతర డినామినేషన్లలోకి మార్చుకోవచ్చని తెలిపింది. అలాగే మే 23 నుంచి ఇష్యూ డిపార్ట్‌మెంట్‌లను కలిగి ఉన్న 19 ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లో (ఆర్‌వో) కూడా ఒకేసారి రూ.20,000 పరిమితి వరకు మార్చుకునే సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొంది. కాగా నల్లధనం నిల్వలను పెంచుకునేందుకు అత్యధిక విలువ కలిగిన నోట్లను ఉపయోగిస్తున్నారనే ఆందోళనల నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ అనూహ్య చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది.

2018-19లోనే ముద్రణ నిలిపివేత

పాత రూ.500, రూ.1,000 నోట్ల రద్దు సమయంలోనే రూ.2,000 నోటును ప్రవేశపెట్టడం జరిగింది. అప్పట్లో చెలామణీలో ఉన్న రూ. 500, రూ.1,000 నోట్ల చట్టబద్ధమైన చెల్లుబాటును ఉపసంహరించుకున్న తర్వాత, ఆర్థిక వ్యవస్థలో కరెన్సీ అవసరాన్ని త్వరితగతిన తీర్చడానికి ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే 2018-19లోనే ఆర్‌బీఐ రూ.2,000 నోట్ల ముద్రణను నిలిపివేసింది. ఈ నోట్లు ఇప్పటికే చాలా అరుదుగా చెలామణీలో ఉన్నాయి.

అవసరాలకు ప్రస్తుత కరెన్సీ స్టాక్ ఓకే..

రూ. 2,000 నోటును ప్రస్తుతం సాధారణ లావాదేవీలకు వినియోగించడం లేదని తాము గమనించినట్లు ఆర్‌బీఐ పేర్కొంది. ప్రస్తుతం ఇతర డినామినేషన్లలో చెలామణీలో ఉన్న నోట్ల నిల్వ ప్రజల కరెన్సీ అవసరాలను తీర్చడానికి సరిపోతుందని స్పష్టం చేసింది. రూ.2,000 నోట్లను డిపాజిట్ చేయడానికి లేదా మార్చుకోవడానికి

మిగతా IIవ పేజీలో ▶

హైకోర్టు తాత్కాలిక సీజేగా జస్టిస్ ఏవీ శేషసాయి

- రాష్ట్రపతి ఉత్తర్వులు
- నోటిఫై చేసిన కేంద్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే)గా సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జస్టిస్ శేషసాయి నియామకాన్ని కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా ఉన్న జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా నియమితులైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైకోర్టుకు పూర్తిస్థాయి సీజే నియమితులయ్యేంత వరకు జస్టిస్ శేషసాయి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా కొనసాగుతారు.



స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబం

జస్టిస్ శేషసాయి 1962 జూన్ 3న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో వ్యవసాయ, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబంలో జన్మించారు. భీమవరం మునిసిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో ప్రాథమిక విద్యను, లూథరన్ హైస్కూల్‌లో పాఠశాల ఉన్నత విద్యను అభ్యసించారు. కేజీఆర్‌ఎల్ కాలేజీలో ఇంటర్, డీఎన్‌ఆర్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేశారు. ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీలో బీఎల్ చదివారు. 1987 జూలైలో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. రెవెన్యూ కేసుల్లో దిట్ట అయిన పి.రాజగోపాల్‌రావు వద్ద జూనియర్‌గా వృత్తి జీవితాన్ని ఆరంభించారు. సివిల్, క్రిమినల్, సర్వీసు, రాజ్యాంగ కేసులతో సహా అన్ని రకాల చట్టాలకు సంబంధించిన కేసుల్లో నైపుణ్యం సంపాదించారు. అతి తక్కువ కాలంలో సొంతంగా ప్రాక్టీస్ మొదలుపెట్టారు. విద్య, సంస్కృతి, సంగీతం, తత్వం అంటే ఆసక్తి. హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా, ఏపీ బార్ కౌన్సిల్ ప్యానల్ అడ్వొకేట్‌గా, పోలవరం ప్రాజెక్టుపై ఒడిశా ప్రభుత్వం దాఖలు చేసిన సూట్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున జూనియర్ న్యాయవాదిగా వ్యవహరించారు. 2013 ఏప్రిల్ 12న అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. రాష్ట్ర విభజన తరువాత 2019లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణం చేశారు. ఇప్పటివరకు నంబర్ 2 స్థానంలో కొనసాగారు.



సంక్షేమ చదువులు

- అత్యున్నత ప్రమాణాలే లక్ష్యంగా విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు
- విద్యార్థులను ప్రపంచ స్థాయి పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అనేక పథకాలు
- జగనన్న అమ్మఒడితో అందరికీ చదువుకునే అవకాశం
- మనబడి: నాడు-నేడుతో పాఠశాలల్లో సకల సౌకర్యాలు
- విద్యా కానుకతో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు
- ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా ప్రభుత్వ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమం
- జగనన్న గోరుముద్ద కింద విద్యార్థులకు పౌష్టికాహారం
- అత్యధిక మార్కులు సాధించినవారికి నగదు ప్రోత్సాహకాలు
- 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు
- అన్ని తరగతుల్లోనూ డిజిటల్ బోధన
- బైలింగ్యువల్ పుస్తకాలు



బ్రాండ్ ఏపీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర చరిత్రలోనే గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో అనేక విప్లవాత్మక సంస్కరణలను ప్రవేశపెట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక విద్యా రంగాన్ని కొత్త పుంతలు తొక్కించింది. విద్యారంగంలో గత మూడేళ్లలో సంస్కరణలకే ప్రభుత్వం ఏకంగా రూ.54 వేల కోట్ల వ్యయం చేసింది. మనబడి: నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి సకల సౌకర్యాలు కల్పించింది. జగనన్న అమ్మ ఒడి కింద ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న ప్రతి విద్యార్థికి ఏటా రూ.15 వేలు అందిస్తోంది. అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా ప్రభుత్వ స్కూళ్లలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) విధానం, ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టింది. జగనన్న విద్యా కానుక కింద పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, షూ, లేసులు, యూనిఫామ్, బ్యాగు, టై, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ వంటివన్నీ అందించింది. జగనన్న గోరుముద్ద పథకం కింద శుచికర, రుచికర మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందిస్తోంది. అందరికీ డిజిటల్ విద్యా బోధనకు వీలుగా డిజిటల్ తరగతులు, స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేసింది. అలాగే అత్యంత నాణ్యమైన బైజూస్ కంటెంట్‌ను విద్యార్థులకు అందిస్తోంది. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులను అందజేసింది. ప్రభుత్వ పథకాలను రెండు చేతులా అందిపుచ్చుకుంటున్న విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో సత్తా చాటారు. కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలలను తలదన్నేలా అత్యధిక మార్కులు సాధించారు. ఈ నేపథ్యంలో జగనన్న ఆణిముత్యాలుగా ఎంపిక చేసి వారికి ప్రభుత్వం నగదు పురస్కారాలను అందించనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఇలా ఉన్నాయి..

జగనన్న అమ్మ ఒడి

ఈ పథకం కింద పాఠశాలలకు తమ పిల్లలను పంపే అర్హురాలైన ప్రతి పేద తల్లికి ఏటా రూ.15 వేల చొప్పున అందిస్తున్నారు. ఇప్పటివరకు రూ. 19,617.53 కోట్లు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే కాకుండా ప్రైవేటు స్కూళ్లలో చదివేవారికి కూడా ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. ఫలితంగా పాఠశాలల్లో విద్యార్థుల చేరికల శాతం గణనీయంగా పెరిగింది.

మన బడి: నాడు -నేడు

మన బడి: నాడు -నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను ప్రభుత్వం సమూలంగా మార్చింది. దశలవారీగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలను కల్పించింది. స్కూల్ భవనాలు, తాగు నీరు, తరగతి గదులు, గ్రీన్ చాక్ బోర్డులు, కిచెన్ షెడ్లు, విద్యుత్, ఫ్యాన్లు, టీచర్లు-విద్యార్థులకు ఫర్నీచర్, బాలబాలికలకు వేర్వేరుగా టాయిలెట్లు, వాటిలో రన్నింగ్ వాటర్, స్కూల్ చుట్టూ ప్రహరీ, స్కూల్ మొత్తానికి రంగులు.. ఇలా మొత్తం 11 రకాల సౌకర్యాలను కల్పించింది. అత్యంత నాణ్యతతో విద్యార్థుల పేరెంట్స్ కమిటీలు, ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో ఎక్కడా రాజీపడకుండా ప్రభుత్వ స్కూళ్లలో సకల వసతులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

జగనన్న గోరుముద్ద

ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు అత్యంత నాణ్యమైన, రుచికరమైన పోషకాలతో కూడిన

మిగతా IIవ పేజీలో ▶

పెద్దగా ప్రయోజనం ఉండదు..

గతంలో పెద్దనోట్ల రద్దు వల్ల మొత్తం నల్లడబ్బు బయటకు వస్తుందని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. నల్లడబ్బు అనేది కేవలం నగదు రూపంలోనే ఉండదు. బంగారం, ఆస్తుల రూపంలో రకరకాలుగా ఉంటుందనే విషయం అందరికీ తెలిసిందే. కొన్ని అంచనాల ప్రకారం కేవలం 7 శాతమే నగదు రూపంలో ఉంటుంది. అయితే పెద్దనోట్ల రద్దు నిర్ణయం బ్లాక్‌మనీని వైట్ చేసుకునే ప్రక్రియకు ఉపయోగపడుతుందనే మా లాంటి వాళ్ల అనుమానాలు నిజమయ్యాయి. ఇదంతా ఓ ప్రహసనంలా ముగిసింది. అప్పుడు రూ.1,000, రూ.500 రద్దు చేసి రూ.2 వేల నోటు తెచ్చారు. మళ్లీ ఇప్పుడు ఎన్నికలకు ముందు నల్లధనంపై పోరాటం పేరిట పెద్దనోటు ఉపసంహరించారు. అయితే మొత్తం మనీ సప్లయ్‌లో రూ.2 వేల నోటు వినియోగం నామమాత్రమే కాబట్టి పెద్దగా ప్రయోజనం ఉండదు.

– ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, ఆర్థిక, రాజకీయరంగ నిపుణులు

నల్లధనం నియంత్రణ సాధ్యం కాదు

ఆర్‌బీఐ సర్క్యులర్ ప్రకారం చూసినా.. ఇది సాధారణ నిర్ణయంలాగే కనిపిస్తోంది. దీని వల్ల ప్రజలపై పెద్దగా ప్రభావం పడే అవకాశాలు కనిపించడం లేదు. గరిష్టంగా రూ.20 వేల విలువైన నోట్ల మార్పిడికే అవకాశం కల్పించారు. అయితే 2018లోనే రూ.2 వేల నోట్ల ముద్రణను నిలిపేశారు. కొంతకాలంగా ఇవి పెద్దగా ప్రజా వినియోగంలో లేవు. అందువల్ల రూ.2 వేల నోట్ల ఉపసంహరణ ద్వారా నల్లధనం నియంత్రణ అనేది సాధ్యం కాదు. మళ్లీ సులభంగా నగదు లావాదేవీలు పేరిట రూ.1,000 నోటును తెచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

– ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి, ఆర్థికవేత్త, విశ్రాంత డీన్, హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ

జన జీవితంపై ప్రభావం ఉండదు

రూ.2 వేల నోటు రద్దు అయినంత మాత్రాన జన జీవితంపై ప్రభావం ఏమీ ఉండదు. ఈ నోట్లు ఇప్పటికే ప్రజల దగ్గర లేకుండా పోయాయి. ముద్రణను ఆపేయడంతో దాని సర్క్యులేషన్ కూడా తక్కువగానే ఉంది. గతంలో వెయ్యి, ఐదు వందల నోట్లు రద్దు చేసినపుడు నల్లడబ్బును పట్టుకుంటామని చెప్పినా, మొత్తం బ్లాక్‌మనీ తిరిగి వైట్‌మనీగా సర్క్యులేషన్‌లోకి వచ్చింది. అయితే పెద్ద వాళ్లకు ఇదొక అగ్ని పరీక్షగా మారే అవకాశాలున్నా, వీటిని మార్చుకునేందుకు కూడా వారు అడ్డదారులు వెతుక్కుంటారు.

– డి.పాపారావు, ఆర్థికరంగ విశ్లేషకులు

రూ.2,000 నోట్ల రద్దును స్వాగతించిన వైఎస్సార్‌సీపీ

సాక్షి, అమరావతి/సాక్షి, న్యూఢిల్లీ: రూ.2,000 నోట్లను రద్దుచేయాలన్న ఆర్‌బీఐ నిర్ణయాన్ని తమ పార్టీ స్వాగతిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (వైఎస్సార్‌సీపీపీ) నేత విజయసాయిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లధనాన్ని అరికట్టే చర్యలకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆయన పేర్కొన్నారు.

2,000 నోటుకు చెల్లుచీటి

▶ మొదటి పేజీ తరువాయి

సెప్టెంబర్ 30 వరకు ఉన్న సమయాన్ని ఉపయోగించుకోవాలని ప్రజలకు సూచించింది.

వివాదాలకు దూరంగా కేంద్రం!

2016 నవంబర్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పెద్ద నోట్ల రద్దు ప్రకటన చేసినప్పుడు, ఆయా వ్యవహారాలను చూసే ఆర్‌బీఐని కేంద్రం తక్కువచేసిందన్న విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే కేంద్రం ఈసారి దీనికి దూరంగా ఉందని, రిజర్వ్ బ్యాంకే కీలక నిర్ణయాన్ని ప్రకటించిందని అంటున్నారు.

చెలామణీలో రూ.3.62 లక్షల కోట్ల విలువైన రూ.2,000 నోట్లు

ఆర్‌బీఐ వెలువరించిన వివరాల ప్రకారం.. రూ.2,000 డినామినేషన్ బ్యాంక్ నోట్లలో దాదాపు 89 శాతం మార్చి 2017కు ముందు జారీ అయ్యాయి. వాటి జీవిత కాలం 4–5 సంవత్సరాలుగా అంచనా వేయడం జరిగింది. 2018 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల గరిష్ట చెలామణీ విలువ రూ.6.73 లక్షల కోట్లుగా ఉంది. చెలామణీలో ఉన్న మొత్తం నోట్లలో వీటి విలువ 37.3 శాతం. ఇక 2023 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల చెలామణీ విలువ రూ.3.62 లక్షల కోట్లకు తగ్గింది. ప్రస్తుతం చెలామణీలో ఉన్న మొత్తం నోట్లలో ఈ విలువ 10.8 శాతం మాత్రమే. అంటే ఈ మొత్తమే ప్రజల నుంచి బ్యాంకింగ్ వ్యవస్థలోకి రావాలన్నమాట.

ఈ నోట్లు చెల్లుతాయా?



- 2016 నవంబర్‌లో పాత రూ.500, రూ.1,000 నోట్ల రద్దు చేసిన సందర్భంలో ఆ నోట్లు తక్షణమే చెల్లకుండా పోయాయి. దీంతో చాలా మందిలో దీనిపై సందేహాలు నెలకొన్నాయి. అయితే, ఈసారి సెప్టెంబర్ 30 వరకూ రూ.2,000 నోటు లీగల్ టెండర్ కొనసాగనుంది. అంటే ఈ నోటు సాంకేతికంగా అప్పటివరకూ చెల్లుబాటులోనే ఉంటుందని అర్థం. సాధారణ లావాదేవీలకు రూ.2 వేల నోట్లను వినియోగించవచ్చని ఆర్‌బీఐ తెలిపింది. అలాగే వాటిని స్వీకరించవచ్చు కూడా. అయితే, 2023 సెప్టెంబర్ 30లోగా మీ వద్ద ఉన్న ఆ నోట్లను బ్యాంకులో డిపాజిట్ చేయాలి లేదా మార్చుకోవాలి. అన్ని బ్యాంకు శాఖలతో పాటు దేశ వ్యాప్తంగా ఆర్‌బీఐకి ఉన్న 19 ప్రాంతీయ కార్యాలయాల్లో వాటిని మార్చుకోవచ్చు.
- బ్యాంకుల్లో ఉండే బిజినెస్ కరెస్పాండెంట్‌ల నుంచి రోజుకు రూ.4వేలు మాత్రమే మార్చుకోవచ్చు.
- మే 23 నుంచి ఈ నోట్లను మార్చుకునే చాన్స్ ఉంది. ప్రజలకు ఇబ్బంది కలగకుండా బ్యాంకులు ఏర్పాట్లు చేసుకునేందుకు ఈ సమయం ఇచ్చారు.
- ఏ బ్యాంకులోనైనా ఒకసారి రూ.20వేలు మాత్రమే మార్చుకోవచ్చు. డిపాజిట్‌పై ఆంక్షలు లేవు. రూ.2 వేల నోట్లు ఎన్ని ఉన్నా మీ ఖాతాలో డిపాజిట్ చేసుకోవచ్చు. తర్వాత మీ అవసరానికి తగ్గట్లు నగదు తీసుకోవచ్చు. అయితే కేవైసీ, ఇతర చట్టబద్ధమైన నిబంధనలను అనుసరించి డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.
- నోట్ల మార్పిడి పూర్తిగా ఉచితం. అలాగే వయోవృద్ధులు, దివ్యాంగులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు తగు ఏర్పాట్లు చేయాలని బ్యాంకులకు సూచించారు.
- తొలుత బ్యాంకు అధికారులను సంప్రదించాలి. ఫిర్యాదు చేసిన 30 రోజుల్లోగా బ్యాంకు స్పందించకపోతే.. లేదా వారు ఇచ్చిన సమాధానంతో సంతృప్తి చెందకపోతే రిజర్వు బ్యాంకు–ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్ స్కీమ్ (ఆర్‌బీఐ–ఐఓఎస్), 2021 కింద ఆర్‌బీఐకి ఫిర్యాదు చేయవచ్చు.
- సెప్టెంబర్ 30 తర్వాత కూడా రూ.2,000 నోట్లు ప్రైవేటుగా ఎవరి దగ్గరైనా ఉంటే వాటి పరిస్థితి ఏంటనేది ఆర్‌బీఐ నిర్దిష్టంగా చెప్పలేదు. గతంలో రూ.500, 1,000 నోట్ల రద్దు సమయంలో డిపాజిట్ చేయడానికి ఇచ్చిన గడువు తర్వాత వాటిని ఎవరైనా ఉంచుకుంటే దాన్ని నేరంగా ప్రభుత్వం ప్రకటించింది. అయితే సెప్టెంబర్ 30 తర్వాత రూ.2,000 నోట్లను కలిగి ఉన్నవారిపై ఎలాంటి చట్టపరమైన చర్యలు ఉండబోవని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. డీమానిటైజేషన్ నిర్ణయానికి, తాజాగా రూ.2,000 నోట్ల ఉపసంహరణకు మధ్య చాలా తేడా ఉందని, దీనివల్ల ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం ఉండదని కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి టీవీ సోమనాథన్ వ్యాఖ్యానించారు. కాగా పెద్ద నోట్లపై ఆధారపడటాన్ని తగ్గించి, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడమే తాజా చర్య లక్ష్యమని మాజీ కార్యదర్శి ఎస్‌సీ గార్గ్ చెప్పారు.

సం‘క్షేమ’ చదువులు

▶ మొదటి పేజీ తరువాయి

మధ్యాహ్న భోజనాన్ని పిల్లలకు అందించడానికి ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకాన్ని ప్రవేశపెట్టింది. రోజుకో రకం మెనూతోపాటు వారానికి ఐదు గుడ్లు, మూడు చిక్కీలను పిల్లలకు అందిస్తోంది. ఏటా ఈ పథకానికి ప్రభుత్వం రూ.1,800 కోట్లు వెచ్చిస్తోంది.

జగనన్న విద్యా కానుక

జగనన్న విద్యా కానుక కింద ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి ఒక స్కూల్ బ్యాగ్, కుట్టు కూలితో మూడు జతల యూనిఫామ్‌లు, ఒక బెల్ట్, ఒక జత షూలు, రెండు జతల సాక్స్‌లు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, వర్క్‌బుక్స్, ఇంగ్లిష్– తెలుగు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ అందిస్తోంది. ఈ పథకానికి ప్రభుత్వం ఇప్పటివరకు రూ.2,323.99 కోట్లు ఖర్చు చేసింది. ఈ పథకం కింద ఏడాదికి 47 లక్షల మంది పిల్లలకు లబ్ధి చేకూర్చింది.

పాఠశాలలు, మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేక నిధి

ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల నిర్వహణతో పాటు అక్కడి మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచేలా దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో ప్రభుత్వం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసింది. మరుగుదొడ్ల నిర్వహణ నిధి కింద రూ.874.88 కోట్లు కేటాయించింది. నెలకు రూ.6 వేల వేతనంతో 44,748 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఆయాలను నియమించింది. అలాగే స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్ కింద ప్రభుత్వం రూ.442 కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసింది. స్కూళ్లలో ఏవైనా మరమ్మతులు, ఇతర పనులను వెంటనే చేసేలా ఈ నిధిని కేటాయించింది.

సబ్జెక్టు టీచర్లతో బోధన

నూతన విద్యావిధానానికి అనుగుణంగా రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఫౌండేషన్ విధానాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 3వ తరగతి నుంచే విద్యార్థులకు సబ్జెక్టు టీచర్లతో బోధన జరిగేలా చర్యలు తీసుకుంది.

ఆంగ్ల మాధ్యమం.. సీబీఎస్‌ఈ విధానం

ప్రభుత్వ స్కూళ్లలో పేద పిల్లలకు ఆంగ్ల మాధ్యమం గతంలో అందేది కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) విధానాన్ని దశలవారీగా ఏర్పాటు చేస్తోంది.

కరిక్యులంలో సంస్కరణలు

పునాది స్థాయి నుంచే విద్యారంగాన్ని పటిష్టం చేసేలా ప్రభుత్వం కరిక్యులంలో సంస్కరణలు చేపట్టింది. పాఠ్యపుస్తకాలు కార్యాచరణ ఆధారిత పాఠ్యాంశాలతో ఉండేలా మార్పులు చేసింది.



బ్రాండ్ ఏపీ

విద్యార్థులు, టీచర్లకు ప్రయోజనం కలిగేలా బైలింగ్యువల్ విధానంలో పాఠ్యపుస్తకాలను అందించింది. ఆంగ్ల మాధ్యమం నేపథ్యంలో విద్యార్థులు, టీచర్లకు సామర్థ్యాలు పెరిగేలా వారికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహించింది.

ప్రతి మండలంలో బాలికల కోసం కాలేజీ

ప్రతి మండలంలో బాలికల కోసం ఒక జూనియర్ కళాశాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఉన్నత పాఠశాలలో ఉత్తీర్ణులైన బాలికలు చదువు మానేయకుండా ప్రభుత్వం ప్రతి మండలంలో బాలికల కోసం కనీసం ఒక జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తోంది. 292 ఉన్నత పాఠశాలలను బాలికల కోసం హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేసింది. మొత్తం 352 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా (కేజీబీవీ)ల్లో +2ని ప్రవేశపెట్టారు. ప్రభుత్వం చర్యలతో మొత్తం 679 మండలాల్లో బాలికల కోసం కనీసం ఒక జూనియర్ కళాశాల ఉంది.

డిజిటల్ లెర్నింగ్.. డిజిటల్ బోధన


కోవిడ్ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం విద్యార్థుల కోసం డిజిటల్ లెర్నింగ్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీనికి అనుగుణంగా బైజూస్ కంటెంట్‌తో కూడిన యాప్‌ను విద్యార్థులకు ఉచితంగా అందేలా చేసింది. అన్ని పాఠశాలల్లో ప్రతి తరగతి గదికి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం ఇంటర్‌నెట్ సౌకర్యాలను కూడా కల్పిస్తోంది. 2022–23 విద్యా సంవత్సరంలో 4,59,564 మంది 8వ తరగతి విద్యార్థులకు రూ.686 కోట్లతో 5.18 లక్షల ట్యాబ్‌లను అందించింది. అలాగే 59,176 మంది టీచర్లకు కూడా ట్యాబ్‌లు ఇచ్చింది. ఈ ట్యాబ్‌ల్లో అత్యున్నత ప్రమాణాలతో కూడిన బైజూస్ పాఠ్యాంశాలను లోడ్ చేసి ఉచితంగా వారికి అందిస్తోంది. రూ.750 కోట్ల బడ్జెట్ అంచనాలతో 2023–24 విద్యా సంవత్సరానికి 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించడానికి అనుమతులు ఇచ్చింది.

సంస్కరణల కోసం రూ.54 వేల కోట్ల వ్యయం

విద్యకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం గత మూడేళ్లలో విద్యారంగ సంస్కరణల కోసమే రూ.54,023.67 కోట్లు వెచ్చించింది. రాష్ట్ర విద్యార్థులను ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దడం కోసం దీర్ఘకాలిక లక్ష్యంతో పాఠశాల విద్యలో విప్లవాత్మక సంస్కరణలను అమలు చేస్తోంది.

గత మూడేళ్లలో వివిధ పథకాల లబ్ధిదారులు, నిధులు (రూ.కోట్లలో)

పథకం	లబ్ధిదారులు	నిధులు
జగనన్న అమ్మఒడి	44,48,865	19,617.53
జగనన్న విద్యా కానుక	47,32,065	2,324
జగనన్న గోరుముద్ద	43,26,782	3,117.44
మన బడి: నాడు-నేడు ఫేజ్1	15,715 పాఠశాలలు	3,669.00
మన బడి: నాడు-నేడు ఫేజ్2	22,344 పాఠశాలలు	8,000.00
8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు	5,18,740	685.87
జగనన్న విద్యా దీవెన	24,74,544	8,365.26
జగనన్న వసతి దీవెన	18,77,863	3,349.57
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	34,19,875	4,895.00
మొత్తం వ్యయం	--	54,023.67



'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 58

శనివారం 20-5-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సుప్రీం జడ్జిగా జస్టిస్ పీకే మిశ్రా ప్రమాణం

6లో

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ పీకే మిశ్రా, సీనియర్ న్యాయవాది కేవీ విశ్వనాథన్ ప్రమాణం చేశారు. వీరితో సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రమాణం చేయించారు. జస్టిస్ పీకే మిశ్రా ఆగస్ట్ 2029 వరకూ, జస్టిస్ కేవీ విశ్వనాథన్ మే 25, 2031 వరకూ సేవలందించనున్నారు.





వలంటీర్లకు వందనం కార్యక్రమానికి హాజరైన వారిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సేవా 'బలగం'

సంక్షేమ సారథులు, నా సైన్యం వలంటీర్లే: సీఎం జగన్

ప్రతి ఇంటికీ జరుగుతున్న మంచికి సాక్షులు

- ఇంత మంచి ఎప్పుడైనా జరిగిందా? అని ఆలోచించేలా ప్రతి ఇంటికీ చెప్పండి
- ఈ ప్రభుత్వ ఫిలాసఫీకి ప్రతిరూపం మీరే
- వలంటీర్లను లీడర్లను చేస్తానని మొదటి మీటింగ్‌లోనే చెప్పా
- లంచాలు, వివక్షకు తావులేని వలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబుకు కడుపుమంట
- డజను 'జెలూసిల్' మాత్రలు వేసుకున్నా అది తగ్గదు
- వలంటీర్లు ఎందుకు..? మూటలు మోయడానికా? అని ఎగతాళి చేశారు
- కోర్టుల ద్వారా అడ్డుకునేందుకు ప్రయత్నించారు
- ఇప్పుడు మాట మార్చి నాలుక మడతేశారు
- నిస్వార్థ సేవలకు గుర్తింపుగా ఏటా సత్కారాలు
- వరుసగా మూడో ఏడాదీ 'వలంటీర్లకు వందనం'.. రాష్ట్రమంతా పది రోజులు కార్యక్రమాలు
- విజయవాడలో లాంఛనంగా ప్రారంభించిన సీఎం

సాక్షి, అమరావతి: ఇంతకు ముందెప్పుడూ జరగని విధంగా రాష్ట్రంలో ప్రతి ఇంటికీ ప్రభుత్వం చేసిన ప్రతి మేలు, మంచి పనికీ, ప్రతి సంక్షేమ పథకానికీ, ఆ మంచి పనుల ద్వారా చోటుచేసుకుంటున్న మార్పులకు సాక్షులు వలంటీర్లేనని సీఎం వైఎస్ జగన్ తెలిపారు. పేదల ప్రభుత్వంపై చంద్రబాబు, ఆయన అనుకూల మీడియా తప్పుడు ప్రచారాలతో నిందలు వేస్తుంటే సత్య సారథులు, సత్య సాయుధులుగా మారి ప్రతి గడపకూ వెళ్లి ఐదు కోట్ల మంది ప్రజలకు నిజాలు చెప్పాల్సిన బాధ్యతను వలంటీర్లు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆ హక్కు, నైతికత కేవలం

మిగతా 2వ పేజీలో ▶

ఔనయ్యా.. నా సైన్యమే

"చంద్రబాబుకు ఒకటే మాట చెబుతున్నా.. అవునయ్యా, వీళ్లు (వలంటీర్లు) మంచి చేస్తున్న ప్రభుత్వానికి, మంచి చేస్తున్న ముఖ్యమంత్రికి బ్రాండ్ అంబాసిడర్‌లే. ప్రజా సేవకులు, స్వచ్ఛంద సైనికులే. జగనన్న సైన్యం వీరే."

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

కిడ్నీ వ్యాధి బాధిత వలంటీర్‌పై
సీఎం ఔదార్యం

రూ.10 లక్షల సాయం ప్రకటన

తక్షణమే రూ.2 లక్షల చెక్కు అందజేత

2లో

ఫ్యాక్ట్ చెక్

దగా చేసింది ఎవరో తెలియదా రామోజీ ?

- నిత్యం ఉషోదయంతో అబద్ధాలే రామోజీ పని
- ఉచిత పంటల బీమాతో వైఎస్ జగన్ ప్రభుత్వం మేలు చేస్తున్నా విషపు రాతలే

8లో

అనకాపల్లి జిల్లా కేంద్రంలోని నెహ్రూచౌక్ వద్ద మానవహారం నిర్వహిస్తున్న ప్రజలు, వైఎస్సార్‌సీపీ నేతలు



స్థలాలను సమాధులతో పోలుస్తారా!?

- చంద్రబాబు వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా జనాగ్రహం
- తక్షణం ఆయన క్షమాపణ చెప్పాలి
- సంక్షేమ పథకాలు బాబుకు రుచించడంలేదు
- ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి
- ఆ మాటలు ఆయన అహంకారానికి నిదర్శనం
- వైఎస్సార్‌సీపీ నేతల మండిపాటు

7లో



నోట్లు రద్దు చేయాలని
చెప్పింది నేనే

- నేను ప్రపంచంలో కంపెనీలన్నీ తెస్తే ఈ ప్రభుత్వం వెనక్కి పంపింది
- టీడీపీ అధికారంలోకి వస్తే అమరావతే రాజధాని
- పేదలకు ఇచ్చిన సెంటు భూమి సమాధికే సరిపోదు
- అనకాపల్లి సభలో ప్రతిపక్ష నేత చంద్రబాబు

- వివరాలు 7లో

రష్యాకు శిక్ష తప్పదు

ఆ దేశంపై ఇక మరిన్ని ఆంక్షలు.. ఉక్రెయిన్‌కు మా మద్దతు కొనసాగుతుంది

జీ-7 అధినేతల ప్రకటన

- వివరాలు 6లో

విశాఖ సిగలో మరో మణిహారం

మధురవాడలో 19 ఎకరాల్లో ఐస్పేస్ బిజినెస్ పార్క్



- ఐటీ కంపెనీల కోసం రూ.300 కోట్లతో అభివృద్ధి
- ఆసక్తి గల సంస్థల నుంచి బిడ్లు ఆహ్వానించిన ఏపీఐఐసీ
- బిడ్లు దాఖలుకు చివరి తేదీ జూన్ 20

సాక్షి, అమరావతి: మహానగరంగా వేగంగా విస్తరిస్తున్న విశాఖపట్నం సిగలో మరో మణిహారం వచ్చి చేరుతోంది. ఇప్పటికే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, అదానీ డేటా సెంటర్, ఐటీ బిజినెస్ పార్క్, ఇన్ఫోసిస్ వంటి సంస్థలతో అభివృద్ధి చెందుతున్న విశాఖలో అంతర్జాతీయ ప్రమాణాలతో మరో భారీ బిజినెస్ పార్క్ నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. అంతర్జాతీయ ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీలను ఆకర్షించడమే లక్ష్యంగా మధురవాడ హిల్ నంబర్-3లో 18.93 ఎకరాల్లో ఐస్పేస్ బిజినెస్ పార్క్‌ను ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) అభివృద్ధి చేస్తోంది. ఇందుకు సుమారు రూ.300 కోట్ల వ్యయం చేయనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం ఏర్పాటు చేసే కంపెనీ (ఎస్పీవీ)లో ఏపీఐఐసీ 26 శాతం వాటాను కలిగి ఉంటుంది. మిగిలిన 74 శాతం వాటాను భాగస్వామ్య కంపెనీ కలిగి ఉంటుంది. భూమికి అత్యధిక ధరను కోట్ చేసిన సంస్థను ఎంపిక చేస్తారు. ఎంపికైన సంస్థ ఏపీఐఐసీకి 26 శాతం వాటా కింద రూ.78 కోట్లు సమకూర్చాల్సి ఉంటుంది. మిగిలిన మొత్తాన్ని భాగస్వామ్య కంపెనీ ఈక్విటీగా పరిగణిస్తారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బహుళజాతి సంస్థలను ఆకర్షించే విధంగా ఈ బిజినెస్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నామని ఏపీఐఐసీ వీసీ, ఎండీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో చేపడుతున్న ఈ ప్రాజెక్టులో భాగస్వామిగా చేరడానికి ఆసక్తి గల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించినట్లు వెల్లడించారు. ఆసక్తి గల సంస్థలు జూన్ 20లోగా బిడ్లు దాఖలు చేయాలని కోరారు. మధురవాడ, రుషికొండ ప్రాంతాల్లో ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీలను ఆకర్షించేలా ఈ బిజినెస్ పార్కును అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. గత కొంతకాలంగా దిగ్గజ కంపెనీలు విశాఖలో కార్యాలయాలు ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తుండటంతో దానికి అనుగుణంగా ఏపీఐఐసీ బిజినెస్ పార్కులను అభివృద్ధి చేస్తున్న సంగతి తెలిసిందే.

డిజైన్ దగ్గర నుంచి నిర్వహణ వరకు

నూతన సాంకేతిక పరిజ్ఞానం, అంతర్జాతీయ ప్రమాణాలతో బిజినెస్ పార్కును నిర్మించేలా డిజైన్ దగ్గర నుంచి నిధుల సమీకరణ వరకు భాగస్వామ్య కంపెనీనే చూసుకోవాల్సి ఉంటుందని ఏపీఐఐసీ స్పష్టం చేసింది. అలాగే ఐటీ, ఐటీ ఆధారిత, ఆర్థిక కంపెనీల అవసరాలకు అనుగుణంగా కమర్షియల్ ఆఫీస్ స్పేస్, బిజినెస్ సెంటర్‌తో పాటు సమావేశ మందిరాలు, బిజినెస్ హోటల్స్, సర్వీస్ అపార్ట్‌మెంట్స్, ఎయిర్ థియేటర్, ఫుడ్ బేవరేజ్ సౌకర్యాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలాగే ఇతర మౌలిక వసతులతోపాటు పార్కింగ్ సౌకర్యాలు కూడా భాగస్వామ్య కంపెనీనే కల్పించాల్సి ఉంటుంది.

మొదలైన 'నైరుతి' పురోగమనం

- వచ్చే 2, 3 రోజుల్లో బంగాళాఖాతం, అండమాన్‌లకు నైరుతి రుతపవనాలు విస్తరించే అవకాశం
- జూన్ మొదటి వారంలో కేరళలో ప్రవేశానికి అనుకూల వాతావరణం
- అప్పటివరకు కొనసాగనున్న ఎండల తీవ్రత

సాక్షి, అమరావతి: నైరుతి రుతుపవనాలు పురోగమించడానికి అనువైన వాతావరణం నెలకొన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. నైరుతి గాలులు నిలకడగా ఉండడం, ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవులు, అండమాన్ సముద్రంలో వర్షాలు పడడం వల్ల రుతుపవనాల పురోగమనానికి అవకాశం ఏర్పడినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో రుతుపవనాలు వచ్చే 3, 4 రోజుల్లో దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండమాన్ నికోబార్ దీవులు మరికొన్ని ప్రాంతాల్లో మరింత ముందుకు వెళ్లేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు తెలిపింది. వచ్చే 24 గంటల్లో రుతుపవనాలు ఈ ప్రాంతాల్లోనే కొంతవరకు విస్తరించే అవకాశం ఉందని పేర్కొంది. దీంతో రుతుపవనాలు జూన్ మొదటి వారంలో కేరళలోకి ప్రవేశిస్తాయని అంచనా వేస్తున్నారు. అప్పటివరకు ఎండల తీవ్రత కొనసాగనుంది.

చాగలమర్రిలో 46.2 డిగ్రీల ఉష్ణోగ్రత

రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం ఎండల తీవ్రత ఉండగా రాయలసీమ జిల్లాల్లో దాని ప్రభావం ఎక్కువగా కనిపించింది. నంద్యాల జిల్లా చాగలమర్రిలో 46.2 డిగ్రీలు, వైఎస్సార్ జిల్లా సిద్ధవటంలో 45.2, పల్నాడు జిల్లా రొంపిచర్లలో 44.9 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 3 మండలాల్లో తీవ్రవడగాడ్పులు, 25 మండలాల్లో వడగాడ్పులు వీచినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శనివారం 23 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. గుంటూరు, ఎన్టీఆర్, పల్నాడు, వైఎస్సార్ జిల్లాల్లోని పలు మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు తెలిపింది. అక్కడక్కడ కొన్నిచోట్ల పిడుగులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది.

విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని సందర్శించిన తెలంగాణ అధికారి

తాడేపల్లిలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని శుక్రవారం తెలంగాణలోని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ - డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ఎన్.ప్రకాష్‌రెడ్డి సందర్శించారు. సంస్థ అవలంబిస్తున్న సాంకేతికతల గురించి ఎండీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆయనకు వివరించారు. స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్‌లో 24/7 వాతావరణాన్ని పర్యవేక్షించే విధానాన్ని తెలిపారు. తుపాన్లు, వరదలు, వడగాలులు, భారీవర్షాలు, పిడుగుపాటు హెచ్చరిక సమాచారాన్ని జిల్లా యంత్రాంగానికి, ప్రజలకు పంపించే వ్యవస్థను వివరించారు. వాతావరణ పరిశోధన విభాగాల్లోని వివిధ అంశాలను ప్రకాష్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వినియోగిస్తున్న టెక్నాలజీని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకాష్‌రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.నాగరాజు, వాతావరణ నిపుణులు ఎం.ఎం అలీ, ఇన్‌చార్జి సీహెచ్ శాంతిస్వరూప్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



ప్రధాన కేంద్రాల్లో శుక్రవారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు(డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	44.6	28.4
నంద్యాల	44.1	27.8
కర్నూలు	42.4	29.3
మార్కాపురం	42.0	28.0
రాజమహేంద్రవరం	41.5	28.5
తిరుపతి	41.0	28.0
నెల్లూరు	40.3	29.2
ఏలూరు	39.0	28.0
విజయవాడ	38.0	29.0
విశాఖపట్నం	37.2	29.2
విజయనగరం	37.0	30.0
శ్రీకాకుళం	35.0	26.0
తెలంగాణలో..		
ఆదిలాబాద్	42.3	27.2
రామగుండం	42.4	29.2
హైదరాబాద్	40.6	26.5

సేవా 'బలగం'

▶ మొదటి పేజీ తరువాయి

వలంటీర్లకు మాత్రమే ఉందన్నారు. 'రాష్ట్ర ప్రజలంతా గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల అరాచకాలు ఎలా ఉంటాయో చూశారు. ఈరోజు అవేవీ లేవు. వాటి స్థానంలో మనందరి ప్రభుత్వం తీసుకొచ్చిన తులసి మొక్క లాంటి వ్యవస్థే వలంటీర్లు. జగనన్న ప్రభుత్వంలో పేదలందరికీ చేసిన ప్రతి ఒక్క మంచి మీ చేతుల మీదుగా, మీ ద్వారానే జరిగింది. ప్రతి ఒక్కరికీ నిజాలు చెప్పే హక్కు, చెప్పాల్సిన బాధ్యత కూడా మీ భుజస్కంధాలపైనే ఉందని మరిచిపోవద్దు' అని పేర్కొన్నారు. తనకున్న అతి పెద్ద బలం ప్రతి గడపకూ నేరుగా వెళ్లే వలంటీర్లేనన్నారు. వరుసగా మూడో ఏడాది ఉత్తమ వలంటీర్లకు అవార్డులతో పాటు నగదు బహుమతి అందజేసే 'వలంటీర్లకు వందనం' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్ శుక్రవారం విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్‌లో లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. ఆ వివరాలివీ...

మీ జగనన్న నమ్మకం మీరు..

'నాలుగేళ్లుగా మన ప్రభుత్వాన్ని ప్రతి గడప వద్దకూ తీసుకెళ్లాం. ఈరోజు ప్రతి గడప వద్దకు వెళ్లి నీకు మంచి జరిగిందా? లేదా? అని నీతిగా, నిజాయితీగా ప్రతి అక్కనూ అడగగలిగే నైతికత మన ప్రభుత్వానికి ఉంది. అది వలంటీర్ల వల్లే సాధ్యపడింది. ఎక్కడా వివక్ష చూపలేదు, లంచాలకు తావులేదు. మంచే కానీ, ఎక్కడా చెడు చేయలేదు. మీ జగనన్న పెట్టుకున్న నమ్మకం మీరు. ప్రజలకు, ప్రజా ప్రభుత్వానికి మధ్య వారధులు, సంక్షేమ సారథులు మీరే.

ఆ హక్కు మీకు మాత్రమే ఉంది..

తూర్పున సూర్యుడు ఉదయించకముందే ప్రతి అవ్వాతాతకు ఒక మంచి మనవరాలిగా, మనవడిగా.. వితంతువులు, దివ్యాంగులకు ఒక మంచి చెల్లెమ్మలా, అక్కలా, తమ్ముడిలా, అన్నలా ప్రతి నెలా ఒకటో తారీఖున 64 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్న గొప్ప సేవకులు, సైనికులు మన వలంటీర్లు. జగనన్న పాలనలో మాదిరిగా ఇలా మీ ఇంటికే వచ్చి ఒకటో తారీఖునే పెన్షన్ ఇస్తున్న వ్యవస్థను గత ప్రభుత్వంలో ఏనాడైనా చూశారా? అని ఆలోచింపచేసేలా ప్రజలను అడగగలిగే నైతిక హక్కు మీకు మాత్రమే ఉంది. అమ్మ ఒడి, ఆసరా, చేయూత, ఇళ్ల పట్టాలు, ఇళ్లు, రైతు భరోసా.. ఇలా అనేక పథకాలను గత ప్రభుత్వంలో ఏనాడైనా చూశారా? అని అడిగే నైతికత మీకు మాత్రమే సొంతం.

కడుపు మంటతో ర్వలేకపోతున్నారు..

మన నవరత్నాల పాలన, బటన్ నొక్కి నేరుగా రూ.2.10 లక్షల కోట్లను అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేయడం, నాన్ డీబీటీ కూడా కలిపితే మొత్తంగా రూ.3 లక్షల కోట్ల మేర లబ్ధి చేకూర్చటాన్ని చూసి కొందరు కడుపు మంటతో ఓర్వలేకపోతున్నారు. గతంలో ఎప్పుడూ మంచిచేసిన చరిత్ర లేని వారంతా ఈరోజు ఎలా మాట్లాడుతున్నారో, ఏ రకంగా అబద్ధాలు చెబుతున్నారో, ఎల్లో మీడియా, సోషల్ మీడియాల ద్వారా ఎలా దుష్ప్రచారం చేస్తున్నారో మీరంతా చూస్తున్నారు. ఇంత మంచి చేస్తున్న పేదల ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు, నిందలు వేస్తోంటే ప్రతి గడప వద్దకూ వెళ్లి నిజాలు చెప్పగలిగిన సత్య సారథులు, సత్య సాయుధులు మీరే (వలంటీర్లు).

ఆలోచన రేకెత్తించాలి..

రాష్ట్రంలో ప్రతి ఇంటికి రాబోయే రోజుల్లో ఇంకా ఎక్కువగా వెళ్లాలి. జరిగిన మంచిని చూపించాలి. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను వివరించాలి. ఇంతకుముందు ప్రభుత్వంలో ఇలాంటి మంచి జరిగిందా? అని ఆలోచింపజేసేలా అడగాలి. ప్రతి మాట అడిగి అందరినీ ఆలోచించేలా చేయాల్సిన బాధ్యత మీదే. ప్రజలందరికీ వ్యత్యాసాన్ని తెలియచేయాల్సిన బాధ్యత కూడా మీపైన ఉంది.

మీ హక్కులకు ఏ ఆటంకాలుండవు..

2019లో మనం అధికారంలోకి రాగానే నవరత్నాల ఫిలాసఫీ నచ్చి మీ జగనన్నకు తోడుగా ఉండేందుకు స్వచ్ఛందంగా పేదలకు సేవ చేసేందుకు ముందుకొచ్చిన 2.66 లక్షల మంది మహా సైన్యమే వలంటీర్ వ్యవస్థ. దాదాపు 25 సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక విషయంలో కులమతాలు, ఏ పార్టీకి ఓటు వేశారన్నది కూడా చూడకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి పేదకూ మంచి చేయాలనే తపనతో అడుగులు వేస్తున్న గొప్ప సైన్యం వలంటీర్లు. వలంటీర్లు చేస్తున్నది సేవ మాత్రమే. ఇది ప్రభుత్వ ఉద్యోగం పరిధిలోకి వచ్చే సేవ కాదు. ఇది స్వచ్ఛంద సేవ. దీనిపేరే వలంటీర్. ఇక్కడ పని చేస్తున్న ఏ ఒక్కరూ కూడా ప్రభుత్వ ఉద్యోగులు కారు. మీ అటెండెన్స్ కూడా ఎప్పుడైనా ప్రభుత్వ సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నామని మార్కు చేసే కార్యక్రమం మాత్రమే. ఎవరైనా మిమ్మల్ని ఫలానా పని మీరు చేయకూడదంటే గట్టిగా సమాధానం చెప్పండి. మీ రాజకీయ హక్కులకు, మీ అభ్యుదయ ఆదర్శ భావాలకు ఎలాంటి ఆటంకాలు, అవరోధాలు ఉండవని స్పష్టం చేస్తున్నా. వలంటీర్లను ఉద్దేశించి నేను చేసిన మొదటి ప్రసంగంలోనే మిమ్మల్ని లీడర్లుగా చేస్తానని చెప్పా. ఆ మాటను గుర్తు పెట్టుకోండి. నవరత్నాల ఫిలాసఫీకి సారథులుగా, మంచి చేస్తున్న ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లుగా, ప్రజలందరికీ మోటివేటర్లుగా, మన ప్రభుత్వానికి అండగా మీరంతా నిలబడాలని పిలుపునిస్తున్నా.

పది రోజుల పాటు కార్యక్రమాలు..

వరుసగా మూడో ఏడాది సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర అనే మూడు అవార్డులతో పది రోజులపాటు వలంటీర్లను రాష్ట్రవ్యాప్తంగా సత్కరించే కార్యక్రమాన్ని ఇక్కడ నుంచే ప్రారంభిస్తున్నాం. ఈ ఏడాది ఉత్తమ సేవలందించిన 2,33,719 మంది వలంటీర్లను సన్మానిస్తున్నాం. ఇది మీరు చేసిన సేవలకు కల్పిస్తున్న గుర్తింపు. ఇందుకోసం ఈ ఏడాది రూ.239 కోట్లు ఖర్చు చేస్తున్నాం. మొదటి స్థాయిలో రాష్ట్రవ్యాప్తంగా 2,28,624 మంది సేవామిత్రలకు సత్కారంతో పాటు రూ.10 వేలు నగదు, ప్రశంసా పత్రంతో ప్రతి మండలంలో సన్మానాలు జరుగుతాయి. రెండో స్థాయిలో ప్రతి మండలంలో ఐదుగురు, మున్సిపాల్టీలు నగరపాలక సంస్థలలో 10 మంది చొప్పున ఎంపిక చేసిన 4,220 మంది సేవారత్నలకు రూ.20 వేలు నగదు బహుమతితో కూడిన సన్మానాలు జరుగుతాయి. మూడో స్థాయిలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఐదుగురు చొప్పున 875 మంది సేవా వజ్రలకు రూ.30 వేలు నగదు, మెడల్, బ్యాడ్జితోపాటు సర్టిఫికెట్ ఇచ్చి సన్మానిస్తాం. ఇలా ప్రతి సంవత్సరం మీరు చేస్తున్న సేవలకు గుర్తింపు రావాలని, మీ సేవలపై ప్రజల్లో చర్చ జరగాలని, మీలో ఏ ఒక్కరికీ లంచాలు, వివక్ష ఆలోచనలే మనసులోకి రాకూడదనే ఉద్దేశంతో ఆత్మస్థైర్యాన్ని పెంచుతూ, గుర్తింపునిస్తూ ఈ అవార్డులు అందిస్తున్నాం. మూడు విడతల్లో వలంటీర్ల పురస్కారాల కోసం ప్రభుత్వం రూ.705 కోట్లు ఖర్చు పెట్టింది.


చంద్రబాబు ఏమన్నారో మర్చిపోవద్దు..

చంద్రబాబు ఆయన ఎల్లో మీడియా, దుష్ట చతుష్టయానికి వలంటీర్ వ్యవస్థ అంటేనే కడుపులో మంట. ఎంత కడుపు మంట అంటే.. ఒక డజన్ 'జెలూసిల్' మాత్రలు వేసినా కూడా తగ్గనంత మంట! ఈ వ్యవస్థ గురించి, వలంటీర్ల గురించి ఎంత దుర్మార్గంగా విమర్శలు చేశారో ఒక్కసారి గుర్తు తెచ్చుకుంటే వాళ్లు మనుషులేనా? అనిపించేది. వలంటీర్లపై నిరంతరం దుష్ప్రచారం, విమర్శలు చేస్తూనే ఉన్నారు. వలంటీర్లను చంద్రబాబు, ఎల్లో మీడియా వెటకారం చేస్తూ ఏమన్నారో బాగా గుర్తు పెట్టుకోండి. 'ఏం పని వీళ్లకు? తెల్లవారుజామున వెళ్లి తలుపులు తడుతున్నారు..' అంటూ దురుద్దేశాలు ఆపాదించిన చంద్రబాబును బాగా గుర్తు పెట్టుకోండి. ఇదే పెద్దమనిషి వలంటీర్లను చులకనగా చూపించేందుకు.. 'మద్యం తాగి వస్తారు.. వీళ్లు చేసేది మూటలు మోసే ఉద్యోగం.. వీళ్లంతా అల్లరి మూకలు' అని కూడా చంద్రబాబు అన్నాడు. తమకు అధికారం వస్తే వెంటనే వలంటీర్ల వ్యవస్థను రద్దు చేసి తిరిగి జన్మభూమి కమిటీలను తెస్తానన్నాడు. వలంటీర్ల వ్యవస్థ పనిచేయకుండా కోర్టులకు వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేశాడు. కానీ వలంటీర్ల సేవలను ప్రజలు గుర్తించి మెచ్చుకోవడంతో ఇదే చంద్రబాబు ఇప్పుడు 'ఈ వలంటీర్లు అంతా జగన్ సైన్యం.. వాళ్లు వద్దు.. మాకు అధికారం వస్తే కొత్త వలంటీర్ల వ్యవస్థను తెస్తాం' అంటున్నారు.

వలంటీర్ సోదర, సోదరీ మణులకు నా సెల్యూట్

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్వీట్

నా పిలుపునందుకుని ప్రజలకు స్వచ్ఛందంగా సేవ చేసేందుకు ముందుకొచ్చిన 2.64 లక్షల మంది సైనికులే మన వలంటీర్లు అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన సూర్యోదయానికి ముందే దాదాపు 64 లక్షల మంది లబ్ధిదారులకు పింఛన్ అందిస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా, సంక్షేమ సారథులుగా నిలుస్తున్న వలంటీర్ సోదర, సోదరీమణులకు నా సెల్యూట్ అని ఆయన శుక్రవారం రాత్రి ట్వీట్ చేశారు.



వలంటీర్ల నగదు పురస్కారాల చెక్కుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వలంటీర్లు తదితరులు

కిడ్నీ వ్యాధి బాధిత వలంటీర్‌పై సీఎం ఔదార్యం



సీఎం వైఎస్ జగన్‌ను కలిసి సమస్యను వివరిస్తున్న సోంబాబు తల్లి వెంకమ్మ

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వలంటీర్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.10 లక్షల సాయం ప్రకటించి మానవత్వం చాటుకున్నారు. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం కానూరు మురళి నగర్ 20వ వార్డు ఐదో నంబర్ సచివాలయంలో సోంబాబు నాలుగేళ్లుగా వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. దళిత కుటుంబానికి చెందిన సోంబాబుకు చిన్నతనంలోనే తండ్రి మరణించగా.. తల్లి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. వలంటీర్‌గా పనిచేస్తున్న జక్కుల సోంబాబుకు రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి. తన ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా నాలుగేళ్లుగా ప్రభుత్వం అప్పగించిన ప్రతి పనిని చిత్తశుద్ధితో చేస్తున్నాడు. సోంబాబుకు డయాలసిస్ చేయించుకోకపోతే జీవించలేని పరిస్థితి. శుక్రవారం నగరంలోని ఏ ప్లస్ కన్వెన్షన్‌లో నిర్వహించిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో సోంబాబు, అతని తల్లి వెంకమ్మ, సోదరులు సీఎం వైఎస్ జగన్‌ను కలిసి పరిస్థితి వివరించారు. సోంబాబు కుటుంబం ఆవేదన విన్న సీఎం వైఎస్ జగన్ చలించిపోయారు. తక్షణమే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.10 లక్షల సాయం ప్రకటించారు. డయాలసిస్ పేషెంట్లకు ప్రభుత్వం ఇస్తున్న రూ.10 వేల పెన్షన్ కూడా ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మూత్రపిండాల మార్పిడికి అవసరమైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తక్షణమే పూర్తిచేయాలని చెప్పారు. మూత్రపిండాల మార్పిడికి అయ్యే ఖర్చులనూ ప్రభుత్వమే భరిస్తుందని సోంబాబు కుటుంబానికి సీఎం జగన్ హామీ ఇచ్చారు. తక్షణ సాయంగా రూ.2 లక్షలు అందించాలని కలెక్టర్ ఢిల్లీరావును ఆదేశించారు.

సోంబాబుకు రూ.2 లక్షల చెక్కు అందజేత

సీఎం ఆదేశించిన వెంటనే ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు గంటల వ్యవధిలోనే సోంబాబు కుటుంబానికి తన కార్యాలయంలో రూ. 2లక్షల చెక్కును అందజేశారు. సమస్యల పట్ల వేగంగా స్పందించి, మానవత్వంతో ఆలోచించే ప్రభుత్వం ఉండటం అరుదైన విషయమని ఢిల్లీరావు అన్నారు.



సోంబాబుకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు



వెంకటకృష్ణారావు(సేవావజ్ర)



కె.జెస్సీ(సేవారత్న)



బి.జ్యోతి(సేవావజ్ర)



ఎస్‌కే గుల్నాజ్‌బేగం(సేవారత్న)



విజయకుమార్(సేవావజ్ర)



కె.వరలక్ష్మి (సేవామిత్ర)



జి.సంధ్యారాణి (సేవారత్న)



డి.అరుణ(సేవారత్న)



కె.సందీప్(సేవావజ్ర)



నాగేశ్వరరావు(సేవారత్న)



ఎస్.నాగలక్ష్మి(సేవావజ్ర)



కె.పున్నయ్య(సేవారత్న)



రాజగోపాలస్వామి(సేవావజ్ర)



ఆర్.మాధవి(సేవారత్న)



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా సేవావజ్ర అవార్డు అందుకుంటున్న ఎస్.సంధ్య

మా ధైర్యం, నమ్మకం, భవిష్యత్తు మీరే



వలంటీర్‌గా చేరిన తొలిరోజుల్లో జన్మభూమి కమిటీల ఆగడాలను గుర్తు చేసుకున్న ఓ కుటుంబం మీరైనా రేషన్ కార్డు మంజూరు చేస్తారా? అని అడిగింది. కేవలం 4 గంటల్లోనే రేషన్ కార్డు తీసుకెళ్లి వారి చేతికి అందించా. మరో ఘటనలో మంగళగిరి ఎన్నారై ఆసుపత్రిలో అపెండిసైటిస్ ఆపరేషన్ జరిగిన ఓ దివ్యాంగ మహిళకు పింఛన్ అక్కడికే వెళ్లి అందచేశా. రవాణా చార్జీలను తిరస్కరించడంతో భావోద్వేగానికి గురై నమస్కరించింది. నన్ను పంపింది జగనన్న కాబట్టి అన్నకు నమస్కరించాలని కోరా. వలంటీర్లంటే మూటలు మోసేవారని విమర్శించిన వారే మమ్మల్ని ఇప్పుడు పొగుడుతున్నారు. మాకు ప్రజల ఆశీస్సులు, ఆశీర్వాదాలే గొప్పవి. మా వలంటీర్ల అందరి తరఫునా చెబుతున్నా.. మా ధైర్యం, నమ్మకం, భవిష్యత్తు మీరే జగనన్నా.

– ఉప్పాల నరేష్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వలంటీర్

ఈ గౌరవం మీవల్లే..



నా పరిధిలో 75 కుటుంబాలు ఉండగా 62 కుటుంబాలు సంక్షేమ పథకాలు పొందాయి. పెన్షన్ కానుక గురించి ఒక పెద్దాయనతో ఈ కేవైసీ కోసం వెళితే ఆయనకు ఇల్లు లేదు. సమాధుల పక్కన చెట్టుకింద ఉన్నారు. నాకు బాధ వేసి ఓల్డేజ్ హోమ్‌లో చేర్చా. తర్వాత పెన్షన్ ఇవ్వడానికి వెళ్లినప్పుడు ఆయన కళ్లలో చూసిన సంతోషం ఎప్పటికీ మరిచిపోలేను. పేదలందరికీ ఇల్లు పథకం కింద ఇంటి పట్టా అందుకున్న ఓ మహిళ.. నాకు ఆడపిల్లలు లేరు. నువ్వే వచ్చి పాలు పొంగించాలని కోరినప్పుడు సంతోషమేసింది. ఈ గౌరవం మీవల్లే దక్కింది జగనన్నా! మరో మహిళకు రేషన్ కార్డు, పింఛన్ ఇప్పించినప్పుడు తన కన్నబిడ్డ కూడా ఇంత చేయలేదని కృతజ్ఞతలు తెలిపింది. ఆ దీవెనలన్నీ మీకే జగనన్నా..!

– హేమ, విజయవాడ తూర్పు నియోజకవర్గ వలంటీర్

మంచిపేరు వచ్చేలా ముందుకుసాగాలి



అవార్డులు పొందుతున్న వలంటీర్లందరికీ హృదయపూర్వక అభినందనలు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఏ ఇంటికి వెళ్లినా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పెన్షన్ల గురించే చెబుతున్నారు. ఇన్ని సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా అందుతున్నాయంటే దానికి కారణం వలంటీర్లే. వలంటీర్లు రానున్న రోజుల్లో మరింత మంచిపేరు వచ్చేలా ముందుకుసాగాలి.

– బూడి ముత్యాలనాయుడు, ఉప ముఖ్యమంత్రి (పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ)

అన్ని రాష్ట్రాలు ఈ వ్యవస్థను ఫాలో అవుతున్నాయి



ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు అయితే, ఎంత కష్టమైనా, ఎంత దూరం వరకైనా వెళ్లి ఆ కార్యక్రమం అమలు చేసే ధీశాలి సీఎం జగన్. వలంటీర్లలో 76 శాతం మంది యువత, అందులో మహిళలు 53 శాతం ఉన్నారు. అవినీతి రహితంగా సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలనే నినాదంతో వలంటీర్లు ముందుకెళుతున్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా ఈ వ్యవస్థను ఫాలో అవుతున్నాయి. జగనన్నే మా నమ్మకం, జగనన్నే మా భవిష్యత్ అనే నినాదంలో మనం గొంతుకలుపుదాం, ఆయన్ను మళ్లీ సీఎం చేద్దాం.

– ఆదిమూలపు సురేష్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



ఆలయం వెలుపల జస్టిస్ సురేష్ రెడ్డి



జస్టిస్ ఉమేష్ ఎంఏ

తిరుమల: తిరుమల శ్రీవారిని శుక్రవారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్ రెడ్డి, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉమేష్ ఎంఏ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనాలను, అధికారులు లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

సర్వ దర్శనానికి 30 గంటలు

తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. క్యూ వెలుపల శిలాతోరణం వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 66,820 మంది స్వామివారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3.29 కోట్లు వేశారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 30 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.

మోదీ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయం



సమావేశంలో మాట్లాడుతున్న వీర్రాజు

సాక్షి, అమరావతి/గన్నవరం: ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టి తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది. కృష్ణాజిల్లా గన్నవరం సమీపంలోని ఎస్ఎం కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మాట్లాడుతూ ప్రధాన మంత్రి తీసుకువచ్చిన అనేక సంస్కరణల వల్ల దేశం ఆర్థికంగా పురోభివృద్ధి బాట పట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఈ నెల 30 నుంచి నెల రోజుల పాటు ప్రజల్లోకి తీసుకువెళ్లి చైతన్యవంతులను చేయాలని సూచించారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అవినీతి, అసమర్థ పాలనపై ప్రజా చార్జిషీట్లు దాఖలు చేయాలని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, మాజీ కేంద్ర మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి, ఆ పార్టీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల సహ ఇన్‌చార్జి సునీల్ దియోధర్, పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు శివప్రకాష్, విష్ణువర్ధన్‌రెడ్డి, బీద్రా శ్రీమన్నారాయణ, విష్ణుకుమార్‌రాజు, భానుప్రకాష్‌రెడ్డి, మాధవ్, మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలకు కొత్త ఇన్‌చార్జిల నియామకం

భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు కొత్త ఇన్‌చార్జిలను నియమించింది. 26 జిల్లాల కొత్త ఇన్‌చార్జిల పేర్లను రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు ప్రకటించారు.

బై బై టీబీ



కోవిడ్ తరహాలో క్షయ వ్యాధి నియంత్రణ

- ఇప్పటికే వ్యాధి నియంత్రణలో దేశంలో టాప్ 3లో ఏపీ
- మరింత వేగంగా వ్యాధిని అరికట్టేందుకు చర్యలు
- గ్రామ స్థాయిలోనే వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు
- ఎక్కువ కేసులు గుర్తించి వ్యాప్తిని అరికట్టడానికి వీలు
- త్వరలో పైలెట్ గా ప్రకాశం జిల్లాలో ప్రారంభం
- త్వరలో బీసీజీ టీకా పంపిణీ
- వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులు, హైరిస్క్ వర్గాలకు టీకాలు

సాక్షి, అమరావతి: ఒకరి నుంచి మరొకరికి సోకే ప్రమాదకర వ్యాధి క్షయ(టీబీ)ను మరింత సమర్థవంతంగా నియంత్రించడానికి వైద్య శాఖ ప్రణాళిక రూపొందించింది. కరోనా వ్యాప్తి సమయంలో అవలంబించిన ట్రేసింగ్–టెస్టింగ్–ట్రీట్‌మెంట్ విధానాన్ని టీబీ నియంత్రణలోనూ పాటించనుంది. కరోనా పరీక్షల తరహాలో వీలైనంత ఎక్కువ మందికి టీబీ పరీక్షలు చేయనున్నారు. ఇప్పటికే ప్రతి లక్ష మంది జనాభాకు 1,522 మందికి పరీక్షలు చేస్తూ దేశంలోనే తొలి మూడు స్థానాల్లో ఏపీ ఒకటిగా ఉంది. ఇకపై మరింత ఎక్కువ మందికి పరీక్షలు చేసి, వ్యాధి వ్యాప్తిని అరికట్టాలని నిర్ణయించింది.

గ్రామ స్థాయిలోనే

ఇప్పటివరకు రెండు వారాలైనా తగ్గని దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, కఫంలో రక్తం పడుతున్న వారికి ట్రూ నాట్ ల్యాబ్ సౌకర్యం ఉన్న ఆస్పత్రుల్లో టీబీ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. నూతన విధానంలో గ్రామ స్థాయిలోనే వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో టీబీ లక్షణాలున్న వారి నుంచి నమూనాలు సేకరించనున్నారు. టీబీ రోగుల కుటుంబ సభ్యులు, సుగర్ బాధితులు, ధూమపానం చేసే వారు, ఎయిడ్స్ రోగులు ఇతర హైరిస్క్ వర్గాల వారికి విలేజ్ క్లినిక్‌లోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు స్క్రీనింగ్ చేస్తారు. వీరిలో ఎవరికైనా టీబీ లక్షణాలుంటే అక్కడే కఫం నమూనా సేకరిస్తారు. వాటిని ఓ ఏజెన్సీ ద్వారా ట్రూ నాట్ ల్యాబ్‌కు పంపుతారు. దీనివల్ల వీలైనంత ఎక్కువ మందిని పరీక్షించే అవకాశం ఉంటుంది. ప్రాథమిక స్థాయిలోనే వ్యాధి బయటపడుతుంది. ప్రజలు కూడా వ్యయప్రయాసలకోర్చి లేబొరేటరీ వరకు వెళ్లే అవసరం ఉండదు. ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి తగ్గుతుంది.

త్వరలో పైలెట్‌గా ప్రకాశం జిల్లాలో

నూతన విధానాన్ని త్వరలో ప్రకాశం జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించనున్నారు. విలేజ్ క్లినిక్‌ల నుంచి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు తరలించడానికి ఊబర్, ఓలా, ర్యాపిడో తరహా ఏజెన్సీ ఎంపికకు ఏపీఎంఎస్ఐడీసీ టెండర్లను పిలవనుంది. ఈ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టులో గమనించిన లోటుపాట్లను సరిచేసి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తారు.

93 శాతం సక్సెస్ రేటు

దేశంలోనే సమర్థవంతంగా క్షయ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్న టాప్–3 రాష్ట్రాల్లో ఏపీ ఒకటిగా ఉంటోంది. 2020 నుంచి రాష్ట్రంలో సక్సెస్ రేటు 90 శాతం నమోదవుతోంది. 2021లో ఉత్తమ పనితీరుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర వైద్య శాఖకు అవార్డు అందించింది. గత ఏడాది క్షయ రోగులకు చేసిన వైద్య చికిత్సలో 93 శాతం సక్సెస్ రేటు నమోదైంది. 2022లో రాష్ట్రవ్యాప్తంగా 8,52,414 మందికి టీబీ పరీక్షలు నిర్వహించగా 92,129 మందికి వ్యాధి నిర్ధారణ అయింది. వీరిలో 90,862 మందికి వైద్య సేవలు అందించారు. 84,501 మంది చికిత్స పూర్తి చేసుకుని వ్యాధి నుంచి బయటపడ్డారు.

త్వరలో బీసీజీ వ్యాక్సినేషన్ కూడా



పెద్దల్లో క్షయ వ్యాధిని నిరోధించడానికి ఉపయోగపడే బాసిల్లస్ కాల్మెట్ గురిన్ (బీసీజీ) టీకాను రాష్ట్రంలో పంపిణీకి కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖకు సమ్మతిని ఇచ్చాం. త్వరలో 50 శాతం జిల్లాల్లో టీకా పంపిణీ ప్రారంభం అవుతుంది. ఇప్పటికే టీబీతో బాధపడుతున్న వారి కుటుంబ సభ్యులు, ఇతర హైరిస్క్ వర్గాల వారికి టీకా ఇస్తారు. కేంద్ర వైద్య శాఖ 2025 నాటికి దేశంలో టీబీ నిర్మూలనే లక్ష్యంగా పెట్టుకుంది. అంతకన్నా ముందే మన రాష్ట్రంలో టీబీని నిర్మూలించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

– జె. నివాస్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్

ఎస్సీ గురుకుల ఉపాధ్యాయుల వేతనాలు పెంపు

- 1,791 మంది పార్ట్ టైమ్ టీచర్లకు ప్రయోజనం
- పీఈటీ, హెల్త్ సూపర్‌వైజర్ల వేతనాలూ పెంపు
- మంత్రి మేరుగు నాగార్జున వెల్లడి



మంత్రి మేరుగు నాగార్జునను సన్మానిస్తున్న జేఏసీ నేతలు

సాక్షి, అమరావతి: ఎస్సీ గురుకులాల్లో పనిచేస్తున్న 1,791 మంది పార్ట్ టైమ్ టీచర్ల వేతనాలను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినట్టు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున వెల్లడించారు. టీచర్లతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు, హెల్త్ సూపర్ వైజర్ల వేతనాలు కూడా పెంచినట్టు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకులాల్లో పనిచేస్తున్న జూనియర్ లెక్చరర్లు, పీజీటీలు, టీజీటీలు, పీఈటీలు, హెల్త్ సూపర్‌వైజర్ల వేతనాలు పెంచాలంటూ ఉపాధ్యాయులు చేసిన విజ్ఞప్తి మేరకు బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశంలో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. గతంలో జూనియర్ లెక్చరర్ల(జేఎల్)వేతనం రూ.18 వేలు ఉండగా.. దీనిని రూ.24,150కు పెంచినట్టు తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ల(పీజీటీ) వేతనం రూ.16,100 నుంచి రూ.24,150కు, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ల(టీజీటీ) వేతనం రూ.14,800 నుంచి రూ.19,350కు, వ్యాయామ ఉపాధ్యాయుల (పీఈటీ) వేతనం రూ.10,900 ఉండగా.. దానిని రూ.16,350కు పెంచినట్టు చెప్పారు. వీరితో పాటు హెల్త్ సూపర్ వైజర్, స్టాఫ్ నర్సుల వేతనం రూ.12,900 ఉండగా దాన్ని రూ.19,350కు పెంచామన్నారు. కాగా, తమ కష్టాలను గుర్తించి తమ వేతనాలను పెంచినందుకు గురుకుల విద్యాలయాల సంస్థ ఉద్యోగుల జేఏసీ నేతలు, టీచర్లు మంత్రి మేరుగు నాగార్జునను శుక్రవారం సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ నాగభూషణం మాట్లాడుతూ తాము కోరిన వెంటనే న్యాయం చేశారని కొనియాడారు.

చిట్‌ఫండ్ కంపెనీలను ప్రశ్నిస్తే
టీడీపీకి ఎందుకు కోపం?

- మార్గదర్శిపై చర్చకు రాకుండా జీవీ రెడ్డి వెనక్కి తగ్గారు
- రామోజీకి రోజుకు రూ.10 కోట్ల ఆదాయం
- రామోజీ వద్ద ఉన్న డబ్బు బ్లాక్ మనీ అయిఉండాలి
- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ వ్యాఖ్యలు



సాక్షి, రాజమహేంద్రవరం: చిట్‌ఫండ్ కంపెనీలను ప్రశ్నిస్తే చంద్రబాబు, టీడీపీ నేతలకు ఎందుకు కోపం వస్తోందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ప్రశ్నించారు. తాను ఏనాడూ మార్గదర్శి చిట్ ఫండ్స్‌పై ఫిర్యాదు చేయలేదన్నారు. తన పోరాటమంతా మార్గదర్శి ఫైనాన్స్‌పై మాత్రమేనన్నారు. ఉండవల్లి శుక్రవారం మాట్లాడుతూ.. మార్గదర్శి వ్యవహారంపై టీడీపీ అధికార ప్రతినిధి జీవీ రెడ్డి చర్చకు రాకుండా వెనక్కు తగ్గారని, ఆయన వచ్చి ఉంటే ఆరోగ్యకర చర్చ జరిగేదని తెలిపారు. రామోజీరావు జోలికి వెళ్తే బ్రహ్మాండం బద్దలైనట్లుగా కొందరు మాట్లాడటం వింతగా ఉందన్నారు. చిట్‌ఫండ్‌లో కట్టే డబ్బుకి టీడీఎస్, జీఎస్టీ వర్తించవని, అందుకే డబ్బున్నవాళ్లంతా అక్కడ సొమ్ములు దాచుకుంటున్నారేమోనని వ్యాఖ్యానించారు. రూ.17 వేల కోట్ల ఆస్తులున్న రామోజీ వ్యవస్థను శాసిస్తున్నారన్నారు. ఏపీ, తెలంగాణలో శాఖల ద్వారా రామోజీరావుకు రోజుకు రూ.10 కోట్ల ఆదాయం వస్తోందన్నారు. దీన్నిబట్టి చూస్తే రామోజీ దగ్గరున్న డబ్బు మొత్తం బ్లాక్ మనీ అయి ఉండాలని తెలిపారు. దాదాపు 30 సంస్థలు మార్గదర్శి కింద నడుస్తున్నాయని, ప్రజల పెట్టుబడితో వ్యాపారం చేసే వాళ్లకి 50 శాతం సొంత పెట్టుబడి ఉండాలని తీర్పు ఉన్నా ఆయనకు వర్తించదన్నట్లు రామోజీ వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. చిట్‌ఫండ్ నడిపేవారు ఇతర వ్యాపారాలు చేయకూడదని 1993లోనే సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు ఇచ్చిందని చెప్పారు. రామోజీరావుని సీఐడీ విచారించిన వీడియోలు, తనిఖీ చేసిన రికార్డుల కాపీలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా కోరినట్లు చెప్పారు. ఎందుకంటే తనపై మార్గదర్శి యాజమాన్యం వేసిన కేసు విచారణలో హెచ్‌యూఎఫ్ మార్గదర్శికి వర్తిస్తుందా లేదా అనేది స్పష్టం చేయాలని ప్రశ్నిస్తానన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం శుభ పరిణామమని, బీజేపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని అన్నారు.

హజ్‌యాత్రకు అదనపు సాయంపై
ఎన్‌ఆర్‌ఐల కృతజ్ఞతలు

సాక్షి, అమరావతి/కడప కార్పొరేషన్: హజ్‌యాత్రకు వెళ్లే ముస్లింలపై అదనపు భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవడం సంతోషకరమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. హజ్ యాత్రికులకు అదనపు సాయం అందిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు తెలుపుతూ దుబాయ్‌లో ఏపీఎన్ఆర్‌టీఎస్ ఆధ్వర్యంలో 'థ్యాంక్యూ సీఎం' కార్యక్రమాన్ని నిర్వహించారు. అంజద్‌బాషా మాట్లాడుతూ విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ద్వారా హజ్‌యాత్రకు వెళ్లేవారికి సెంట్రల్ హజ్‌కమిటీ, కేంద్రం రూ.3.80 లక్షల టికెట్ ధర నిర్ణయించాయన్నారు. దీన్ని కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ సాంకేతిక కారణాల రీత్యా వారు ఏమీ చేయలేకపోయారన్నారు. దీంతో ఒక్కో హజ్ యాత్రికుడిపై పడే రూ.80,000 అదనపు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని సీఎం జగన్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ మేరకు రూ.14.50 కోట్ల నిధులను విడుదల చేసి ముస్లింల పక్షపాతిగా మరోసారి రుజువు చేసుకున్నారన్నారు. కాగా, హజ్ యాత్రికులపై భారం పడకుండా ఆర్థిక సాయం చేసిన సీఎం జగన్ కి కువైట్‌లోని ప్రవాస భారతీయులు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం కువైట్‌లోని హవెల్లి ప్రాంతంలో ఉన్న ఆర్‌ఆర్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ గల్ఫ్, కువైట్ కన్వీనర్లు బీహెచ్ ఇలియాస్, ఎం.బాలిరెడ్డి మాట్లాడుతూ..ముస్లిం మైనార్టీలకు సీఎం జగన్ అండగా నిలుస్తున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు లక్కీ అజీస్, పారిశ్రామిక వేత్త కరీం చెప్పలి, హబీబ్, షేక్ రహమతుల్లా, షా హుస్సేన్, జాఫర్, అబుతురాబ్, సజ్జాద్, ఇమ్రాన్, అబ్దుల్ అజీస్, గోవిందు నాగరాజు, ఎం.వీ నరసారెడ్డి పాల్గొన్నారు.

సారా, అక్రమ మద్యంపై ఉక్కుపాదం

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు డీజీ రవిశంకర్ అయ్యన్నార్

సాక్షి, అమరావతి: నాటు సారా, అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అదనపు డీజీ రవిశంకర్ అయ్యన్నార్ అధికారులను ఆదేశించారు. సెబ్ జిల్లా యూనిట్లతో విజయవాడలో గురు, శుక్రవారాల్లో నిర్వహించిన సమీక్షా సమావేశాల్లో ఆయన మాట్లాడారు. పదే పదే నేరాలకు పాల్పడుతున్న నిందితులపై పీడీ చట్టాన్ని నమోదు చేయాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేసి చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్న ముద్దాయిలను సంబంధిత రాష్ట్రాల పోలీసుల సహకారంతో న్యాయస్థానాల ముందు హాజరుపరచాలని చెప్పారు. పారిశ్రామిక ఆల్కహాల్‌ను వినియోగిస్తున్న పరిశ్రమలను క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమాలకు పాల్పడకుండా కట్టడి చేయాలన్నారు. విద్యా సంస్థల ప్రాంగణాలు, పరిసర ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని... మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు డీజీ రవిశంకర్ అయ్యన్నార్ చెప్పారు. స్పందన కార్యక్రమానికి వస్తున్న ఫిర్యాదులను గుణాత్మకంగా పరిష్కరించాలని... ఫిర్యాదుదారుల అభిప్రాయాలను కూడా నమోదు చేయాలని సూచించారు.

ఎన్జీరంగా వర్సిటీలో డిప్లమో కోర్సులకు దరఖాస్తులు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో డిప్లమో కోర్సులలో చేరగోరు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, సేంద్రియ వ్యవసాయం, విత్తన సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ ఇంజినీరింగ్ డిప్లమో కోర్సులలో చేరగోరు విద్యార్థుల నుంచి 2023–24 విద్యా సంవత్సరానికి గానూ ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా పదవ తరగతిలో వచ్చిన మార్కులు ఆధారంగా డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు.

నీవే వాయుదేవుడవు, యముడవు, అగ్నివి, వరుణుడవు,
చంద్రుడవు, ప్రజాపతియైన బ్రహ్మవు, బ్రహ్మకును జనకుడవు.
నీకు వేలకొలది నమస్కారములు. మరల మరల నమస్కారములు.
– భగవద్గీత

సాక్షి

శనివారం, 20 మే 2023

ఆచి తూచి వ్యవహరించాలి


యుద్ధోన్మాదం పర్యవసానంగా మనిషి మృగంగా మారితే ఏమవుతుందో ప్రపంచానికి ఇప్పటికీ చాటుతూనే ఉన్న హిరోషిమా నగరంలో శుక్రవారం మూడురోజులపాటు జరిగే జీ–7 దేశాల శిఖరాగ్ర సదస్సు ప్రారంభమైంది. 15 నెలలుగా ఎడతెరిపి లేకుండా కొనసాగుతున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో సహజంగానే ఈ సదస్సులో అది ప్రధానంగా చర్చకొస్తుంది. ఉక్రెయిన్‌లో రష్యా 'వ్యూహాత్మక ఓటమి'కి అందరూ ఏకం కావాలంటూ ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పిలుపునిచ్చారు. పాశ్చాత్య దేశాలన్నీ రష్యాకు వ్యతిరేకంగా ఒక్కటయ్యాయి. ఉక్రెయిన్‌కు ఆయుధాలందిస్తూ రష్యా యుద్ధ వ్యూహాలను వమ్ముచేస్తున్నాయి. అయితే అదొక్కటే సరిపోదు. జీ–7 సమావేశాల వేదిక హిరోషిమా గనుక ఆ దేశాధినేతలందరూ చిత్తశుద్ధితో బాధ్యతాయుతంగా ఆలోచించి ఈ యుద్ధాన్ని కట్టడి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలేమిటన్న అంశంపై దృష్టి సారించాలి. గెలుపోటముల సంగతలావుంచి ఇది అణుయుద్ధంగా పరిణమించకుండా ఏంచేయాలో ఆలోచించాలి. ఎందుకంటే హిరోషిమా, నాగసాకి పట్టణాలపై రెండో ప్రపంచ యుద్ధ సమయంలో 1945 ఆగస్టు 9న అమెరికా అణుబాంబులు ప్రయోగించటం పర్యవసానంగా ఏం జరిగిందో అందరికీ తెలుసు. ఆనాటి విషాద ఉదంతాల్లో రెండు లక్షలమందికిపైగా మృత్యువాత పడ్డారు. అనంతర దశాబ్దాల్లో మరిన్ని లక్షలమంది దీర్ఘకాల వ్యాధుల బారినపడి చనిపోయారు. బాంబు జారవిడిచిన ప్రాంతానికి చుట్టూవున్న 11 చదరపు కిలోమీటర్ల పరిధిలో కనీవినీ ఎరుగని విధ్వంసం చోటు చేసుకుంది. తరాలు గడుస్తున్నా ఇప్పటికీ అంగవైకల్యంతో జన్మిస్తున్నవారు అక్కడ ఎక్కువే. ఈ శిఖరాగ్ర సదస్సు అణు నిరాయుధీకరణ, అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక చర్యలపై దృష్టి సారిస్తుందంటున్నారు. అయితే అణ్వస్త్ర దేశాలన్నీ తమ వద్ద ఉన్న అణ్వాయుధాలను స్వచ్ఛందంగా వదులుకోవడానికి ముందుకు రానంతవరకూ ఈ లక్ష్యాలు నెరవేరవు. ఉక్రెయిన్ దురాక్రమణ యుద్ధంలో అణ్వస్త్రాలు ప్రయోగిస్తామని తరచు పుతిన్ బెదిరిస్తున్నారు. ఉత్తరకొరియా అణు క్షిపణులను అభివృద్ధి చేస్తున్నానంటున్నది. ఈ పరిణామాలు ఆందోళనకరమైనవే. కాదనలేం. అయితే తమ దగ్గర తప్ప వేరే ఎవరివద్దా అణ్వస్త్రాలు ఉండరాదన్న వాదంతో ఈ ప్రమాదాన్ని ఎదుర్కొనటం సాధ్యం కాదు. అసలు ఎవరిదగ్గరైనా మానవాళిని సర్వనాశనం చేసే ఆయుధాలు ఎందుకుండాలన్న ప్రశ్న ఎవరికి వారు వేసుకోవాలి. అమెరికా అణు ఛత్రఛాయలో కొనసాగుతున్న జపాన్ అణునిరాయుధీకరణ గురించి మాట్లాడటంపై విమర్శలు తలెత్తటంలో వింతేమీ లేదు.

జీ–7 సభ్యదేశాల ముందు పెద్ద ఎజెండాయే ఉంది. తైవాన్‌కు చైనా నుంచి వస్తున్న బెదిరింపులు, గతంలో పాశ్చాత్య దేశాలకు వలసలుగా ఉండి స్వాతంత్ర్యం పొంది ఇప్పుడు రష్యా, చైనాలకు సన్నిహితమవుతున్న పేద దేశాల విషయంలో అనుసరించాల్సిన వ్యూహం ఇందులో చర్చకు రాబోతున్నాయి. ఆర్థిక స్థితిగతులు సరేసరి. అరబ్ దేశాల వైఖరితో తలెత్తిన చమురు సంక్షోభం, దాన్ని వెన్నంటి వచ్చిన ఆర్థిక మాంద్యంతో నిలువెల్లా వణికిన పాశ్చాత్య దేశాలు 1975లో ఒక్కటై జీ–6గా ఏర్పడ్డాయి. ఇందులో ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, బ్రిటన్‌లతోపాటు అమెరికా చేరింది. ఆ మరుసటి ఏడాది కెనడా చేరికతో అది జీ–7 అయింది. చిత్రమేమంటే...అప్పటికి ప్రపంచ ఆర్థిక కార్యకలాపాల్లో యాభై శాతం వాటావున్న ఈ దేశాలకు ఇప్పుడు 30 శాతం మించిలేదు. చైనా, భారత్, బ్రెజిల్ ఆర్థిక వ్యవస్థలు చురుకందుకున్నాయి. రష్యా, చైనాలవైపు మొగ్గుతున్న పేద దేశాలకు ఆరోగ్యం, ఆహారభద్రత, మౌలిక సదుపాయాల కల్పన తదితర రంగాల్లో తోడ్పాటునందిస్తూ వాటిని అక్కున చేర్చుకోవాలని జీ–7 దేశాలు భావిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ ఇంధన సంస్థ, ఓఈసీడీ తదితర సంస్థల ప్రతినిధులు కూడా హాజరవుతున్నారు గనుక ఆ దిశగా విధాననిర్ణయాలుండొచ్చు. ఇక రష్యా చమురుపై విధించిన ఆంక్షల అమలుపై ఇందులో చర్చిస్తారంటున్నారు. దాంతోపాటు వజ్రాల వ్యాపారంలో కూడా రష్యాను కట్టడి చేయటంపై జీ–7 దృష్టి సారించబోతోంది. ఇది నేరుగా భారత్‌నూ, ప్రత్యేకించి గుజరాత్‌లో అధికంగా ఉన్న వజ్రాల పరిశ్రమనూ ప్రభావితం చేస్తుంది. ప్రపంచ వజ్రాల వ్యాపారంలో 40 శాతం వాటా ఉన్న రష్యా, గుజరాత్‌లోని సూరత్ వజ్రాల పాలిషింగ్ పరిశ్రమపై ప్రధానంగా ఆధారపడుతుంది. రష్యాపై విధిస్తున్న ఆంక్షలవల్ల ఆ దేశం ఒక్కటే కాదు... ముడి చమురు, వజ్రాలు తదితర ఉత్పత్తులపై ఆధారపడుతున్న భారత్‌వంటి దేశాలకు సైతం ఇబ్బందులు తలెత్తుతాయి. జీ–7 శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటున్న ప్రధాని నరేంద్ర మోదీ ఈ విషయంలో మన వైఖరిని స్పష్టంగా తెలియజేయటం అవసరం.

ప్రచ్ఛన్న యుద్ధం ముగిసి మూడు దశాబ్దాలవుతోంది. ఇన్నేళ్లుగా ప్రపంచ దేశాల మధ్య పరస్పర విశ్వాసం వల్ల అయితేనేమి, ఎవరూ తొలుత అణ్వాయుధాలు వినియోగించరాదన్న నియమం పెట్టుకోవటం వల్ల అయితేనేమి ప్రమాదం లేకుండా పోయింది. అయితే ఆ దశ ముగిసి పరస్పరం హెచ్చరికలు, సవాళ్ల పర్వం మొదలైంది. యుద్ధం సంప్రదాయ ఆయుధాల పరిధిలోనే పరిభ్రమిస్తుందనుకోవటం ఆత్మవంచనే అవుతుంది. కనుక జీ–7 దేశాలు అత్యంత జాగురూకతతో ఈ అంశాన్ని పరిశీలించాలి. ఉక్రెయిన్‌కు ఆయుధాలందజేస్తూ పోవటం, ఆంక్షలు అమలు చేయటంవల్ల రష్యా లొంగుబాటులోకొస్తుందా, అది మరింత రెచ్చిపోయి ఉన్మాద స్థితికి చేరుతుందా అన్నది గమనించుకోవాలి. విజ్ఞతతో వ్యవహరించాలి. ఆ యుద్ధాన్ని ఆపటమే ధ్యేయంగా తదుపరి చర్యలుండాలి.

పెద్దన్నల రూట్ మారితే...

విశ్లేషణ



శ్యామ్ శరణ్

అమెరికా, చైనా మధ్య తుది ఘర్షణ చోటు చేసుకుంటే ఇది భారతదేశానికి వ్యూహాత్మక విన్యాసానికి చోటు లేకుండా చేస్తుంది. స్నేహితుడు, ప్రత్యర్థి ఇద్దరి నుంచీ 'నువ్వు ఉంటే మాతో ఉండు లేదా వ్యతిరేకంగా ఉండు' అనే ఒకే రకమైన ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తుంది. కానీ ఆశ్చర్యకరంగా అమెరికా, చైనా మధ్య సంబంధాల 'స్థిరీకరణ' ప్రయత్నాలు సాగుతున్నాయి. ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు చైనా అప్రకటిత మద్దతు చెప్పడం కూడా వీటిని ఆపడం లేదు. ఈ పరిణామాలపై అప్పుడే భారత్ ఆందోళన చెందాల్సిన అవసరం లేకపోవచ్చు. కానీ భారత్ ప్రయోజనాలపై ఇవి ప్రభావం చూపుతాయి కాబట్టి వీటిని జాగ్రత్తగా, నిర్దిష్టంగా అంచనా వేయాల్సి ఉంటుంది.

గత కొన్ని సంవత్సరాలుగా, తన ప్రపంచాధిపత్యానికి చైనా ముప్పు కలిగిస్తూ ఎదుగుతోందని అమెరికా గ్రహిస్తోంది. రెండు దేశాల మధ్య బలాబలాల అంతరం క్రమంగా క్షీణిస్తోంది. ఆర్థిక, సైనిక, సాంకేతికపరమైన ప్రతిశక్తి కొలమానంలోనూ ఇది కనిపిస్తోంది. ప్రపంచంలోనే చైనా రెండో అతిశక్తిమంతమైన దేశం. అమెరికాను అగ్రపీఠం నుంచి తప్పించి తాను నంబర్ వన్ దేశంగా మారాలన్న తన ఆకాంక్షను వ్యక్తపర్చే విషయంలో చైనా ఏమాత్రం మొహమాటపడదు. కాబట్టి రెండు దేశాల మధ్య ఘర్షణ వ్యవస్థీకృతంగానే ఉంటోంది.

పరివర్తన చెందుతున్న భౌగోళిక రాజకీయ వ్యవస్థ కేంద్రంగా తాను ఆవిర్భవించడం అనివార్యమని చైనా అభిప్రాయం. దీన్ని వెనక్కి తిప్పలేకపోయినా, కనీసం ఈ పరిణామాన్ని ఆపాలని అమెరికా కృతనిశ్చయంతో ఉంది. ఈ క్రమంలో ఎవరు నెగ్గుతారు అనేది స్పష్టం కావడం లేదు కానీ, దీని పర్యవసానాలు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేకించి ఆసియా దేశాలపై ప్రభావం చూపుతాయి. ఈ కారణం చేత, అమెరికా–చైనా సంబంధాలలోని పరిణామాలను చాలా జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉంది. ఎందుకంటే అవి భారత్ భౌగోళిక రాజకీయ అవకాశాలపై గణనీయంగా ప్రభావితం చూపుతాయి.

నేను భారత్ దృక్కోణాన్ని అందిస్తాను. అన్ని రకాల ఘర్షణ, కుట్రల కోణంలో చూస్తే– అమెరికా, చైనా సంబంధాలు చివరి ఘర్షణ వైపుగా పయనిస్తున్నాయని అనుకోవచ్చు. కానీ ఈ తుది ఘర్షణ భారతదేశానికి ఒక వ్యూహాత్మక విన్యాసానికి చోటు లేకుండా చేస్తుంది. స్నేహితుడు, ప్రత్యర్థి ఇద్దరి నుంచీ 'నువ్వు ఉంటే మాతో ఉండు లేదా వ్యతిరేకంగా ఉండు' అనే ఒకే రకమైన ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎత్తుగడల రీత్యా అయినా సరే... నిర్దిష్ట ప్రభావిత రంగాలను గుర్తించడం ద్వారా తమ మధ్య పోటీని నియంత్రించడానికి రెండు పార్టీలూ తీసుకునే నిర్ణయం నుంచే అమెరికా, చైనా మధ్య పొత్తు సంభవించవచ్చు. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అమెరికా, నాటి సోవియట్ యూనియన్ మధ్య జరిగింది ఇదే. అలాంటిది ఏదైనా జరిగినప్పుడు చైనా తూర్పు ప్రపంచంపై తన ఆధిపత్యాన్ని స్పష్టంగా నొక్కి చెప్పుతుంది, అదే సమయంలో పశ్చిమార్ధగోళంలో అమెరికా ప్రాభవాన్ని అంగీకరిస్తుంది. చైనీస్ వ్యూహకర్తలు తరచుగా ఈ దోపిడీ విభజనను పశ్చిమ పసిఫిక్ మధ్య గీత గీయడం ద్వారా నొక్కి చెబుతారు. అప్పుడు హిందూ మహాసముద్రం వ్యూహాత్మకంగా చైనా ప్రభావంలో పడిపోతుంది. ఇది భారత్‌కు శాపం అవుతుంది. ఈ ఆకస్మికత అసంభవంగా కనిపిస్తున్నప్పటికీ, దాన్ని పూర్తిగా తోసిపుచ్చకూడదు.

ఈ నేపథ్యంలో అమెరికా, చైనా సంబంధాల్లోని ఇటీవలి కొన్ని పరిణామాల ప్రాధాన్యత ఏమిటి? మే 10, 11న అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సల్లివాన్, చైనా ప్రభుత్వ కౌన్సిలర్, మాజీ



విదేశాంగ మంత్రి వాంగ్ యీని వియన్నాలో కలిశారు. 'యుఎస్–చైనా ద్వైపాక్షిక సంబంధం, అంతర్జాతీయ, ప్రాంతీయ భద్రతా సమస్యలకు సంబంధించిన కీలక అంశాలపై నిష్కపటమైన, వాస్తవికమైన, నిర్మాణాత్మక చర్చలు జరిగా'యని వైట్ హౌస్ నివేదించింది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, తైవాన్ సమస్య తదితర అంశాలపై కూడా చర్చలు జరిగినట్లు తెలిపింది.

ఈ చర్చలను వివరించడానికి చైనా షిన్హువా న్యూస్ ఏజెన్సీ కూడా ఇదేవిధమైన పదజాలాన్ని ఉపయోగించింది. 'చైనా–అమెరికా సంబంధాల్లోని అవరోధాలను తొలగించి, స్థిరీకరించడంపై ఇరుపక్షాల మధ్య నిష్కపటమైన, లోతైన, వాస్తవికమైన, నిర్మాణాత్మక చర్చలు జరిగా'యని నివేదించింది.

ఇది అమెరికా, చైనా మధ్య వివిధ స్థాయిల్లో ద్వైపాక్షిక సంబంధాలకు సంబంధించిన వివిధ అంశాల్లో చర్చలు, సంభాషణల పునరుద్ధరణకు మార్గాన్ని సుగమం చేసింది. అమెరికా వాతావరణ విభాగానికి సంబంధించి అమెరికా అధ్యక్షుడి ప్రత్యేక దూత జాన్ కెర్రీని చైనా సందర్శనకు ఆహ్వానించారని నివేదించారు కూడా. అమెరికా వాణిజ్య ప్రతినిధి కేథరీన్ తాయ్ మే 25–26 తేదీల్లో డెట్రాయిట్‌లో జరగనున్న అపెక్ వాణిజ్య మంత్రుల సమావేశంలో చైనా వాణిజ్యమంత్రి వాంగ్ వెన్‌తావోతో చర్చలు జరపనున్నారు. జూన్ నెలలో సింగపూర్ లోని షాంగ్రి–లా చర్చల్లో అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్, చైనా రక్షణమంత్రి జనరల్ లీ షాంగ్‌ఫుతో భేటీ కానున్నారు. చైనాలో నూతన రాజకీయ ప్రతినిధులతో కమ్యూనికేషన్ ఛానల్స్ ఏర్పాటుపై అమెరికా ఆసక్తితో ఉన్నట్లు కనిపిస్తోంది. బీజింగ్ కొత్త నాయకత్వంలో అనేక కొత్త ముఖాలు కనిపిస్తున్నాయి. దీనికి సంబంధించి చైనా పక్షం ముందడుగు వేస్తున్నట్లు కనిపిస్తోంది.

ఏప్రిల్ 20న జాన్ హాప్కిన్స్ యూనివర్సిటీలో చేసిన, జాగ్రత్తగా రూపొందించిన ప్రసంగంలో అమెరికా ట్రెజరీ సెక్రటరీ జానెట్ ఎల్లెన్, అమెరికా–చైనా పొత్తులో ఈ నూతన దశ గురించి సంకేతాలిచ్చారు. 'సంపద్వంతమైన చైనా... అమెరికాకు, ప్రపంచానికి కూడా మంచిదే కాబట్టి పెరుగుతున్న చైనా సంపద ప్రమాదకరమని అమెరికా ఏమాత్రమూ భావించడంలే'దని ఎల్లెన్ ఆ ప్రసంగంలో వివరించారు. చైనా నుంచి మన ఆర్థిక వ్యవస్థను విడగొట్టాలని అమెరికా చూడటం లేదని ఆమె చెప్పారు. 'మన రెండు ఆర్థిక వ్యవస్థలూ సంపూర్ణంగా వేరుపడిపోతే అది రెండు దేశాలకూ వినాశకరమవుతుంది, అది తక్కిన ప్రపంచాన్ని కూడా అస్థిరపరుస్తుంది' అని ఆమె చెప్పారు. ఈ అంశాన్ని నొక్కి చెప్పడానికిగానూ, అమెరికా–చైనా వాణిజ్యం ప్రస్తుతం 750 బిలియన్ డాలర్లకు చేరుకుందని ఆమె తెలిపారు.

ఇది దేన్ని సూచిస్తుంది? ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు చైనా నిశ్శబ్ద మద్దతు ప్రకటించడం అనేది చైనాతో సంబంధాల 'స్థిరీకరణ' కోసం అమెరికా చేపట్టిన ఈ ముఖ్యమైన చర్యను నిరోధించలేదు. ఇటీవలి కాలంలో ఘర్షణాత్మక దిశకు దారితీసిన తైవాన్ సమస్య ఇప్పుడు కాస్త సద్దుమణిగిననట్లు కనిపిస్తోంది. చైనా పక్షం నుంచి కూడా దీనిపై కొన్ని వ్యాఖ్యలు వస్తున్నాయి. తైవాన్ స్థితి గీత దాటకూడని బాటమ్ లైన్‌కి ప్రాతినిధ్యం వహిస్తోందనీ, అది అమెరికా, చైనా సంబంధాల సంపూర్ణత్వాన్ని సూచించదనీ చైనా పేర్కొంది. స్పష్టంగానే, తైవాన్ జలసంధిలో ప్రమాదకరమైన ఘర్షణ నుంచి వెనక్కు మళ్లాలని ఇరు పక్షాలూ నిర్ణయించుకున్నాయి.

అమెరికా తీసుకున్న చొరవ తర్వాత గత నెలలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమాన్యుయెల్ మెక్రాన్ చైనాను సందర్శించారు. ఉక్రెయిన్‌పై చైనా వైఖరి భిన్నంగా ఉన్నప్పటికీ ఇది చైనాను బుజ్జగించడానికి సంబంధించినదే అనడంలో సందేహం లేదు. చైనాను 'వ్యవస్థీకృత' ప్రత్యర్థిగా నిర్వచించినప్పటికీ, ఫ్రాన్స్, జర్మనీ రెండూ చైనాతో సంబంధాలు కొనసాగాల్సిన ప్రాధాన్యతను నొక్కి చెప్పాయి.

భారత్ ఈ పరిణామాల పట్ల ఆందోళన చెందాల్సిందేనా? బహుశా ఈ దశలో అవసరం లేకపోవచ్చు. ఎందుకంటే ఈ పరిణామాలన్నీ ఏ దశను అనుసరిస్తాయో ఇంకా స్పష్టం కావడం లేదు. పైగా ఏదో అంశంపై తిరిగి ఘర్షణ ఏర్పడటం ద్వారా లేదా వివాదాస్పద సమస్య ద్వారా అమెరికా, చైనా బంధాలు మళ్లీ పట్టాలు తప్పుతాయా అన్నది కూడా అస్పష్టమే. అయితే ఇవి ఎలా పరిణమిస్తాయన్నదే భారత్ ప్రయోజనాలపై ప్రభావం చూపుతుంది కాబట్టి వీటిని జాగ్రత్తగా, నిర్దిష్టంగా అంచనా వేయాల్సి ఉంటుంది. కాకతాళీయంగా, చైనాతో సాయుధ ఘర్షణ సంభవించిన పక్షంలో భారత్‌పై అమెరికా పెద్దగా ఆధారపడి లేదని అమెరికాలో పలు వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అంటే అమెరికా, చైనా మధ్య ఉద్రిక్తతలను తగ్గించుకోవడంపై భారత్ ప్రతిస్పందనల పట్ల అమెరికా పెద్దగా సావధానత చూపదని ఇది సూచిస్తుంది.

వ్యాసకర్త విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

చెల్లుకు చెల్లు



ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ములాయం సింగ్ యాదవ్ 1990లో కేరళ ముఖ్యమంత్రికి హిందీలో లేఖ రాశారు, ఇంగ్లీష్ కాపీ లేకుండా. కేరళ సీఎం ఇ.కె. నయనార్ దానికి మలయాళంలో బదులిచ్చారు, ఇంగ్లీష్ కాపీ లేకుండా. అప్పుడు ఆగ్రహంతో ములాయం తిరిగి ఇంగ్లీష్‌లో లేఖ రాశారు. ఇవ్వాళ (మే 19) కామ్రేడ్ నయనార్ వర్ధంతి.

– అద్వైద్, చరిత్రకారుడు

అంతా?



క్రెడిట్ కార్డ్ (ఇంటర్నేషనల్) లావాదేవీల సౌకర్యం పొందడానికి పౌరులు ముందస్తు పన్నులు చెల్లించాల్సిన ఏకైక దేశం ప్రపంచంలో ఇండియా ఒక్కటే; అది కూడా 20 శాతం!

– గోవింద్‌రాజ్ ఎతిరాజ్, జర్నలిస్ట్

ఇట్టే వెళ్లొచ్చు



ఇండియాలోని పెద్ద నగరాలను దర్శించడం కన్నా నిజానికి థాయిలాండ్ పర్యటించడం చవక. మధ్యశ్రేణి హోటళ్లు 2,500–3,000 మధ్య ఉంటాయి. స్ట్రీట్ ఫుడ్ చాలా చవక (రూ. 95–150). ఏసీ ఫుడ్ కోర్ట్స్ కొంచెం ఎక్కువంతే. చాలాభాగం దక్షిణాసియా చూడ్డానికి మనం 'ధనవంతులం' కానక్కర్లేదు.

– మధు మేనన్, ఫొటోగ్రాఫర్, షెఫ్

ఎదుగుతాడు



సంతుష్టిగా ఉన్న మనిషి అల్ప విషయాలను విస్మరించగలిగి, అతిముఖ్య వాస్తవాలతో జీవించగలడు. క్లుప్తంగా చెప్పాలంటే, అతడు సాధారణంగా జీవిస్తూ అత్యున్నతంగా ఆలోచించడాన్ని సాధన చేస్తాడు.

– మౌలానా వహీదుద్దీన్ ఖాన్, ఇస్లామిక్ పండితుడు

ఆటలు చెల్లవు



ముస్లిం బ్రదర్‌హుడ్ తీవ్రవాదులకు అత్యంత దుస్వప్నంగా నిలుస్తున్న దేశం ఏదైనా ఉందంటే అది యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ).

– హసన్ సజ్వానీ, పారిశ్రామికవేత్త

పార్టీ నిర్మాణం చేయని నాయకుడు

సందర్భం



సి. రామచంద్రయ్య

జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఇటీవల తన పార్టీ పెట్టుకోబోయే రాజకీయ పొత్తులపై ఇచ్చిన మరింత స్పష్టత ఆయన రాజకీయ అనైతికత్వాన్ని మరింత స్పష్టం చేయడంతో ఆ పార్టీలో అంతర్మథనం మొదలయిన సూచనలు కనిపిస్తున్నాయి. ఒకవైపు జాతీయ పార్టీ అయిన బీజేపీతో పొత్తులో ఉండి మరోవైపు తెలుగుదేశం పార్టీతో చెలిమిని ఆశిస్తున్న పవన్ కల్యాణ్... ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ వ్యాఖ్యానించినట్లు 'తన సొంత పార్టీ నేతల్ని రాజకీయంగా ఎదుటి నుంచి పొడిచినట్లే!' అందులో ఎలాంటి సందేహమూ లేదు.

సాధారణంగా, ఏ రాజకీయ పార్టీలోనైనా పార్టీ అధినేత స్థాయి నుంచి కింది స్థాయిలోని సామాన్య కార్యకర్త వరకు సిద్ధాంతాలు, విధానాలలో ఒకేవిధమైన 'పార్టీ లైన్' ఉంటుంది. కానీ, జనసేనలో అందుకు భిన్నమైన ధోరణి కనబడుతుంది. కారణం పవన్ కల్యాణ్‌కు తన పార్టీని ప్రజాస్వామ్యబద్ధంగా నడపాలన్న స్పృహ లోపించడం. 2014లో పవన్ కల్యాణ్ జనసేన ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఆయన చేసిన ప్రసంగంలో భారీ డైలాగులు ఉన్నాయి. చేగువేరాను ఉటంకించారు. ప్రసిద్ధ కవి గుంటూరు శేషేంద్ర శర్మ, శ్రీశ్రీల కవితాపంక్తులు చదివి వినిపించారు. తన అన్న చిరంజీవిలా తాను మంచివాడిని కాదనీ, దృఢంగా వ్యవహరిస్తాననీ చెప్పుకొని, తనను అభిమానించే కొంతమంది వ్యక్తుల్లో లేనిపోని ఆశలు రేకెత్తించారు. ఆ తర్వాత ఏం జరిగిందో చర్వితచర్వణంగా చెప్పుకోనక్కర్లేదు.

చంద్రబాబు ప్రభుత్వంలో జరిగిన తప్పుల్ని పవన్ కల్యాణ్ ఏనాడూ ప్రశ్నించలేదు. 2019 ఎన్నికల ముందు హఠాత్తుగా.. కమ్యూనిస్టులు, బీఎస్పీతో పొత్తు పెట్టుకొని ఎన్నికలకు వెళ్లి మట్టికరిచారు. అప్పటి ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడం ద్వారా ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయావకాశాలను దెబ్బతీయడం అనే వ్యూహం ఫలించక పోగా పోటీ చేసిన రెండు చోట్లా అవమానకరరీతిలో ఓడి పోయారు. ఓటమి తర్వాత కూడా పవన్ కల్యాణ్ తన పార్టీని గ్రామస్థాయి నుంచి నిర్మాణం చేసుకోవడానికి కృషి చేయలేదు. పైగా, పార్టీలోకి సీనియర్లు ఎవరూ రాకుండా.. నంబర్ 2గా మరో నాయకుడిని ఎంచుకొని ఆయనను తన రాజకీయ వ్యవహారాల కమిటీకి ఛైర్మన్ చేశారు.

ఏ రాజకీయ పార్టీలోనైనా అధ్యక్షుడి తర్వాత స్థానంలో రాజకీయ వ్యవహారాల కమిటీ లాంటి ఉన్నత స్థాయి కమిటీ ఉంటుంది. అందులో ఉండేవారందరూ సమాన హోదా కలిగి ఉంటారు. ఆశ్చర్యం ఏమంటే.. జనసేనలోని అగ్రనేతలు



ముగ్గురూ అగ్రకులాలకు చెందినవారే. పార్టీని నడిపేది వారే. వారి తర్వాత నాయకులెవరన్నది ఎవ్వరికీ అంతుపట్టదు. నాయకత్వాన్ని ప్రోత్సహించడం, నాయకుల్ని తయారు చేయడం అన్నది పవన్ కల్యాణ్‌కు ఇష్టం లేదన్నది స్పష్టంగా తెలుస్తుంది. పార్టీపరంగా నాయకత్వ లక్షణాలు గలిగిన వారిని అన్ని స్థాయిలలో గుర్తించి వారికి రాజకీయంగా అవకాశాలు అందించి సమాజంలో వారికి గుర్తింపు లభించేలా తీర్చిదిద్దే ప్రక్రియను ప్రతి రాజకీయ పార్టీ చేస్తుంది. కానీ, ఆశ్చర్యం.. 10 ఏళ్ల వయస్సున్న జనసేనలో అటువంటి ప్రక్రియ ఉన్నట్లు కనబడదు.

పవన్‌కల్యాణ్ రాజకీయ భవిష్యత్‌పై ఆయన సొంత సామాజిక వర్గంలోని కొంతమంది భారీ అంచనాలు వేసుకొన్నారు. సొంతంగా రాజకీయ పార్టీని పెట్టిన చిరంజీవి... ప్రత్యర్థుల ఎత్తులు, పైఎత్తుల ముందు నిలబడలేక చివరకు ఆ పార్టీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశారనీ... కానీ, పవన్ కల్యాణ్ మాత్రం అధికారం దక్కించుకొంటాడంటూ కొందరు సామాజిక మాధ్యమాలలో పనికిమాలిక ట్వీట్లు, రాతలు పెడుతూ వాస్తవాల్ని విస్మరిస్తున్నారు. ఆశ్చర్యం ఏమిటంటే.. చిరంజీవిని కొందరు వ్యక్తులు ప్రభావితం చేసి ప్రజారాజ్యాన్ని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయించారంటూ నెపాన్ని ఎవరి మీదనో రుద్దుతూ ఉంటారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు ఎదురుదెబ్బలు తగలడం సహజమనీ, వాటిని తట్టుకొని నిలబడాలే తప్ప, చెప్పుడు మాటలు విని కాడిని కింద పడేయడం ఏమిటనీ ప్రశ్నించే దమ్ము, ధైర్యం లేకుండా ఎవరినో నిందిస్తే ప్రయోజనం ఏమిటి?

పవన్ కల్యాణ్ వేస్తున్న రాజకీయ తప్పటడుగుల్ని విమర్శిస్తే.. అదో పెద్ద నేరం అన్నట్లు.. సొంత సామాజిక వర్గం వారు పవన్ కల్యాణ్‌ను పల్లెత్తుమాట మాట్లాడకూడదన్నది జనసేన మేధావుల అభిప్రాయం. చిరంజీవిని ముఖ్యమంత్రి చేసుకోలేకపోయామని, పవన్ కల్యాణ్‌ను మాత్రం ఆ పీఠం మీద కూర్చోబెట్టాల్సిందేనంటూ కొందరు ఊదర కొడుతున్నారు. నిజానికి, గతంలో ఎన్.టి. రామారావు, డా॥ వైఎస్ రాజశేఖర రెడ్డి, ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిలు ముఖ్యమంత్రులు కాగలిగారంటే అందుకు కారణం వారి సొంత సామాజిక వర్గీయులు కాదు. అన్ని కులాల, మతాల వారి మద్దతు, అండదండల్ని వారు సంపాదించుకోగలిగారు. వారి వ్యక్తిత్వాన్నీ, ఔన్నత్యాన్నీ ప్రజలు గ్రహించారు, ఆదరించారు. వారికి కులాన్ని ఆపాదించడం అవివేకం. పవన్ కల్యాణ్ తన అవగాహనా రాహిత్యంతో, సంకుచిత మనస్తత్వంతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక సామాజిక వర్గానికి వ్యతిరేకం అనీ, వారిని వర్గ శత్రువుగా పరిగణిస్తున్నారంటూ మాట్లాడుతున్నారు.

పవన్ కల్యాణ్‌ను గుడ్డిగా సమర్థించే కుహనా మేధావులు గ్రహించాల్సిందేమిటంటే... ఆయనకు ముఖ్యమంత్రి కావాలన్న కాంక్ష లేదు. అయితే, అది అతనిలోని ఉదాత్తమైన లక్షణం కాదు. ఆయనకు అనేక పరిమితులు ఉన్నాయి. తన పార్టీని నమ్ముకొని పని చేస్తున్న వారిని ఉన్నత స్థానాలలో నిలపాలన్న కోరిక ఆయనలో ఏ కోశానా లేదు. కానీ, ఆ పార్టీని నమ్ముకున్న వారికి మాత్రం తాము ఆ పార్టీ ద్వారా ప్రజాప్రతినిధులు కావాలన్న తపన ఉంది. అందులో తప్పు లేదు. సమంజసం కూడా! కానీ, పవన్ కల్యాణ్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిపాలనను ఓ వంకగా చూపి తెలుగుదేశం పార్టీతో జతకట్టడం ద్వారా తన ప్రణాళికను అమలు చేయాలనుకొంటున్నారు. పొత్తులో భాగంగా పరిమితంగా 'సీట్లు' కోరతారు. తెలుగుదేశం పార్టీ ఇచ్చే స్థానాల్లో కూడా జనసేన అభ్యర్థులు పోటీ చేస్తారా? లేక తెలుగుదేశం పంపించే అభ్యర్థులే జనసేన ద్వారా పోటీలో నిలుస్తారా? అనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. పవన్ కళ్యాణ్ వేస్తున్న అడుగులు, ఆ పార్టీలో నిజాయితీగా పని చేస్తున్న వారి ఆకాంక్షలకు ఎక్కడా పొంతనలేదు.

నాయకత్వం అంటే వేరే పార్టీ అడుగుజాడల్లో నడవడం కాదని పవన్ కల్యాణ్‌కు ఎవరు చెబుతారు? అసలు పొత్తుల గురించి పార్టీలో చర్చించి, అందరి అభిప్రాయాలు స్వీకరించి ఓ నిర్ణయానికి రాకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం రాజకీయ పార్టీల విధానం కాదని పవన్ కల్యాణ్‌కు చెప్పగలిగిన వారు ఆ పార్టీలో లేరా? ప్రజల కోసం పార్టీయే తప్ప వేరొకర్ని గెలిపించడానికి పార్టీ నడపడం ఏమిటి? దారుణం ఏమిటంటే, పవన్ కల్యాణ్ ప్రతిపాదించే పొత్తుల గురించి తమ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీలోని కొంతమంది నాయకులు బాహాటంగా చెబుతున్నారు. హతవిధీ! బీజేపీకి ఏమిటీ దుర్గతి?! అని అందరూ మాట్లాడుకునే పరిస్థితిని ఆ పార్టీ నేతలు కల్పించుకోవడం ఆంధ్రప్రదేశ్‌లో దాని దీనస్థితిని తెలియచెబుతోంది.


2019లో ఎటువంటి పొత్తులు లేకుండా పోటీచేసి కేవలం 5 లక్షల ఓట్ల తేడాతో అధికారం కోల్పోయినప్పటికీ తిరిగి 5 సంవత్సరాలపాటు ప్రజలతో మమేకమై ప్రజల ఆదరణను చూరగొని 50 శాతం ఓట్లు సాధించిన వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి జగన్ ముందు పవన్ కళ్యాణ్ వేస్తున్న పొత్తుల వ్యూహాలు కుప్పిగంతులే.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు

అకారణ బంధుత్వం

'అకారణ బంధుత్వం' అన్న పదబంధాన్ని మన పూర్వకవులలో ఒకరిద్దరు చాలా ఇష్టంగా ఉపయోగించారు. వినడానికే కాదు ఆ మాట వెనక ఉన్న అర్థం గురించి ఆలోచించినా ఎంతో హృద్యంగా ఉంటుంది. ఒక మనిషి ఏ కారణమూ లేకుండానే కష్టంలో చిక్కుకున్న సాటి మనిషితో బంధుత్వాన్ని కలుపుకొని నిస్వార్థంగా తాను చేయగల సహాయం చేయడాన్ని ఈ పదబంధం సూచిస్తుంది.

వెన్నెలకంటి అన్నయ రచించిన 'షోడశకుమార చరితం' కావ్యం ద్వితీయాశ్వాసంలోని ఒక సన్నివేశం ఇది. ఒక రాకుమారుడు సపరివారంగా వేటకు వచ్చి అడవిలోకి దూకుడుగా చొచ్చుకుని వెళ్లాడు. ఒకానొక సమయంలో దారి తప్పిపోయి ఒంటరివాడై ఎటు వెళ్ళాలో తెలియక తిరుగుతూ ఉండగా, దగ్గర లోని



జ్యోతిర్మయం

ఒక ప్రవాహంలో ఆ అడవికి చెందినవాడే అయిన ఒక వృద్ధుడు, తన కాలు మొసలి నోటికి చిక్కి, తప్పించుకోలేక తన్నుకులాడుతూ కనపడతాడు. ఇది చూసిన రాకుమారుడు ఆ ప్రవాహం వద్దకు వెళ్ళి సాయంగా కత్తి, కటారు వంటి తన ఆయుధాలకు కాసింత సేపు పని పెట్టి, తానూ కష్టపడి పోరాడి ఆ వృద్ధ ఆటవికుడి కాలును ఎట్టకేలకు మొసలి నోటినుండి తప్పించి రక్షిస్తాడు. నీటిలో మొసలికి ఏనుగునైనా పడవేయగలంత బలం ఉంటుందని తెలిసినదే కదా! అయినా సరే, వెనుకాడకుండా, చేస్తున్న ప్రయత్నం మధ్యలో వదలక, ఎక్కడినుండి ఎలా వచ్చాడో తెలియని ఆ రాకుమారుడు తన ప్రాణాన్ని సైతం పణంగా పెట్టి చేసిన సహాయంతో ప్రాణం కాపాడుకున్న ఆ వృద్ధ ఆటవికుడి నోటి నుండి కృతజ్ఞతా పూర్వకంగా వెలువడిన మొదటి మాటలు 'పూని యకారణ బంధుడవై నా ప్రాణములు గాచి నసమాన కృపాంభోనిధి' అన్నవి.

'నేను పడుతున్న అవస్థను చూసి, మనకెందుకులే ఈ తంటాలు అనుకుని నా ప్రారబ్ధానికి నన్ను వదిలేసి పోకుండా, నేనంటే ఏమిటో, నా బ్రతుకు ఏమిటో ఏమీ గణనలోకి తీసుకోకుండా, ఏ కారణం లేకుండానే నన్ను నీ బంధువుని చేసుకుని, ఆప్పుడి వలె నన్ను ఈ మొసలి బారినుండి కాపాడిన నీకు నేను ఇప్పుడు దాసుడనయ్యాను' అంటాడు ఆ మనిషి. అతడు చెప్పి నట్లుగానే, అవతలి మనిషిని దాసుడిని చేసుకోగలిగే తత్త్వం 'అకారణ బంధుత్వ' చర్యలో అంతర్లీనమై ఉంటుందన్నది ఇందులో తెలుస్తుంది.

– వెంకట్ భట్టు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.పాడ్యమి రా.8.43 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** కృత్తిక ఉ.7.34 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** రా.12.09 నుండి 1.50 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.31 నుండి 7.11 వరకు, రాహుకాలం ఉ.9.00 నుండి 10.30 వరకు ; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.46, **సూర్యాస్తమయం:** 6.38.

ఆర్ట్స్‌లోనే కామర్స్ కూడా

బీకాం కోర్సు ఆర్ట్స్ అండ్ హ్యుమానిటీస్ కిందకే వస్తుంది



- స్పష్టం చేసిన హైకోర్టు ధర్మాసనం
- ఆర్ట్స్ కిందకు బీకాం వస్తుందా రాదా అంటూ హైకోర్టులో ఆసక్తికర కేసు
- పూర్తిస్థాయిలో విచారణ జరిపిన ధర్మాసనం
- బీకాం అభ్యర్థులు వార్డ్ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ సెక్రటరీగా పని చేయగలరని వెల్లడి
- పిటిషనర్లను ఆ పోస్టుకు పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశం
- ఈ ప్రక్రియ 8 వారాల్లో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టీకరణ

సాక్షి, అమరావతి : బీకాం కోర్సు ఆర్ట్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగం కిందకు వస్తుందా రాదా అంటూ హైకోర్టు ముందుకు ఓ ఆసక్తికర కేసు వచ్చింది. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం.. బీకాం కోర్సు ఆర్ట్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగం కిందకే వస్తుందని తీర్పు చెప్పింది. రాష్ట్రంలోని దాదాపు అన్ని విశ్వవిద్యాలయాలు బీకాంను ఈ విభాగం కిందే బోధిస్తున్నాయని గుర్తు చేసింది. బీకాం, ఆర్ట్స్ విభాగం కిందకు రాదనేందుకు ఆధారాలేవీ అధికారులు సమర్పించలేదంది. కామర్స్ కోర్సు ఆర్ట్స్ కిందకు వస్తుందని యూజీసీ సమాచార హక్కు చట్టం కింద సమాచారం ఇచ్చిందని వివరించింది. వార్డ్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ (గ్రేడ్‌-2) పోస్టుకు బీకాం చదివిన వారు అర్హులు కాదనడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. వారు ఈ విధులు నిర్వర్తించలేరన్న అధికారుల వాదనను తోసిపుచ్చింది. నోటిఫికేషన్‌లో ఈ ఉద్యోగులు ఎలాంటి విధులు నిర్వర్తించాలో ఎక్కడా ప్రస్తావించలేదని, ఆర్ట్స్ నేపథ్యం ఉన్న వారు మాత్రమే ఆ బాధ్యతలు నిర్వర్తిస్తారని కూడా చెప్పలేదంది. క్రీడాకారులు, ఎక్స్ సర్వీస్‌మెన్, ఎన్‌సీసీలో ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసిన వారికి అవకాశం ఇచ్చారని, వయో పరిమితిని సైతం సడలించారని గుర్తు చేసింది. వీరంతా వార్డ్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ బాధ్యతలు నిర్వర్తించగలిగినప్పుడు, బీకాం చదివిన వారూ అర్హులవుతారని హైకోర్టు ధర్మాసనం తేల్చి చెప్పింది. రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో అనర్హులుగా తేల్చిన అభ్యర్థులను ఆ పోస్టుకు అర్హులుగా పరిగణించాలని అధికారులను ఆదేశించింది. పిటిషనర్లను ఆ పోస్టుకు పరిగణనలోకి తీసుకుని, నియామకాలు చేయాలని ఆదేశించింది. ఈ ప్రక్రియను ఎనిమిది వారాల్లో పూర్తి చేయాలని హైకోర్టు చెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్ తదితరులతో కూడిన ధర్మాసనం గత వారం తీర్పు వెలువరించింది.

విచారణ ద్వారా తేల్చాలన్న సింగిల్ జడ్జి

వార్డ్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ పోస్టుకు పురపాలక శాఖ 2019లో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పోస్టులకు బీకాం చదివిన వారూ దరఖాస్తు చేయగా, వారిని అధికారులు రాతపరీక్షకు అనుమతించారు. సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో బీకాం కోర్సు ఆర్ట్స్, హ్యుమానిటీస్ విభాగం కిందకు రాదని, పోస్టుకు అర్హులు కారని అధికారులు తిరస్కరించారు. దీనిపై పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు.. అధికారులకు పూర్తిస్థాయి వినతి పత్రం సమర్పించాలని పిటిషనర్లను ఆదేశించింది. దానిపై చట్ట ప్రకారం నిర్ణయం తీసుకోవాలని అధికారులకు చెప్పింది. అభ్యర్థులు పురపాలక శాఖ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించగా, దానిని తిరస్కరిస్తూ కమిషనర్ 2020లో ఉత్తర్వులిచ్చారు. ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. పిటిషనర్లు చదివిన బీకాం కోర్సు ఆర్ట్స్ అండ్ హ్యుమానిటీస్ కిందకు వస్తుందో లేదో తేల్చాలని అధికారులను ఆదేశించారు. ఈ తీర్పును సవాలు చేస్తూ అభ్యర్థులు ధర్మాసనం ముందు అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ అప్పీళ్లపై జస్టిస్ సోమయాజులు ధర్మాసనం విచారణ జరిపింది. అభ్యర్థుల తరఫున న్యాయవాది జొన్నలగడ్డ సుధీర్ వాదనలు వినిపిస్తూ.. సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు బీకాం ఆర్ట్స్ అండ్ హ్యుమానిటీస్ కిందకే వస్తుందని యూజీసీ సమాధానం ఇచ్చిందంటూ, ఆ వివరాలను కోర్టు ముందుంచారు. రాష్ట్రంలో పలు విశ్వవిద్యాలయాలు బీకాంను ఆర్ట్స్ విభాగం కింద పేర్కొంటూ ఇచ్చిన డిగ్రీ సర్టిఫికేట్లను ధర్మాసనం ముందుంచారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ, యూజీసీ 2014లో ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగానే నిర్ణయం తీసుకున్నామన్నారు. వార్డ్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ పోస్టు అణగారిన వర్గాలను పైకి తీసుకొచ్చేందుకు ఉద్దేశించిందని, కార్పొరేట్ అకౌంటింగ్ తదితర సబ్జెక్టులు ఈ పోస్టు కింద నిర్వర్తించే విధులకు సరిపోవన్నారు. అందువల్ల పురపాలక శాఖ నిర్ణయంలో ఎలాంటి తప్పులేదని తెలిపారు.

ఏపీలో ఏడాది పొడవునా ఫుట్‌బాల్ టోర్నమెంట్లు

ఎంపీ కోటగిరి శ్రీధర్ వెల్లడి



తిరుపతి ఎడ్యుకేషన్: క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న సీఎం వైఎస్ జగన్ సహకారంతో ఏపీలో ఫుట్‌బాల్ క్రీడను మరింత అభివృద్ధి చేస్తామని ఏలూరు ఎంపీ, ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ తెలిపారు. తిరుపతిలోని ఓ హోటల్‌లో శుక్రవారం జాతీయ ఫుట్‌బాల్ ఫెడరేషన్ ప్రతినిధుల సమక్షంలో రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అనంతరం ఏపీఎఫ్ఏ రాష్ట్ర అధ్యక్షునిగా నూతనంగా ఎన్నికైన ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ మాట్లాడారు. ఏడాది పొడవునా ఏపీలో జాతీయ, రాష్ట్ర స్థాయి టోర్నమెంట్లను నిర్వహిస్తామన్నారు. జూన్ 15న అనంతపురంలో కర్ణాటక, ఆంధ్ర ఫ్రెండ్లీ మ్యాచ్, జూలైలో బాలికల సబ్ జూనియర్స్ అంతర్ జిల్లా పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

హైకోర్టు ఆదేశాల మేరకు నూతన కమిటీ

ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యతిరాజులు తెలిపారు. ఈ నూతన కమిటీ నియామకానికి తనను పరిశీలకులుగా హైకోర్టు నియమించినట్లు పేర్కొన్నారు. పలు జిల్లాల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన తరువాత 8మందితో నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నూతన కమిటీలో రాష్ట్ర అధ్యక్షునిగా ఎంపీ కోటగిరి శ్రీధర్, ఉపాధ్యక్షులుగా మునిశ్రీనివాసరావు (శ్రీకాకుళం), ఎస్.వేణుగోపాల్, కోశాధికారిగా విజయ్‌కుమార్ (బాపట్ల), సంయుక్త కార్యదర్శులుగా బి.చంద్రశేఖర్ (నెల్లూరు), కె.క్రాంతికుమార్ (గుంటూరు), ఈసీ సభ్యులుగా బి.చక్రవర్తి (కృష్ణ), కె.రాజేష్ (కాకినాడ), ఎ.రెడ్డప్ప (తిరుపతి)లను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): ఖాజీపేట-కొండపల్లి సెక్షన్ మధ్యలోని చింతల్‌పల్లి-నెక్కొండ స్టేషన్ మధ్యలో జరుగుతున్న మూడోలైన్ నిర్మాణ పనుల్లో భాగంగా జరుగుతున్న నాన్ ఇంటర్‌లాక్ పనుల కారణంగా ఆ మార్గంలో నడిచే పలు రైళ్లు పూర్తిగానూ, మరికొన్ని పాక్షికంగానూ రద్దు చేయడంతో పాటు కొన్ని రైళ్లను దారి మళ్లించి నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పూర్తిగా రద్దు చేసిన రైళ్లు: ఖాజీపేట-డోర్నకల్లు (07753/07754), విజయవాడ-డోర్నకల్లు (07755/07756), విజయవాడ-గుంటూరు (07464/07465), భద్రాచలం రోడ్డు-సికింద్రాబాద్ (17660/17659), విజయవాడ-సికింద్రాబాద్(12713/12714) ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 21 నుంచి జూన్ 7 వరకు పూర్తిగా రద్దు చేశారు. అదే విధంగా ఖాజీపేట-తిరుపతి (17091/17092) రైళ్ల ఈ నెల 23, 30, జూన్ 6 తేదీలలో, మచిలీపట్నం-సికింద్రాబాద్ (07185/07186) రైళ్ల ఈ నెల 21, 28, జూన్ 4 తేదీలలో రద్దు చేశారు.

పాక్షికంగా రద్దు చేసిన రైళ్లు: సిర్‌పూర్ టౌన్-భద్రాచలం (17034) ఈ నెల 20 నుంచి జూన్ 6 వరకు వరంగల్లు-భద్రాచలం మధ్య, భద్రాచలం-సిర్‌పూర్ (17033) ఈ నెల 21 నుంచి జూన్ 7 వరకు భద్రాచలం-వరంగల్లు మధ్య పాక్షికంగా రద్దు చేశారు.

దారి మళ్లింపు: విశాఖపట్నం-ముంబై ఎల్‌టీటీ (18519) ఈ నెల 21 నుంచి జూన్ 7 వరకు వయా విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి, సికింద్రాబాద్ మీదుగా నడుస్తుంది. షాలిమార్-సికింద్రాబాద్ (22849) ఈ నెల 24, 28, జూన్ 4 తేదీలలో వయా సికింద్రాబాద్, పగిడిపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా నడుస్తుంది. యశ్వంత్‌పూర్-టాటానగర్ (18112) ఈ నెల 21, 28, జూన్ 4 తేదీలలో వయా సికింద్రాబాద్, పగిడిపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా నడుస్తుంది. హైదరాబాద్-షాలిమార్ (18046) ఈ నెల 28, జూన్ 7 తేదీలలో వయా విజయవాడ, గుంటూరు, సికింద్రాబాద్ మీదుగా నడుస్తుంది.

బాబూ.. బహుజనులకు అడ్డొస్తే రాజకీయంగా అంతమే

964వ రోజు రిలే దీక్షలో బహుజన నేతల హెచ్చరిక

తాడికొండ: రాష్ట్రంలో బహుజనులకు అడ్డొచ్చిన కులవాదులకు ఏం శాస్తి జరిగిందో తెలుసుకుని బాబు అండ్ కో మసలుకుంటే మంచిదని లేకుంటే రాజకీయంగా వారిని భస్మం చేయడం ఖాయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 964వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. భారతదేశానికి 75 సంవత్సరాల క్రితమే స్వాతంత్ర్యం వచ్చినా ఏపీలో మాత్రం కులవాదుల పెత్తందారీ విధానానికి అంతు లేకుండా పోతుందన్నారు. అమరావతితో పాటు అన్ని ప్రాంతాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్తశుద్ధితో ముందుకెళుతున్నారని చెప్పారు. అమరావతి ముసుగులో బాబు చేసిన అవినీతిని కప్పిపెట్టేందుకు, రాజధాని పేరుతో జరిగిన రహస్య అజెండా ప్రజలకు తెలియకుండా ఉండేందుకే బాబు దొంగ ఉద్యమానికి పెట్టుబడి పెట్టి మరీ రెచ్చగొడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

e-NIT No.4/CE(R&B)SH&MD,APRDC/2023-24 తేది: 18.05.2023

నెల్లూరు జిల్లాలో ఒక పని కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. టెండర్ల స్వీకరణకు చివరి తేది: 08.06.2023న మ.3.30 గం.వరకు. తదుపరి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.inలో చూడవచ్చును.

సం/- చీఫ్ ఇంజినీర్ (R&B), SH & మేనేజింగ్ డైరెక్టర్, APRDC

DIPR RO No.9541/CL/Advt/1/1/2021-22, Dt: 19.05.2023

ఎ.పి. స్టేట్ పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ లిమిటెడ్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన-2

4 పనుల కొరకు టెండర్ నం.లు 10 to 13/2023-24 తేది: 18/05/2023 కోసం సివిల్ పనుల కొరకు టెండర్లు కోరబడుచున్నవి. టెండర్ నంబర్లు 10 to 12 కోసం బిడ్ల దాఖలుకు చివరి తేది: 06-06-2023 సా॥ 5.00 గం. టెండర్ నం. 13 కోసం బిడ్ల దాఖలుకు చివరి తేది: 29-05-2023 సా॥ 5.00 గం. వివరాల కోసం www.apeprocurement.gov.in ను దర్శించండి.

సం/- చీఫ్ ఇంజినీర్

DIPR RO No.2094PP/CL/Advt/1/1/2021-22, Dt 19.05.2023

A.P. టౌన్‌షిప్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (APTIDCO)
ఇ-టెండరు ప్రకటన

CRDA లొకేషన్స్‌లోని నిడమర్రు, పెనుమాక మరియు నౌలూరు ULB లలోని TIDCO PMAY-HFA కాలనీ వద్ద LHP ప్రెషర్ స్యాండ్ ఫిల్టర్స్ సరఫరా, డెలివరీ, స్థాపన & పనిచేయించుట ఏర్పాటు చేయుట కోసం లమ్‌సమ్ కాంట్రాక్ట్ టెండర్ కోరబడుచున్నది. NIT Nos. 01 to 03/TO/CRDA/Infra/Gnt/APTIDCO/2023-24, Dt.18.05.2023 of TO, Guntur. **ECV మొత్తం:** 1) రూ.34,13,786.00, 2) రూ.42,90,753.00, 3) రూ.43,51,115.00. గుంటూరు జిల్లా. వివరాలను వెబ్‌సైట్ **http://tender.apeprocurement.gov.in** లో చూడవచ్చును. ఎట్టి కారణాలు తెలియజేయకుండా ఏదేని లేదా అన్ని టెండర్లను అంగీకరించుటకు/ తిరస్కరించుటకు/ రద్దు చేయుటకు/ వాయిదా వేయుటకు టెక్నికల్ ఆఫీసర్, గుంటూరు జిల్లాకు హక్కు కలదు. సంప్రదించు నం.: 9701687755.

సం/- టెక్నికల్ ఆఫీసర్, APTIDCO, గుంటూరు

DIPR RO No.2095PP/CL/Advt/1/1/2021-22, Dt: 19-05-2023

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

No.217 to 283/2023-24 తేది: 18.05.2023

JJM ప్రోగ్రామ్ క్రింద రూ. 75723.70 లక్షల మొత్తం అంచనా వ్యయంతో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, SPSR నెల్లూరు, తిరుపతి, చిత్తూరు మరియు వైఎస్ఆర్ కడప జిల్లాలలో 55 LPCD సర్వీస్ లెవల్‌తో 100% FHTC ల ద్వారా అవసరమైన అన్ని నివాస ప్రాంతాలకు త్రాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేయుట కోసం మండలం వారీగా ప్యాకేజింగ్ పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌లో ఆన్‌లైన్ (రివర్స్ టెండరింగ్) టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లను ఇ-మార్కెట్ ప్లేస్ **www.tender.apeprocurement.gov.in**లో 25.05.2023 నుండి 15.06.2023 సా.4.00 గం. వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. **సంబంధిత అధికారి:** సంబంధిత జిల్లాల SEలు.

సం/- చీఫ్ ఇంజినీర్-II, RWS&S, గొల్లపూడి, విజయవాడ

DIPR RO No.9526/CL/Advt/1/1/2021-22, Dt 19.05.2023

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ లిమిటెడ్
(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వరంగ సంస్థ)
చీఫ్ ఇంజినీర్ (N) కార్యాలయం, APIIC లిమిటెడ్, 9వ అంతస్తు, APIIC టవర్-I, IT పార్క్, మంగళగిరి, గుంటూరు జిల్లా-522503, వెబ్: www.apiic.in
ఇ-మెయిల్ IDs: ysrkvvl.narasimharao@ap.gov.in; s.manibhaskar@gov.in

"ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నం జిల్లా, మధురవాడ, హిల్ నం.3 వద్ద 19 ఎకరాల భూమిలో జాయింట్ వెంచర్ ప్రాతిపదిక పైన పబ్లిక్ - ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా I-స్పేస్ బిజినెస్ పార్క్ అభివృద్ధి, ఆపరేషన్ & నిర్వహణ కోసం ఆసక్తి వ్యక్తీకరణ కోసం పిలుపు"

Tender Notice Nos.04/CE(N)/APIIC/2023-24, తేది: 18-05-2023

APIIC వారు నిర్దేశించిన వ్యాపార జిల్లాలో తమ కార్యాలయాలు నెలకొల్పుకొనుటకు IT/ ITES మరియు ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగంలోని ఉన్నత శ్రేణి కంపెనీలను ఆకర్షించేందుకు మల్టీనేషనల్ కంపెనీల కోసం అంతర్జాతీయ వ్యాపార హబ్‌ను రూపొందించేందుకు ప్రణాళిక చేశారు. ప్రతిపాదిత ప్రాజెక్ట్‌లో వాణిజ్య కార్యాలయాల కోసం బిజినెస్ టవర్స్ మరియు స్టార్ కేటగిరీ బిజినెస్ హోటల్ వంటి ఇతర ఆధార సదుపాయాలు, MICE (సమావేశాలు, ప్రోత్సాహకాలు, కన్వెన్షన్స్ మరియు ఎగ్జిబిషన్స్) కోసం సదుపాయాలు ఉంటాయి. APIIC వారు జాయింట్ వెంచర్ ప్రాతిపదికన పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య నమూనా ద్వారా 19 ఎకరాల భూమి (హిల్ నం.3, మధురవాడ, విశాఖపట్నం వద్ద)లో నిర్దేశించిన బిజినెస్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్‌ను అమలు చేయాలని భావిస్తున్నారు. ప్రాజెక్ట్ ఇచ్చేందుకు సంస్థ ఎంపిక కోసం ప్రక్రియను చేపట్టాలని APIIC నిర్ణయించింది. ఎంపికైన సంస్థ APIIC తో భాగస్వామ్యం/ జాయింట్ వెంచర్‌లో ప్రాజెక్ట్ రూపకల్పన, ఇంజినీరింగ్, ఫైనాన్సింగ్, ప్రొక్యూర్‌మెంట్, నిర్మాణం, ఆపరేషన్ మరియు నిర్వహణకు బాధ్యత వహించవలసి ఉంటుంది. కాగోరు దరఖాస్తుదార్లు www.apiic.in/downloads tenders.html వద్ద లభించే EOI డాక్యుమెంట్‌లో తెలిపిన విధంగా షెడ్యూల్ చేసిన తేదీ మరియు సమయాన ప్రి-EOI సమావేశంలో పాల్గొనవలసిందిగా కోరబడుతున్నారు. ఆసక్తి గల దరఖాస్తుదార్లు EOI డాక్యుమెంట్‌లో నిర్దేశించిన నమూనాలో 20-06-2023న లేదా ఆలోగా తమ EOI దరఖాస్తులు దాఖలు చేయవలెను.

సం/- చీఫ్ ఇంజినీర్ (N)

తదుపరి వివరాలకు కోసం సంప్రదించండి:
శ్రీ YSKVVL నరసింహారావు, చీఫ్ ఇంజినీర్ (N),
ఫోన్ నం. 7675891199, ఇ-మెయిల్: ysr_narasimharao@yahoo.com

DIPR RO No.2098PP/CL/Advt/1/1/2021-22, Dt:19.05.2023

రూ.2,000 నోట్ల రద్దుపై ఎవరేమన్నారంటే...

విశ్వగురు పనితీరుకు ఇదొక ఉదాహరణ

''తనను తాను విశ్వగురు అని చెప్పుకుంటున్న ప్రధాని నరేంద్ర మోదీ పనితీరుకు రూ.2,000 నోట్ల ఉపసంహరణ ఒక ఉదాహరణ. మొదట అనుకున్నది చెసెయ్యి. ఆ తర్వాత ఆలోచించు అనేదే ఆయన విధానం. రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేయడం ఒక మూర్ఖపు నిర్ణయం. 2016 నవంబర్ 8న మోదీ తుగ్లక్ ఫర్మానా జారీ చేశారు. ఆ గాయానికి మందు పూయడానికి రూ.2,000 నోటును తీసుకొచ్చారు. డిమానిటైజేషన్ విఫలమైనట్లుగానే ఈ రెండో డిమానిటైజేషన్ విఫలం కావడం ఖాయం. 2016 నవంబర్ 8 నాటి భూతం దేశాన్ని మరోసారి వెంటాడడానికి, ప్రజలను కష్టాలపాలు చెయ్యడానికి వచ్చింది''

- కాంగ్రెస్

ఏం సాధిస్తారో చెప్పాలి

''రూ.2,000 నోటు ద్వారా, ఇప్పుడు దాని రద్దు ద్వారా సాధించిందేమిటో మోదీ ప్రభుత్వం చెప్పాలి. నోట్ల రద్దు విజయవంతమైందని సంబరపడ్డారు. మరిప్పుడు రూ.2,000 నోటును వెనక్కి తీసుకోవడానికి కారణమేమిటి?''

- ఎన్సీపీ అధినేత శరద్ పవార్

శ్వేతపత్రం విడుదల చేయాలి

''నోట్ల రద్దు వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు కలిగిన మేలు ఏమిటో మోదీ ప్రభుత్వం వివరణ ఇవ్వాలి. దానిపై శ్వేతపత్రం విడుదల చేయాలి. మన దేశ ఆర్థిక వ్యవస్థను కొందరు తుగ్లక్‌లు నియంత్రిస్తున్నారు. రూ.2,000 నోటును రద్దు చేయాలని వారు ఇప్పుడు నిర్ణయించారు''

- సీపీఐ

చురుగ్గా నైరుతి

న్యూఢిల్లీ: మండే ఎండల నడుమ ఓ చల్లని కబురు. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. శుక్రవారానికల్లా అవి అండమాన్ నికోబార్ దీవుల్లోని పలు ప్రాంతాలతో పాటు బంగాళాఖాతం, దక్షిణ అండమాన్ సముద్రంలోకి ప్రవేశించినట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. రానున్న రెండు మూడు రోజుల్లో మరింత విస్తరిస్తాయని పేర్కొంది. ఏటా నైరుతి జూన్ 1కల్లా కేరళలోకి ప్రవేశిస్తుంటుంది. ఈసారి మూడు రోజుల దాకా ఆలస్యం కావచ్చని వాతావరణ శాఖ ఇటీవల అంచనా వేయడం తెలిసిందే. రుతుపవనాలను బాగా బలహీనపరిచే ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడటం ఈసారి ఆందోళనకు కారణంగా మారింది. దానివల్ల రుతుపవనాల ఆగమనం, వర్షపాతం బాగా ప్రభావితం కావచ్చన్న అంచనాల నేపథ్యంలో నైరుతి విస్తరించడం శుభ పరిణామం.

ఫ్లాష్‌బ్యాక్...

ఆ నిర్ణయంతో... అతలాకుతలం

అప్పట్లో దేశాన్ని కుదిపేసిన రూ.1,000, 500 నోట్ల రద్దు

నల్లధనం, నకిలీ నోట్లు, నగదు లావాదేవీల కట్టడే లక్ష్యం • ఒక్కటీ నెరవేరక విఫల ప్రయోగంగా మిగిలిన వైనం

అది 2016. నవంబర్ 8. రాత్రి 8 గంటల సమయం. ఎవరి పనుల్లో వాళ్లు బిజీగా ఉన్న వేళ. ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నట్టుండి టీవీ తెరల మీద ప్రత్యక్షమయ్యారు. జాతినుద్దేశించి మాట్లాడటం మొదలు పెట్టారు. ఏమిటా అని ఆసక్తిగా చూస్తున్న వాళ్లందరికీ షాకిస్తూ పెద్ద నోట్ల రద్దు నిర్ణయాన్ని ప్రకటించారు. నల్లధనాన్ని రూపుమాపడమే లక్ష్యంగా రూ.1,000, రూ.500 నోట్లను తక్షణం రద్దు చేస్తున్నట్టు పేర్కొన్నారు. నకిలీ నోట్ల బెడద పోవడమే గాక నగదు రహిత డిజిటల్ లావాదేవీలకు కూడా ఈ నిర్ణయంతో ఊపొస్తుందని చెప్పుకొచ్చారు. ఫలితంగా 2016 నవంబర్ 8 అర్ధరాత్రి నుంచి పెద్ద నోట్లు పనికిరాకుండా పోయాయి! కానీ అనంతర పరిణామాలను, ముఖ్యంగా నోట్ల మార్పిడి ప్రక్రియను సజావుగా డీల్ చేయడంలో కేంద్రం పూర్తిగా విఫలమైంది. దాంతో కొద్ది నెలల పాటు దేశమంతా అక్షరాలా అల్లకల్లోలమైపోయింది. పెద్ద నోట్లను మార్చుకునేందుకు ఏ బ్యాంకు ముందు చూసినా కొండవీటి చాంతాటిని తలదన్నే లైన్లే. ఆ లైన్లలోనే కుప్పకూలిన ప్రాణాలు. నగదు మీదే ఆధారపడి నడిచే వ్యాపారాలు పడకేసి ఆర్థికంగా చితికిపోయిన సగటు బతుకులు. ఇలా ఎవరిని కదిలించినా కన్నీటి కథలే! మనసుల్ని మెలిపెట్టే గాథలే. వ్యవసాయం మొదలుకుని ఆటోమొబైల్, నిర్మాణ తదితర కీలక రంగాలు నగదు కటకటతో కొన్నాళ్ల పాటు పూర్తిగా పడకేశాయి. మొత్తంగా దేశ ఆర్థిక రంగమే అతలాకుతలమైపోయింది. ఇంతా చేస్తే నోట్ల రద్దు వల్ల నల్లధనం ఏ మాత్రమూ కట్టడి కాలేదని తర్వాతి కాలంలో గణాంకాలతో పాటు నిరూపణ కావడం మరో విషాదం. అప్పట్లో ప్రవేశపెట్టిన రూ.2,000 కరెన్సీని ఆర్బీఐ తాజాగా రద్దు చేసిన నేపథ్యంలో నాటి చేదు జ్ఞాపకాలను జనం మరోసారి భయంభయంగా గుర్తు చేసుకుంటున్నారు...



నోట్ల రద్దు-కొన్ని వాస్తవాలు

- పలు అంచనాల ప్రకారం మన దేశ జీడీపీలో 20 నుంచి 25 శాతం దాకా నల్లధనమే. అంటే రూ.30 లక్షల కోట్ల పై చిలుకు!
- నల్లధనం లేని బంగారు భవిష్యత్తు కోసం తాత్కాలికంగా కాస్త బాధను ఓర్చుకోక తప్పదని నోట్ల రద్దు వేళ ప్రధాని చెప్పుకొచ్చారు. జనం కూడా అందుకు సిద్ధపడ్డారు.
- నోట్ల రద్దుతో తమకు కలిగిన నష్టాలను, వ్యయప్రయాలను పళ్ల బిగువున భరించారు.
- నోట్ల రద్దు వల్ల కనీసం బ్యాంకింగ్ వ్యవస్థకు ఆవల ఉన్న రూ.3 లక్షల కోట్ల నుంచి రూ.4 లక్షల కోట్ల విలువైన నల్లధనం చెత్త కాగితం కింద మారుతుందని కేంద్రం ఆశించింది.
- కానీ వాస్తవంలో జరిగింది అందుకు పూర్తిగా విరుద్ధమని గణాంకాలు తేల్చాయి.
- నోట్ల రద్దు నిర్ణయం నాటికి దేశం చలామణిలతో ఉన్న నగదులో ఏకంగా 86 శాతం (రూ.16.24 లక్షల కోట్లు) రూ.1,000, రూ.500 నోట్లే. ఇందులో రూ1,000 నోట్ల వాటా 38 శాతం కాగా రూ.500 నోట్లది 47 శాతం. అదంతా రాత్రికి రాత్రి పనికిరాకుండా పోయింది.
- ఈ మొత్తంలో ఏకంగా 99 శాతానికి పైగా కరెన్సీ క్రమంగా బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగొచ్చిందని అనంతరం రిజర్వు బ్యాంకే అధికారికంగా ప్రకటించింది. నల్లధనం కట్టడి లక్ష్యం ఇసుమంతైనా నెరవేరలేదని తద్వారా స్పష్టమైంది.
- నగదు కార్యకలాపాలను తగ్గించాలన్న ఉద్దేశమూ నెరవేరలేదు. 2016 నవంబర్‌లో దేశ ప్రజల దగ్గర రూ.17.7 కోట్ల విలువైన నగదుంటే 2022 అక్టోబర్ నాటికి ఆ మొత్తం ఏకంగా రూ.30.88 లక్షల కోట్లకు పెరిగింది.
- నకిలీ నోట్ల చలామణి కూడా పెద్దగా తగ్గలేదని తర్వాతి కాలంలో గణాంకాలతో పాటు రుజువైంది. నకిలీ నోట్లలో అత్యధికం వంద రూపాయల నోట్లే కావడం ఇందుకు కారణమని తేలింది.
- కాకపోతే నోట్ల రద్దు వల్ల ఇటు ప్రజలకు, అటు ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టం అపారం.
- నగదు కార్యకలాపాల మీదే ఆధారపడే 48 కోట్ల మందికి పైగా భారతీయులను పెద్ద నోట్ల రద్దు కోలుకోలేని దెబ్బ కొట్టింది.

ఆర్థికవేత్తల విస్మయం

పలువురు ఆర్థికవేత్తలు కూడా నోట్ల రద్దు నిర్ణయంలో ఔచిత్యమేమిటో అంతుబట్టడం లేదంటూ అప్పట్లో ఆశ్చర్యపోయారు. ''నల్లధనంలో మహా అయితే ఓ 5 శాతం మాత్రం నగదు రూపంలో ఉంటుందేమో. మిగతాదంతా భూములు, బంగారం వంటి ఆస్తుల రూపేణా మాత్రమే ఉంటుంది. ఇది అందరికీ తెలిసిన సంగతే. అలాంటప్పుడు కేవలం పెద్ద నోట్ల రద్దుతో నల్లధనం మాయమైపోతుందని ఆర్బీఐ అనుకున్నారో!'' అన్నారు.

- 2016 సెప్టెంబర్ దాకా ఆర్బీఐ గవర్నర్‌గా చేసిన రఘురాం రాజన్ నోట్ల రద్దు ప్రతిపాదనను తాను సమర్థించలేదని కుండబద్దలు కొట్టారు.
- నోట్ల రద్దు నిర్ణయాన్ని చట్టబద్ధమేనని గత జనవరిలో తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు కూడా, 'ఆరేళ్ల తర్వాత ఇప్పుడు కాలాన్ని వెనక్కు తిప్పలేం' అంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేసింది. ఆ నిర్ణయం లక్ష్యాన్ని సాధించిందా లేదా అన్నది ఇప్పుడు అప్రస్తుతమని స్పష్టంగా పేర్కొంది.

- దేశ జీడీపీలో 45 నుంచి 60 శాతం దాకా వాటా ఉండే పలు రంగాలు కొన్నాళ్ల పాటు అత్యంత తీవ్రంగా ప్రభావితమయ్యాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

ముగ్గురు న్యాయమూర్తులకు సుప్రీంకోర్టు వీడ్కోలు

వారి సేవలను కొనియాడిన సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్

న్యూఢిల్లీ: పదవీ విరమణ చేయనున్న జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ వి.రామసుబ్రమణియన్ సేవలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ కొనియాడారు. జూన్ 16న జస్టిస్ కేఎం జోసెఫ్, జూన్ 17న జస్టిస్ అజయ్ రస్తోగి, జూన్ 29న జస్టిస్ వి.రామసుబ్రమణియన్ పదవీ విరమణ చేయనున్నారు. ఈ నెల 22 నుంచి సుప్రీంకోర్టుకు వేసవి సెలవులు ప్రారంభం కానున్నందున శుక్రవారమే వీరికి చివరి పనిదినం అయింది. ఈ సందర్భంగా సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో ప్రత్యేక వీడ్కోలు సమావేశం ఏర్పాటైంది. ముగ్గురు న్యాయమూర్తులతో తనకు అనుబంధాన్ని సీజేఐ గుర్తుకు తెచ్చుకున్నారు. 'జోసెఫ్ నాకు చిన్ననాటి స్నేహితుడు. 1972లో ఢిల్లీకి వచ్చిన కొత్తలో నా మొట్టమొదటి స్నేహితుడు. అటువంటి వ్యక్తి రిటైరవుతుండటంతో నా విచారం రెట్టింపయింది'అని పేర్కొన్నారు. ఒకే ధర్మాసనంలో జస్టిస్ జోసెఫ్‌తో కలిసి పనిచేయడం సంతోషదాయకమన్నారు. రాజ్యాంగ చట్టాలు మొదలుకుని వాణిజ్య చట్టాల వరకు ఎంతో పట్టున్న జస్టిస్ కేఎం జోసెఫ్ సేవలను ఇకపై తాము మిస్ అవుతున్నామన్నారు. సామాన్యుడికి కూడా న్యాయం అందాలంటే బార్ సహాయం ఎంతో అవసరమని జస్టిస్ జోసెఫ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. 2018 ఆగస్టులో సుప్రీంకోర్టు జడ్జిగా జస్టిస్ జోసెఫ్ బాధ్యతలు చేపట్టారు.

జస్టిస్ అజయ్ రస్తోగి గొప్ప మిత్రుడు

సున్నితత్వం, దయా గుణం కలిగిన జస్టిస్ అజయ్ రస్తోగి తనకు గొప్ప మిత్రుడని సీజేఐ కొనియాడారు. సివిల్, కార్మిక చట్టాలు వంటి అనేక అంశాల్లో తరచూ జస్టిస్ రస్తోగి విశేష పరిజ్ఞానంపైనే ఆధారపడే వాడినన్నారు. 'బ్రదర్ రస్తోగి, తీర్పు రాసిన జడ్జీల్లో మీ పేరు కనిపిస్తే చాలా ప్రశాంతత, భరోసాతో ఉండే వాడిని'అని తెలిపారు. కొలీజియం సమావేశాల్లో తనకు ఎంతో మద్దతుగా నిలిచే వారన్నారు. 1958లో జన్మించిన జస్టిస్ రస్తోగి 2018 నవంబర్‌లో సుప్రీం జడ్జిగా నియమితులయ్యారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి జస్టిస్ రామసుబ్రమణియన్


జస్టిస్ రామసుబ్రమణియన్ వినయశీలి, బహుముఖ ప్రతిభావంతుడైన న్యాయమూర్తి, మానవతా వాదిగా సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ కొనియాడారు. 'రిటైరయ్యాక ఏదైనా ట్రిబ్యునల్‌కు చైర్మన్ పదవిని చేపట్టాలని జస్టిస్ రామ్‌ని కోరగా తిరస్కరించారు. అయినా నా ప్రయత్నం మానను'' అని సీజేఐ అన్నారు. 2006 నుంచి మద్రాస్ హైకోర్టు జడ్జిగా పనిచేసిన జస్టిస్ సుబ్రమణియన్ 2016లో ఉమ్మడి ఏపీ హైకోర్టుకు బదిలీ అయ్యారు. అనంతరం తెలంగాణ హైకోర్టు జడ్జిగా కొనసాగారు. 2019లో హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు సీజేగా పదోన్నతిపై వెళ్లారు. అదే ఏడాది సుప్రీంకోర్టు జడ్జిగా నియమితులయ్యారు.



ప్రమాణస్వీకారం అనంతరం సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌తో జస్టిస్ మిశ్రా

సుప్రీం జడ్జిగా జస్టిస్ పీకే మిశ్రా ప్రమాణం

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ పీకే మిశ్రా, సీనియర్ న్యాయవాది కేవీ విశ్వనాథన్ ప్రమాణం చేశారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రధాన న్యాయమూర్తి కోర్టులో వీరిద్దరితో సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రమాణం చేయించారు. దీంతో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య ఆమోదిత 34కు చేరింది. జస్టిస్ పీకే మిశ్రా ఆగస్టు 2029 వరకూ, జస్టిస్ కేవీ విశ్వనాథన్ మే 25, 2031 వరకూ సేవలందించనున్నారు. జస్టిస్ జేబీ పార్డీవాలా పదవీ విరమణ అనంతరం మే 25, 2031 వరకూ జస్టిస్ విశ్వనాథన్ సీజేఐగా సేవలందించనున్నారు.



శుక్రవారం ఢిల్లీలో ప్రియాంక, రాహుల్‌గాంధీలతో సిద్ధరామయ్య, డీకే

కర్ణాటక కేబినెట్ ప్రమాణం నేడే

ఢిల్లీలో పార్టీ పెద్దలతో సిద్ధరామయ్య, శివకుమార్ చర్చలు

కేబినెట్ కూర్పు, పోర్ట్‌ఫోలియోలకు తుది రూపు

న్యూఢిల్లీ: కర్ణాటకలో కాంగ్రెస్ మంత్రివర్గం ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం ఢిల్లీ చేరుకున్న సీఎల్పీ నేత సిద్ధరామయ్య, కేపీసీసీ చీఫ్ డీకే శివకుమార్‌లు కేబినెట్ కూర్పు, పోర్టుఫోలియోలపై పార్టీ పెద్దలతో విస్తృత చర్చలు జరిపారు. డీకే శివకుమార్ ప్రత్యేకంగా కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, మాజీ చీఫ్‌లు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రాలను కలిసి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్‌తోపాటు మంత్రులుగా కొందరు ప్రమాణం చేస్తారంటూ అధిష్టానం ముందుగానే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్, సూర్జేవాలాలతో సిద్ధరామయ్య ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం వీరి చర్చల్లో శివకుమార్ పాలుపంచుకున్నారు. నలుగురూ కలిసి జన్‌పథ్-10లో ఉంటున్న రాహుల్ గాంధీని వెళ్లి కలిశారు. గంటన్నరకుపైగా వారి మధ్య చర్చలు నడిచాయి. ఆపై రాహుల్ గాంధీ, సూర్జేవాలా, వేణుగోపాల్‌లు పార్టీ చీఫ్ ఖర్గేను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కేబినెట్‌లోకి ఎందరిని తీసుకోవాలనే విషయమై తుది నిర్ణయానికి వచ్చారు. కేబినెట్‌లోకి తీసుకునే 20 మంది పేర్లను ఖారారు చేసినట్లు అనంతరం పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలోని వివిధ వర్గాలు, ప్రాంతాలు, వర్గాలకు సముచిత స్థానం దక్కేలా కేబినెట్ కూర్పు ఉంటుందన్నాయి.

హాజరుకానున్న నేతలు

ప్రమాణ స్వీకారోత్సవానికి కంఠీరవ స్టేడియాన్ని అంగరంగ వైభవంగా తీర్చిదిద్దారు. లక్ష మందికి పైగా కార్యకర్తలు, అభిమానులు పాల్గొంటారని అంచనా. విస్తృతంగా బందోబస్తు కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమానికి బిహార్ సీఎం నితీశ్, తమిళనాడు సీఎం స్టాలిన్, ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్, నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా హాజరవుతారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ తనకు బదులుగా పార్టీ ప్రతినిధిని పంపుతారని సమాచారం. కంఠీరవ స్టేడియంలో ఏర్పాట్లను శుక్రవారం ఉదయం డీకే శివకుమార్ స్వయంగా పరిశీలించారు. ప్రజా ప్రతినిధులైన జేడీఎస్, బీజేపీ నేతలను కూడా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆహ్వానించినట్లు శివకుమార్ చెప్పారు. శనివారమే జరిగే కేబినెట్ మొదటి భేటీలో కాంగ్రెస్ ప్రధాన హామీ అయిన 5 గ్యారంటీల అమలుపై నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

రష్యాకు శిక్ష తప్పదు

ఆ దేశంపై ఇక మరిన్ని ఆంక్షలు • ఉక్రెయిన్‌కు మా మద్దతు కొనసాగుతుంది • జి-7 దేశాల అధినేతల ప్రకటన

హిరోషిమా/న్యూఢిల్లీ: ఉక్రెయిన్‌లో మారణకాండ సాగిస్తూ అమాయకుల ప్రాణాలను బలిగొంటున్న రష్యాకు శిక్ష తప్పదని జి-7 దేశాల అధినేతలు హెచ్చరించారు. రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించబోతున్నట్లు తేల్చిచెప్పారు. ఉక్రెయిన్‌కు తమ మద్దతు కొనసాగుతుందని తేల్చిచెప్పారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జి-7 శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు కూటమి దేశాల అధినేతలు శుక్రవారం జపాన్‌లోని హిరోషిమాకు చేరుకున్నారు. అనంతరం సమాశమై, తాజా అంతర్జాతీయ పరిణామాలపై చర్చించారు. ఉక్రెయిన్‌పై రష్యా చట్ట విరుద్ధమైన, న్యాయ విరుద్ధమైన యుద్ధం సాగిస్తోందని మండిపడ్డారు. రష్యాకు వ్యతిరేకంగా కలిసికట్టుగా ముందుకు సాగాలని జి-7 దేశాల నేతలు ప్రతిన బూనారు. రష్యా ప్రారంభించిన ఈ యుద్ధాన్ని రష్యానే ముగించాలని అన్నారు. హిరోషిమాలోని శాంతి పార్కును వారు సందర్శించారు. రెండో ప్రపంచ యుద్ధంలో బాంబు దాడిలో దెబ్బతిన్న డోమ్ వద్ద గ్రూప్ ఫొటోలు దిగారు. అక్కడ పుష్పగుచ్ఛాలు ఉంచి, అమర వీరులకు నివాళులర్పించారు. జి-7 శిఖరాగ్ర సదస్సుకు గుర్తుగా చెర్రీ మొక్కను నాటారు.

దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడంలో రాజీలేదు: మోదీ

సార్వభౌమత్వం, గౌరవాన్ని కాపాడుకొనే విషయంలో భారతదేశం పూర్తిస్థాయిలో సన్నద్ధమై ఉందని, ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. భవిష్యత్తులో భారత్-చైనా సంబంధాలు మెరుగుపడడం అనేది కేవలం ఇరు దేశాల మధ్య పరస్పర గౌరవం, పరస్పర ప్రయోజనాలపై ఆధారపడి ఉంటుందని తేల్చిచెప్పారు. శుక్రవారం జపాన్ వార్తా సంస్థ 'నిక్కీ ఆసియా' ఇంటర్వ్యూలో మోదీ మాట్లాడారు. పలు అంశాలపై తన అభిప్రాయాలు పంచుకున్నారు. పొరుగు దేశాలతో సాధారణ ద్వైపాక్షిక సంబంధాలు ఉండాలంటే సరిహద్దుల్లో శాంతియుత పరిస్థితులు కొనసాగడం తప్పనిసరి అని చెప్పారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి, చట్టబద్ధ పాలనకు, వివాదాలకు శాంతియుత పరిష్కారం కనుగొనడానికి తాము అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఉద్ఘాటించారు. భారత్-చైనా మధ్య సంబంధాలు సాధారణ స్థాయికి చేరుకుంటే ఇరు దేశాలకే కాకుండా ప్రపంచానికి కూడా లబ్ధి చేకూరుతుందని తెలియజేశారు. భారత్ ప్రగతి పథంలో దూసుకుపోతోందని వివరించారు. 2014లో ప్రపంచంలో పదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ ఇప్పుడు ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని గుర్తుచేశారు. పాకిస్తాన్‌తో సాధారణ, ఇరుగుపొరుగు సంబంధాలను నరేంద్ర మోదీ కోరుకుంటున్నట్లు నిక్కీ ఆసియా వెల్లడించింది.

హిరోషిమాలో మోదీ

జి-7, క్వాడ్ దేశాల అధినేతల సదస్సులో పాల్గొనడానికి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం జపాన్‌లోని హిరోషిమా నగరానికి చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు జపాన్ సీనియర్ అధికారులు, భారత రాయబార కార్యాలయం అధికారులు స్వాగతం పలికారు. హిరోషిమాలో ల్యాండ్ అయ్యానంటూ మోదీ ట్వీట్ చేశారు. ఆయన ఈ నెల 21 దాకా హిరోషిమాలో పర్యటిస్తారు. జి-7 సదస్సుతోపాటు వివిధ కార్యక్రమాలు, సమావేశాల్లో పాల్గొంటారు. జపాన్ పర్యటనకు బయలుదేరేముందు ఢిల్లీలో మోదీ ఒక ప్రకటన విడుదల చేశారు. ''జి-20 కూటమికి ఈ ఏడాది భారత్ సారథ్యం వహిస్తోంది. ఈ నేపథ్యంలో హిరోషిమాలో జి-7 దేశాల అధినేతలతో సమావేశమై, చర్చించేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. ప్రపంచ సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించబోతున్నాం'' అన్నారు.



ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న భారతీయులు

సదస్సులో పాల్గొననున్న జెలెన్‌స్కీ

జి-7 దేశాల శిఖరాగ్ర సదస్సులో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సైతం పాల్గొనబోతున్నారు. ఆయన ఆదివారం సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ విషయాన్ని ఉక్రెయిన్ నేషనల్ సెక్యూరిటీ, డిఫెన్స్ కౌన్సిల్ సెక్రటరీ ఒలెక్సీ డానిలోవ్ నిర్ధారించారు. తమ దేశంలో నెలకొన్న అస్థిరతను పరిష్కరించడానికి తమ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్తారని, ఎవరినైనా కలుస్తారని చెప్పారు.



ఢిల్లీ ప్రభుత్వ సర్వీసుల ఉద్యోగులపై పూర్తి అధికారాలు రాష్ట్ర ప్రభుత్వానికే ఉంటాయన్న సుప్రీంకోర్టు తీర్పును తక్షణం అమలు చేయాలనే డిమాండ్‌తో శుక్రవారం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా నివాసం ముందు బైఠాయించి ధర్నా చేస్తున్న ఆప్ మంత్రులు గోపాల్ రాయ్, సౌరభ్ భరద్వాజ్, ఆతిషి తదితరులు. దాదాపు 90 నిమిషాల ధర్నా అనంతరం ఎల్జీ వారిని లోనికి పిలిచి చర్చించారు.

ఒరిజినల్ రికార్డులు సమర్పించండి

ఆనంద్‌మోహన్ విడుదలపై బిహార్ సర్కారుకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: తెలుగు దళిత ఐఏఎస్ అధికారి జి.కృష్ణయ్య హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్షపడిన మాజీ ఎంపీ ఆనంద్ మోహన్ శిక్షాకాలం తగ్గింపునకు సంబంధించి మొత్తం ఒరిజినల్ రికార్డులు సమర్పించాలని బిహార్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. అంతేకాకుండా ఆనంద్ మోహన్ నేర చరిత్ర వివరాలు సైతం అందజేయాలని సూచించింది. ఈ కేసులో విచారణకు ఇక వాయిదా వేయలేమని, రికార్డులన్నీ సమర్పించాల్సిందేనని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జేబీ పార్డీవాలాతో కూడిన ధర్మాసనం బిహార్ సర్కారు తరఫు న్యాయవాది మనీశ్ కుమార్‌కు తేల్చిచెప్పింది. శిక్షాకాలం ముగియక ముందే ఆనంద్ మోహన్‌ను జైలు నుంచి విడుదల చేస్తూ బిహార్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై జి.కృష్ణయ్య భార్య ఉమా కృష్ణయ్య తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. తమ ప్రతిస్పందనను తెలియజేసేందుకు కొంత గడువు ఇవ్వాలన్న మనీశ్ కుమార్ విజ్ఞప్తిని తిరస్కరించింది. నిబంధనల్లో సవరణలు చేసి మరీ ఆనంద్ మోహన్ శిక్షాకాలాన్ని తగ్గించి అతన్ని విడుదల చేస్తూ నితీశ్ కుమార్ ప్రభుత్వం ఏప్రిల్ 10న ఉత్తర్వు జారీ చేసిన సంగతి తెలిసిందే.

సునాక్ దంపతుల సంపద తగ్గింది



లండన్: గత ఏడాది యూకే ధనవంతుల జాబితాలో తొలిసారిగా చోటుదక్కించుకున్న బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్, అక్షతా మూర్తి దంపతుల సంపద ఈ ఏడాది కొంత తగ్గిపోయింది. ఏడాది వ్యవధిలో వారు 201 మిలియన్ పౌండ్ల సంపద కోల్పోయినట్లు శుక్రవారం విడుదలైన 'ద సండే టైమ్స్ రిచ్ లిస్ట్-2023'ను బట్టి తేటతెల్లమవుతోంది. ఇన్ఫోసిస్ కంపెనీలో అక్షతా మూర్తి షేర్ల విలువ పడిపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. 2022 నాటి సంపన్నుల జాబితాలో రిషి సునాక్ దంపతులు 222వ స్థానంలో నిలిచారు. ఈ ఏడాది జాబితాలో వారి ర్యాంక్ 275కు చేరింది. ప్రస్తుతం వారి సంపద 529 మిలియన్ పౌండ్లని (రూ.5,461 కోట్లు) అంచనా. సునాక్ దంపతుల సంపదలో సింహభాగం ఇన్ఫోసిస్ షేర్ల రూపంలోనే ఉంది. ఇక 35 బిలియన్ పౌండ్లతో (రూ.3.61 లక్షల కోట్లు) బ్రిటన్ సంపన్నుల జాబితాలో ఈ ఏడాది కూడా తొలి స్థానాన్ని భారత సంతతికి చెందిన హిందుజా కుటుంబమే దక్కించుకుంది.

ఎలిజబెత్ అంత్యక్రియలకు రూ.1,655 కోట్లు

లండన్: క్వీన్ ఎలిజబెత్-2 అంత్యక్రియలకు 162 మిలియన్ పౌండ్లు (రూ.1,655 కోట్లు) ఖర్చయినట్లు బ్రిటన్ కోశాగార విభాగం (ట్రెజరీ) వెల్లడించింది. రాణి అంత్యక్రియల ఖర్చులను ట్రెజరీ చీఫ్ సెక్రెటరీ జాన్ గ్లెన్ పార్లమెంట్‌కు సమర్పించారు. 70 ఏళ్ల పాటు బ్రిటన్ మహారాణి హోదాలో కొనసాగిన ఎలిజబెత్-2 గత ఏడాది సెప్టెంబర్ 8న మరణించిన సంగతి తెలిసిందే. గత సెప్టెంబర్ 19న జరిగిన ఆమె అంత్యక్రియలకు వివిధ దేశాల నేతలు, ప్రతినిధులు హాజరయ్యారు

టీచర్ల తొలగింపుపై కలకత్తా హైకోర్టు స్టే

కోల్‌కతా: ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే 32 వేల మంది టీచర్ల నియామక ఉత్తర్వులను రద్దు చేస్తూ ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై కలకత్తా హైకోర్టు స్టే విధించింది. ఎటువంటి శిక్షణ లేకుండా కేవలం టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) ప్రాతిపదికన 2016లో నియమితులైన సుమారు 32 వేల మంది టీచర్లను తొలగించాలంటూ సింగిల్ బెంచ్ మే 12న తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వును సవాల్ చేస్తూ పశ్చిమబెంగాల్ ప్రాథమిక విద్య బోర్డ్, బాధిత ఉపాధ్యాయులు వేసిన పిటిషన్లను శుక్రవారం కోర్టు విచారించింది. బాధితులకు అర్థవంతమైన రక్షణ హక్కు అవకాశం ఇవ్వకుండా ఉద్యోగాల నుంచి తొలగించడంపై ప్రాథమికంగా న్యాయపరమైన జోక్యం అవసరమని భావిస్తున్నట్లు పేర్కొంది.

క్లుప్తంగా...

జీవోలన్నీ ఏపీ.గెజిట్‌లో అప్‌లోడ్ చేయండి

- అన్ని శాఖలకు సాధారణ పరిపాలన శాఖ ఆదేశాలు జారీ

సాక్షి, అమరావతి: జీవోలన్నీ ఏపీ.గెజిట్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సిందిగా సాధారణ పరిపాలన శాఖ అన్ని శాఖలకు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. గతంలోనే ఆదేశాలిచ్చినప్పటికీ ఇప్పటికీ కొన్ని శాఖలు జారీ చేసిన జీవోలను ఏపీ.గెజిట్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం లేదని గుర్తించినట్లు పేర్కొంది. ఇక నుంచి జీవో జారీ చేస్తే దాన్ని తప్పనిసరిగా ఏపీ.గెజిట్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు జారీ చేసిన జీవోలను వెంటనే ఏపీ.గెజిట్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సిందిగా ఆదేశించింది. ఈ ఆదేశాలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉల్లంఘించరాదని సాధారణ పరిపాలన శాఖ పేర్కొంది.

37 మంది అదనపు ఎస్పీలకు పోస్టింగ్‌లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పదోన్నతిపై 37 మంది అదనపు ఎస్పీలకు ప్రభుత్వం పోస్టింగులు కేటాయించింది. డీఎస్పీల నుంచి ఇటీవల 37 మందికి అదనపు ఎస్పీలుగా పదోన్నతి కల్పించిన విషయం తెలిసిందే. వారికి పోస్టింగులు కేటాయిస్తూ హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తా శుక్రవారం ఉత్తర్వులిచ్చారు.

మాచ్‌ఖండ్‌లో మెరుగుపడిన విద్యుత్ ఉత్పత్తి

- 6వ నంబరు జనరేటర్ రెడీ


6వ నంబరు జనరేటర్ వద్ద ఇంజినీర్లు

ముంచంగిపుట్టు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో ఎట్టకేలకు 6వ నంబరు జనరేటర్ శుక్రవారం వినియోగంలోకి వచ్చింది. 120 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల ఈ ప్రాజెక్టులో ఆరు జనరేటర్లున్నాయి. 4, 6 నంబర్ల జనరేటర్లు రెండేళ్లుగా పనిచేయడంలేదు. అప్పటినుంచి మరమ్మతులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం 6వ నంబరు జనరేటర్ వినియోగంలోకి రావడంతో విద్యుత్ ఉత్పత్తి 87 మెగావాట్లకు చేరుకుంది. ప్రస్తుతం 4వ నంబర్ జనరేటర్ మినహా మిగతా ఐదు జనరేటర్లు పనిచేస్తున్నాయని ప్రాజెక్టు ఈఈ (జనరేషన్) గోవిందరాజులు తెలిపారు. 4వ నంబరు జనరేటర్ కూడా వారం రోజుల్లో అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

స్థలాలను సమాధులతో పోలుస్తారా?

చంద్రబాబు వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా జనాగ్రహం

- తక్షణం ఆయన క్షమాపణ చెప్పాలి
- సంక్షేమ పథకాలు బాబుకు రుచించడంలేదు
- ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి.. ఆ మాటలు బాబు అహంకారానికి నిదర్శనం
- వైఎస్సార్‌సీపీ నేతల మండిపాటు



చిలకలూరిపేటలో మంత్రి విడదల రజిని ఆధ్వర్యాన నిరసన ర్యాలీ, ప్రొద్దుటూరులో చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విప్ రామచంద్రారెడ్డి తదితరులు

సాక్షి నెట్‌వర్క్: పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సెంటు భూమి సమాధి కట్టుకునేందుకే పనికొస్తుందంటూ విజయనగరం జిల్లా ఎస్.కోటలో గురువారం నిర్వహించిన రోడ్డుషోలో టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా జనాగ్రహం వ్యక్తమవుతోంది. 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే ఆయన రాజకీయ సంస్కారం ఇదేనా అంటూ మండిపడ్డారు. ఆయన వ్యాఖ్యలను నిరసిస్తూ అనేక జిల్లాల్లో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎస్.కోట, గజపతినగరం, సాలూరు, చీపురుపల్లి తదితర ప్రాంతాల్లో నల్లబ్యాడ్జీలు ధరించి ప్రజలు పెద్దఎత్తున నిరసన తెలిపారు. గజపతినగరం నాలుగు రోడ్ల కూడలిలో దిష్టిబొమ్మను దహనం చంద్రబాబు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు.

■ టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు తక్షణమే క్షమాపణ చెప్పాలని మంత్రి విడదల రజిని చిలకలూరిపేటలో డిమాండ్ చేశారు. పేదల ఇంటి స్థలాల విషయంలో ఆయన వ్యాఖ్యలను మంత్రి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఆమె పార్టీ శ్రేణులతో కలిసి భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించి అక్కడ మానవహారం చేపట్టారు. నివాస స్థలాన్ని శ్మశాన స్థలంతో పోల్చడం చూస్తుంటే పేదలపట్ల చంద్రబాబుకు ఉన్న అహంకారానికి అద్దంపడుతోందన్నారు.

■ చంద్రబాబు అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం సరికాదని మరో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శ్రీకాకుళం జిల్లా మందస మండలం హంసరాలి పంచాయతీలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పేదలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు చంద్రబాబుకు రుచించడంలేదన్నారు.

■ ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరంలో చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా పార్టీ శ్రేణులతో కలిసి ధర్నా చేపట్టారు. చంద్రబాబు అహంకార ధోరణి నశించాలని, పేదలపై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, డౌన్ డౌన్ చంద్రబాబు అంటూ ఎమ్మెల్యే నినాదాలు చేశారు. సెంటు స్థలం ఇళ్లకు పనికిరాదని, శవాలు పూడ్చడానికి పనికొస్తుందని చంద్రబాబు మాట్లాడటం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. చంద్రబాబు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు.

■ వైఎస్సార్‌సీపీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నేతలు కూడా చంద్రబాబు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పాలకోడేరు మండలం వేంద్రలో పార్టీ శ్రేణులు నిరసన ప్రదర్శన చేపట్టి చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఏలూరు, ఉండి, భీమడోలు, గణపవరం, పోలవరం రూరల్, నూజివీడు, అత్తిలి, ఇరగవరం, తణుకు మండలాల్లో కూడా స్థానిక నేతలు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

■ కాకినాడ జిల్లా పిఠాపురం మండలం ఎల్ఎన్ పురంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబు నేతృత్వంలో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. అలాగే, కాకినాడ జిల్లా శంఖవరం మండలం నెల్లిపూడి లోనూ ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ నాయకత్వంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. నిడదవోలు ఓవర్ బ్రిడ్జి సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. పేదల స్థలాలను సమాధులతో పోల్చిన చంద్రబాబును వచ్చే ఎన్నికల్లో రాజకీయ సమాధి చేయాలంటూ నేతలు నినదించారు.


గజపతినగరంలో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

■ పేదలంటే చంద్రబాబుకు ఎప్పుడూ చులకన భావమేనని తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విమర్శించారు. అమరావతిలో 50 వేల మంది పేదలకు సీఎం జగన్ ఇస్తున్న ఇళ్ల స్థలాలను చంద్రబాబు స్మశానంగా వ్యాఖ్యానించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు హయాంలో ఎప్పుడైనా ఒక సెంటు భూమి పేదలకు ఇచ్చారా అని ప్రశ్నించారు. చంద్రబాబు వ్యాఖ్యలను నిరసిస్తూ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. చంద్రబాబు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు.

■ ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజల ద్రోహి చంద్రబాబు గోబ్యాక్.. గోబ్యాక్ అంటూ అనకాపల్లిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాయి. చంద్రబాబు పర్యటిస్తున్న అనకాపల్లిలో 'గో బ్యాక్' అని ప్లకార్డులు ప్రకార్డులు ప్రదర్శిస్తూ నల్లబ్యాడ్జీలతో భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

■ ప్రొద్దుటూరులోనూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. చంద్రబాబుకు పేద ప్రజలపై సరైన అభిప్రాయంలేదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మండిపడ్డారు. అమరావతిలో 50వేల మంది నిరుపేదలకు తమ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందని, తమ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక, చంద్రబాబు ఇలాంటి విమర్శలు చేస్తున్నారన్నారు.

■ నెల్లూరులో వైఎస్సార్‌సీపీ శ్రేణులు శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక దళిత, బడుగు బలహీన వర్గాల వారి గురించి చంద్రబాబు హేళనగా వ్యాఖ్యానించటం సమంజసం కాదని నేతలు అన్నారు.

■ పేదలకిచ్చే స్థలాలను చంద్రబాబు సమాధులతో పోల్చడంపై కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా అంబేడ్కర్ విగ్రహాల వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కోడుమూరు పట్టణంలో చంద్రబాబు దిష్టిబొమ్మను ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ దహనం చేశారు.

■ అనంతపురం జిల్లా రాయదుర్గంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి నేతృత్వంలో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు భారీ ర్యాలీ చేపట్టి చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. చంద్రబాబు పేదలను అవమానిస్తున్నారని కాపు రామచంద్రారెడ్డి మండిపడ్డారు.

విమానం ఆలస్యం.. ప్రయాణికుల ఇక్కట్లు

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): విశాఖ నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు ఢిల్లీ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా ఏఐ 0787 విమానం రాత్రి 9.30 గంటలైనప్పటికీ రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. విమానాశ్రయ సంస్థకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వీరి ఆందోళనతో స్పందించిన అధికారులు ప్రత్యామ్నాయ విమానం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే రాత్రి 10 గంటలు దాటినా విమానం ఏర్పాటు చేయలేదు. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో పాటు విమానంలో సాంకేతిక లోపం ఏర్పడడంతో ఇబ్బంది వచ్చిందని విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా ముంబై నుంచి రాత్రి 8 గంటలకు విశాఖకు రావలసిన ఇండిగో విమానాన్ని వాతావరణం అనుకూలించకపోవడంతో హైదరాబాద్‌కు మళ్లించారు. ఇక్కడి నుంచి ఈ విమానంలో వెళ్లాల్సిన ప్రయాణికులకు ఇండిగో సంస్థ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది.

ఓబుళాపురం మైనింగ్ కేసు ట్రయల్ గడువు పొడిగింపు

- 4 నెలలు పొడిగించిన సుప్రీంకోర్టు ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: ఓబుళాపురం మైనింగ్ కేసు ట్రయల్ గడువు పొడిగించాలన్న హైదరాబాద్ సీబీఐ కోర్టు జడ్జి విజ్ఞప్తిని సుప్రీంకోర్టు అనుమతించింది. ట్రయల్ కోర్టు జడ్జి దాఖలు చేసిన అప్లికేషన్‌ను శుక్రవారం జస్టిస్ అనిరుద్ధబోస్, జస్టిస్ సుధాంశు ధులియాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఆరునెలల్లో ట్రయల్ పూర్తిచేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన విషయాన్ని సీబీఐ న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఎక్కువ గడువిస్తే నిందితుడు కేసును నిర్వీర్యం చేసే అవకాశం ఉందని ఆరోపించారు. తక్కువ సమయమే పొడిగించాలని కోరారు. అనంతరం.. హైదరాబాద్ సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి విజ్ఞప్తిని అనుమతిస్తున్నామని ధర్మాసనం పేర్కొంది. పెద్దసంఖ్యలో సాక్షులను విచారించే అవసరం ఉన్నందున గడువును మరో నాలుగు నెలలు పొడిగిస్తున్నట్లు తెలిపింది.

నోట్లు రద్దు చేయాలని చెప్పింది నేనే

- అనకాపల్లి సభలో చంద్రబాబు

సాక్షి, అనకాపల్లి: రూ.2వేలు, రూ. వెయ్యి, రూ.500 నోట్లను రద్దు చేయాలని చెప్పింది తానేనని ప్రతిపక్ష నేత చంద్రబాబు తెలిపారు. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కు డిజిటల్ కరెన్సీ రిపోర్టు కూడా ఇచ్చానన్నారు. ఈ రిపోర్టు ఆధారంగానే ఆర్‌బీఐ రూ.2 వేల నోట్లను రద్దు చేసిందని చెప్పారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు 3 సెంట్ల భూమిని ఇచ్చామన్నారు. జగన్ ప్రభుత్వం ఇచ్చే సెంటు భూమి సమాధికి కూడా సరిపోదని మరోసారి పేద ప్రజలను కించపరుస్తూ వ్యాఖ్యలు చేశారు. చనిపోతే శవం పూడ్చడానికే ఈ సెంటు భూమి సరిపోతుందన్నారు. అనకాపల్లిలో శుక్రవారం 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. సుంకరమెట్ట జంక్షన్ నుంచి నెహ్రూ చౌక్ జంక్షన్ వరకూ రోడ్ షో నిర్వహించారు. అనంతరం బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడారు. 'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిత్యావసర ధరలు, వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్, కరెంట్ చార్జీలు పెంచింది. నేను పెద్ద పెద్ద బాంబులకు.. మైన్లకే భయపడలేదు.. ఈ ముఖ్యమంత్రికి భయపడతానా..?. నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విశాఖకు ప్రపంచంలో ఉన్న అన్ని కంపెనీలను తెచ్చాను.. అయితే అన్ని కంపెనీలను తిరిగి పంపించిన ఘనత జగన్‌కే చెల్లింది. రూ.2,200 కోట్లతో 8 వేల మందికి ఉద్యోగాలు వచ్చేలా లూలూ కంపెనీని తీసుకొస్తే.. వాటా ఇవ్వలేదని వెనక్కి పంపించేశారు. ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ కంపెనీని కూడా ఇలాగే సాగనంపేశారు. అదానీ డేటా సెంటర్, భావనపాడు పోర్టు, భోగాపురం ఎయిర్ పోర్టులకు నేను శంకుస్థాపన చేస్తే ఇప్పుడు డ్రామాలాడుతున్నారు' అని చంద్రబాబు మండిపడ్డారు.

ఉత్తరాంధ్రకు పట్టిన శని.. జగన్

'విశాఖను నేను ఆర్థిక రాజధానిగా, ఐటీ, టూరిజం హబ్‌గా చేయాలనుకున్నాను. అయితే ఈ ప్రభుత్వం పరిపాలనా రాజధానిగా చేసి.. రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేసి ఆటలాడుతోంది. నేను అధికారంలోకి వస్తే అమరావతే రాజధాని. విశాఖను పరిపాలనా రాజధాని చేస్తానంటున్న జగన్ ఉత్తరాంధ్రకు పట్టిన శనిలాంటివాడు. నేను అధికారంలో ఉండి ఉంటే పోలవరం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వంశధార వరకు అన్నింటినీ పూర్తి చేసేవాడిని. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక్క పరిశ్రమైనా వచ్చిందా? ఒక్కరికైనా ఉద్యోగం వచ్చిందా..? అమెరికాలో ఉన్నవారి కంటే ఇంగ్లిష్ రాకున్నా ఇక్కడివారే ఎక్కువ సంపాదిస్తున్నారు. జ్ఞానం ఉండాలి గానీ ఇంగ్లిష్ ఎందుకు?. హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో పెట్టా' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. కాగా చంద్రబాబు రాత్రి 7 గంటలకు బహిరంగ సభలో పాల్గొనాల్సి ఉంది. అయితే జనాలెవరూ రాకపోవడంతో రాత్రి 8 గంటలకు సభ నిర్వహించారు. అప్పటికీ జనాలు పెద్దగా రాకపోవడంతో నేతలపై ఆయన అసహనం వ్యక్తం చేశారు.

పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే

- రాష్ట్రంలో 31 లక్షల ఇళ్ల స్థలాలు
- కరోనా తరువాత రెండేళ్లలో 3 లక్షల ఇళ్ల నిర్మాణం
- చంద్రబాబు తయారుచేసిన మాస్టర్ ప్లాన్ ధనికులు, సంపన్నులకే పరిమితం
- పేదల ఇళ్లస్థలాలపై రైతుల ముసుగులో రియల్ వ్యాపారులు కోర్టుకెళ్లడం సిగ్గుచేటు
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి


కృష్ణాయపాలెంలో లేఅవుట్‌ను పరిశీలిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు

మంగళగిరి: రాష్ట్రంలో పేదప్రజల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజావ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. రాష్ట్రంలో 31 లక్షల ఇళ్ల స్థలాలను కేటాయించడంతో పాటు కరోనా తరువాత గడచిన రెండేళ్లలో మూడులక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసినట్లు తెలిపారు. సీఆర్‌డీఏ పరిధిలోని నవులూరు, యర్రబాలెం, కృష్ణాయపాలెం ఆర్–5 జోన్‌లో పేదలకు కేటాయించిన నివేశన స్థలాలకు సంబంధించిన లేఅవుట్ అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సజ్జల మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక సుమారు రూ.30 వేల కోట్లతో 60 వేల ఎకరాలను కొనుగోలు చేసి 31 లక్షల ఇళ్లస్థలాలను కేటాయించినట్లు చెప్పారు. గత రెండేళ్లలో మూడు లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేశామని, ఐదులక్షల ఇళ్లు రూఫ్ లెవెల్‌లో ఉండగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఆర్–5 జోన్ లేఅవుట్ల అభివృద్ధి పనులు నిర్విరామంగా కొనసాగుతున్నాయన్నారు. ఇటువంటి తరుణంలో టీడీపీ నేతలు సైంధవుల్లా.. పేదలకు స్థానం లేకుండా చేయాలని కుట్రలు, కుయుక్తులు పన్నడం సిగ్గుచేటని చెప్పారు. గతంలో చంద్రబాబు సీఆర్‌డీఏ పరిధిలో ధనికులు, సంపన్నవర్గాలు ఉండేలా మాస్టర్ ప్లాన్ తయారు చేసుకున్నారని విమర్శించారు. చంద్రబాబు తయారు చేసిన మాస్టర్ ప్లాన్‌ను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బ్యాలెన్స్ చేస్తూ సీఆర్‌డీఏ పరిధిలో శ్రామికులు, కార్మికులు, కష్టజీవులు అందరూ కలిసి ఉండేలా 50 వేల పేద కుటుంబాలకు ఇళ్లను కేటాయించేందుకు కృషిచేస్తున్నారని చెప్పారు. రాజధాని రైతుల ముసుగులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బ్రోకర్లు, ఏజెంట్లు ఆర్–5 జోన్‌లో పేదలకు స్థలాలివ్వడంపై కోర్టుకెళ్లటం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు రియల్ ఎస్టేట్ వ్యాపారి మాదిరి వ్యవహరించడమే తప్ప టిడ్కో గృహాల లబ్ధిదారులకు చేసిందేమీలేదని చెప్పారు. ఆ ఇళ్లకు వసతుల గురించి ఆలోచించలేదని, నయాపైసా ఖర్చుపెట్టలేదని తెలిపారు. తన లాభం కోసమే టిడ్కో ఇళ్ల పేరుతో గోడలు కట్టి పేదలపై అప్పుల భారం మోపారని విమర్శించారు, చంద్రబాబు దిగిపోయిన తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి టిడ్కో లబ్ధిదారులపై భారం తొలగించి ఉచితంగా ఇళ్లు కేటాయించారని గుర్తుచేశారు. పేదలకు రెండుసెంట్ల చొప్పున స్థలం కేటాయించానని గొప్పలు చెప్పుకొంటున్న చంద్రబాబు.. ఎక్కడైనా ఇచ్చారా? అని ఆయన ప్రశ్నించారు. ఎంపీలు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, నందిగం సురేష్, ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్యవరప్రసాద్, లేళ్ల అప్పిరెడ్డి, మర్రి రాజశేఖర్, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా, వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి సురేష్ పాల్గొన్నారు.

బాబు రాజకీయానికి ప్రజలే సమాధి కడతారు

- రాజధానిలో పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చి తీరతాం
- పేదలకు ఏనాడూ సెంటు భూమి ఇవ్వని చంద్రబాబు
- మరుగుజ్జు పవన్‌కళ్యాణ్ కూలీ నంబర్ వన్
- డిప్యూటీ సీఎంలు నారాయణస్వామి, రాజన్నదొర, మంత్రులు పెద్దిరెడ్డి, అంబటి, కాకాణి, రోజా, ఉషశ్రీ

సాక్షి, అమరావతి/నెట్‌వర్క్: పేదలకు రాజధానిలో ఇళ్లస్థలాలు ఇస్తుంటే దళిత ద్రోహి చంద్రబాబు కడుపుమంటతో మాట్లాడుతున్నారని పలువురు మంత్రులు ధ్వజమెత్తారు. పేదలకు ఇస్తున్న స్థలాలు సమాధులు కట్టుకోవడానికి కూడా పనికిరావంటూ వ్యాఖ్యానించిన చంద్రబాబు రాజకీయానికి త్వరలో ప్రజలు సమాధి కడతారని చెప్పారు. వందమంది చంద్రబాబులు, వెయ్యిమంది పవన్‌కళ్యాణ్‌లు అడ్డుపడినా రాజధానిలో పేదలకు స్థలాలు ఇచ్చి తీరతామన్నారు. పవన్‌కళ్యాణ్ జీవితకాలం చంద్రబాబుకు బానిసగా ఉండిపోవాల్సిందేనని ఎద్దేవా చేశారు. వివిధ ప్రాంతాల్లో మాట్లాడుతూ వారేమన్నారంటే..

బాబు మదమెక్కి మాట్లాడుతున్నారు



రాజధాని ప్రాంతంలో పేద ప్రజలకు ఇళ్లు నిర్మించే విషయంలో చంద్రబాబు మదమెక్కి అహంకారపు మాటలు మాట్లాడుతున్నారు. చంద్రబాబు పాలనలో రైతులను మభ్యపెట్టి, గ్రాఫిక్స్ చూపించి భూములను లాక్కున్నారు. దీనిపై విచారణ జరుగుతోంది. పేదలకు సెంటు భూమి ఇస్తే శవాన్ని పూడ్చిపెట్టేందుకు కూడా సరిపోదని పేద ప్రజల మనోభావాలు దెబ్బతినేలా చంద్రబాబునాయుడు మాట్లాడుతున్నారు. టీడీపీని ప్రజలు భూస్థాపితం చేసినా ఆయన అహంకారం తగ్గలేదు. చంద్రబాబు పాలనలో ఇళ్లు మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీ సిఫారసులు ఉండేవి. ప్రస్తుతం ఎటువంటి సిఫారసులు లేకుండా అర్హులు దరఖాస్తు చేసుకుంటే సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయి. చంద్రబాబు ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలి. ఉచిత బీమాకు సంబంధించి ఈనాడులో అడ్డగోలు రాతలు రాస్తున్నారు. వయసు పైబడిన రామోజీరావు విషయ పరిజ్ఞానం కూడా లేకుండా గలీజు రాతలు రాస్తున్నారు.

– మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మందుబాబుల అధ్యక్షుడు చంద్రబాబు



టీడీపీ అధికారం ఉన్నంత కాలం చంద్రబాబు మందుబాబులకు అధ్యక్షుడుగా ఉంటూ అక్రమ మద్యాన్ని ప్రోత్సహించారు. కరువుకు బంధువు, వరుణుడికి శత్రువుగా నిలిచిపోయిన చంద్రబాబును ప్రజలు నమ్మబోరు. పవన్‌కళ్యాణ్ ప్యాకేజీకి అమ్ముడు పోయి 18 సీట్లకు ఒప్పందం కుదుర్చుకున్న రీల్ నటుడు. పవన్ జీవితకాలం చంద్రబాబుకు బానిసగా ఉండిపోవాల్సిందే తప్ప గమ్యం లేదు. తాగుబోతుల సంఘానికి చంద్రబాబు అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి లోకేశ్, తెలుగు తమ్ముళ్లు ఈసీ మెంబర్లు. స్కిల్ డెవలప్‌మెంట్, అమరావతి భూ కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు వాటి నుంచి బయటపడడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురద చల్లుతున్నారు. ఇది బాబు నీచ సంస్కృతికి నిదర్శనం.

– డిప్యూటీ సీఎం నారాయణస్వామి

బాబూ.. ఇదేనా నీ రాజకీయ సంస్కారం!



ముఖ్యమంత్రిగా 14 ఏళ్లు పనిచేసి ప్రజలకు ఏం మేలు చేశావో చెప్పగలవా చంద్రబాబూ.. నీ రాజకీయ చరిత్రలో పేదలకు ఒక్క సెంటు భూమైనా ఇచ్చావా.. పేదల ఇళ్లను సమాధులతో పోలుస్తావా.. ఇదేనా నీ రాజకీయ సంస్కారం. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో పేదల జీవితాలు బాగుపడుతుంటే నీ కెందుకు అంత అక్కసు? ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కలను నిజంచేస్తుంటే... చూసి ఓర్వలేక సమాధులతో పోల్చడం సిగ్గుచేటు. దమ్ముంటే చంద్రబాబు హయాంలో ఇచ్చిన ఇళ్ల స్థలాల వివరాలను వెల్లడించాలి. చంద్రబాబు మానసిక పరిస్థితి సరిగ్గా లేక ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియడంలేదు. ఒంటరిగా పోటీచేసే దమ్ము, ధైర్యంలేక అందరి చుట్టూ పొత్తుల కోసం కాళ్లరిగేలా తిరుగుతున్న విషయాన్ని ప్రజలంతా గమనిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలు బుద్ధి చెప్పటం ఖాయం.

– డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

అడ్డుతగలడం బాబుకు పరిపాటి



పేదల కలల నివాస నిర్మాణానికి ప్రభుత్వం స్థలమిస్తే అవి సమాధులు కట్టుకోవడానికి కూడా పనికిరావని చులకనగా మాట్లాడటం చంద్రబాబు అహంకారానికి నిదర్శనం. ఎంత అభివృద్ధి చేస్తున్నా ఎల్లో మీడియా ద్వారా విషప్రచారం చేయడం ఆయనకు అలవాటుగా మారింది. అమరావతిలో పేదలకు ఇస్తున్న ఇళ్ల స్థలాలను ఆపడానికి కోర్టుకెళ్లారు. ప్రతి పనికి అడ్డుతగలడం, కోర్టుకు వెళ్లి స్టేలు తెచ్చుకోవడం ఆయనకు పరిపాటిగా మారింది. 14 ఏళ్లు సీఎంగా ఉన్న ఆయన కుప్పం ప్రాంతాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేదు? పశ్చిమ మండలాల్లో చెరువులన్నీ నిండాయి. ఇక్కడ రిజర్వాయర్లు, నీటి ప్రాజెక్టులు నిర్మిస్తామంటే వాటిని కూడా ఆపాలని చంద్రబాబు చూస్తున్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు.

– మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రాజకీయాలకు అనర్హుడు పవన్



వందమంది చంద్రబాబులు, వెయ్యిమంది పవన్ కళ్యాణ్‌లు అడ్డుపడినా రాజధానిలో పేద ప్రజలకు ఇంటి పట్టాలు ఇచ్చి తీరతాం. హైకోర్టు, సుప్రీం కోర్టు పేదలకు అనుకూలంగా తీర్పు ఇవ్వటంతో చంద్రబాబుకు కడుపు మండుతోంది. పేదల హృదయాల్లో గూడు కట్టుకునేందుకు వైఎస్సార్‌సీపీ నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటుంది. మూడు రాజధానుల సిద్ధాంతానికి కట్టుబడే ఉన్నాం. పవన్ కళ్యాణ్ పెద్ద మరుగుజ్జు, కూలీ నెంబర్ వన్. ఈ దేశంలో రాజకీయాలకు అనర్హుడు ఎవరైనా ఉన్నారంటే అది పవన్‌కళ్యాణ్ మాత్రమే. సంకుచిత మనస్తత్వం ఉన్న చంద్రబాబు దళితుల ద్రోహి. రాబోయే ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే సంగ్రామం.

– మంత్రి అంబటి రాంబాబు

సెంటు భూమిలోనే పాతేస్తారు



సెంటు భూమి అంటూ మహిళల సెంటిమెంట్‌ని అవమానించిన చంద్రబాబుని, టీడీపీని ఆ సెంటులోనే పాతేస్తారు. ప్రతిపక్ష పార్టీ వారు పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని ధర్నా చేస్తారు. అయితే ఏపీలో రివర్స్‌లో ప్రవర్తిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే.. ప్రతిపక్ష పార్టీ నేతలు కోర్టుకు వెళ్లి ఇవ్వకుండా ఆపేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అక్రమ కట్టడంలో దర్జాగా ఉంటున్న చంద్రబాబు ఏనాడైనా పేదలకు సెంటు స్థలం ఇచ్చారా?. మహిళలు, పేదలను అవమానిస్తూ మాట్లాడిన చంద్రబాబుకి వచ్చే ఎన్నికల్లో వారు బుద్ధి చెబుతారు. ఏపీలో అమలవుతున్న వలంటీర్ వ్యవస్థను దేశవ్యాప్తంగా అమలుచేసేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రయత్నిస్తున్నారు.

– మంత్రి ఆర్‌కే రోజా

మహిళలకు క్షమాపణ చెప్పాలి



ప్రభుత్వం మహిళల పేరుతో ఇచ్చే ఇళ్లస్థలాల్లో సమాధులు కట్టుకోవాలని చంద్రబాబు మాట్లాడటం దారుణం. ఇందుకు ఆయన రాష్ట్ర మహిళలకు క్షమాపణ చెప్పాలి. సుప్రీంకోర్టు తీర్పుతో చంద్రబాబుకు ఫ్రస్ట్రేషన్ వచ్చింది. మహిళా ద్రోహి అయిన చంద్రబాబుకు మహిళలంతా బుద్ధిచెప్పడం ఖాయం. సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అమరావతిలోను మహిళల పేరుతో ఇళ్ల పట్టాలు ఇస్తోంది. అటువంటి మహిళలను కించపరిచేలా వారి సమాధులు కట్టుకోవాలన్నట్టుగా చంద్రబాబు వ్యాఖ్యలు చేయడం దుర్మార్గం. మొదట్నుంచి మహిళలను చిన్నచూపు చూసే నైజం చంద్రబాబుది. గతంలో కోడలు మగబిడ్డను కంటానంటే అత్త వద్దంటుందా అని కూడా అన్నారు.

– మంత్రి ఉషశ్రీచరణ్

బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి

- బీసీ రిజర్వేషన్లపై క్రిమిలేయర్ తొలగించాలి
- రేపు తిరుపతిలో బీసీ ఉద్యోగుల సంఘ రాష్ట్ర మహాసభలు
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య



సాక్షి, అమరావతి: బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించేలా వచ్చే పార్లమెంటు సమావేశాల్లో రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 21న తిరుపతిలో బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభల్లో అనేక సమస్యలను చర్చించి కీలక తీర్మానాలు చేస్తామని పేర్కొన్నారు. బీసీ ఉద్యమానికి ఉద్యోగులు నాయకత్వం వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఉద్యోగులు ఐకమత్యంగా ఉద్యమిస్తే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. దేశ జనాభాలో 56 శాతం జనాభా గల బీసీలు... కులాల పేరుతో విడిపోవడం వల్ల న్యాయమైన డిమాండ్లు సాధించుకోలేకపోతున్నామని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 75ఏళ్ల తర్వాత కూడా రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించకపోతే ఇదేమి ప్రజాస్వామ్యమని కృష్ణయ్య ప్రశ్నించారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించడానికి రాజ్యాంగ పరమైన, న్యాయపరమైన అవరోధాలు ఏమీలేవన్నారు. మండల్ కమిషన్, పార్లమెంటరీ కమిటీ చైర్మన్ నాచియప్పన్ కమిటీ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని సిఫార్సులు చేశాయని గుర్తుచేశారు. బీసీలు అటెండర్లు, వాచ్‌మన్లుగానే ఉద్యోగ విరమణ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేయాలన్నారు.

క్లుప్తంగా...

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల హాల్ టికెట్లు సిద్ధం

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియెట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల (థియరీ) 2023కు సంబంధించిన హాల్ టికెట్లను విడుదల చేస్తున్నట్లు ఇంటర్మీడియెట్ బోర్డు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ల జ్ఞానభూమి లాగిన్ నుంచి డౌన్లోడ్ చేసుకొనే సౌకర్యం కల్పించినట్లు తెలిపింది. జనరల్ వొకేషనల్ ఇంటర్మీడియెట్ విద్యార్థుల హాల్ టికెట్లు సిద్ధంగా ఉన్నాయని పేర్కొంది. అన్ని జిల్లాల ప్రాంతీయ పర్యవేక్షణాధికారులు ఈ విషయాన్ని వారి జిల్లాలలోని అన్నీ కాలేజీల ప్రిన్సిపాళ్లకు తెలియజేయాలని ఇంటర్మీడియెట్ విద్యామండలి సెక్రటరీ ఎం.వి.శేషగిరిబాబు ఆదేశించారు.

24 నుంచి అందుబాటులో గ్రూప్-1 హాల్ టికెట్లు

సాక్షి, అమరావతి: గ్రూప్-1 పోస్టుల భర్తీకి నిర్వహించే మెయిన్ రాత పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను ఈ నెల 24వ తేదీ నుంచి అందుబాటులో ఉంచనున్నట్లు ఏపీపీఎస్సీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. కమిషన్ వెబ్‌సైట్ నుంచి ఈ హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. గ్రూప్-1 మెయిన్ రాత పరీక్షలు జూన్ 3 నుంచి 10వ తేదీ వరకు సంప్రదాయ విధానంలో, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయని పేర్కొంది.

సీపెట్‌లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు 28

సాక్షి, అమరావతి: విజయవాడలోని సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజినీరింగ్, టెక్నాలజీ (సీపెట్) కోర్సుల్లో డిప్లొమా, పీజీ డిప్లొమాల్లో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ డైరెక్టర్ సీహెచ్.శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ సంస్థ సీపెట్‌లో మూడేళ్ల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ), ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ) కోర్సులకు పదో తరగతి ఉత్తీర్ణులు, రెండేళ్ల పీజీ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ-పీపీటీ) కోర్సుకు బీఎస్సీ ఉత్తీర్ణులు, చివరి ఏడాది చదువుతున్న వారు అర్హులని వివరించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.250, మిగిలిన వారికి రూ.500 రుసుము చెల్లించి www. cipet.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చే నెల 11వ తేదీన ప్రవేశపరీక్ష జరుగుతుందని తెలిపారు. వివరాలకు 9985941979 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 162 ఆదర్శ పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సుల్లో ప్రవేశానికి అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 22 నుంచి వచ్చే నెల 7వ తేదీలోగా ఎస్సీ, ఎస్టీలు రూ.150, ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200 నిర్ణీత రుసుం చెల్లించి apms. apcfss. in, cse. ap. gov.inలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పదో తరగతి మార్కుల మెరిట్ ప్రాతిపదికన, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

ముగిసిన ఈఏపీ సెట్ ఎంపీసీ స్ట్రీమ్ పరీక్షలు

94.35 శాతం మంది హాజరు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంజనీరింగ్, వ్యవసాయ, ఫార్మా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఏపీ ఈఏపీ సెట్ ఎంపీసీ స్ట్రీమ్ పరీక్షలు శుక్రవారం తో ముగిశాయి. ఈ పరీక్షలకు 2,38,180 మంది రిజిస్టర్ కాగా 2,24,724 (94.35) శాతం మంది హాజరయ్యారు. ఈ నెల 15వ తేదీన ప్రారంభమైన ఈ పరీక్షల్ని శుక్రవారం వరకు మొత్తం 9 సెషన్లలో నిర్వహించారు.

దస్తగిరి అప్రూవర్ కావడంపై సీబీఐకి నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యకేసులో దస్తగిరి అప్రూవర్‌గా మారడమనే అంశంలో సీబీఐ వాదనలు వింటామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ అంశంపై వివేకా పీఏ కృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం జస్టిస్ కృష్ణమురారి, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించిన విషయం విదితమే. అయితే హత్యకు గురైన వ్యక్తి భార్య, కుమార్తె ఈ కేసులో బాధితులని సునీత నర్రెడ్డి తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా శుక్రవారం ధర్మాసనం ముందు ప్రస్తావించారు. హత్య తర్వాత పోలీసులకు కృష్ణారెడ్డి సమాచారం ఇచ్చారని, సునీత హక్కులు స్వాధీన పరచుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి సునీత, ఆమె భర్తను ప్రాసిక్యూట్ చేయాలని కోరుతున్నారని తెలిపారు. దస్తగిరి అప్రూవర్‌గా మారడాన్ని సవాల్ చేసే అర్హత ఎవరికి ఉందో స్పష్టత ఇస్తామని గురువారమే తెలిపామని, దీనిపై జూలై 3 లేదా 4 తేదీల్లో విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ అంశంలో సీబీఐ వాదనలు వినాలని కృష్ణారెడ్డి న్యాయవాది కోరడంతో ధర్మాసనం సీబీఐకి నోటీసులు జారీచేసింది.

దగా చేసింది ఎవరో తెలియదా రామోజీ?

ఉచిత పంటల బీమాతో వైఎస్ జగన్ ప్రభుత్వం మేలు చేస్తున్నా విషపు రాతలే

- నిత్యం ఉషోదయంతో అబద్ధాలే రామోజీ పని
- రైతుకు పైసా భారం లేకుండా పూర్తి ఉచితంగా, సరళంగా బీమా అమలు
- తదుపరి సీజన్ ప్రారంభానికి ముందే పరిహారం అందజేత
- రైతులకు అసలు దగా జరిగింది టీడీపీ ప్రభుత్వంలోనే
- టీడీపీ హయాంలో 74 .37 లక్షల మంది రైతులకే బీమా
- వైఎస్సార్‌సీపీ హయాంలో 1.66 కోట్ల మందికి బీమా
- 2022-23లోనే ఏకంగా 54 లక్షల మందికి ఉచిత బీమా కవరేజ్
- టీడీపీ ఐదేళ్లలో 30.85 లక్షల మందికి రూ.3,411 కోట్ల పరిహారం
- వైఎస్సార్‌సీపీ హయాంలో 44.66 లక్షల మందికి రూ.6,488.84 కోట్ల పరిహారం



ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి: పచ్చ పత్రిక ఈనాడు విషపు రాతలు విపత్తులకంటే ప్రమాదకరంగా ఉన్నాయి. నిత్యం ఉషోదయంతో అబద్ధాలు నినదించే రామోజీకి క్షేత్ర స్థాయిలో వ్యవసాయ సంస్కరణల యజ్ఞం కనిపించట్లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వ్యవసాయంలో తీసుకొచ్చి విప్లవాత్మక మార్పులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు దక్కుతున్నాయి. రైతులపై పైసా భారం పడకుండా డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం అమలు చేస్తున్నారు. వాస్తవానికి రైతులకు అన్ని రకాలుగా దగా చేసింది చంద్రబాబు ప్రభుత్వమే. టీడీపీ హయాంలో సగటున 20.28 లక్షల మంది రైతుల పంటలకు మాత్రమే బీమా కవరేజ్ ఉండేది. అదీ సకాలంలో చెల్లించేవారు కాదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఈ నాలుగేళ్ల పాలనలో 1.66 కోట్ల మంది రైతులకు బీమా కల్పించారు. ఒక్క 2022-23 సంవత్సరంలోనే 54.11 లక్షల మందికి పంటల బీమా రక్షణ కల్పించారు. ఇది ఓ రికార్డు. పంట కోత ప్రయోగాల ఆధారంగా వేసే దిగుబడి అంచనాకంటే.. వాస్తవ దిగుబడులు ఏమాత్రం తగ్గినా తదుపరి సీజన్ ప్రారంభం కావడానికి ముందే వైఎస్ జగన్ ప్రభుత్వం బీమా పరిహారం చెల్లిస్తోంది. ఈవేమీ పట్టని ఈనాడు ఉచిత బీమాపై అసత్య కథనంతో విషం కక్కింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ- క్రాప్ నమోదు ఆధారంగా వైఎస్సార్ ఉచిత పంటల బీమాకు 2020 -21 సంవత్సరంలో రూ. 1,739 కోట్లు, 2021 -22 లో రూ. 2,978 కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం రైతులకు చెల్లించింది. అదీ.. నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసింది. గడిచిన నాలుగేళ్లలో ఉద్యాన పంటలకు రూ.423.73 కోట్లు పెట్టుబడి రాయితీని రైతుల ఖాతాల్లో జమ చేసింది. మామిడి పంట నష్టపోయిన 4,197 రైతులకూ రూ. 4.97 కోట్లు పెట్టుబడి రాయితీ అందించింది.

రబీ 2022-23 సీజన్‌కి పంటల బీమా కింద పంటలను నోటిఫై చేయలేదన్న మాటఉత్త అబద్ధమే. వైఎస్సార్ ఉచిత పంటల బీమా అమలుకు 2022-23 రబీలో ఈ- క్రాప్ నమోదు పూర్తయిన రైతుల వివరాలను కేంద్ర ప్రభుత్వానికి, బీమా కంపెనీలకు ఈ ఏడాది మార్చిలోనే పంపించింది. నేషనల్ క్రాప్ ఇన్స్యూరెన్స్ పోర్టల్‌లో నోటిఫికేషన్ డిజిటైజేషన్ కూడా పూర్తయింది. కేంద్ర ప్రభుత్వ సాంకేతిక బృందం రైతువారీ వివరాల పరిశీలన తర్వాత పీఎంఎఫ్‌బీవై పోర్టల్‌లో రబీ డేటా ప్రదర్శిస్తుంది.

పంటల బీమాను సరళతరం చేసింది కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. బీమా అన్నది రైతుకు గుది బండగా మారకుండా, బ్యాంకు రుణంతో సంబంధం లేకుండా ఈ-క్రాప్‌లో నమోదైతే చాలు ప్రతి ఎకరాకూ బీమా వర్తింపజేస్తోంది. రైతుపై భారం లేకుండా పూర్తి ప్రీమియంను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తోంది. బీమా కంపెనీలు గడువులోగా పరిహారం చెల్లించేలా పర్యవేక్షిస్తోంది. వైఎస్సార్ ఉచిత పంటల బీమాను కేంద్ర ప్రభుత్వం కూడా ప్రశంసించింది. రాష్ట్రంలో రైతులకు బీమా పరిహారాన్ని తదుపరి సీజన్ ప్రారంభానికి ముందే చెల్లిస్తోంది. మిర్చి పంటకు బీమాను గతంలో మాదిరిగానే యథాతథంగా అమలు చేస్తోంది. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద మిర్చి పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు సకాలంలో పరిహారం చెల్లిస్తోంది. 2019-20లో 58,968 మంది రైతులకు రూ.90.24 కోట్లు, 2020-21లో 19,983 మంది రైతులకు రూ.36.02 కోట్లు, 2021-22లో 70,229 మంది రైతులకు రూ.439.78 కోట్లు చెల్లించింది. 2023-24లో బీమాకు మిర్చి పంట కవరేజీపై ప్రత్యేక దృష్టి పెట్టింది.

బీమా కవరేజ్ పొందిన రైతులు, విస్తీర్ణం (లక్షల ఎకరాల్లో) ఇలా..

తెలుగుదేశం పార్టీ హయాంలో

సంవత్సరం	రైతులు (లక్షల్లో)	విస్తీర్ణం (లక్షల ఎకరాల్లో)
2014-15	4.55	15.98
2015-16	17.13	57.71
2016-17	17.79	51.10
2017-18	18.22	60.70
2018 (ఖరీఫ్)	16.68	46.35
మొత్తం	74.37	231.84

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో

సంవత్సరం	రైతులు (లక్షల్లో)	విస్తీర్ణం (లక్షల ఎకరాల్లో)
2018-19 (రబీ)	8.15	18.62
2019 - 20	27.88	51.65
2020 21	35.2	50.1
2021 - 22	41.37	87.5
2022 - 23	54.11	115.95
మొత్తం	166.71	323.82
పెరుగుదల	224.2శాతం	139.7శాతం

బీమా కవరేజ్, పరిహారం ఇలా..

తెలుగుదేశం పార్టీ పాలనలో ఐదేళ్లలో 74.37లక్షల మంది రైతులకు బీమా కవరేజ్ అయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గడిచిన నాలుగేళ్లలో 1.67 కోట్ల మంది రైతులు బీమా కవరేజ్ పరిధిలోకి వచ్చారు. టీడీపీ హయాంలో 2.32 కోట్ల ఎకరాలకు బీమా కవరేజ్ కల్పిస్తే, ఈ నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 3.24 కోట్ల ఎకరాలకు బీమా కవరేజ్ కల్పించింది. టీడీపీ హయాంలో 30.85 లక్షల మందికి రూ.3,411 కోట్ల బీమా పరిహారం ఇస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటివరకు 44.66 లక్షల మందికి రూ.6,488.84 కోట్ల బీమా పరిహారం అందజేసింది.

'రక్షణ'లేని వెబ్‌సైట్లు

- దేశంలోని రక్షణ వెబ్‌సైట్లకు సైబర్ దాడుల చీడ
- ఐదేళ్లలో 130 శాతం పెరిగిన దాడులు
- చైనా, రష్యాల నుంచే ముప్పు
- సైబర్ సెక్యూరిటీ నివేదికలో వెల్లడి

సాక్షి, అమరావతి : కొన్ని రోజుల కిందట పూణేలో రక్షణ శాఖ శాస్త్రవేత్త ప్రదీప్‌కురుల్కర్ అరెస్ట్ తీవ్ర సంచలనం సృష్టించింది. అగ్ని, ఆకాశ్ క్షిపణి పరిజ్ఞాన పరిశోధన రంగంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఆయన.. పాకిస్తాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ హనీ ట్రాప్‌లో పడ్డారు. అనంతరం రక్షణ శాఖకు చెందిన కీలక వెబ్‌సైట్లు సైబర్ దాడులకు గురయ్యాయి. ఈ ఒక్క ఉదంతమే కాదు.. ఇటీవల కాలంలో భారత దేశంలోనూ, ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వశాఖలకు చెందిన వెబ్‌సైట్లు సైబర్ దాడుల బారిన పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అందులో రక్షణ, టెలి కమ్యూనికేషన్స్ శాఖలకు చెందిన వెబ్‌సైట్లే అత్యధికంగా ఉంటుండటం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది. రక్షణ శాఖకు చెందిన డిఫెన్స్ సైబర్ ఏజెన్సీ(ఐడీఎస్ఏ) ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ సంయుక్తంగా విడుదల చేసిన 'సైబర్ సెక్యూరిటీ నివేదిక' భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా రక్షణ వెబ్‌సైట్లపై సైబర్ దాడుల ముప్పును వెల్లడిస్తోంది. దేశంలో ప్రభుత్వ వెబ్‌సైట్లపై సైబర్ దాడులు అంతకంతకూ పెరుగుతున్నాయి. ప్రధానంగా 2018 తర్వాత ఈ ముప్పు మరింత తీవ్రమవుతోంది. ఐదేళ్లలో సైబర్ దాడులు ఏకంగా 130 శాతం పెరగడం ఆందోళన కలిగిస్తోంది. 2018లో దేశంలో 2,08,456 వెబ్‌సైట్లు సైబర్ దాడులకు గురయ్యాయి. వాటిలో రక్షణ, ఇంధన, సమాచార శాఖలకు చెందిన విభాగాల వెబ్‌సైట్లపై సైబర్ దాడులు 70,798 దాకా ఉన్నాయి. కాగా, 2022లో దేశంలో 13,91,457 సైబర్ దాడులు నమోదయ్యాయి. వాటిలో రక్షణ, ఇంధన, సమాచార శాఖలకు చెందిన వెబ్‌సైట్లపై సైబర్ దాడులు ఏకంగా 1,92,439 ఉండటం గమనార్హం. భారత ప్రభుత్వ వెబ్‌సైట్లపై సైబర్ దాడులు దాదాపు చైనా, రష్యాల కేంద్ర బిందువుగానే సాగుతుండటం గమనార్హం. 50 శాతం సైబర్ నేరాల మూలస్థానం ఆ రెండు దేశాల్లోనే ఉన్నట్టుగా గుర్తించారు.

ఆసియా– పసిఫిక్ రీజియన్‌లోనే అత్యధికం

సైబర్ సెక్యూరిటీ వెంచర్స్ విడుదల చేసిన సైబర్ నేరాల నివేదిక-2022 ప్రకారం ప్రపంచవ్యాప్తంగా సైబర్ దాడుల్లో ప్రభుత్వ వెబ్‌సైట్లపై దాడులు 8.70 శాతం ఉన్నాయి. 2020 తర్వాత ప్రభుత్వ వెబ్‌సైట్లపై సైబర్ దాడులు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నాయని ఆ నివేదిక వెల్లడించింది. ఇక ప్రాంతాలవారీగా సైబర్ దాడుల్లో ఆసియా-పసిఫిక్ రీజియన్ మొదటి స్థానంలో ఉంది.

అవసరమైనంత విద్యుత్ అందిస్తాం

- భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా విద్యుత్ రంగం బలోపేతం
- అధికారులతో సమీక్షలో మంత్రి పెద్దిరెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో డిమాండ్ తగ్గట్టుగా ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు ప్రజలకు కరెంటు అందిస్తున్నాయని, ఇకమీదట కూడా ఎంత అవసరమైనా విద్యుత్‌ను సరఫరా చేస్తామని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితిపై అధికారులతో శుక్రవారం ఆయన వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా, రికార్డు స్థాయిలో 12,653 మెగావాట్ల గరిష్ట డిమాండ్‌తో 251 మిలియన్ యూనిట్ల మేర విద్యుత్ వినియోగం జరుగుతున్నా.. విద్యుత్ కోతలు విధించడం లేదని తెలిపారు. భవిష్యత్తులో పెరగనున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడం కోసం విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు.

భారీగా పెరుగుతున్న డిమాండ్

ఇంధన డిమాండ్ ఏటా పెరుగుతూ వస్తున్నదని, గతేడాది గరిష్ట డిమాండ్‌తో పోలిస్తే ఈ ఏడాది దాదాపు 27.51 శాతం పెరిగిందని మంత్రి పెద్దిరెడ్డి వెల్లడించారు. ఉదాహరణకు, 2020 మార్చి నెలలో ఇంధన డిమాండ్ 5,853.39 మిలియన్ యూనిట్లు కాగా, ఈ ఏడాది మార్చిలో నెలవారీ ఇంధన డిమాండ్ దాదాపు 16 శాతం పెరుగుదలతో 6,781.54 మిలియన్ యూనిట్లకు చేరుకుందని చెప్పారు. అదేవిధంగా, 2020 మే నెలలో సగటు రోజు డిమాండ్ 180.69 మిలియన్ యూనిట్లుకాగా, ఈ ఏడాది మే 17 వరకు సగటు రోజు డిమాండ్ 16.33 శాతం పెరుగుదలతో 210.20 మిలియన్ యూనిట్లు ఉందని ఆయన వివరించారు. ఒక్క వైజాగ్ నగరంలోనే 2018-19లో 6,696 మిలియన్ యూనిట్లు ఉన్న విద్యుత్ డిమాండ్ 2021-22లో 8,164 మిలియన్ యూనిట్లకు, అంటే 22 శాతం పెరిగిందన్నారు. ఈ విధంగా ఇంధన వినియోగం పెరగడం రాష్ట్ర ఆర్థిక ప్రగతికి సంకేతమని మంత్రి అభిప్రాయపడ్డారు. వ్యవసాయ రంగానికి 9 గంటలు పగటిపూట విద్యుత్ సరఫరా ఉచిత విద్యుత్ పథకాన్ని బలోపేతం చేయడంలో భాగంగా, ఈ ఏడాది మార్చి నాటికి రాష్ట్రంలో దాదాపు 1.20 లక్షల వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు.

విద్యుత్ శాఖ ఎల్లప్పుడూ సన్నద్ధం

పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఉత్పత్తి కోసం థర్మల్ పవర్ ప్లాంట్‌లకు బొగ్గు సరఫరాను మెరుగుపరచడానికి ప్రయత్నిస్తున్నామని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. ఈ మేరకు కేంద్ర బొగ్గు, రైల్వే మంత్రిత్వ శాఖలతో రాష్ట్ర విద్యుత్ శాఖ అధికారులు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని వివరించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా డిస్కంలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాయని, సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉన్నాయని ఆయన వివరించారు. థర్మల్ పవర్ ప్రొడక్షన్ ప్రాజెక్టులు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్ట్‌లు, పవర్ నెట్‌వర్క్ మొదలైన వాటి నుంచి విద్యుత్ ఉత్పత్తిని మరింత పెంచేందుకు ఏపీ విద్యుత్తు సంస్థలు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. మే 18న నమోదైన 251మిలియన్ యూనిట్ల డిమాండ్‌లో దాదాపు 103.294 మిలియన్ యూనిట్ల డిమాండ్‌ను ఏపీజెన్‌కో ప్లాంట్లు తీర్చాయని సంస్థ ఎండీ కేవీఎస్ చక్రధర్ బాబు తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఐ.పృథ్వీతేజ్, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మజనార్దనరెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు తదితరులు పాల్గొన్నారు.

'తుంగభద్ర' సామర్థ్యంపై మళ్లీ సర్వే

వాడివేడిగా తుంగభద్ర బోర్డు సర్వసభ్య సమావేశం

సాక్షి, అమరావతి :తుంగభద్ర డ్యామ్ నీటినిల్వ సామర్థ్యం 105.78 టీఎంసీలని అంగీకరించిన కర్ణాటక సర్కార్ తాజాగా అడ్డం తిరిగింది. మళ్లీ హైడ్రోగ్రాఫిక్ సర్వే చేయించి.. డ్యామ్ నీటినిల్వ సామర్థ్యాన్ని పక్కాగా తేల్చాలంటూ చేసిన ప్రతిపాదనకు తుంగభద్ర బోర్డు ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ ఈఎన్సీ సి. నారాయణరెడ్డి చేసిన సూచన మేరకు నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌పీ) కింద డ్యామ్ నీటినిల్వ సామర్థ్యాన్ని తేల్చే సర్వే చేపట్టాలని నిర్ణయించింది. హైదరాబాద్‌లోని జలసౌధలో చైర్మన్ డీఎం రాయ్‌పురే అధ్యక్షతన శుక్రవారం తుంగభద్ర బోర్డు 219వ సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. ఈ సమావేశంలో ఏపీ ఈఎన్సీ నారాయణరెడ్డి, తెలంగాణ ఈఎన్సీ మురళీధర్, కర్ణాటక జలవనరుల శాఖ కార్యదర్శి కృష్ణమూర్తి కులకర్ణి, బోర్డు సభ్య కార్యదర్శి నాగమోహన్ తదితరులు పాల్గొన్నారు. తుంగభద్ర డ్యామ్ నీటినిల్వ సామర్థ్యంపై 2008లో బోర్డు నిర్వహించిన అధ్యయనంలో 100.85 టీఎంసీలని తేలడంతో.. దానినే ప్రాతిపదికగా తీసుకుని 2021-22 వరకూ మూడు రాష్ట్రాలకు నీటిని పంపిణీ చేస్తూ వచ్చారు. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) మార్గదర్శకాల మేరకు ఆర్వీ అసోసియేట్స్ సంస్థ చేసిన అధ్యయనంలో.. డ్యామ్ నీటినిల్వ సామర్థ్యం 105.78 టీఎంసీలని తేలింది. బోర్డు 218వ సర్వసభ్య సమావేశంలో దీనిపై చర్చించి.. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల అంగీకారంతో 2022-23 నీటి సంవత్సరంలో నిల్వ సామర్థ్యం 105.78 టీఎంసీలను పరిగణలోకి తీసుకుని బోర్డు నీటిని పంపిణీ చేసింది. కానీ శుక్రవారం జరిగిన సమావేశంలో కర్ణాటక అధికారి కులకర్ణి అడ్డం తిరిగారు. డ్యామ్ నీటినిల్వ సామర్థ్యం 105.78 టీఎంసీలకు తాము అంగీకరించే ప్రశ్నేలేదని, మళ్లీ హైడ్రోగ్రాఫిక్ సర్వే నిర్వహించి, నిల్వ సామర్థ్యాన్ని పక్కాగా తేల్చాలని చేసిన డిమాండ్‌కు బోర్డు చైర్మన్ అంగీకరించారు.

ఎత్తిపోతలు, తాగునీటి పథకాలకు టెలీమీటర్లు..

తుంగభద్ర డ్యామ్ జలవిస్తరణ ప్రాంతంలో ఎత్తిపోతలు, పావగడ, చెళ్లకెర, మొలకాల్మూర్ తాగునీటి పథకాల ద్వారా 4.123 టీఎంసీలను వినియోగించుకుంటున్నామని కర్ణాటక చెబుతోందని.. కానీ, వాటిద్వారా అంతకంటే ఎక్కువే వాడుకుంటోందని.. ఇది దిగువ రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణల హక్కులకు విఘాతం కల్పించడమేనని రెండు రాష్ట్రాల అధికారులు తెలిపారు. కర్ణాటక వాడుకుంటున్న నీటిని టెలీమీటర్ల ద్వారా లెక్కించి చౌర్యానికి అడ్డుకట్ట వేయాలంటూ చేసిన సూచనకు బోర్డు అంగీకరించింది. నవలి రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టడానికి అనుమతివ్వాలంటూ కర్ణాటక చేసిన ప్రతిపాదనపై ఏపీ, తెలంగాణ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో బోర్డు దానిని అజెండా తొలగించింది. తుంగభద్ర డ్యామ్ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత బోర్డుపై ఉందని ఏపీ, తెలంగాణ అధికారులు స్పష్టంచేశారు. బోర్డు పరిధిలోని భూముల్లో 78 ఎకరాలను తమకు లీజుకు ఇవ్వాలన్న కర్ణాటక సర్కార్ ప్రతిపాదనను తోసిపుచ్చారు. బోర్డు సభ్య కార్యదర్శిగా ఐదేళ్లకు మించి ఒక వ్యక్తి కొనసాగడానికి నిబంధనలు అంగీకరించని నేపథ్యంలో.. దాన్ని సడలించాలన్న సభ్య కార్యదర్శి నాగమోహన్ ప్రతిపాదనను ఏపీ, తెలంగాణ అధికారులు తోసిపుచ్చారు. కర్ణాటక పరిధిలో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) ఆధునీకరణ పనులను మూడేళ్లలోగా పూర్తిచేయాలని ఏపీ ఈఎన్సీ ప్రతిపాదనకు బోర్డు అంగీకరించింది.

విచారణకు సంపూర్ణ సహకారం

- సీబీఐ విచారణకు హాజరయ్యేందుకే అవినాశ్ హైదరాబాద్ వచ్చారు
- తల్లి ఆరోగ్యం విషమంగా ఉందనే సమాచారంతో హుటాహుటిన బయల్దేరారు
- అదే విషయాన్ని సీబీఐ అధికారులకు కూడా తెలిపారు
- ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరవుతారు
- పారిపోతున్నారంటూ ఎల్లో మీడియా దుష్ప్రచారం
- వివేకాను నరికినోడు రోడ్లపై సెటిల్‌మెంట్లు.. సంబంధం లేనివారిపై వేధింపులా? : సజ్జల

సాక్షి, అమరావతి: సీబీఐ విచారణకు ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పూర్తిగా సహకరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. సీబీఐ విచారణకు హాజరయ్యేందుకే అవినాశ్‌రెడ్డి హైదరాబాద్ వెళ్లారన్నారు. అయితే తన తల్లి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం అందడంతో అదే విషయాన్ని సీబీఐ అధికారులకు తెలియచేసి పరామర్శించేందుకు హుటాహుటిన పులివెందుల బయల్దేరారని చెప్పారు. కొన్ని మీడియా సంస్థలు అత్యుత్సాహంతో దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. శుక్రవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడారు. సీబీఐ అధికారులు పిలిచిన ప్రతిసారీ వైఎస్ అవినాశ్‌రెడ్డి విచారణకు హాజరవుతున్నారని గుర్తుచేశారు. అవినాశ్ ఎక్కడికీ పారిపోవడం లేదని, తప్పించుకోవాల్సిన అవసరం ఆయనకు లేదని స్పష్టం చేశారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఆ పార్టీ నేతలు, వైఎస్ సునీత, ఎల్లో మీడియా అంతా కలిసి అవినాశ్‌పై బురద జల్లుతూ దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సీబీఐ ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరయ్యేందుకు అవినాశ్ సిద్ధంగా ఉన్నారన్నారు. వివేకానందరెడ్డిని తానే నరికానని అంగీకరించినోడేమో రోడ్డుపై తిరుగుతూ సెటిల్‌మెంట్లు చేస్తుంటే.. ఈ హత్య కేసుతో ఎలాంటి సంబంధం లేని వారిని మాత్రం వేధింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు.

మీడియా వెంబడించడం ఏమిటి?

తల్లి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు అబద్ధాలు సృష్టించాల్సిన దౌర్భాగ్యం అవినాశ్‌కు లేదంటూ ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా సజ్జల పేర్కొన్నారు. తల్లిని చూసేందుకు అవినాశ్‌రెడ్డి పులివెందుల వెళ్తుంటే ఆయన ఎక్కడికో పారిపోతున్నట్లుగా మీడియా వెంబడించడాన్ని తప్పుబట్టారు. అవినాశ్‌ను నేరస్తుడుగా చూపే ప్రయత్నం చేయడం సరికాదని హితవు పలికారు. అవినాశ్ వాహనాన్ని వెంబడిస్తున్న మీడియాపై దాడి జరగడం దురదృష్టకరమన్నారు. ఆ విషయం అవినాశ్‌కు తెలిసి ఉండకపోవచ్చన్నారు.

ప్రమేయం ఉంటే చంద్రబాబు వదిలేవారా?

వివేకా హత్య కేసులో నిజంగానే అవినాశ్‌రెడ్డి ప్రమేయం ఉంటే అప్పట్లో అధికారంలో ఉన్న చంద్రబాబు ఆయన్ను వదిలేవారా? అని సజ్జల సూటిగా ప్రశ్నించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు వివేకా హత్య కేసులో అనుమానితులను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. ఈ కేసుకు సంబంధించి చంద్రబాబు, నాడు ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్న ఏబీ వెంకటేశ్వరావుకు అన్ని విషయాలు తెలుసన్నారు. వివేకా హత్య అనంతరం రక్తపు మరకలను ఎవరు తుడిచారో, వివేకా రాసినట్లు చెబుతున్న లేఖను ఎవరు, ఎందుకు దాచారో అందరికీ తెలుసన్నారు. విచారణ పూర్తయ్యే లోపే వ్యక్తిత్వ హననానికి పాల్పడటం సరికాదని హితవు పలికారు.

అవినాశ్ తల్లికి తీవ్ర అస్వస్థత

- పులివెందుల ఆస్పత్రిలో ప్రథమ చికిత్స..
- హైదరాబాద్ తరలిస్తుండగా పరిస్థితి విషమించడంతో కర్నూలు ఆస్పత్రికి
- కార్డియాక్ ఎంజైమ్స్‌లో మార్పులు.. పరిస్థితి ఆందోళనకరం
- రెండు గంటలకు ఒకసారి పరీక్షలు చేయాలన్న వైద్యులు
- హుటాహుటిన హైదరాబాద్ నుంచి కర్నూలు చేరుకున్న అవినాశ్
- మానవత్వం లేకుండా ఎల్లో మీడియా దుష్ప్రచారం..

సాక్షి ప్రతినిధి కర్నూలు, పులివెందుల: ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి మాతృమూర్తి తీవ్ర అనారోగ్యంతో కర్నూలు విశ్వభారతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కార్డియాక్ ఎంజైమ్స్ సాధారణం కంటే ఎక్కువ ఉండటంతో ఆమె ఆరోగ్యం విషమించింది. వైద్యులు ఆమె ఆరోగ్యాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. అవినాశ్ దగ్గరుండి తల్లి బాగోగులు చూసుకుంటున్నారు. కాగా ఈ వ్యవహారంపై ఎల్లో మీడియా శుక్రవారం మధ్యాహ్నం నుంచి తప్పుడు కథనాలను ప్రసారం చేసింది. పులివెందుల భాకరాపురంలోని తమ నివాసంలో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి మాతృమూర్తి శ్రీలక్ష్మికి ఉదయం ఛాతీలో నొప్పి రావడంతో సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో స్థానికంగా ఉన్న దినేశ్ నర్సింగ్ హోంలో చేర్పించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నందున మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించాలని వైద్యులు సూచించారు. ఈ క్రమంలో ప్రత్యేక అంబులెన్స్‌లో బయలుదేరగా పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు కర్నూలులోని విశ్వభారతి ఆస్పత్రిలో చేర్పించారు. కార్డియాక్ నిపుణుడు హితేశ్‌రెడ్డి, జనరల్ ఫిజీషియన్ రవికళాధర్‌రెడ్డి పర్యవేక్షణలో శ్రీలక్ష్మికి చికిత్స అందిస్తున్నారు. రక్త పరీక్షలతో పాటు గుండెకు సంబంధించిన పరీక్షలు చేశారు. మరిన్ని పరీక్షలు చేయాల్సి రావడంతో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి తదితరులు ఆస్పత్రికి చేరుకుని పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో ఆస్పత్రికి తరలి వచ్చారు.

మానవత్వం లేకుండా వెంటాడిన వైనం

శుక్రవారం సీబీఐ విచారణకు హాజరయ్యేందుకు హైదరాబాద్‌లోని నివాసం నుంచి బయల్దేరిన ఎంపీ అవినాశ్‌రెడ్డి తన తల్లి శ్రీలక్ష్మి అనారోగ్యం గురించి తెలియడంతో దర్యాప్తు అధికారులకు న్యాయవాది ద్వారా సమాచారం అందచేసి హుటాహుటిన ప్రయాణమయ్యారు. అవినాశ్‌ను అదుపులోకి తీసుకునేందుకు సీబీఐ అధికారులు కర్నూలు పంచలింగాల చెక్‌పోస్టు వద్ద నిరీక్షిస్తున్నట్లు టీడీపీ అనుకూల మీడియా ప్రచారం చేసింది. ఎల్లో మీడియా ప్రతినిధులు చెక్‌పోస్టు వద్దే కాపుకాసి అవినాశ్ కాన్వాయ్‌ను వెంటాడారు. మధ్యాహ్నం 1.12 గంటల సమయంలో అవినాశ్ చెక్‌పోస్టు దాటి పులివెందుల మార్గంలో వెళ్లారు. అనంతరం తాడిపత్రి సమీపంలోని చుక్కలూరు వద్ద అంబులెన్స్‌లో తల్లిని చూసి అవినాశ్ కంటతడి పెట్టారు. పులివెందుల వెళ్లకుండా తిరిగి తల్లితో పాటు హైదరాబాద్ వచ్చేందుకు సిద్ధమయ్యారు.


వైఎస్ అవినాశ్‌రెడ్డి తల్లి ఆరోగ్య వివరాలను మీడియాకు వివరిస్తున్న డాక్టర్ హితేశ్‌రెడ్డి

పరిస్థితి ఆందోళనకరం

శ్రీలక్ష్మి అనారోగ్యంపై భిన్న కథనాల నేపథ్యంలో విశ్వభారతి ఆస్పత్రి గుండె వైద్య నిపుణుడు హితేశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'ఛాతీలో నొప్పి వచ్చి శ్రీలక్ష్మి కిందపడిపోయారు. లో బీపీ అని భావించి పులివెందుల ఆస్పత్రిలో చేర్పించారు. తరువాత కర్నూలు తీసుకొచ్చారు. ఈసీజీ చేస్తే మార్పులు కనిపించాయి. కొన్ని పరీక్షలు చేశాం. రిపోర్టులు రాలేదు. కార్డియాక్ ఎంజైమ్స్‌లో మార్పులు వచ్చాయి. సాధారణం కంటే ఎక్కువగా ఉన్నాయి. ఇది ఆందోళనకర పరిస్థితి. మరిన్ని పరీక్షలు చేయాల్సి ఉంది. యాంజియోగ్రామ్ కూడా చేస్తాం. ఎంజైమ్స్ పెరుగుతూ ఉన్నందున ప్రతి రెండు గంటలకు ఒకసారి పరీక్షలు చేయాలి. ప్రస్తుతం పరిస్థితి ఆందోళనకరంగా ఉంది' అని పేర్కొన్నారు.

అయితే శ్రీలక్ష్మి పరిస్థితి విషమించడంతో కర్నూలులోని విశ్వభారతి ఆస్పత్రికి తరలించారు. దీంతో ఎల్లో మీడియా మరో దుష్ప్రచారానికి తెర తీసింది. శ్రీలక్ష్మి ఆరోగ్యంగానే ఉన్నారని, సీబీఐ అరెస్టు నుంచి తప్పించుకునేందుకు అవినాశ్ ప్రయత్నిస్తున్నారంటూ మానవత్వం లేకుండా చానళ్లలో చర్చలు నిర్వహించింది.

క్లుప్తంగా...

గోవిందరాజ స్వామి ఆలయం మహా సంప్రోక్షణ ఆపలేం

- పిటిషనర్‌కు స్పష్టం చేసిన హైకోర్టు
- పిటిషన్ కొట్టివేత

సాక్షి, అమరావతి : తిరుపతి శ్రీ గోవిందరాజ స్వామి ఆలయం మహా సంప్రోక్షణను ఆపలేమని హైకోర్టు స్పష్టం చేసింది. దేవస్థానం గర్భగుడి విమాన గోపురానికి రాగి రేకులను అమర్చే విషయంలో అవినీతి జరిగిందన్న ఆరోపణలపై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యామ్నాయ మార్గాలున్నాయని చెప్పింది. విమాన గోపురంపై బంగారు పూతతో కూడిన రాగి రేకులను అమర్చే విషయంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని, అడ్వొకేట్ కమిషన్‌ను నియమించి వాస్తవాలు తేల్చేంత వరకు మహా సంప్రోక్షణ వాయిదా వేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాన్ని కొట్టేసింది. మహా సంప్రోక్షణ పూర్తయిన తరువాత కూడా డ్రోన్‌ల సాయంతో విమాన గోపురంపై రాగి రేకులను పరిశీలించవచ్చని హైకోర్టు అభిప్రాయపడింది. అందువల్ల ఈ నెల 21న తలపెట్టిన మహా సంప్రోక్షణను వాయిదా వేస్తూ ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వడం సాధ్యం కాదని తేల్చి చెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్రీభానుమతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాగి రేకులకు బంగారు పూత బదులు, బంగారు రంగు వేస్తున్నారని, 100 కేజీల స్థానంలో 50 కేజీల రేకులే ఉపయోగిస్తున్నారని తిరుపతికి చెందిన పిటిషనర్ తుమ్మా ఓంకార్ తరఫు న్యాయవాది జేవీ ఫణిదత్ తెలిపారు. ఈ పనుల కోసం గోపురంపై ఉన్న విగ్రహాలను ధ్వంసం చేశారన్నారు. టీటీడీ తరఫు సీనియర్ న్యాయవాది ఎస్. సత్యనారాయణ ప్రసాద్ ఈ వాదనలను తోసిపుచ్చారు. ఇదే అంశంపై ఇప్పటికే రెండు వ్యాజ్యాలు దాఖలై ఉన్నాయని, వాటిపై హైకోర్టు ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. మహా సంప్రోక్షణ పూర్తయిన తరువాత కూడా డ్రోన్‌ల సాయంతో గోపురంపై రాగి రేకుల ఏర్పాటును పరిశీలించవచ్చని చెప్పారు. మహా సంప్రోక్షణపై ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులను జారీ చేయవద్దని అభ్యర్థించారు.

కాచిగూడ-నర్సాపూర్ ప్రత్యేక రైలు

సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కాచిగూడ-నర్సాపూర్ (07653/07654) మధ్య స్పెషల్ ట్రైన్ నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీన అలాగే జూన్ 1న రాత్రి 8.30 గంటలకు ఈ రైలు కాచిగూడలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.35 గంటలకు నర్సాపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 26, జూన్ 2వ తేదీల్లో సాయంత్రం 6 గంటలకు నర్సాపూర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.50 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది.


బాపట్ల జిల్లాలో ఆక్వా పార్కు ఏర్పాటు వల్ల వేలాది మంది రైతులకు అనేక విధాలుగా మేలు కలగనుంది. రైతులకు స్థానికంగా అవసరమైన నాణ్యమైన సీడ్ దొరకనుంది. ప్రాసెసింగ్ యూనిట్లు కూడా అందుబాటులోకి రానుండటంతో గిట్టుబాటు ధర లభించనుంది. ఇక్కడి నుంచే విదేశాలకు ఎగుమతులు చేసే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు జిల్లాలోని రేపల్లె, నిజాంపట్నం, బాపట్ల, కర్లపాలెం, పిట్టలవారిపాలెం, చీరాల, వేటపాలెం, చిన్నగంజాం, నగరం, భట్టిప్రోలు తదితర మండలాల పరిధిలో 21,400 ఎకరాల్లో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో 2013 నుంచి వెనామీ రకం 80 శాతం సాగు చేస్తుండగా, మిగిలిన రకాలు 20 శాతం సాగు చేస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి, బాపట్ల

ఆక్వా పార్కుతో రైతుకు మరింత భరోసా

బాపట్ల జిల్లాలో రూ.185 కోట్లతో 280 ఎకరాల్లో నిర్మాణం

- ఇటీవల శంకుస్థాపన చేసిన సీఎం వైఎస్ జగన్
- అందుబాటులోకి రానున్న నాణ్యమైన సీడ్
- ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో రైతులకు గిట్టుబాటు ధరలు



ఆక్వా పార్కు ఏర్పాటు చేయనున్న స్థలం

రేపల్లె నియోజకవర్గం నిజాంపట్నం మండలంలోని పరిశావారిపాలెం వద్ద రూ.185 కోట్లతో 280 ఎకరాల్లో ఆక్వా పార్కు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. ఈ పార్కులో పీతలు, పండుగప్పలతోపాటు పలు రకాల చేపలు, రొయ్యల సీడ్‌ను ఉత్పత్తి చేయనున్నారు. ప్రస్తుతం వెనామీ, టైగర్ రొయ్యలు, పీతలు, పండుగప్పల సీడ్‌ను రైతులు తమిళనాడులోని రామేశ్వరం, రామనాథపురంతోపాటు కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి తదితర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. దీనివల్ల రవాణా ఖర్చులు అధికం కావడంతో రైతులకు ఆర్థిక భారం పెరుగుతోంది. అదేవిధంగా ప్రస్తుతం రైతుల నుంచి వ్యాపారులు రొయ్యలు, చేపలు కొనుగోలు చేసి కృష్ణపట్నం, కాకినాడ, చెన్నై ప్రాంతాలకు తీసుకువెళ్లి అక్కడే ప్రాసెసింగ్ చేసి ఎగుమతి చేస్తున్నారు. జిల్లా నుంచి ఏటా 52 దేశాలకు రూ.2వేల కోట్ల విలువైన రొయ్యలు, రూ.250 కోట్ల మేర చేపల ఎగుమతులు జరుగుతున్నాయి. అయినా స్థానికంగా ప్రాసెసింగ్ యూనిట్ లేకపోవడంతో రైతులకు గిట్టుబాటు ధరలు లభించడంలేదు. ఆక్వా పార్కు ఏర్పాటు వల్ల స్థానికంగా సీడ్ దొరకడంతోపాటు ప్రాసెసింగ్ యూనిట్లు అందుబాటులోకి వస్తాయి. దీనివల్ల రైతులకు ఖర్చులు తగ్గడంతోపాటు అధిక ధరలు లభించనున్నాయి. ఫలితంగా జిల్లాతోపాటు సమీప ప్రాంతాల్లో పదివేల ఎకరాల వరకు ఆక్వా సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

రైతులకు మరింత మేలు



మా ప్రాంతంలో ఆక్వా పార్కు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు మరింత మేలు కలుగుతుంది. ఇక్కడ రొయ్యలతోపాటు పీతలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. స్థానికంగా పీతల సీడ్ దొరకదు. తమిళనాడుకు వెళ్లాలంటే రవాణా ఖర్చు ఎక్కువగా ఉంటుంది. ఇక్కడే సీడ్ దొరికితే ఖర్చులు తగ్గుతాయి. గిట్టుబాటు ధర లభిస్తుంది.

– మోపిదేవి శివనాగేశ్వరరావు, ఆక్వా రైతు, నిజాంపట్నం

జగనన్నకు ధన్యవాదాలు



మా మండలంలో ఆక్వా పార్కు ఏర్పాటు చేస్తున్నందుకు సీఎం జగనన్నకు ధన్యవాదాలు. పార్కు వస్తే అన్ని రకాల సీడ్ దొరుకుతుంది. రవాణా ఖర్చులు మిగులుతాయి. ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడం వల్ల రైతులకు మంచి ధర లభిస్తుంది.

– కొక్కిలిగడ్డ జగదీష్, నిజాంపట్నం మండలం

గొంతు నులిమి.. తలపై కొట్టి..


ఘటనను పరిశీలిస్తున్న పోలీసులు


హతురాలు కె.రాధ (ఫైల్)

- 'ప్రకాశం'లో వివాహిత హత్య
- ఆర్థిక వివాదమే హత్యకు కారణం?
- రోడ్డు ప్రమాదంలా చిత్రీకరించేందుకే మృతదేహంపై టైరు గుర్తులు ..
- కీలక పాత్రధారి స్నేహితుడేనని అనుమానాలు
- పలు కోణాల్లో పోలీసుల దర్యాప్తు

కనిగిరి రూరల్ : ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం జిల్లెల్లపాడుకు చెందిన వివాహిత కోటా రాధ (35) బుధవారం రాత్రి హత్యకు గురైంది. ఈ కేసులో మృతురాలి స్నేహితుడు కేతిరెడ్డి కాశయ్య అలియాస్ కాశీరెడ్డి కీలక నిందితుడిగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఆర్థికపరమైన అంశాలే హత్యకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. మృతురాలి తల్లిదండ్రులు కూడా కాశయ్యపైనే ఫిర్యాదు చేశారు. వివరాలివీ.. రాధ, కాశయ్యలు స్నేహితులు. ఒకే పాఠశాలలో చదువుకున్నారు. జిల్లెల్లపాడుకు చెందిన కె. రాధకు, నల్గొండ జిల్లా కోదాడకు చెందిన మోహన్‌రెడ్డితో వివాహమైంది. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. మోహన్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, రాధ గృహిణి. అప్పటికే హైదరాబాద్‌లోనే నివాసముంటున్న కాశయ్య తాను సాఫ్ట్‌వేర్ కంపెనీ పెడుతున్నానని, దానికి నగదు కావాలంటూ వీరి వద్ద నుంచి సుమారు రూ.51 లక్షల వరకు అప్పుగా తీసుకున్నాడు. కంపెనీలో నష్టంరావడంతో అక్కడి నుంచి ఉడాయించాడు. అప్పుగా తీసుకున్న నగదు వడ్డీతో కలిపి సుమారు రూ.80 లక్షలు అయింది. అయితే, రెండేళ్ల నుంచి డబ్బులు చెల్లించకపోవడంతో తరచూ రాధ, మోహన్‌రెడ్డి ఒత్తిడి చేస్తుండటంవల్లే రాధను కాశయ్య హత్యచేశాడనే ప్రచారం సాగుతోంది.

అసలేం జరిగిందంటే..

ఈనెల 11న జిల్లెలపాడులోని చౌడేశ్వరమ్మ తిరునాళ్లకు రాధ కుటుంబీకులు హైదరాబాద్ నుంచి పుట్టింటికి వచ్చారు. అది తెలుసుకున్న కాశయ్య.. తాను ఇప్పుడు బెంగళూరులో ఉంటున్నానని, తండ్రికి, భర్తకు ఎవరికీ చెప్పకుండా కనిగిరికి వస్తే రూ.2 లక్షలు చెల్లిస్తానని ఐదురోజుల క్రితం మెసేజ్ పెట్టాడు. అయితే, రాధ వెళ్లలేదు. తిరిగి బుధవారం మరో మెసేజ్ పెట్టాడు. దీంతో రాధ అదేరోజు తన చిన్న కుమారుడిని తీసుకుని తండ్రికి చెప్పకుండా, ఇంట్లో అమ్మకు చెప్పి కనిగిరి వెళ్లింది. అక్కడ చిన్నాన్న ఇంట్లో పిల్లవాడ్ని వదిలిపెట్టింది. తర్వాత బాబాయ్‌తో వచ్చి పిల్లవాడికి దుస్తులు షాపింగ్ చేసింది. సా.6.47 గంటల సమయంలో పామూరు బస్టాండ్‌లో గల సీసీ ఫుటేజీల్లో కనిపించింది. రా.8.30 గంటల నుంచి రాధ ఫోన్ పనిచేయలేదు. నాగిరెడ్డి మృతురాలి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి అన్నిచోట్ల వెతికారు. ఫలితం లేకపోవడంతో అర్ధరాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి 12.50 గంటలకు ఫోన్ లొకేషన్ కనిపెట్టారు. అది జిల్లెల్లపాడు వద్ద కన్పించడంతో అక్కడికి వెళ్లి చూడగా రాధ విగతజీవిగా పడి ఉంది. రాధను ఒక చోటికి తీసుకెళ్లి హత్యచేసి ఆ తర్వాత మరో ప్రదేశానికి తీసుకెళ్లి పడేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రాధను హంతకులు కారులోకి ఎక్కించుకుని మత్తు మందు ఇచ్చి ఎవరూ లేని నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి చున్నీతో గొంతు నులిమి, తలపై బలంగా కొట్టి హత్యచేసి ఉంటారని ఆనవాళ్లను బట్టి తెలుస్తోంది. ఆ తర్వాత ఆమెను జిల్లెల్లపాడు క్రాస్ రోడ్డు వద్ద పడేసి దాన్ని రోడ్డు ప్రమాదంలా చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లు ప్రచారం జరుగుతోంది.

ఈనాడు కథనం అవాస్తం : డీఎస్పీ

ఈ హత్యకు సంబంధించి ఈనాడు కథనం పూర్తిగా అవాస్తమని కనిగిరి డీఎస్పీ ఆర్ రామరాజు అన్నారు. పోలీసులు జాప్యం చేశారని, సకాలంలో స్పందించలేదని రాయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పోస్టుమార్టం ప్రాథమిక నివేదికలో అత్యాచారం జరిగినట్లు వెల్లడికాలేదన్నారు. మృతురాలి తల్లిదండ్రులు కాశయ్యపై ఫిర్యాదు చేశారని, ఆ కోణంలో దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

సమర్థంగా ఏపీ విపత్తుల నిర్వహణ

- గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఎస్.ప్రకాష్‌రెడ్డి

తాడేపల్లిరూరల్ : ఆంధ్రప్రదేశ్‌లో విపత్తుల నిర్వహణ సంస్థ వినియోగిస్తున్న టెక్నాలజీ అద్భుతమని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ఎస్.ప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ అవలంభిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం గురించి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వివరించారు. స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్‌లో 24/7 వాతావరణాన్ని పర్యవేక్షించే విధానం తెలియజేశారు. తుపాన్లు, వరదలు, వడగాడ్పులు, భారీ వర్షాలు, పిడుగుపాటు హెచ్చరిక సమాచారం జిల్లా యంత్రాంగానికి, ప్రజలకు పంపించే వ్యవస్థను వివరించారు. అనంతరం ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వినియోగిస్తున్న టెక్నాలజీని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విపత్తు/అత్యవసర పరిస్థితులను సమర్థంగా నిర్వహించడానికి ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సి.నాగరాజు, వాతావరణ నిపుణులు ఎం.ఎం.అలీ, ఎస్ఈఓసి ఇన్‌చార్జి సిహెచ్.శాంతి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.


ప్రకాష్‌రెడ్డికి వివరాలు వెల్లడిస్తున్న రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్


'ప్రసాద్'లోకి రెండు ఆలయాల పరిశీలన


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి ధన్యవాదాలు


సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకంలోకి ఆంధ్రప్రదేశ్‌లోని కోటప్పకొండ, ఒంటిమిట్టలోని కోదండరామస్వామి ఆలయాలను చేర్చే ప్రతిపాదన పరిగణనలోకి తీసుకున్నందుకు కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీపార్టీ (వైఎస్సార్‌సీపీ) నేత విజయసాయిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విజయసాయిరెడ్డి ట్వీట్ చేశారు. వీలైనంత త్వరగా ప్రాజెక్టు ప్రతిపాదలను కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం పంపుతుందని పేర్కొన్నారు.

జిల్లా వార్తలు

చారిత్రక వాస్తుశిల్ప 'చిత్ర' సంపద


తాజ్‌మహల్


జామా మసీదు


ఎర్రకోట

- ఫొటో జర్నలిస్టు కేఎన్ వసీఫ్ దేశానికి ఇచ్చిన బహుమానం
- రేపు విజయవాడలో 'ఆర్కిటెక్చరల్ హెరిటేజ్' దృశ్యమాలిక పుస్తకావిష్కరణ

తెనాలి: ఆయనో ఫొటో జర్నలిస్టు.. ఉండేది ఎడారి దేశంలోనైనా ఏడాదికోసారి మేరా భారత్ మహాన్ అనుకుంటారు. రెక్కలు కట్టుకుని వాలతారు. కెమెరా క్లిక్ చేసే ప్రతిసారీ ఓ చారిత్రక కట్టడంకేసి తొంగిచూస్తారు. విశిష్టతను శోధిస్తారు. ఆ తర్వాతే దృశ్యం కెమెరా కందుతుంది. తన మనోనేత్రం గుర్తించిన అద్భుతాన్ని హృద్యంగా కెమెరా రెటీనా కందిస్తారు.. మెరిపిస్తారు. ఆయనే కేఎన్ వసీఫ్.


కాఫీ టేబుల్ బుక్ రూపకల్పన

భారతదేశంలోని అద్భుతమైన ఆర్కిటెక్చరల్ హెరిటేజ్‌ను దాదాపు పదేళ్లకుపైగా తన కెమెరాతో క్లిక్ మనిపిస్తున్న వసీఫ్ దాదాపు 35 వాస్తు కట్టడాలకు సంబంధించిన 150 ఫొటోలతో అద్భుతమైన కాఫీ టేబుల్ బుక్‌ను రూపొందించారు. భారతీయ ఆత్మ అనదగ్గ ఫొటోలతో కూడిన ఈ పుస్తకాన్ని మన దేశంలో తొలిసారిగా ఈనెల 21న విజయవాడ నగరంలో ఆవిష్కరించనున్నారు. ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా (పీఏఐ) ఆధ్వర్యంలో బెజవాడ ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో ఉదయం 11 గంటలకు ఏర్పాటయే సభలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అకడమిక్ ఎఫైర్స్ డీన్ ప్రొఫెసర్ ఈదర శ్రీనివాసరెడ్డి ఆవిష్కరిస్తారు. ఐఏఎస్ అధికారి, ఏపీ స్టేట్ మైనార్టీస్ వెల్ఫేర్ డైరెక్టర్ ఎ.ఎండీ ఇంతియాజ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని పీఏఐ వ్యవస్థాపక చైర్మన్ తమ్మా శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఎన్నో కట్టడాలకు పుస్తకంలో చోటు

వైవిధ్యం, గొప్ప వారసత్వం, అద్భుతమైన గతం భారతదేశం ప్రత్యేకత. మధ్యయుగం మొఘల్ పాలకుల నుంచి బ్రిటిష్ రాచరికపు వ్యవస్థ వరకు దేశంలో నిర్మాణమైన కోటలు, స్మారక కట్టడాలు, రాజభవనాలు దేశ వారసత్వ సంపదకు ప్రతీకలని తెలిసిందే. ఢిల్లీ ఎర్రకోట, ఆగ్రాలోని తాజ్‌మహల్, కుతుబ్‌మినార్, హుమాయున్ సమాధి, అజంతా, ఎల్లోరా నిర్మాణాల నుంచి హైదరాబాద్‌లోని చార్మినార్ వరకు వేటికవే ప్రత్యేకమైన కట్టడాలు. నిర్మాణ శైలి, వినియోగించిన శిలలు, రాళ్లు.. అన్ని విభిన్నమైనవే. రాజా దీనదయాళ్ తీసిన ఫొటోల్లో నాలుగొందల ఏళ్లకు పైబడిన భాగ్యనగరంలోని చారిత్రక స్థలాల్నీ, నిజాం నవాబుల జీవితాన్నీ ఇప్పటికీ చూడగలుగుతున్నాం. ఆ తరహాలోనే భారతదేశ అద్భుత ఆర్కిటెక్చరల్ హెరిటేజ్‌కు ప్రతిరూపాలనదగ్గ చిత్రరాజాలను ఇప్పుడు వసీఫ్ మనముందుకు తీసుకొస్తున్నారు.

వసీఫ్ నేపథ్యం ఇదీ..



కేఎన్ వసీఫ్ స్వస్థలం హైదరాబాద్. ప్రస్తుతం సౌదీఅరేబియాలోని రియాద్‌లో ఉంటున్నారు. అక్కడి ఆర్కిటెక్చరల్ మేగజైన్ 'ఆల్బెనా'తో రెండు దశాబ్దాల అనుబంధం. రియాద్‌కు వెళ్లే ముందు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు స్టాఫ్ ఫొటోగ్రాఫర్‌గా దశాబ్దంపాటు పనిచేశారు. ఫొటో జర్నలిస్టుగా 'సియాసత్' ఉర్దూ డైలీలో చేశారు. తర్వాత డెక్కన్ క్రానికల్, ఇలస్ట్రేటెడ్ వీక్లీ, ఇండియా టుడే, సావీ, సొసైటీ, ఆన్‌లుకర్ వంటి పత్రికలకు పనిచేశారు. వసీఫ్ కృషిని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫొటోగ్రఫీ, ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ సొసైటీ, ఏపీ ఫొటోగ్రాఫిక్ అకాడమీలు గుర్తించాయి. 1998 నుంచి ఏటా ఒక నెలరోజులు భారతదేశం వస్తూ ఇక్కడ ఫొటో షూట్‌లను షెడ్యూల్ చేస్తున్నారు. భారతీయ ఆర్కిటెక్చర్‌లోని వివిధ శైలులను డాక్యుమెంట్ చేస్తున్నారు. 2005లో తొలిసారిగా జెద్దాలోని ఇండియన్ కాన్సులేట్‌లో జరిగిన భారతీయ ఉత్సవంలో భారతదేశ వారసత్వ ఫొటోలను ఎగ్జిబిట్ చేసే అవకాశాన్ని అక్కడి కాన్సులేట్ ఔసార్ సయీద్ కల్పించినట్టు వసీఫ్ చెప్పారు. అప్పటి నుంచి సౌదీ అరేబియాలోని వివిధ నగరాల్లో, రియాద్, జెద్దా కాన్సులేట్‌తో కలిసి ఫొటో ప్రదర్శనలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆవిధంగా గల్ఫ్ దేశాల్లోని లక్షలాది భారతీయుల్లో దేశీయ పర్యాటకంపై ఆసక్తిని రేకెత్తిస్తున్నారు. భారతీయ చారిత్రక కట్టడాలపై పలు లఘు చిత్రాలనూ తీశారాయన.

సీపెట్‌లో డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

పరీక్ష ఫీజు చెల్లింపుకు ఈనెల 28వ తేదీ తుది గడువు

గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడలోని కేంద్ర పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్)లో 2023–24 విద్యాసంవత్సరానికి డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తుల్ని కోరుతున్నట్లు సంస్థ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్. శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ) కోర్సుల్లో ప్రవేశానికి టెన్త్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. రెండేళ్ల వ్యవధి గల పీజీ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ–పీపీటీ) కోర్సుకు బీఎస్సీలో ఉత్తీర్ణులైన వారితోపాటు ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలియజేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250, ఓబీసీ, జనరల్ విద్యార్థులు రూ.500 చొప్పున డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీపీఈటీ.జీవోవీ.ఇన్ ద్వారా ఈనెల 28వ తేదీలోపు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూన్ 11న జరగనున్న సీపెట్ ఆన్‌లైన్ అడ్మిషన్ టెస్టు–2023 ద్వారా ప్రవేశాలు కల్పించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వ జ్ఞానభూమి వెబ్‌సైట్ ద్వారా నిబంధనలను అనుసరించి అర్హులైన విద్యార్థులకు ఫీజు రీ–యింబర్స్‌మెంట్ సదుపాయం వర్తిస్తుందని తెలిపారు. ఆయా కోర్సులకు ప్లాస్టిక్, అనుబంధ సంస్థల్లో క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా దేశ, విదేశాల్లోని ప్లాస్టిక్ వస్తువుల తయారీ, మౌల్డ్ తయారీ, టెస్టింగ్, నాణ్యత నిర్ధారణ రంగాల్లో మంచి ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. ఆసక్తి గలవారు ఇతర సమాచారానికి బి. అంజినాయక్‌ను 78935 86494 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

● సేవకు సత్కారం


ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా పని చేస్తున్న గ్రామ, వార్డు వలంటీర్లకు శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవార్డులు ప్రదానం చేశారు. జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాల్, ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ కల్పలత, విజయవాడ పశ్చిమ, సెంట్రల్ ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు తదితరులు ఉన్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

చదివేది డిగ్రీ.. చేసేది బైక్ చోరీలు

నరసరావుపేట టౌన్: డిగ్రీ చదువుతూ చెడు వ్యసనాలకు బానిసై ద్విచక్ర వాహన దొంగతనాలకు పాల్పడుతున్న విద్యార్థిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 8 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ అశోక్ కుమార్ తెలిపారు. శుక్రవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చిలకలూరిపేట మద్దినగర్‌కు చెందిన షేక్ ఖాలీషా నరసరావుపేట పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ ఫస్టియర్ చదువుతూ ఆ కళాశాల హాస్టల్‌లో ఉంటున్నాడు. రెండు నెలల క్రితం అతని స్నేహితుడి వద్ద కారు తీసుకొని శావల్యాపురం తిరునాళ్లకు వెళ్లి తిరిగి వస్తుండగా యాక్సిడెంట్ అయింది. కారు రిపేరు చేసేందుకు రూ.50 వేలు ఖర్చు అవుతుందని వాటిని ఇవ్వాలని యజమాని ఒత్తిడి తెస్తున్నాడు. డబ్బు కోసం ఖాలీషా బైక్ చోరీల మార్గం ఎంచుకున్నాడు. రోజు రాత్రిళ్లు పట్టణంలో సంచరిస్తూ ద్విచక్రవాహనాలను అపహరిస్తున్నాడు. రామిరెడ్డిపేట రాధాసుందర కల్యాణ మండపం, సన్నిధి ఫంక్షన్ హాల్ వద్ద నిలిపి ఉన్న 8 ద్విచక్ర వాహనాలను దొంగిలించి రైల్వే స్టేషన్ వెనుక భాగంలో ముళ్ల పొదల్లో వాటిని దాచాడు. వాటిల్లో ఒక వాహనంపై సంచరిస్తూ శుక్రవారం ఆర్‌యూబీ వద్ద తనిఖీలు చేస్తున్న సమయంలో పట్టుబడ్డాడు. వాహనాలు స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

శాస్త్ర విజ్ఞానమే ఇంద్రజాలం


ఇంద్రజాలాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): సైన్స్ ప్రాముఖ్యతను తెలియజేస్తూ మూఢాచారాలతో స్వాములు చేసే మోసాలను బయటపెట్టే శాస్త్ర విజ్ఞానమే ఇంద్రజాలమని అమరావతి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావు అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 5వ తేదీ నుంచి 15 రోజుల పాటు ప్రముఖ మెజీషియన్ క్రాంతికార్ పర్యవేక్షణలో మ్యాజిక్‌లో శిక్షణ పొందిన 72 మంది బాలబాలికలు మ్యాజిక్ ప్రదర్శించారు. బాలబాలికలు ప్రదర్శించిన ఇంద్రజాలం అలరించింది. 72 మంది చిన్నారుల మ్యాజిక్ ప్రదర్శనతో ప్రేక్షకులు మంత్ర ముగ్ధులయ్యారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ అడగగానే పిల్లలకు మ్యాజిక్ నేర్పించిన క్రాంతికార్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బాలబాలికలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో తాడేపల్లి అమరావతి బాలోత్సవం ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, వాసవ్య మహిళా మండలి కార్యదర్శి జి.రష్మి, కార్డియాలజిస్ట్ డాక్టర్ కాగిత కృష్ణచంద్, గాదె సుబ్బారెడ్డి, యూ.వి. రామరాజు, ఐజాక్ న్యూటన్ తదితరులు పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని బంధం

- ఒకేరోజు తనువు చాలించిన సీఎస్సార్ మాస్టారు దంపతులు


సుబ్రహ్మణ్యేశ్వరరావు (ఫైల్)


పుష్ప లీలావతి (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: అరవై ఏళ్ల వైవాహిక జీవితంలో ఎప్పుడు ఎడబాటు అనేది లేదు. ఒకరిని విడిచి, ఒకరు ఉండలేని బంధం వారిది. అందుకే ఎనిమిది పదుల వయసులో భర్త మరణాన్ని భరించలేని ఆ ఇల్లాలు పతి అంత్యక్రియలు పూర్తయిన కొద్దిసేపటికే తనూ తనువు చాలించింది. ఈ హృదయవిదారక ఘటన గురువారం గుంటూరులో జరిగింది. గుంటూరు నగరంలోని చౌత్రా సెంటర్లో నివసిస్తున్న చుండూరు సుబ్రహ్మణ్యేశ్వరరావు సంగడిగుంటలోని జీసీఎస్ఎస్ జూనియర్ కాలేజీ హైస్కూల్ (చలమయ్య హైస్కూల్)లో 1966 నుంచి గణిత శాస్త్ర ఉపాధ్యాయునిగా పని చేసి 1993లో ఉద్యోగ విరమణ చేశారు సీఎస్సార్ మాస్టారుగా సుపరిచితులైన ఆయన బోధనా పటిమతో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. ఆయన వద్ద చదువుకున్నవారు వివిధ రంగాల్లో ఉన్నతస్థాయిల్లో స్థిరపడ్డారు. 88 ఏళ్ల వయసులో అనారోగ్యంతో ఈనెల 18న ఉదయం గుంటూరులోని తన స్వగృహంలో ఆయన తుది శ్వాస విడిచారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఆయన భౌతికకాయానికి అదే రోజు సాయంత్రం అంత్యక్రియలు పూర్తి చేశారు. భర్త అంత్యక్రియలు పూర్తి చేసిన కొద్ది సేపటికే ఆయన సతీమణి పుష్పలీలావతి (83) భర్త వియోగాన్ని భరించలేక మానసిక వేదనతో తనువు చాలించారు. వీరికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సుబ్రహ్మణ్యేశ్వరరావు మాస్టారు వద్ద చదువుకున్న పూర్వ విద్యార్థి, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి గురువారం గురువు, శుక్రవారం ఉదయం గురుపత్నీ పుష్పలీలావతి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన తమ గురువు సుబ్రహ్మణ్యేశ్వరరావు వద్ద చదువుకున్న రోజులను, ఆయన అందించిన నిస్వార్థ సేవలను గుర్తు చేసుకున్నారు.



ప్రపంచ టీటీ చాంపియన్‌షిప్ బరిలో శ్రీజ

జాతీయ చాంపియన్, తెలంగాణ క్రీడాకారిణి ఆకుల శ్రీజ ప్రతిష్టాత్మక ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) వ్యక్తిగత చాంపియన్‌షిప్ పోటీలకు సిద్ధమైంది. దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో నేడు ఈ మెగా టోర్నీ మొదలుకానుంది. నేడు జరిగే మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో నికోలా అర్లియా (ఇటలీ)తో శ్రీజ తలపడుతుంది. శనివారమే జరిగే డబుల్స్ తొలి రౌండ్‌లో గయా మొన్ఫార్డిని-నికోల్ అర్లియా (ఇటలీ)లతో శ్రీజ-దియా చిటాలె (భారత్) ఆడతారు. డబుల్స్ తొలి రౌండ్‌లో గెలిస్తే రెండో రౌండ్‌లో టాప్ సీడ్ సన్ యింగ్షా-వాంగ్ మాన్యు (చైనా)లతో శ్రీజ-దియా తలపడతారు.

హారిక ఖాతాలో మరో 'డ్రా'

మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక వరుసగా మూడో 'డ్రా' నమోదు చేసింది. సైప్రస్‌లో 12 మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య 11 రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. ప్రపంచ మాజీ విజేత అలెగ్జాండ్రా కొస్టెనిక్ (స్విట్జర్లాండ్)తో జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌ను తెల్లపావులతో ఆడిన హారిక 35 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. నాలుగో రౌండ్ తర్వాత హారిక 2.5 పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో ఉంది.



గెలిస్తే ప్లే ఆఫ్ దశకు...

ఐపీఎల్‌లో నేడు కీలక మ్యాచ్‌లు
ఢిల్లీ x చెన్నై (మధ్యాహ్నం గం. 3:30 నుంచి)
కోల్‌కతా x లక్నో (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం


కృనాల్ పాండ్యా, డికాక్

- చెన్నై ఖాతాలో ప్రస్తుతం 15 పాయింట్లు ఉన్నాయి. ఢిల్లీ వేదికగా జరిగే తమ చివరి మ్యాచ్‌లో గెలిస్తే చెన్నై 17 పాయింట్లతో, ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తుంది. అయితే రెండో స్థానమా, మూడో స్థానమా అనేది రాత్రి జరిగే తర్వాతి మ్యాచ్‌తో ఖరారవుతుంది. చెన్నై ఓడిపోతే మాత్రం ఆదివారం జరిగే మ్యాచ్‌ల ఫలితాల కోసం ఎదురు చూడాల్సి ఉంటుంది. ఎప్పుడో ప్లే ఆఫ్స్‌కు దూరమైన ఢిల్లీ క్యాపిటల్స్ గెలిచినా ఆ జట్టుకు ప్రయోజనం ఏమీ ఉండదు. అయితే సీజన్‌లో ఆఖరి స్థానం నుంచి తప్పించుకునేందుకు ఇదో అవకాశం.
- లక్నో ఖాతాలో ప్రస్తుతం 15 పాయింట్లు ఉన్నాయి. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగే మ్యాచ్‌లో గెలిస్తే 17 పాయింట్లతో లక్నో కూడా ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించడం ఖాయం. పైగా చెన్నై మ్యాచ్ ముగిసిపోతుంది కాబట్టి ఎంత తేడాతో గెలిస్తే రెండో స్థానం దక్కుతుందనేది కూడా తెలుస్తుంది. ఓడితే చెన్నైలాగే ఆదివారం మ్యాచ్ ఫలితాల కోసం ఎదురు చూడక తప్పదు. కోల్‌కతా సాంకేతికంగా నిష్క్రమించకపోయినా... గెలిచి 14 పాయింట్లతో చేరడంతో పాటు –0.256 నుంచి రన్‌రేట్‌ను భారీగా మెరుగుపర్చుకొని పోటీలో నిలవడం దాదాపు అసాధ్యం!

27న బీసీసీఐ 'ప్రత్యేక' సమావేశం

న్యూఢిల్లీ: కీలక అంశాలే అజెండాగా ఈ నెల 27న భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రత్యేక సర్వసభ్య సమావేశం (ఎస్‌జీఎం) నిర్వహించనుంది. అహ్మదాబాద్‌లో జరిగే ఈ మీటింగ్‌లో ప్రధానంగా ఐదు అంశాలపై బోర్డు చర్చించనుంది.

వర్కింగ్ గ్రూప్: ఈ ఏడాది సొంతగడ్డపై జరిగే వన్డే ప్రపంచకప్ కోసం వర్కింగ్ గ్రూప్ నియామకంపై ఎస్‌జీఎంలో కసరత్తు చేస్తారు. ఇందులో ఉండాల్సిన సభ్యులు, అప్పగించాల్సిన బాధ్యతలపై చర్చిస్తారు.

డబ్ల్యూపీఎల్‌కు నిర్దిష్టమైన షెడ్యూల్: మహిళల లీగ్‌కు ఐపీఎల్‌లాగే క్రేజ్ పెంచేందుకు అంతర్జాతీయ స్టార్ క్రికెటర్లు అందుబాటులో ఉండే వీలైన, మేలైన నిర్దిష్ట షెడ్యూల్‌పై దృష్టి సారిస్తారు.

లైంగిక వేధింపుల నిరోధక కమిటీ: అప్పట్లో బోర్డు మాజీ సీఈఓ రాహుల్ జోహ్రిపై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చినపుడు కమిటీ వేసి నిగ్గుతేల్చారు. అయితే ఇప్పుడు బోర్డులో పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

రాష్ట్ర జట్లకు ఫిజియోలు: దేశవాళీ ఆటగాళ్ల ఫిట్‌నెస్ కోసం రాష్ట్ర జట్లకు నాణ్యమైన ఫిజియోలను, ట్రెయినర్లను నియమించాలని ఇందుకోసం ఎన్‌సీఏ సర్టిఫైడ్ సిబ్బందిని తీసుకోనుంది.

మౌలిక వసతులపై: మౌలిక వసతుల అభివృద్ధి, సబ్సిడీ సబ్-కమిటీల నియామకంపై ఎస్‌జీఎంలో చర్చించనున్నారు.

దేశం కోసం పతకం... పతకం కోసం సర్వస్వం...

బ్రిజ్‌భూషణ్ వ్యాఖ్యలపై రెజ్లర్ల కౌంటర్



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ రెజ్లర్లు సాధించిన పతకాలకు వెలకట్టడంపై స్టార్ రెజ్లర్లు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రెజ్లర్ల పతకాలు 15 రూపాయలు కూడా విలువ చేయవని, పతకాలు తిరిగివ్వడం కాదు... రూ.కోట్లలో పొందిన ప్రోత్సాహకాల్ని తిరిగివ్వాలని బీజేపీ ఎంపీ కూడా అయిన బ్రిజ్‌భూషణ్ అన్నారు. దీనిపై జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తున్న ఒలింపిక్ మెడలిస్ట్ బజరంగ్ పూనియా మాట్లాడుతూ 'ఆ పతకం ఛారిటీలో బ్రిజ్‌భూషణ్ ఇచ్చింది కాదు. నేను దేశం కోసం శ్రమిస్తే వచ్చింది. దాని కోసం రాత్రనక పగలనక మా రక్తం ధారపోశాం. ఏళ్ల తరబడి చెమట చిందించాం. దానికి వెలకట్టే అర్హత అతనికి లేనేలేదు' అని అన్నాడు. మరో రెజ్లర్ సాక్షి మలిక్ కూడా అంతే స్థాయిలో ధ్వజమెత్తింది. బ్రిజ్‌భూషణ్‌కు కనపడిన 15 రూపాయల పతకం కోసమే సర్వస్వాన్ని ధారపోశామని చెప్పింది. అతని వ్యాఖ్యలు సిగ్గుచేటని, క్రీడాలోకం ముక్తకంఠంతో ఖండించాలని సూచించింది. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజభూషణ్‌ను అరెస్టు చేయాలని రెజ్లర్లంతా నెలరోజులుగా నిరసన చేస్తున్నారు.

విజయంతో ముగించిన రాజస్తాన్

- 4 వికెట్లతో పంజాబ్ కింగ్స్‌పై గెలుపు
- రాణించిన యశస్వి, పడిక్కల్


దేవదత్ పడిక్కల్

ధర్మశాల: మాజీ చాంపియన్ రాజస్తాన్ రాయల్స్ సాంకేతికంగా ఇంకా 'ప్లే ఆఫ్స్' రేసులోనే ఉంది. తమ చివరి మ్యాచ్‌లో గెలిచిన ఆ జట్టు 14 పాయింట్లతో ప్రస్తుతం ఐదో స్థానంలో నిలిచింది. లీగ్ దశలో తమ పని పూర్తి చేసుకున్న ఆ జట్టు అవకాశాలు ఆదివారం జరిగే మ్యాచ్‌ల ఫలితాలపై ఆధారపడి ఉన్నాయి. శుక్రవారం జరిగిన పోరులో రాయల్స్ 4 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. స్యామ్ కరన్ (31 బంతుల్లో 49 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), జితేశ్ శర్మ (28 బంతుల్లో 44; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), షారుఖ్ ఖాన్ (23 బంతుల్లో 41 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం రాజస్తాన్ 19.4 ఓవర్లలో 6 వికెట్లకు 189 పరుగులు సాధించి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దేవదత్ పడిక్కల్ (30 బంతుల్లో 51; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), యశస్వి జైస్వాల్ (36 బంతుల్లో 50; 8 ఫోర్లు), హెట్‌మైర్ (28 బంతుల్లో 46; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) విజయంలో కీలకపాత్ర పోషించారు.

కీలక భాగస్వామ్యాలు...

ఇన్నింగ్స్ రెండో బంతికే ప్రభ్‌సిమ్రన్ (2)ను చక్కటి రిటర్న్ క్యాచ్‌తో అవుట్ చేసి బౌల్ట్ రాజస్తాన్‌కు శుభారంభం అందించగా, కొద్ది సేపటికే పంజాబ్ మరో మూడు కీలక వికెట్లు కోల్పోయింది. 12 పరుగుల వ్యవధిలో అథర్వ తైడే (19), శిఖర్ ధావన్ (17), లివింగ్‌స్టోన్ (9) అవుటయ్యారు. దాంతో స్కోరు 50/4 వద్ద నిలిచింది. ఈ దశలో కరన్‌తో కలిసి జితేశ్ జట్టును ఆదుకున్నాడు. సందీప్ ఓవర్లో 2 సిక్స్‌లు కొట్టిన జితేశ్, ఆ తర్వాత సైనీ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ బాదాడు. కానీ అదే ఓవర్లో అతను వెనుదిరిగాడు. జితేశ్ అవుటయ్యాక 15 నుంచి 18వ ఓవర్ వరకు 24 బంతుల్లో పంజాబ్ 26 పరుగులే చేయగలిగింది. అయితే చివరి రెండు ఓవర్లలో కరన్, షారుఖ్ మెరుపు బ్యాటింగ్ కారణగా ఆ జట్టు మెరుగైన స్కోరు నమోదు చేయగలిగింది. చహల్ వేసిన 19వ ఓవర్లో ఇద్దరు బ్యాటర్లు కలిసి 3 సిక్స్‌లు, 2 ఫోర్లు సహా 28 పరుగులు రాబట్టగా... బౌల్ట్ వేసిన ఆఖరి ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్‌తో మొత్తం 18 పరుగులు వచ్చాయి. వీరిద్దరు ఆరో వికెట్‌కు 37 బంతుల్లో అభేద్యంగా 73 పరుగులు జోడించారు.

సామ్సన్ విఫలం...

జోస్ బట్లర్ ఈ సీజన్‌లో ఐదోసారి 'డకౌట్'కాగా... యశస్వి, పడిక్కల్ భాగస్వామ్యం రాజస్తాన్‌ను మెరుగైన స్థితికి చేర్చింది. కరన్ వేసిన తొలి ఓవర్లో యశస్వి 3 ఫోర్లు కొట్టగా, రబడ ఓవర్లో పడిక్కల్ వరుసగా 6, 4 బాదడంతో పవర్‌ప్లేలో స్కోరు 57 పరుగులకు చేరింది. 29 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న వెంటనే పడిక్కల్ వెనుదిరగడంతో 73 పరుగుల (49 బంతుల్లో) రెండో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. సామ్సన్ (2) ప్రభావం చూపలేకపోగా, 35 బంతుల్లో యశస్వి హాఫ్ సెంచరీ సాధించాడు. అయితే గెలుపు దిశగా హెట్‌మైర్‌దే కీలకపాత్ర. ప్రతీ బౌలర్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ అతను బౌండరీలతో పరుగులు రాబట్టాడు. రబడ ఓవర్లో పరాగ్ (12 బంతుల్లో 20; 1 ఫోర్, 2 సిక్స్‌లు) వరుసగా రెండు సిక్సర్లు కొట్టడంతో రాయల్స్ విజయానికి చేరువైంది. 19వ ఓవర్లో ముగిస్తే బెంగళూరు రన్‌రేట్‌ను దాటే అవకాశం ఉండగా... హెట్‌మైర్ అవుట్‌తో అది సాధ్యం కాలేదు. చివరకు మరో రెండు బంతులు మిగిలి ఉండగా రాజస్తాన్ గెలిచింది.

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ (సి అండ్ బి) బౌల్ట్ 2; ధావన్ (ఎల్బీ) (బి) జంపా 17; అథర్వ (సి) పడిక్కల్ (బి) సైనీ 19; లివింగ్‌స్టోన్ (బి) సైనీ 9; స్యామ్ కరన్ (నాటౌట్) 49; జితేశ్ (సి) (సబ్) ఫెరీరా (బి) సైనీ 44; షారుఖ్ (నాటౌట్) 41; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం** (20 ఓవర్లలో 5 వికెట్లకు) 187. **వికెట్ల పతనం:** 1-2, 2-38, 3-46, 4-50, 5-114. **బౌలింగ్:** బౌల్ట్ 4-0-35-1, సందీప్ శర్మ 4-0-46-0, సైనీ 4-0-40-3, జంపా 4-0-26-1, చహల్ 4-0-40-0.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి) (సబ్) రిషి ధావన్ (బి) ఎలిస్ 50; బట్లర్ (ఎల్బీ) (బి) రబడ 0; పడిక్కల్ (సి) బ్రార్ (బి) అర్ష్‌దీప్ 55; సంజూ సామ్సన్ (సి) (సబ్) రిషి ధావన్ (బి) చహర్ 2; హెట్‌మైర్ (సి) శిఖర్ ధావన్ (బి) కరన్ 46; పరాగ్ (సి) అథర్వ (బి) రబడ 20; ధ్రువ్ జురేల్ (నాటౌట్) 10; బౌల్ట్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం** (19.4 ఓవర్లలో 6 వికెట్లకు) 189. **వికెట్ల పతనం:** 1-12, 2-85, 3-90, 4-137, 5-169, 6-179. **బౌలింగ్:** స్యామ్ కరన్ 4-0-46-1, రబడ 4-0-40-2, అర్ష్‌దీప్ 4-0-40-1, ఎలిస్ 4-0-34-1, రాహుల్ చహర్ 3.4-0-28-1.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	13	9	4	0	18	0.835
చెన్నై	13	7	5	1	15	0.381
లక్నో	13	7	5	1	15	0.304
బెంగళూరు	13	7	6	0	14	0.180
రాజస్తాన్	14	7	7	0	14	0.148
ముంబై	13	7	6	0	14	-0.128
కోల్‌కతా	13	6	7	0	12	-0.256
పంజాబ్	14	6	8	0	12	-0.304
ఢిల్లీ	13	5	8	0	10	-0.572
హైదరాబాద్	13	4	9	0	8	-0.558

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

పసిడి పతక పోరుకు జ్యోతి సురేఖ–ఓజస్ జోడీ

ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-2 టోర్నీ



షాంఘై: వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో ఆకట్టుకోలేకపోయిన భారత స్టార్ ఆర్చర్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ మిక్స్‌డ్ టీమ్ కాంపౌండ్ విభాగంలో మెరిసింది. భారత్‌కే చెందిన ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలెతో కలిసి మిక్స్‌డ్ టీమ్ విభాగంలో పోటీపడిన జ్యోతి సురేఖ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన ప్రపంచకప్ స్టేజ్-2 మిక్స్‌డ్ టీమ్ సెమీఫైనల్లో సురేఖ-ఓజస్ ద్వయం 'షూట్ ఆఫ్'లో ఎలీసా రోనర్-ఇలియా ఫ్రాగ్నన్ (ఇటలీ) జోడీపై గెలిచింది. నిర్ణీత 16 బాణాల తర్వాత రెండు జోడీలు 157–157తో సమఉజ్జీగా నిలిచాయి. 'షూట్ ఆఫ్'లోనూ రెండు జోడీలు 19–19తో సమంగా నిలిచాయి. అయితే భారత ఆర్చర్లు కొట్టిన బాణాలు కేంద్ర బిందువుకు అతిసమీపంగా ఉండటంతో విజయాన్ని ఖరారు చేసుకున్నారు. నేడు జరిగే ఫైనల్లో ఓ యుహూన్-కిమ్ జాంగ్‌హో (కొరియా)లతో సురేఖ-ఓజస్ తలపడతారు. పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ ధీరజ్ బొమ్మదేవర క్వార్టర్ ఫైనల్లో 0–6తో ఓ జిన్ హైక్ (కొరియా) చేతిలో ఓడిపోయాడు.


సహజ పరాజయం



కాట్రెటి (జార్జియా): అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి సహజ యామలపల్లి పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సహజ 4–6, 3–6తో దెజానా రాడనోవిచ్ (సెర్బియా) చేతిలో ఓడిపోయింది. గంటా 50 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఆరుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది.

సినిమా

రజనీకాంత్ చివరి చిత్రం అదేనా?


రజనీకాంత్

సూపర్‌స్టార్ రజనీకాంత్ ఫుల్ స్వింగ్‌లో ఉన్నారు. ఏడు పదుల వయసులోనూ ఆయన వరుస సినిమాలతో దూసుకెళుతున్నారు. అయితే లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో చేయనున్నది రజనీకాంత్ ఆఖరి చిత్రం అవుతుందేమో? అని తాజాగా ఓ ఇంటర్వ్యూలో తమిళ దర్శకుడు-నటుడు మిస్కిన్ చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అయ్యాయి. దీనిపై సూపర్‌స్టార్ ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న 'జైలర్' షూటింగ్ పూర్తి చేసిన రజనీకాంత్ ప్రస్తుతం తన కుమార్తె ఐశ్వర్య దర్శకత్వం వహిస్తున్న 'లాల్ సలామ్' చిత్రీకరణలో పాల్గొంటున్నారు. ఆ తర్వాత తన 170వ సినిమాని 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ రాజా దర్శకత్వంలో చేస్తారు రజనీ. ఆ తర్వాత 171వ సినిమాని 'తలైవర్ 171' (వర్కింగ్ టైటిల్)ని లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో చేయనున్నారట రజనీకాంత్. ప్రస్తుతం లోకేశ్ కనకరాజ్ దర్శకత్వం వహిస్తున్న 'లియో' సినిమాలో డైరెక్టర్ మిస్కిన్ కీలక పాత్రలో నటిస్తుండటం విశేషం. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో మిస్కిన్ మాట్లాడుతూ– ''లోకేశ్ కనకరాజ్ డైరెక్షన్‌లో చేసేందుకు రజనీ సార్ ఆసక్తిగా ఉన్నారు. ఆయనే స్వయంగా లోకేశ్‌ను తన 171వ సినిమా గురించి అడిగారు. బహుశా ఇదే రజనీకాంత్‌గారికి చివరి సినిమా కావచ్చు. ఆ తర్వాత ఆయన సినిమాలకు బ్రేక్ ఇస్తారేమో!'' అన్నారు. కాగా మిస్కిన్ వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారాయి. అయితే సినిమాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలనే నిర్ణయాన్ని రజనీకాంత్ తీసుకోరంటూ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెడుతున్నారు.

హనుకి గ్రీన్ సిగ్నల్?


ప్రభాస్

ప్రస్తుతం 'సలార్', 'ప్రాజెక్ట్ కె', 'రాజా డీలక్స్' (వర్కింగ్ టైటిల్) సినిమాలతో బిజీగా ఉన్నారు ప్రభాస్. ఆ సినిమా చిత్రీకరణలు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో కొత్త సినిమాల కోసం కథలు వింటున్నారట ప్రభాస్. ఇందులో భాగంగా దర్శకుడు హను రాఘవపూడి చెప్పిన ఓ కథ ప్రభాస్‌కు నచ్చిందని, ఈ కథకు ప్రభాస్ ఆల్మోస్ట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, దీంతో ఈ స్క్రిప్ట్‌కు హను రాఘవపూడి తుది మెరుగులు దిద్దే పనిలో ఉన్నారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. అంతేకాదు.. ఈ సినిమాను మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తారనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు ప్రస్తుతం 'రాజా డీలక్స్' షూటింగ్‌లో పాల్గొంటున్నారు ప్రభాస్. అలాగే ప్రభాస్ నటించిన 'ఆదిపురుష్' చిత్రం జూన్ 16న థియేటర్స్‌లో రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే.

యాక్షన్ దేవర


ఎన్టీఆర్

ఎన్టీఆర్ అభిమానులకు బర్త్ డే గిఫ్ట్ ఇచ్చింది 'ఎన్టీఆర్ 30' యూనిట్. నేడు (మే 20) ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ చిత్రానికి 'దేవర' అనే టైటిల్ ఫిక్స్ చేసి, శుక్రవారం ఫస్ట్ లుక్ విడుదల చేశారు మేకర్స్. రక్తమోడుతున్న కత్తిని చేతిలో పట్టుకుని ఎగసిపడుతున్న సముద్రం ఒడ్డున పంచె కట్టుతో రగ్డ్ లుక్‌తో కనిపించారు ఎన్టీఆర్. 'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్–డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో ఈ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రంతో బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ టాలీవుడ్‌కి ఎంట్రీ ఇస్తున్నారు. నందమూరి కల్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ పతాకాలపై సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ''హై యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న చిత్రం 'దేవర'. దేవర అంటే దేవుడు అని అర్థం. యాక్షన్ జోనర్‌లో ఈ చిత్రం సరికొత్త బెంచ్ మార్క్‌ని క్రియేట్ చేస్తుంది. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో సినిమాను 2024 ఏప్రిల్ 5న విడుదల చేయనున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. సైఫ్ అలీఖాన్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్, కెమెరా: ఆర్. రత్నవేలు.

విలన్ వికాస్ మాలిక్


నవాజుద్దీన్

వెంకటేశ్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సైంధవ్'. వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా బాలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ నవాజుద్దీన్ సిద్ధిఖీ తెలుగు చిత్ర పరిశ్రమకి పరిచయమవుతున్నారు. శుక్రవారం (మే 19) నవాజుద్దీన్ సిద్ధిఖీ పుట్టినరోజు. ఈ సందర్భంగా చిత్రయూనిట్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి, ఈ చిత్రంలో ఆయన చేస్తున్న వికాస్ మాలిక్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. ఇందులో నవాజుద్దీన్‌ది పవర్‌ఫుల్ విలన్ రోల్. ''హై యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రం 'సైంధవ్'. వెంకటేశ్ కెరీర్‌లో 75వ లాండ్ మార్క్ మూవీ ఇది. ఇందులో శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్‌గా (మనోజ్ఞ పాత్రలో) నటిస్తుండగా, డాక్టర్ రేణు పాత్రలో రుహానీ శర్మ, జాస్మిన్ పాత్రలో ఆండ్రియా జెర్మియా కనిపించనున్నారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. కాగా 'సైంధవ్' తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో డిసెంబర్ 22న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణ్, సహనిర్మాత: కిశోర్ తాళ్లూరు, కెమెరా: ఎస్. మణికందన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకటరత్నం (వెంకట్).

దయచేసి డిజైనర్‌ని మార్చండి!

- కాన్స్‌లో ఐష్ లుక్‌పై ట్రోల్స్



ఐశ్వర్యా రాయ్

రెండు దశాబ్దాలుగా కాన్స్ చలన చిత్రోత్సవాల్లో పాల్గొంటున్నారు హీరోయిన్ ఐశ్వర్యా రాయ్. అందమైన లుక్స్‌తో కాన్స్ చిత్రోత్సవాల్లో ఓ హైలైట్‌గా నిలుస్తుంటారు. అందుకే 'క్వీన్ ఆఫ్ కాన్స్'గా ఐశ్వర్యను ఆమె అభిమానులు కొనియాడుతుంటారు. అయితే ఒకట్రెండు సార్లు లుక్స్ బాగా లేవనే విమర్శలు కూడా వచ్చాయి. తాజాగా ఈ ఏడాది జరుగుతున్న 76వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఐశ్వర్యా రాయ్ లుక్‌పై మిశ్రమ స్పందన లభించింది. పెద్ద హుడీ జత కలిపి డిజైన్ చేసిన పొడవాటి బ్లాక్ అండ్ సిల్వర్ కలర్ గౌను ధరించి రెడ్ కార్పెట్‌పై ఐశ్వర్యా రాయ్ క్యాట్‌వాక్ చేశారు. ఈ గౌను చూడ్డానికి అంత బాగాలేదనీ, తల చుట్టూ ఉన్న ఆ హుడీ చూడ్డానికి చాలా ఇబ్బందిగా ఉందని పులువురు కామెంట్స్ చేశారు. 'దయచేసి మీ డిజైనర్‌ను మార్చండి', 'కోయీ మిల్ గయా'లోని ఏలియన్ క్యారెక్టర్ జాదూను స్ఫూర్తిగా తీసుకుని ఫ్రాక్‌ని డిజైన్ చేసినట్లున్నారు', 'మీ లుక్ ఓ గిఫ్ట్‌బాక్స్'లా కనిపిస్తోంది', 'చికెన్ షవర్మా' గుర్తుకు వస్తోంది' ఇలా.. నెటిజన్లు రకరకాలుగా ఐశ్వర్యా రాయ్‌ను నెట్టింట ట్రోల్ చేశారు. అలాగే ఐశ్వర్యా రాయ్ రెడ్ కార్పెట్‌పై వాక్ చేయకముందు గ్రీన్ డ్రెస్‌లో ఉన్న ఆమె ఫోటోలు కొన్ని బయటకు వచ్చాయి. ఈ లుక్ గురించి కూడా నెటిజన్లు ఆమెను ట్రోల్ చేశారు. ముఖ్యంగా ఆకుపచ్చ రంగు గౌను ధరించినప్పుడు ఆమె జుట్టుని అలా ఫ్రీగా వదిలేయడం బాగాలేదని, అసలు ఆ స్టయిలే బాగాలేదని కొందరు అభిప్రాయపడ్డారు. అలాగే ఊర్వశీ రౌతేలా ధరించిన కంఠాభరణం గురించి కూడా విమర్శలు వచ్చాయి. మొసలి ఆకారం ఉన్న ఓ నెక్లెస్‌ను ధరించారామె. ఆ ఆభరణం చాలా ఎబ్బెట్టుగా ఉందనే కామెంట్స్ వినిపించాయి. అయితే ఇప్పటివరకూ కాన్స్‌లో మెరిసిన తారల్లో సారా అలీఖాన్, మృణాల్ ఠాకూర్, మానుషీ చిల్లర్, ఈషా గుప్తాలకు మంచి మార్కులు పడ్డాయి. ఇక ఈ నెల 16న ప్రారంభమైన ఈ చిత్రోత్సవాలు 27 వరకు కొనసాగనున్న సంగతి తెలిసిందే.

జూన్‌లో టక్కర్


దివ్యాంశ, సిద్ధార్థ్

'నువ్వొస్తానంటే నేనొద్దంటానా', 'బొమ్మరిల్లు' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించిన సిద్ధార్థ్ హీరోగా రూపొందిన తాజా చిత్రం 'టక్కర్'. కార్తీక్ జి. క్రిష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దివ్యాంశా కౌశిక్ కథానాయికగా నటించారు. అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ప్యాషన్ స్టూడియోస్‌తో కలిసి పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రాన్ని జూన్ 9న తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''సాధారణంగా సిద్ధార్థ్ సినిమాల్లో ప్రేమ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. అయితే 'టక్కర్'లో ప్రేమ సన్నివేశాలతో పాటు అద్భుతమైన యాక్షన్ సీన్స్ ఉంటాయి. ఈ సినిమా కోసం సిద్ధార్థ్ సరికొత్తగా మేకోవర్ అయ్యారు. ఈ రొమాంటిక్ యాక్షన్ రైడ్ ఘనవిజయం సాధించి, తన కెరీర్‌లో మరో గుర్తుండిపోయే సినిమా అవుతుందనే నమ్మకం ఉంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: నివాస్ కె. ప్రసన్న, కెమెరా: వాంచినాథన్ మురుగేశన్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మయాంక్.

ఆల్ టైమ్ గ్రేట్


సుధీర్

సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'జీ.ఓ.ఏ.టీ' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్స్) అనే టైటిల్‌ని ఖరారు చేశారు. 'పాగల్' ఫేమ్ నరేశ్ కుప్పిలి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దివ్య భారతి హీరోయిన్. లక్కీ మీడియా-మహారాజా క్రియేషన్స్ బ్యానర్స్‌పై చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ల, బెక్కం వేణుగోపాల్ నిర్మిస్తున్నారు. కాగా శుక్రవారం (మే 19) సుధీర్ బర్త్‌డేని పురస్కరించుకుని ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది చిత్ర యూనిట్. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ల, బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ– ''మంచి కథాంశంతో తెరకెక్కుతున్న మా సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఫస్ట్ లుక్‌ని విడుదల చేసిన కొద్ది నిమిషాల్లోనే మంచి స్పందన రావడం హ్యాపీగా ఉంది'' అన్నారు. ''జీ.ఓ.ఏ.టీ' లాంటి మంచి కాన్సెప్ట్ ఉన్న కథతో సినిమా చేసే అవకాశం ఇచ్చిన నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు నరేశ్ కుప్పిలి. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, కెమెరా: బాలాజీ సుబ్రహ్మణ్యం.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	298	61,730
నిఫ్టీ ▲	73	18,203

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,644	▼	25
డోజోన్స్	33,456	▼	80
ఎఫ్‌టీఎస్ఈ 100	7,757	▲	15
డాక్స్	16,275	▲	112
షాంఘై	3,284	▼	14
నికాయ్	30,808	▲	234

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	60,275 ▼	199
బంగారం (99.5 స్వచ్ఛత)	60,034 ▼	198
వెండి (కిలో)	71,784 ▲	288

రూ. 7 లక్షల వరకు టీసీఎస్ ఉండదు

• విదేశాల్లో క్రెడిట్, డెబిట్ కార్డు చెల్లింపులపై ఆర్థిక శాఖ వివరణ



న్యూఢిల్లీ: విదేశాల్లో క్రెడిట్ కార్డులపై చేసే ఖర్చుల మీద 20 శాతం టీసీఎస్ (ట్యాక్స్ కలెక్టెడ్ ఎట్ సోర్స్) విధింపుపై విమర్శలు వెల్లువెత్తడంతో ఆర్థిక శాఖ వివరణ ఇచ్చింది. ఒక ఏడాదిలో రూ. 7 లక్షల వరకు క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా చేసే వ్యయాలపై టీసీఎస్ విధించబోమని పేర్కొంది. విదేశాల్లో క్రెడిట్ కార్డుతో చేసే వ్యయాలను కూడా కేంద్రం ఇటీవల రెమిటెన్స్ స్కీమ్–ఎల్ఆర్ఎస్ పరిధిలోకి తెచ్చింది. దీంతో జూలై 1 నుంచి విదేశాల్లో క్రెడిట్ కార్డులపై చేసే వ్యయాలపై 20% పన్ను వర్తించనుంది. అయితే ఇది ట్యాక్స్ టెర్రరిజం అంటూ విమర్శలు వెల్లువెత్తడంతో ఆర్థిక శాఖ తాజా ప్రకటన చేసింది.

ఖజానా జ్యువెలరీ బ్రాండ్ అంబాసిడర్‌గా తమన్నా



హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ రిటైల్ చైన్ ఖజానా జ్యువెలరీ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ నటి తమన్నా నియమితులయ్యారు. తమ బ్రాండ్ ప్రమోషన్‌కు తమన్నా మరింత కొత్త శోభను తీసుకువస్తుందన్న విశ్వాసాన్ని సంస్థ వ్యవస్థాపకులు, ఎండీ కిశోర్ కుమార్ జైన్ వ్యక్తం చేశారు. తన నియామకం పట్ల తమన్నా స్పందిస్తూ, ప్రముఖ బ్రాండ్ నుంచి తనకు లభించిన గొప్ప గౌరవంగా దీనిని పరిగణిస్తున్నట్లు తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

20-5-2023	
విశాఖ	495–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	487–00
విజయవాడ	487–00
రిటైల్ ధర (డజను)	72.00
19-5-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	462–00
వరంగల్	464–00
రిటైల్ ధర	5.20

అదానీకి ఊరట..

• గ్రూప్ స్టాక్స్ ర్యాలీలో నియంత్రణ వైఫల్యం లేదు
• సుప్రీంకోర్టుకు నిపుణుల కమిటీ నివేదిక



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ కంపెనీల షేర్ల ర్యాలీ విషయంలో నియంత్రణలపరమైన వైఫల్యమేమీ లేదని సుప్రీం కోర్టు నియమించిన నిపుణుల కమిటీ పేర్కొంది. అయితే, హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక రావడానికి ముందే అదానీ స్టాక్స్‌లో షార్ట్ బిల్డప్ జరిగిందనడానికి ఆధారాలు ఉన్నాయని తెలిపింది. రిపోర్టు వెల్లడై, షేర్లు కుప్పకూలిన తర్వాత ట్రేడర్లు పొజిషన్లు స్క్వేర్ ఆఫ్ చేసి, లాభపడ్డారని వివరించింది. ఆరు సంస్థలు అనుమానాస్పద ట్రేడింగ్ నిర్వహించాయని.. వాటిలో నాలుగు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) కాగా, ఒకటి కార్పొరేట్ సంస్థ, మరొక వ్యక్తి ఉన్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణను ప్రస్తావిస్తూ పేర్కొంది. 'మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఇచ్చిన వివరణ, డేటా ప్రకారం నియంత్రణ వైఫల్యాల వల్ల షేర్ల ధరల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలను ధ్రువీకరించలేము' అని సుప్రీం కోర్టుకు ఇచ్చిన 173 పేజీల నివేదికలో కమిటీ తెలిపింది. అలాగే, పరస్పర సంబంధమున్న వర్గాల మధ్య లావాదేవీల్లోనూ, కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ నిబంధనల విషయంలోనూ సెబీ విఫలమైనట్లు చెప్పలేమని కమిటీ వివరించింది. సందేహాస్పద విదేశీ సంస్థల నుంచి అదానీ సంస్థల్లోకి నిధులు వచ్చాయన్న ఆరోపణలపై సెబీ 2020 నుంచి చేస్తున్న విచారణలో నిర్దిష్టంగా ఏమీ తేలలేదని కమిటీ తెలిపింది. ఈ నివేదికే తుది తీర్పు కాకపోయినప్పటికీ అదానీ సామ్రాజ్యానికి కాస్త ఊరట మాత్రం కలిగించేదేనని సంబంధిత వర్గాలు తెలిపాయి. అదానీ గ్రూప్ ఖాతాల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపించిన సంగతి తెలిసిందే. దీంతో అదానీ సంస్థల షేర్లు కుప్పకూలాయి. ఈ వ్యవహారంపై అటు సెబీ తన వంతుగా దర్యాప్తు చేస్తుండగా, సుప్రీంకోర్టు కూడా సమాంతరంగా ఆరుగురు సభ్యులతో ఒక కమిటీని నియమించింది. సుప్రీం కోర్టు మాజీ జడ్జి జస్టిస్ ఏఎం సాప్రే సారథ్యంలోని ఈ కమిటీలో కేవీ కామత్, ఓపీ భట్, నందన్ నీలేకని వంటి దిగ్గజాలు ఉన్నారు.

స్టాక్స్ రయ్..

కమిటీ నివేదికతో శుక్రవారం అదానీ గ్రూప్ స్టాక్స్‌కు ఊతం లభించింది. గ్రూప్‌లోని 10 స్టాక్స్ 1.2 శాతం నుంచి 7 శాతం వరకు పెరిగాయి. అదానీ విల్మర్ 6.85%, అదానీ పవర్ 4.93%, అదానీ ట్రాన్స్‌మిషన్ 4.62%, అదానీ గ్రీన్ ఎనర్జీ 4.18%, అదానీ ఎంటర్‌ప్రైజెస్.. అదానీ పోర్ట్స్ చెరి 3.65 శాతం, ఎన్‌డీటీవీ 3.53%, అదానీ టోటల్ గ్యాస్ 3.05% లాభపడ్డాయి. అంబుజా సిమెంట్స్, ఏసీసీ చెరి 1 శాతం లాభపడ్డాయి.

పీఎన్‌బీ లాభం హైజంప్

• క్యూ4లో రూ. 1,159 కోట్లు
• నికర వడ్డీ ఆదాయం జోరు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) గత ఆర్థిక సంవత్సరం (2022–23) చివరి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 5 రెట్లు జంప్‌చేసి రూ. 1,159 కోట్లను తాకింది. మొండి రుణాలు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో కేవలం రూ. 202 కోట్లు ఆర్జించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం సైతం రూ. 245 కోట్ల నుంచి రూ. 1,864 కోట్లకు దూసుకెళ్లింది. వాటాదారులకు బ్యాంక్ బోర్డు షేరుకి రూ. 0.65 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం రూ. 21,095 కోట్ల నుంచి రూ. 27,269 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 30% బలపడి గత ఐదు త్రైమాసికాలకంటే అధికంగా రూ. 9,499 కోట్లను తాకింది.

ఎన్‌పీఏలు డౌన్

ప్రస్తుత సమీక్షా కాలంలో పీఎన్‌బీ స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 11.78 శాతం నుంచి 8.74 శాతానికి, నికర ఎన్‌పీఏలు 4.8 శాతం నుంచి 2.72 శాతానికి దిగివచ్చాయి. దీంతో ప్రొవిజన్లు రూ. 4,564 కోట్ల నుంచి రూ. 3,625 కోట్లకు తగ్గాయి. నికర వడ్డీ మార్జిన్లు 0.48 శాతం పుంజుకుని 3.24 శాతానికి చేరాయి. అయితే మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి బ్యాంక్ నికర లాభం 27 శాతం క్షీణించి రూ. 2,507 కోట్లకు పరిమితమైంది. 2021–22లో రూ. 3,457 కోట్లు ఆర్జించింది. గతేడాది రూ. 29,000 కోట్ల రికవరీలు సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23)లో 12–13 శాతం రుణ వృద్ధిని బ్యాంక్ అంచనా వేసింది. గో ఫస్ట్ ఎయిర్‌లైన్స్ రుణదాతల జాబితాలో బ్యాంక్ లేదని పీఎన్‌బీ ఎండీ అతుల్ కుమార్ గోయెల్ పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో పీఎన్‌బీ షేరు ఎన్ఎస్ఈలో 2 శాతం లాభంతో రూ. 49 వద్ద ముగిసింది.

కేంద్రానికి ఆర్‌బీఐ రూ. 87 వేల కోట్ల డివిడెండ్



ముంబై: గత ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వానికి రూ. 87,416 కోట్ల మొత్తాన్ని డివిడెండ్‌గా చెల్లించే ప్రతిపాదనకు రిజర్వ్ బ్యాంక్ శుక్రవారం ఆమోదముద్ర వేసింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో చెల్లించిన దానితో పోలిస్తే ఇది దాదాపు మూడు రెట్లు. 2021–22లో డివిడెండ్ కింద ఆర్‌బీఐ రూ. 30,307 కోట్లు చెల్లించింది. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ సారథ్యంలో శుక్రవారం జరిగిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ 602వ సమావేశంలో డివిడెండ్‌పై నిర్ణయం తీసుకున్నట్లు ఆర్‌బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. బోర్డు సమావేశంలో దేశీ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులను, సవాళ్లను కూడా సమీక్షించినట్లు పేర్కొంది. 2022–23లో ఆర్‌బీఐ పనితీరును చర్చించి, వార్షిక నివేదికను ఆమోదించారు.

జొమాటో నష్టాలు తగ్గాయ్



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ దిగ్గజం జొమాటో గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర నష్టం దాదాపు సగానికి తగ్గి రూ. 188 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో రూ. 360 కోట్ల నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,212 కోట్ల నుంచి రూ. 2,056 కోట్లకు జంప్‌చేసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 1,702 కోట్ల నుంచి భారీగా పెరిగి రూ. 2,431 కోట్లను తాకాయి. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి కన్సాలిడేటెడ్ నికర నష్టం రూ. 1,226 కోట్ల నుంచి తగ్గి రూ. 971 కోట్లకు పరిమితమైంది. మొత్తం ఆదాయం రూ. 7,079 కోట్లకు జంప్‌చేసింది. 2021–22లో రూ. 4,192 కోట్ల ఆదాయం నమోదైంది. ఫుడ్ డెలివరీ బిజినెస్ సీఈవోగా రాకేష్ రంజన్, సీవోవోగా రిన్షుల్ చంద్రను ఎంపిక చేసినట్లు జొమాటో పేర్కొంది. జొమాటో హైపర్‌ప్యూర్ సీఈవోగా రిషి అరోరాను నియమించినట్లు తెలియజేసింది.

మార్చిలోగా ఒలెక్ట్రా కొత్త ప్లాంటు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహన తయారీలో ఉన్న ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ కొత్త ప్లాంటు నిర్మాణాన్ని 2024 జనవరి–మార్చిలోగా పూర్తి చేయాలని కృతనిశ్చయంతో ఉంది. మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఎంఈఐఎల్) అనుబంధ కంపెనీ అయిన ఒలెక్ట్రా.. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సీతారాంపూర్ ఇండస్ట్రియల్ పార్కులో 150 ఎకరాల విస్తీర్ణంలో దీనిని స్థాపిస్తోంది. ప్లాంటు కోసం రూ.800 కోట్ల నిధులను సమీకరించాలన్న కంపెనీ ప్రతిపాదనకు బోర్డు సైతం ఆమోదం తెలిపింది. తొలి దశలో ఏటా 5,000 యూనిట్ల ఎలక్ట్రిక్ బస్‌లను తయారు చేసే సామర్థ్యంతో కొత్త ప్లాంటు రానుంది. ఈ సామర్థ్యాన్ని 10,000 యూనిట్ల స్థాయికి చేర్చవచ్చు. ప్రస్తుత వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 1,500 యూనిట్లు. ఈ ఏడాది మార్చి నాటికి ఆర్డర్ బుక్ 3,394 యూనిట్లుగా ఉంది.

3 రోజుల నష్టాలకు చెక్



ముంబై: వారాంతాన దేశీ స్టాక్ మార్కెట్లు కోలుకున్నాయి. దీంతో మూడు రోజుల వరుస నష్టాలకు చెక్ పడింది. సెన్సెక్స్ 298 పాయింట్లు జంప్‌చేసి 61,730 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 73 పాయింట్లు ఎగసి 18,203 వద్ద నిలిచింది. అయితే ఇంట్రాడేలో మార్కెట్లు ఆటుపోట్లకు లోనయ్యాయి. సెన్సెక్స్ 61,785 వద్ద గరిష్టాన్ని, 61,252 దిగువన కనిష్టాన్ని తాకింది. వెరసి 530 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. ఇక నిఫ్టీ 18,218– 18,060 పాయింట్ల మధ్య హెచ్చుతగ్గులు చవిచూసింది. విదేశీ మార్కెట్లలో సానుకూల ట్రెండ్‌కుతోడు విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు దేశీయంగా సెంటిమెంటుకు బలాన్నిచ్చినట్లు నిపుణులు పేర్కొన్నారు. యూఎస్ రుణ పరిమితి ఒప్పందం కుదరవచ్చన్న అంచనాలు వారాంతాన ప్రపంచ మార్కెట్లకు జోష్‌నిచ్చినట్లు తెలియజేశారు.

ఐటీ జూమ్: ఎన్ఎస్ఈలో ప్రధానంగా ఐటీ ఇండెక్స్ 1.5% పుంజుకోగా.. రియల్టీ, ఆటో, బ్యాంకింగ్ 0.5% స్థాయిలో బలపడ్డాయి. ఫార్మా 1%నీరసించింది. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ద్వయం, టాటా మోటార్స్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, యాక్సిస్ బ్యాంక్, ఎంఅండ్ఎం, అల్ట్రాటెక్ 3–1 శాతం మధ్య ఎగశాయి. అయితే దివీస్, బ్రిటానియా, ఓఎన్‌జీసీ, ఎన్‌టీపీసీ, హీరోమోటో, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, యూపీఎల్, ఏషియన్ పెయింట్స్, డాక్టర్ రెడ్డీస్, టైటన్ 2–0.7 శాతం మధ్య క్షీణించాయి. కాగా.. అదానీ గ్రూప్‌లోని లిస్టెడ్ షేర్లన్నీ లాభాలతో ముగియడం గమనార్హం!

చిన్న షేర్లు బలహీనం

మార్కెట్లు బలపడినప్పటికీ చిన్న షేర్లు అటూఇటుగా ట్రేడయ్యాయి. బీఎస్ఈలో 1,892 షేర్లు నష్టపోగా.. 1,576 లాభపడ్డాయి. గురువారం రూ. 970 కోట్లు ఇన్వెస్ట్ చేసిన విదేశీ ఇన్వెస్టర్లు వారాంతాన స్వల్పంగా రూ. 113 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. అయితే దేశీ ఫండ్స్ రూ. 1,071 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి.

తేలిక పడదాం

• ఊబకాయం

ఫిట్‌గా, ఆరోగ్యంగా ఎలా ఉండాలనే దానిమీద బోలెడు అంశాలు ప్రచారంలో ఉన్నాయి. అయితే మనం ప్రతిరోజూ ఏమి తింటున్నాము అనే విషయంలో సరైన అవగాహన ఉండాలి. మనం రోజువారిలో తినే ఆహారంతో, ఊబకాయం పెరుగుతున్నదనే ఆందోళనను అధిగమించడానికి కొన్ని అలవాట్లను చేసుకోవాలి. బరువు పెరగడం చాలా సులభం కానీ దానిని తగ్గించడం ఎల్లప్పుడూ కష్టమే. సరైన ఆహారం, వ్యాయామంతో అధిక బరువును తగ్గించుకోవచ్చు.

ఊబకాయంతో పోరాడటానికి సాధారణ చిట్కాలు..

ప్రతిరోజూ మన ఉదయం ప్రారంభించే విధానమే మన మొత్తం ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందట. స్థూలకాయాన్ని పోగొట్టడానికి మనం కొన్ని జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి, ముఖ్యంగా ఉదయం పూట.

రోజూ ఉదయం గోరువెచ్చని నీరు తాగడం

స్థూలకాయానికి ప్రధాన కారణం నెమ్మదిగా జరిగే జీవక్రియ. జీవక్రియను అదుపు లో ఉంచడానికి, ఉదయం లేవగానే కనీసం ఒకటి రెండు గ్లాసుల గోరువెచ్చని నీటిని తాగాలి. నిమ్మరసం, తేనె కలిపిన నీటిని తాగడం జీవక్రియను వేగవంతం చేస్తుంది. బరువు తగ్గడంలో కూడా సహాయపడుతుంది.

తేలికపాటి వ్యాయామం

శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి రోజుకు కనీసం 25 నుండి 30 నిమిషాల పాటు వ్యాయామం చేయడం చాలా అవసరం. తేలికపాటి వ్యాయామాలు చురుకుదనాన్ని పెంపొందించడంలో సహాయపడతాయి. జిమ్‌కి వెళ్లడం చాలా మంచి అలవాటు. ఒకవేళ అలా కుదురకపోతే ఇంట్లోనే ఉదయం తేలికపాటి వ్యాయామాలు చేయడం ద్వారా ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉండవచ్చు.

బ్రేక్‌ఫాస్ట్‌ను బ్రేక్ చేయద్దు

చాలా మంది ప్రజలు తమ ఉదయం అల్పాహారం బరువు తగ్గించడంలో సహాయపడుతుందనుకుంటారు. ఇది అపోహ. ఇది శరీరానికి హానికరం. కొన్నిసార్లు, దీర్ఘకాల ఆకలి బరువు తగ్గడానికి బదులుగా బరువు పెరగడానికి దారితీస్తుంది, ఎందుకంటే ఎక్కువసేపు ఆకలితో బాధపడటం కొంచెం ఎక్కువ తినేలా చేస్తుంది. అలాగే, అల్పాహారం చేయకపోవడం వల్ల శరీరంలో ముఖ్యమైన పోషకాల కొరత ఏర్పడుతుంది.

స్పృహతో తినండి

ప్రతిరోజూ ఉదయం, ఆ రోజు తినే వస్తువుల జాబితాను రాసుకోవాలి. రోజులో ఏమి తినబోతున్నారో గుర్తుంచుకోవడం వల్ల, తక్కువ కేలరీల ఆహారాలను ఎంచుకోవడం, ముందుగానే ప్లాన్ చేసుకోవడం వంటి వాటి వల్ల తినేవాటి మీద జాగ్రత్త వహిస్తారు. అది శరీర బరువుపై కూడా అదుపు ఉండేలా చేస్తుంది.

పైన చెప్పుకున్నవన్నీ తేలిగ్గా చేయదగ్గవే కాబట్టి ఫాలో అవడం బెటర్.



ఎండలు... చుండ్రు తగ్గేదెలా..?

వేసవిలో తలకి ఎక్కువ చెమట పట్టడం, దానికితోడు వాతావరణ కాలుష్యం వల్ల తల తొందరగా మురికిపడుతుంది. అందు వల్ల తరచు తలస్నానం చేయాలి. అలా తలస్నానం చేయకపోవడం వల్ల అంతకుముందు చుండ్రు లేనివారికి చుండ్రు వచ్చే అవకాశం ఉంది. ముందే చుండ్రు ఉన్నవారిని ఆ సమస్య మరింతగా వేధిస్తుంది. చుండ్రు సమస్యను తగ్గించుకునేందుకు కొన్ని చిట్కాలున్నాయి. అవేంటో తెలుసుకుందాం.



వేసవిలో చాలామందిని చుండ్రు సమస్య వేధిస్తుంటుంది. తలలో అమితంగా పొట్టు చేరడం, తలంతా దురద.. ఈ సమస్యలు ఎండాకాలంలో కాస్త ఎక్కువుంటాయి. అలాంటప్పుడు ఇంట్లోనే కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చు.

అవేమిటో చూద్దాం...

• వేప నూనె లేదా వేప ఆకులను గుజ్జుగా చేసి తలకు పట్టించాలి. గంట తరువాత తలస్నానం చేయాలి. దీనివల్ల చుండ్రు సమస్యే కాదు, దురద కూడా తగ్గుతుంది.

• నాలుగు స్పూన్ల గోరువెచ్చని కొబ్బరి నూనెలో అరచెంచా నిమ్మరసం కలపాలి. దీన్ని తలకు పట్టించి గంట తరువాత గాఢత తక్కువగా ఉన్న షాంపూతో తలస్నానం చేయాలి.

పెరుగు కూడా బాగానే పని చేస్తుంది. కప్పు పెరుగును తలంతా పట్టించి అరగంట తరువాత తలస్నానం చేయాలి. ఇలా వారానికి ఒకసారి చేసినా చాలు.

• కలబంద గుజ్జును తలకు పట్టించినా ఫలితం ఉంటుంది. అలోవెరా జెల్ ను కుదుళ్లకు పట్టించి అరగంట తరువాత తలస్నానం చేయాలి.

• పావు కప్పు యాపిల్ సిడార్ వెనిగర్‌ను పావు కప్పు నీళ్లలో కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు తడిగా ఉన్నపుడు మాడుకు పట్టించాలి. అరగంట అయ్యాక తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండు సార్లు చేయొచ్చు.

చుండ్రు ఎందుకు వస్తుంది?

• చుండ్రుకు ప్రధాన కారణం మానసిక ఒత్తిడి, నిద్రలేమి. అయితే ఎండాకాలంలో చెమట వల్ల ఫంగల్ ఇన్ఫెక్షన్లు, ఈస్ట్ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది.

• షాంపూను ఎక్కువగా వాడటం వల్ల మాడు పొడుబారుతుంది. దీనివల్ల చుండ్రు సమస్య వస్తుంది.

• కొందరికి జడను గట్టిగా బిగించి కట్టుకోవడం అలవాటు. అయితే అలా జుట్టును బిగుతుగా అల్లుకోవడం వల్ల గాలి తగలక సమస్య తీవ్రమవుతుంది.

• ఎక్కువగా ఎండలో తిరగడం వల్ల జుట్టు పొడిబారుతుంది. అందువల్ల తల మీద ఎండపడకుండా తలను కవర్ చేసేందుకు ఏమైనా వాడాలి.

• చెమట వల్ల చికాకుగా ఉండి ఎక్కువసార్లు తలస్నానం చేస్తుంటాం. దీనివల్ల కూడా చర్మం పొడిబారి చుండ్రు సమస్య వస్తుంది.

ఇవి పాటించాలి

• వారానికి మూడుసార్లు తలస్నానం చేయాలి. ముఖ్యంగా ఎండాకాలంలో మాడునుంచి నూనెలు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి, దీనివల్ల దుమ్ము, దూళి చేరి చుండ్రు ఎక్కువవుతుంది. తరచూ తల ముట్టుకోకూడదు. అంటే తలలో చేతులు పెట్టి గోక్కోకూడదు. చుండ్రు వల్ల దురద వస్తుంది. దాంతో తరచూ తలలో చేయి పెట్టడం వల్ల ఇన్ఫెక్షన్ ఎక్కువవుతుంది. సమస్య ఇంకాస్త పెరుగుతుంది.

• ఎండాకాలంలో హెయిర్ స్టైలింగ్ కోసమని క్రీములు, స్ప్రేలు ఎక్కువగా వాడితే అవి మాడును పొడిబారేలా చేసి చుండ్రును పెంచుతాయి. వారానికి ఒకసారైనా ఏదైనా ఆయిల్‌తో కుదుళ్లకు బాగా మర్దనా చేసుకోవాలి. దీనివల్ల మంచి రక్త సరఫరా జరుగుతుంది. మాడులో ఉండే చర్మ కణాల పనితీరు మెరుగుపడి చుండ్రు సమస్య తగ్గే అవకాశం ఉంది.

హెల్త్ టిప్స్







డస్ట్ అలర్జీని తగ్గించుకోవడానికి ఆపిల్ సైడర్ వెనిగర్ ఉపయోగపడుతుంది. ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో రెండు చెంచాల ఆపిల్ సైడర్ వెనిగర్ కలుపుకుని తాగాలి. ఇందులో కొన్ని చుక్కల తేనె కూడా కలుపుకోవచ్చు. ఆపిల్ సైడర్ వెనిగర్?లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు అలర్జీని తగ్గించడంలో సహాయపడతాయి. అలర్జీని తగ్గించుకునేందుకు యూకలిప్టస్, లావెండర్ నూనె ఉపయోగించవచ్చు. వేడి నీటిలో 4–5 చుక్కల యూకలిప్టస్, లావెండర్ నూనెను వేసి పీల్చుకోవాలి. ఈ రెండు నూనెలు మంట, నొప్పిని తగ్గించడంలో సహాయపడతాయి.

ఫుడ్ పాయిజన్ అయిందా?



వేసవిలో చాలా మందికి ఎదురయ్యే సమస్యలలో ఫుడ్ పాయిజన్ ఒకటి. దీనికి ప్రధాన కారణం పొడి వాతావరణంలో బ్యాక్టీరియా వృద్ధి చెందడమే. అందువల్ల బయటకు వెళ్లేటప్పుడు ఆహార పరిశుభ్రతపై శ్రద్ధ వహిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. బయట తాగే నీరు శుభ్రంగా లేకపోయినా.. సమస్యలు తప్పవు. అసలు ఫుడ్ పాయిజన్ అయిందీ లేనిదీ ఎలా గుర్తించాలో, దానిని ఎలా నివారించాలో తెలుసుకుందాం.

ఆహారం తిన్న తర్వాత వాంతులు, కడుపు నొప్పి, విపరీతమైన అలసట.

ఎలా నివారించాలి?

• పరిశుభ్రత ఉన్న చోట మాత్రమే తినండి, ఎక్కడ పడితే అక్కడ.. ఏది పడితే అది తినకూడదు.
• బాగా ఉడికిన ఆహారాన్ని మాత్రమే తినాలి.
• ఎండలో ఆరుబయట కూర్చుని ఆహారం తినకూడదు.
• ఆహారాన్ని తయారు చేయడానికి శుభ్రమైన నీటిని వాడాలి.
• పండ్లు, కూరగాయలను బాగా కడిగిన తర్వాతే తినాలి.
• కుళ్లిన కూరగాయలు, పండ్లు ఉపయోగించవద్దు.

• ఫుడ్ పాయిజనింగ్ అయితే ఏం చేయాలి?

• ఫుడ్ పాయిజన్ అయినట్లయితే, నీరు ఎక్కువగా తాగాలి.
• మీకు వికారంగా అనిపిస్తున్నందున నీరు తీసుకోవడం తగ్గించవద్దు. గంజి, నీరు, పుదీనా టీ, బ్లాక్ టీ వంటివి తీసుకోవాలి.

ఓఆర్ఎస్ వినియోగించండి.

హోం రెమెడీ

• కప్పు వేడి నీటిలో 2–3 చెంచాల యాపిల్ సైడర్ వెనిగర్ వేసి, ఆహారానికి ముందు తీసుకోవడం వల్ల ఎసిడిటీ, ఫుడ్ పాయిజనింగ్ ప్రభావం తగ్గుతుంది.
• గ్లాసు వేడినీటిలో అర చెంచా తాజా అల్లం తురుము లేదా శొంఠిపొడి, తేనె కలిపి తాగాలి.
• కప్పు పెరుగులో చెంచా మెంతులు వేసి తినండి. మెంతులు నమలక్కర్లేదు, మింగేయవచ్చు.
• గ్లాసు వేడినీళ్లలో నిమ్మరసం, ఉప్పు, పంచదార కలుపుకొని తాగితే ఉపశమనం ఉంటుంది.
• చల్లని పాలకు అసిడిటీని తగ్గించే గుణం ఉంది. ఎసిడిటీ లేదా ఫుడ్ పాయిజనింగ్ ఉన్నప్పుడు, గ్లాసుడు చల్లని పాలు తాగితే కడుపు నొప్పి తగ్గుతుంది.
• నీళ్లలో జీలకర్ర, ఇంగువ, ఉప్పు వేసి 2–3 సార్లు తాగితే కాస్త ఉపశమనం కలుగుతుంది.

ఇలాంటివి చేసిన తర్వాత కూడా తగ్గకపోతే.. వైద్యుణ్ణి సంప్రదించి మందులు తీసుకోవాలి. చేతులు తరచు సబ్బుతో కడుక్కోవాలి. వంటగదిలో శుభ్రత పాటించాలి. ఫుడ్ పాయిజన్ బారిన పడి కోలుకుంటున్న వారికి తగినంత విశ్రాంతి, నిద్ర అవసరం.



జేఎన్‌టీయూకేకు న్యాక్ ఎ-ప్లస్ గుర్తింపు

ఏపీలో ఎ-ప్లస్ సాధించిన తొలి వర్సిటీగా ఖ్యాతి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ–కాకినాడకు నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) ఎ-ప్లస్ గుర్తింపు ప్రకటించింది. న్యాక్ కార్యాలయం నుంచి ఈ మేరకు శుక్రవారం జేఎన్‌టీయూకేకు సమాచారం వచ్చింది. గతవారంలో న్యాక్ కమిటీ జేఎన్‌టీయూకేకు వచ్చి విద్యావిధానం, వనరులు, ఇతర అంశాలను పరిశీలించింది. 2017లో న్యాక్–బీ సాధించిన జేఎన్‌టీయూకే తాజాగా ఎ-ప్లస్‌తో మరో ఖ్యాతి సాధించింది. రాష్ట్రంలో ఎ-ప్లస్ సాధించిన తొలి వర్సిటీగా జేఎన్‌టీయూకే గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి వర్సిటీ వీసీ డాక్టర్ ప్రసాదరాజుకు అభినందనలు తెలిపారు.

కనీస వేతన సలహా బోర్డు చైర్మన్ నియామకం

సాక్షి, అమరావతి: ఏపీ కనీస వేతన సలహా బోర్డును పునర్వ్యవస్థీకరించి, చైర్మన్‌గా ఒంటెద్దు రఘునాథరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శుక్రవారం గెజిట్ జారీ చేసింది. జూలై 21 నుంచి రెండేళ్ల పాటు రఘునాథరెడ్డి చైర్మన్‌గా కొనసాగుతారని గెజిట్‌లో కార్మిక శాఖ కార్యదర్శి డాక్టర్ ఎం. హరి జవహర్‌లాల్ పేర్కొన్నారు.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
శనివారం। 20। మే। 2023



ఉత్సాహంగా వేసవి శిక్షణ

కంకిపాడు: విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో పిల్లలు పాల్గొంటున్నారు.



ఘన నివాళి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి కార్యక్రమాలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 521.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి విడుదలవుతున్న నీటిని పూర్తిగా నిలిపివేశారు.

న్యూస్‌రీల్

బ్యాంకర్లతో ఎంపీ సమావేశం



చిలకలపూడి(మచిలీపట్నం): తమిళనాడు రాష్ట్రంలోని ఊటీలో కేంద్ర ఆర్థికశాఖ ఆధ్వర్యంలో బ్యాంకు అధికారులతో లోక్‌సభ సబార్డినేట్ కమిటీ అధ్యక్షుడు, బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి శుక్రవారం సమావేశమయ్యారు. ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, కెనరా బ్యాంక్, స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ఐడీబీఐ) అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా బ్యాంకులకు సంబంధించిన విధివిధానాలు, తీసుకుంటున్న చర్యలపై చర్చించారు.

ఎనిమిది మందితో దుర్గగుడి వైదిక కమిటీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి ఎనిమిది మందితో కూడిన వైదిక కమిటీని ఏర్పాటు చేస్తూ ఆలయ ఈవో భ్రమరాంబ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైదిక కమిటీలో స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వేద పండితులు వి.శ్యావశ్వ మహర్షి, యాపీఎల్ఎన్ సుబ్రహ్మణ్య ఘనాపాటి, ప్రధాన అర్చకుడు లింగంబోట్ల బద్రీనాథ్‌బాబు, ఉప ప్రధాన అర్చకుడు బి. శంకర్ శాండిల్య, ముఖ్య అర్చకుడు యజ్ఞనారాయణ శర్మ, అర్చకుడు యాపీఎస్ మురళీధర్ శాస్త్రి, పీవీ రఘునాథ శర్మలను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. వైదిక కమిటీ సభ్యులు ప్రతి రోజు నిర్వహించే విధులతో పాటు దేవస్థానం, ఉపాలయాల్లో జరిగే నిత్య, వార్షిక వైదిక కార్యక్రమాలు, వార్షిక పండుగలు ఆగమ శాస్త్రం ప్రకారం నిర్వహించేలా బాధ్యత వహిస్తారు.

పోలీస్ కమిషనరేట్‌కు కొత్త ఏడీసీపీలు



జి.వి.రమణమూర్తి



డి.ప్రసాద్



కేఆర్ ప్రసాద్

విజయవాడ స్పోర్ట్స్: ఏసీపీ నుంచి ఏడీసీపీలుగా ఉద్యోగోన్నతి పొందిన పలువురు అధికారులను విజయవాడ పోలీస్ కమిషనరేట్‌లోని పలు విభాగాల్లో నియమిస్తూ డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాజా ఉత్తర్వుల ప్రకారం కమిషనరేట్‌లో టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా పని చేస్తున్న జి.వి.రమణమూర్తి కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీగా నియమితులయ్యారు. ట్రాఫిక్ ఏడీసీపీగా పని చేస్తున్న టి.సర్కార్ కర్నూలు ఏఎస్పీగా బదిలీ కాగా ఆయన స్థానంలో కర్నూలు ఏఎస్పీ డి.ప్రసాద్‌ను నియమించారు. సత్యసాయి జిల్లా ఏఎస్పీగా పని చేస్తున్న కె.ఆర్.ప్రసాద్‌ను విజయవాడ ఎస్ఈబీ ఏఎస్పీగా, సీఐడీ ఏఎస్పీగా పని చేస్తున్న ఎం.స్నేహితను విజయవాడ ఏసీబీ ఏఎస్పీగా నియమించారు. ఎన్టీఆర్ జిల్లా పీసీఆర్ ఏసీపీ ఎస్.ఆర్.రాజశేఖరరాజును రాజమండ్రి ఏఎస్పీగా నియమించారు.

కృష్ణా జిల్లా అడిషనల్ ఎస్పీ బదిలీ

కోనేరుసెంటర్(మచిలీపట్నం): కృష్ణాజిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్. వెంకటరామాంజనేయులు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఆర్. శ్రీహరిబాబును ఏఎస్పీగా నియమిస్తూ డీజీపీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణా జిల్లా పోలీసు కార్యాలయం అడ్మిన్‌గా విధులు నిర్వర్తిస్తున్న వెంకటరామాంజనేయులును గవర్నర్ కార్యాలయానికి బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేయగా పీసీఎస్ అండ్ ఎస్ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న ఆర్. శ్రీహరిబాబును జిల్లా అడిషనల్ ఎస్పీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

యూపీహెచ్‌సీలో ఢిల్లీ ఎన్క్యాస్ టీమ్

మంగళగిరి: కార్పొరేషన్ పరిధి ఆత్మకూరు గణపతినగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం ఢిల్లీ నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్ట్స్ (ఎన్క్యాస్) టీమ్ సందర్శించింది. టీమ్ ప్రతినిధులు డాక్టర్ సంజీవరావు, డాక్టర్ స్వాతి లక్ష్మి హెల్త్ సెంటర్‌లోని 12 రకాల వైద్య ఆరోగ్య సౌకర్యాల్ని రెండు రోజుల పాటు పరిశీలించనున్నారు. తొలి రోజు శుక్రవారం మెడికల్ ఆఫీసర్ గది, లేబరేటరీలను పరిశీలించారు. హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ పి. అనూష టీమ్ ప్రతినిధులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పునాది వేసినప్పటి నుంచి పూర్తిగా అభివృద్ధి చెందిన విధానం, వైద్య సేవలు, చేపట్టిన ఆరోగ్య కార్యక్రమాల్ని వివరించారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

చారిత్రక ఘట్టానికి భారీ ఏర్పాట్లు

- 22న ముఖ్యమంత్రి బందరు పర్యటన
- పోర్టు పనులకు అంకురార్పణ
- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయండి
- అధికారులతో సమీక్షలో మంత్రి జోగి రమేష్



తపసిపూడిలోని పోర్టు పనుల ప్రారంభ ప్రాంగణం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యేలు పేర్ని నాని, కైలే అనిల్‌కుమార్, కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ జాషువా

చిలకలపూడి(మచిలీపట్నం): చారిత్రక ప్రాధాన్యం కలిగిన బందరు పోర్టు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటనకు పక్కా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబర్‌లో మాజీ మంత్రి, బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, కృష్ణా కలెక్టర్ పి. రాజాబాబు, ఎస్పీ జాషువా, జేసీ అపరాజితాసింగ్‌లతో కలిసి సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ జిల్లా వాసుల చిరకాల వాంఛ అయిన బందరు పోర్టు అభివృద్ధి పనులు ఈ నెల 22వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి మచిలీపట్నం వచ్చినప్పుడు లక్ష మందిని సమీకరించిన విషయం మంత్రి గుర్తుచేశారు. ఇప్పుడు సీఎం జగన్ పర్యటనలో లక్షకు పైగా జనసమీకరణ చేయాలన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా..

ముఖ్యమంత్రి సభకు హాజరయ్యే ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్న నేపథ్యంలో తాగునీరు, లెమన్‌వాటర్, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా చేయాలన్నారు. వేసవి తాపానికి అనుకోని సంఘటనలు జరగకుండా వైద్యశిబిరాలు సిబ్బందితో సిద్ధంగా ఉండాలన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు..

బందరు శాసనసభ్యుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) మాట్లాడుతూ వీవీఐపీలకు, వీఐపీలకు ఎంట్రీ పాస్‌లు జారీ చేయటంతో పాటు ఉదయం 8.30 గంటలకే సభాస్థలికి చేరుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామాల నుంచి ప్రజలతో బస్సులు సకాలంలో సభాస్థలికి చేరుకుని జనాలను దించి పార్కింగ్‌లో పెట్టుకునేలా రూట్‌మ్యాప్‌తో పాటు పార్కింగ్ సూచికబోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

స్పందనకు ప్రత్యేక కౌంటర్..

జేసీ అపరాజితాసింగ్ మాట్లాడుతూ సభాస్థలి ప్రాంతంలో ప్రత్యేక స్పందన కౌంటర్ ఏర్పాటుతో పాటు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించేందుకు సిబ్బందిని నియమిస్తున్నామని వారికి స్పందన టీ–షర్టులు ధరించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

భద్రతా చర్యలు..

ఎస్పీ జాషువా మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటించే అన్ని ప్రాంతాల్లో పక్కాగా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ఏఎస్పీలు రామాంజనేయులు, ప్రసాద్, డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, డీఎస్పీ మాధవరెడ్డి, ఆర్డీవో ఐ. కిషోర్, డీటీసీ, ఎస్. సీతాపతిరావు, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గీతాబాయి, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయే రోజు..

కోనేరు సెంటర్(మచిలీపట్నం): బందరు పోర్టు నిర్మాణ ప్రారంభోత్సవం చరిత్రలో నిలిచిపోయే రోజు అవుతుందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. శుక్రవారం ఆయన బందరు ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని), పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, ఎస్పీ పి. జాషువాలతో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాలను సందర్శించారు. తొలుత తపసిపూడిలోని మంగినపూడిబీచ్ వద్ద ప్రారంభించనున్న పోర్టు పనుల ప్రాంతాన్ని సందర్శించారు. పైలాన్‌ను పరిశీలించి హెలి ప్యాడ్‌ను సందర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గంగ పూజ చేసే చెక్కల వంతెనను పరిశీలించారు. పోర్టు అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రికి స్వాగతం పలికేందుకు విచ్చేసే ప్రముఖులు వేచి ఉండేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్. వెంకటరామాంజనేయులు, బందరు డీఎస్పీ మాధవరెడ్డి, వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ జోనల్ ఇన్‌చార్జ్ షేక్‌సిలార్‌దాదా పాల్గొన్నారు.

సభా ప్రాంగణం పరిశీలన..

మచిలీపట్నం టౌన్: మంత్రి జోగి ఎమ్మెల్యే పేర్ని నాని, కృష్ణా కలెక్టర్ పి. రాజాబాబు, ఎస్పీ పి. జాషువా, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌లతో కలిసి సీఎం జగన్ సభా ప్రాంగణం వద్ద జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లావాసుల చిరకాల వాంఛగా ఉన్న పోర్టు నిర్మాణం సీఎం జగన్ చేతుల మీదుగా నెరవేరబోతోందన్నారు. ఓ పక్క పోర్టు నిర్మాణం, మరో పక్క వైద్యకళాశాల ఈ సంవత్సరమే అన్ని అనుమతులు పొంది విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఫిషింగ్ హార్బర్ పనులు శరవేగంగా నడుస్తున్నాయన్నారు. ఒకే చోట అభివృద్ధి చెందటం కాదంటూ ప్రతి ప్రాంతంలో అభివృద్ధి జరగాలన్నది ప్రభుత్వ ఆశయమన్నారు. పోర్టు నిర్మాణ లక్ష్యం 30 నెలలు అయినప్పటికీ 26 నెలల్లోనే ఓడలు రాబోతున్నాయన్నారు. దీంతో మచిలీపట్నం గొప్పనగరంగా రూపాంతరం చెందుతుందన్నారు.

సీఎం పర్యటన ఇలా..

చిలకలపూడి(మచిలీపట్నం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 22వ తేదీన బందరు పోర్టు పనులు ప్రారంభించేందుకు కృష్ణాజిల్లా మచిలీపట్నం విచ్చేస్తున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు శుక్రవారం తెలిపారు.

- ఉదయం 9 గంటలకు బందరు మండల పరిధిలోని తపసిపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన హెలి ప్యాడ్‌కు చేరుకుంటారన్నారు.
- అక్కడి నుంచి పోర్టు నిర్మాణం ప్రదేశంలో భూమి పూజ అనంతరం పైలాన్‌ను ఆవిష్కరిస్తారన్నారు.
- అనంతరం హెలికాప్టర్ ద్వారా మచిలీపట్నంలోని జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలి ప్యాడ్‌కు చేరుకుంటారన్నారు.
- తదనంతరం రోడ్డు మార్గం ద్వారా జిల్లా పరిషత్ సెంటర్‌లోని భారత్‌స్కౌట్స్ అండ్ గైడ్స్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకుంటారన్నారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని సందర్శించి, వేదికపైకి విచ్చేస్తారన్నారు.
- అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారన్నారు. ఆ తర్వాత బహిరంగ సభ ప్రాంగణం నుంచి బయలుదేరి రోడ్డు మార్గం ద్వారా పోలీస్‌గ్రౌండ్‌లో హెలి ప్యాడ్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో తాడేపల్లి నివాసానికి వెళతారన్నారు.
- సీఎం భూమిపూజ, పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమాలు ప్రత్యక్షంగా వీక్షించేందుకు సభాస్థలి వద్ద స్క్రీన్ ఏర్పాటు చేశామన్నారు.

అవనిగడ్డ 'ఆణిముత్యాలు'



ఆకుల ప్రేమ్‌సాయి




భావిశెట్టి కావ్యశ్రీ

అవనిగడ్డ: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా నగదు ప్రోత్సాహకాలు ఇవ్వనుంది. నియోజకవర్గ స్థాయిలో ఈనెల 25న, జిల్లా స్థాయిలో ఈనెల 27, రాష్ట్రస్థాయిలో 31న జరిగే కార్యక్రమంలో విద్యార్థులు ఈ నగదు బహుమతిని అందుకోనున్నారు. కాగా కృష్ణా జిల్లాలో అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి 600కి 592 మార్కులతో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించిన ఆకుల ప్రేమ్‌సాయి, 586 మార్కులతో జిల్లాలో రెండో ర్యాంకు పొందిన భావిశెట్టి కావ్యశ్రీ జగనన్న ఆణిముత్యాలు ప్రోత్సాహకానికి ఎంపికయ్యారు. ప్రేమ్‌సాయి రూ.1.15 లక్షల నగదు బహుమతిని అందుకోనున్నారు. రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు ద్వారా రూ.50వేలు, జిల్లాలో మొదటి ర్యాంకు ద్వారా రూ.50వేలు, నియోజకవర్గంలో మొదటి ర్యాంకు ద్వారా రూ.15 వేలు తీసుకోనున్నారు. కావ్యశ్రీ జిల్లా స్థాయిలో సెకండ్ ర్యాంకు ద్వారా రూ.30వేలు, నియోజకవర్గంలో సెకండ్ ర్యాంక్ ద్వారా రూ.10వేలు కలిపి మొత్తం రూ.40వేలు నగదు బహుమతి అందుకోనున్నారు. మోపిదేవి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన మేడికొండ మోనా నియోజకవర్గ స్థాయిలో తృతీయ బహుమతి రూ.5వేలు అందుకోనున్నారు. అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి జిల్లా స్థాయిలో మొదటి రెండు నగదు బహుమతులు తమ స్కూల్‌కు రావడం సంతోషంగా ఉందని, ప్రధానోపాధ్యాయురాలు ఐ. పద్మారాణి చెప్పారు. ఈ సందర్భంగా నగదు బహుమతికి ఎంపికైన ఇద్దరు విద్యార్థులకు హెచ్ఎం పద్మారాణి, పీసీ వైస్ చైర్మన్ అమ్ముల మాధవితో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

సేవా సైన్యం.. సంబరం

- గ్రామ/వార్డు వలంటీర్ల సేవలకు సత్కారం
- వరుసగా మూడో ఏడాది అవార్డుల ప్రదానం
- విజయవాడలో లాంఛనంగా ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్
- ఎన్టీఆర్ జిల్లాలో 8,997, కృష్ణాలో 8,308 వలంటీర్లకు అవార్డులు
- ఉమ్మడి జిల్లాలో అన్ని నియోజకవర్గాల పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు



అవార్డు అందుకున్న వలంటీర్లతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రంలో మంత్రి వేణుగోపాల్, ఎమ్మెల్యే వెలంపల్లి తదితరులు

సాక్షి ప్రతినిధి విజయవాడ: ప్రజలకు వలంటీర్లు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా.. వారికి వందనం చెబుతూ వరుసగా మూడో ఏడాది గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులు ఇచ్చే కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం శ్రీకారం చుట్టారు. విజయవాడ ఏప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఉత్తమ వలంటీర్లకు సేవా మిత్ర, సేవారత్న, సేవా వజ్ర పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించారు. వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా పనిచేస్తున్నారని ఆయన కితాబిచ్చారు. వలంటీర్లు అందిస్తున్న సేవలకు కొనియాడారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో పండుగ వాతావరణంలో వలంటీర్లకు అవార్డులు ప్రదా నం ఈ నెల 22వ తేదీలోపు పూర్తి చేయనున్నారు. కనీసం సంవత్సర కాలంగా నిరంతరాయంగా సేవలందిస్తున్న వలంటీర్లకు వారు అందించిన సేవల ఆధారంగా మూడు కేటగిరీలో ఈ అవార్డులు ప్రదా నం చేస్తున్నారు. సభలో వలంటీర్లు ఉద్వేగంగా, తా ము చేసిన సేవలు, అనుభూతులను వివరించారు. ఎన్టీఆర్ జిల్లాలో 8,997మంది, కృష్ణా జిల్లాలో 8,308 మంది వలంటీర్లు అవార్డులు అందుకోనున్నారు.

జగనన్న సైనికులం అంటూ...

తమ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్నామని వలంటీర్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని వివరించారు. ప్రజల చిరునవ్వులు, ఆశీర్వాదాలే మాకు కొండంత బలం, జగనన్న సైనికులుగా ఉన్నందుకు గర్విస్తున్నామని పలువురు వలంటీర్లు పేర్కొన్నారు. సీఎం అభివాదం చేయగా ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. సీఎం ప్రసంగిస్తున్నంత సేపు సభలో నూతన ఉత్తేజం నెలకొంది. రెండు జిల్లాల నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ఈకార్యక్రమానికి వలంటీర్లు తరలి వచ్చారు. అధికారులు పక్కా ఏర్పాట్లు చేశారు.

ఘన స్వాగతం..

వలంటీర్ల వందనం కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరావు, ఆదిమూలపు సురేష్, చెల్లుబోయిన వేణుగోపాల్, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్సీలు మొండితోక అరుణకుమార్, కల్పలతారెడ్డి, రుహుల్లా, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, కొలుసు పార్థసారథి, రక్షణనిధి, మొండితోక జగన్మోహనరావు, వసంత కృష్ణ ప్రసాద్, కొడాలి నాని, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, గ్రామ, వార్డు సచివాలయాల స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితిసింగ్, పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, డీసీపీలు విశాలగున్నీ, మోకాసత్తిబాబు, పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, అధికారులు స్వాగతం పలికారు.

ఎన్టీఆర్ జిల్లా:	
సేవా వజ్ర:	36
సేవా రత్న:	137
సేవా మిత్ర:	8824
నగదు పురస్కారాల మొత్తం:	రూ. 8,60,60,000

కృష్ణా జిల్లా:	
సేవా వజ్ర:	34
సేవా రత్న:	153
సేవా మిత్ర:	8121
నగదు పురస్కారాల మొత్తం:	రూ. 8,52,90,000

పింఛన్ మంజూరు చేయించా..



ఏ తోడులేని ఓ హెచ్ఐవీ మహిళకు పెన్షన్ మంజూరయ్యేలా చేశాను. చాలా కాలంగా ఆమెకు ప్రభుత్వ పథకాలు అందలేదు. నా క్లస్టర్‌లో తనను కలిసినప్పుడు తన సమస్య గురించి వివరించింది. తనకు ఎవరూ లేరని, ప్రభుత్వం నుంచి కూడా ఎలాంటి సహాయం అందటంలేదని వాపోయింది. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా.. తనకు ఒంటరి మహిళకు అందించే పెన్షన్ మంజూరు చేయించా. నా సేవలను గుర్తించిన ప్రభుత్వం అవార్డు అందించింది. థ్యాంక్యూ జగనన్న.

– బయ్యవరపు జ్యోతి, సేవా వజ్ర, విజయవాడ పశ్చిమ

నమ్మకాన్ని నిలబెడుతున్నాం..



పేదల అభ్యున్నతికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోంది. అలాంటి సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేర్చటానికి మమ్మల్ని ఎంపిక చేసి ప్రభుత్వం మాకు పూర్తిబాధ్యతలు అందించింది. మాపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని మేం నిర్వర్తించాం. ప్రజలకు సేవ చేసిన మమ్మల్ని ప్రభుత్వం గుర్తించి మరీ సన్మానిస్తుందని ఊహించలేదు. చాలా సంతోషంగా ఉంది.

– వైష్ణవి పైడి, సేవారత్న, విజయవాడ తూర్పు

సేవలో ఎంతో సంతృప్తి..



దీన స్థితిలో ఉన్న ఇద్దరికి పెన్షన్‌ను మంజూరు చేయించా. వితంతు పెన్షన్‌కు దరఖాస్తు చేసుకుంటే ఆమె భర్త సజీవంగా ఉన్న సమయంలో ఇన్‌కం టాక్స్ కట్టేవారు. సాధికారిత సర్వేలో అదే నమోదయ్యింది. ఆమెకు పెన్షన్‌కు అర్హతలేదని దరఖాస్తు రిజక్ట్ అయ్యేది. ఆ సమస్యను పరిష్కరించి ఆమెకు పెన్షన్ అందేలా చేశా.. అలాగే చాలాకాలం నుంచి వికలాంగ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న ఆమెకు నా చేతులమీదగా నాయకులు, అధికారులతో మాట్లాడి పెన్షన్ ఇప్పించా. ఆ సమయంలో వారి కళ్లలో ఆనందం వెలకట్టలేనిది. మా సేవలను ప్రభుత్వం కూడా గుర్తించి నగదు బహుమతులివ్వడం సంతోషదాయకం.

– పి. విజయ్‌కుమార్, సేవా వజ్ర, విజయవాడ సెంట్రల్

ఏ ఒక్క రైతునూ నష్టపోనివ్వం

- వారంలోగా ధాన్యం కొనుగోలులో ఇబ్బందులన్నీ తొలగిస్తాం
- బందరు పోర్టు, రైల్ కనెక్టివిటీ, టూరిజం ప్రాజెక్టులపై ఫోకస్
- శరవేగంగా భూముల రీసర్వే
- 'సాక్షి'తో కృష్ణా జిల్లా జేసీ అపరాజితాసింగ్



సాక్షి ఇంటర్వ్యూ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించటమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజితాసింగ్ అన్నారు. శుక్రవారం ఆమె 'సాక్షి'తో పలు అంశాలపై మాట్లాడారు. ప్రస్తుతం రైతులు ఆరుగాలం పండించిన పంటను రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకు అమ్ముకునేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రభుత్వం మూడు సార్లుగా ధాన్యం కొనుగోలుపై లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు. ఆ లక్ష్యం ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేశామన్నారు. అయితే మిల్లర్లు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆన్‌లైన్ చేసే ప్రక్రియకు సంబంధించి తహసీల్దార్ల ద్వారా బి–రిజిస్టర్‌లో నమోదు చేయించటం తదితర అంశాలను చేపట్టామన్నారు. రాబోయే వారం రోజుల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై రైతులు పడుతున్న ఇబ్బందులన్నీ పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. ప్రతి ఒక్క రైతుకు డబ్బులు అందేలా చూడటమే లక్ష్యమన్నారు.

100 గ్రామాల్లో భూహక్కు పత్రాల పంపిణీ..

జిల్లాలో జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం ద్వారా మొదటి దశ రీ–సర్వే పనులకు సంబంధించి జిల్లాలోని 502 గ్రామాల్లో 491 గ్రామాల్లో డ్రోన్ ఫ్లై నిర్వహించామన్నారు. ఇప్పటి వరకు 100 గ్రామాల్లో రీ–సర్వే ప్రక్రియ పూర్తి చేసి భూహక్కు పత్రాలను యజమానులకు పంపిణీ చేశామన్నారు. అలాగే నిర్దేశించిన సరిహద్దులకు 1.30 లక్షల సరిహద్దు రాళ్లను అమర్చామని దీనిని ఓవర్ టెక్నాలజీ ద్వారా చెక్ చేశామన్నారు. రెండోదశ రీ–సర్వే ప్రక్రియ 60 గ్రామాల్లో చేపట్టాలని లక్ష్యం కాగా, 52 గ్రామాల్లో సర్వే చేసి 14 గ్రామాల్లో 13వ నోటిఫికేషన్ జారీ చేశామన్నారు.

ప్రాజెక్టులకు భూ సేకరణ..

జిల్లాలో మేజర్ ప్రాజెక్టులైన జాతీయ రహదారుల విస్తరణ, పోర్టు, రైలు మార్గాలకు సంబంధించి భూసేకరణ ప్రక్రియతో పాటు జిల్లాలో టూరిజం ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు భూసేకరణ ప్రక్రియ జరుగుతోందని జేసీ తెలిపారు. జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ దాదాపుగా పూర్తయ్యిందని పోర్టు, రైలుమార్గానికి సంబంధించి రెండో దశ భూసేకరణకు సంబంధించి రైతులతో చర్చించామన్నారు. వారికి ఆమోదయోగ్యమైన ధరను చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

టూరిజంపై ఫోకస్..

జిల్లాలో అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో టూరిజం ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. అలాగే విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు కూడా ప్రస్తుతం భూసేకరణ జరుగుతోందన్నారు. జిల్లా ప్రజలకు ఇసుక సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా పరిష్కరించేందుకు మండలస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామని, తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఈ కమిటీలో ఉంటారన్నారు. అలాగే మండలాల్లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామని, సమస్యలు ఎదురైతే తెలిపిన వెంటనే పరిష్కరిస్తామని జేసీ స్పష్టం చేశారు.

ఆవు కడుపు నుంచి 40 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు



ఆవుకు శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యుడు దీపక్

మచిలీపట్నంటౌన్: కడుపులో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి ఆహారం తీసుకోకుండా, నీరు తాగకుండా అనారోగ్యం పాలైన ఓ ఆవుకు కృష్ణా జిల్లా బందరు మండల పశువైద్యాధికారి పి.దీపక్ శుక్రవారం శస్త్రచికిత్స చేశారు. ఆవు కడుపులో పేరుకుపోయిన 40 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను ఆయన తొలగించారు. చిలకలపూడికి చెందిన పుట్టి మురారి తన ఆవు పది రోజుల నుంచి ఆహారం తినకపోవటం, నీరు తాగకపోవటంతో పశువైద్యాధికారి దీపక్‌ను ఆశ్రయించారు. దీంతో ఆయన ఆవును పరిశీలించి శస్త్రచికిత్స చేసి వ్యర్థాలను తొలగించారు. వైద్యాధికారి దీపక్ మాట్లాడుతూ ప్రజలు ఆవుకు ఆహారం పెట్టేటప్పుడు ప్లాస్టిక్ వ్యర్థాలు వినియోగించకుండా ఉండాలని సూచించారు. అలాగే ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్లపై వేయటం వల్ల ఆవులు వాటిని తినటంతో ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. వ్యర్థాలు తింటే ఆవు కడుపులో ఉండలు చుట్టుకుని చనిపోయే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు. ఆవుల యజమానులు వాటికి ఆహారం పెట్టే సమయంలో జాగ్రత్తలు వహించాలన్నారు.

'గురుకుల' ప్రవేశ పరీక్షకు సర్వం సిద్ధం

- నేడు ఏపీఆర్ఎస్‌సీఏటీ.. ఏపీఆర్‌జేసీఆర్‌డీసీ ప్రవేశ పరీక్ష
- ఉదయం సీఏటీ, మధ్యాహ్నం ఏపీఆర్‌జేసీఆర్‌డీసీ
- హాజరయ్యే విద్యార్థులు కృష్ణాలో 1,637, ఎన్టీఆర్ జిల్లాలో 3,561

పెడన: ఏపీ రెసిడెన్షియల్ స్కూలు సంస్థ ఆధ్వర్యంలో కామన్ అడ్మిషన్ టెస్ట్(ఏపీఆర్ఎస్‌సీఏటీ), ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల(ఏపీఆర్‌జేసీఆర్‌డీసీ)లో చేరడానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష శనివారం జరగనుంది. దీనికి అన్ని ఏర్పాట్లు చేశారు. 5 నుంచి 8వ తరగతుల్లో ప్రవేశానికి ఏపీఆర్ఎస్‌సీఏటీ శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనుంది. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏపీఆర్‌జేసీఆర్‌డీసీ పరీక్ష జరుగుతుంది. కృష్ణా జిల్లాలో రెండు పరీక్షలకు(క్యాట్, ఆర్ జేసీకి) 1,637 మంది హాజరుకానున్నారు.

ఎన్టీ ఆర్ జిల్లాలో 3,561 మంది పరీక్ష రాయనున్నారు. చీఫ్ సూపరింటిండెంట్లు 25, డిపార్ట్‌మెంట్ ఆఫీ సర్లు 25, ఇన్విజిలేటర్లు 226 మంది విధులు నిర్వహించనున్నారు.

ఏపీఆర్ఎస్‌సీఏటీకి 1,569 మంది విద్యార్థులు

ఏపీఆర్ఎస్‌సీఏటీకి కృష్ణా జిల్లాలోని మచిలీపట్నంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 463 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడలో ఏర్పాటు చేసిన ఐదు పరీక్ష కేంద్రాల్లో 1,098 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయనున్నారు. ఉదయం పూట జరిగే ఈ పరీక్షకు రెండు జిల్లాల్లో 1,569 మంది పరీక్ష రాయనున్నారు.

ఏపీఆర్‌జేసీఆర్‌డీసీకి 3,637 మంది

శనివారం మధ్యాహ్నం జరిగే ఏపీఆర్‌జేసీఆర్‌డీసీ పరీక్షకు మచిలీపట్నంలో ఆరు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 1,174 మంది హాజరుకానున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ నగరంలో ఏర్పాటు చేసిన 12 పరీక్ష కేంద్రాల్లో 2,463 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



ఉదయం, మధ్యాహ్నం జరిగే పరీక్షలకు విద్యార్థులు సకాలంలో హాజరు కావాల్సి ఉంటుంది. ఏమైనా ఇబ్బందులుండిఆలస్యమైతే ఐదు నిమిషాలు నుంచి పది నిమిషాల లోపు వరకు మాత్రమే సమయం ఇచ్చాం. ప్రశాంతంగా పరీక్షలు జరగానికి అన్ని చర్యలు తీసుకున్నాం. డీఈఓ తాహెరాసుల్తానా పరీక్ష కేంద్రాల సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

– ప్రదీప్, కో ఆర్డినేటర్, రెసిడెన్షియల్ స్కూల్స్, కృష్ణా జిల్లా

టీచర్ పోస్టుల భర్తీకి కసరత్తు

- ఉమ్మడి కృష్ణాలో 47 హైస్కూల్ ప్లస్‌లు
- అర్హులైన సీనియర్ స్కూలు అసిస్టెంట్‌లకు పీజీటీలుగా అవకాశం
- నేడు ధ్రువీకరణ పత్రాల పరిశీలనతో పాటు కౌన్సెలింగ్

పెడన: ఉమ్మడి కృష్ణాజిల్లాలో బాలికల హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 260 సబ్జెక్టు పోస్టులను భర్తీ చేయడానికి జిల్లా విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలో బాలికల హైస్కూల్ ప్లస్ పాఠశాలలు 47వరకు ఉన్నాయి. కృష్ణా జిల్లాలో 24, ఎన్టీఆర్ జిల్లాలో 16, ఏలూరు జిల్లాలో ఏడు కలిపి మొత్తం 47 ఉన్నాయి. వీటిని గతేడాది ప్రారంభించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంతో వీటిని ప్రారంభించినా కరోనా ఇబ్బందులు, పాఠశాలలు ఆలస్యంగా తెరుచుకోవడం వంటి అనివార్య కారణాలతో పూర్తిస్థాయిలో పీజీటీలను నియమించలేదు. ఈ ఏడాది తాజాగా హైస్కూల్ ప్లస్ పాఠశాలలో అర్హులైన స్కూలు అసిస్టెంట్‌లకు పోస్టు గ్రాడ్యుయేట్ (పీజీటీ)టీచర్లుగా ఇదే కేడర్‌లో అవకాశం కల్పించి ఒక ఇంక్రిమెంట్ ఇస్తూ కౌన్సెలింగ్ ద్వారా 20న అంటే శనివారం నియామకాలు చేపట్టనుంది.

జాబితా సిద్ధం..

జెడ్పీ, మున్సిపల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూలు అసిస్టెంట్లుగా ఉండి ఆయా సబ్జెక్టుల్లో పీజీ పూర్తి చేసిన వారిని సీనియార్టీ ప్రకారం ఖాళీ పోస్టులను భర్తీ చేయడానికి విద్యాశాఖ చర్యలు తీసుకుంది. నేడు కౌన్సెలింగ్ చేపట్టనుంది. ఈ కౌన్సెలింగ్ 19న జరగాల్సి ఉండగా సమాచారం ఉపాధ్యాయులకు చేరవేసే విషయంలో, సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టడానికి సమయం అవసరం కావడంతో ఒక రోజు జాప్యం జరిగింది.



పెదన మండలంలోని చెన్నూరులో హైస్కూలు ప్లస్ జెడ్పీహెచ్ఎస్

సబ్జెక్టులు వారిగా ఖాళీలు ఇవే..

హైస్కూలు ప్లస్‌లో ఖాళీలను పరిశీలిస్తే తెలుగు 40, ఇంగ్లిష్ 40, గణితం 29, ఫిజిక్స్ 36, కెమిస్ట్రీ 36, బోటని 29, జువాలజీ 29, సివిక్స్ 7, ఎకనామిక్స్ 7, కామర్స్ 7 పోస్టులు ఖాళీలున్నాయి. వీటిని భర్తీ చేయాల్సి ఉంది.

కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు



ఉమ్మడి కృష్ణా జిల్లాలోని 47 హైస్కూలు ప్లస్ పాఠశాలలో ఖాళీగా ఉన్న 260 పోస్టులను భర్తీ చేయడానికి శనివారం ఉదయం సీనియార్టీ జాబితా ప్రకారం సదరు ఉపాధ్యాయుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తాం. ఈ ప్రక్రియ ఉదయం పది గంటలకు ప్రారంభమవుతుంది. తదనంతరం మధ్యాహ్నం నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలవుతుంది. గ్రేడ్–2 హెచ్ఎంల పదోన్నతికి సంబంధించి షెడ్యూల్ ఎప్పుడు అనేది శనివారం ప్రకటిస్తాం.

– తాహెరా సుల్తానా, నోడల్ అధికారి, డీఈవో, కృష్ణా జిల్లా

కొంటామని వచ్చి.. కొత్తవాహనంతో ఉడాయించి..

హనుమాన్‌జంక్షన్ రూరల్: యాక్టివా స్కూటీ కొనుగోలు చేసేందుకు వచ్చామంటూ హోండా షోరూం సిబ్బందిని నమ్మించి, వారి కళ్లు గప్పి కొత్త స్కూటర్‌ను అపహరించిన దుండగులు హనుమాన్‌జంక్షన్ పోలీసులకు చిక్కారు. వివరాల్లోకి వెళ్లితే.. స్థానిక విజయవాడరోడ్డులోని అన్విత హోండా షోరూంకు ఈ నెల 13వ తేదీన రాత్రి 11 గంటల సమయంలో ఏలూరుకు చెందిన పాలాటి మోహనరావు, అతని మిత్రులు బండి సత్తిబాబు, కందుల రాజేష్, గుండుబోయిన భారతిరావు, మహాళీ నరేంద్ర వర్మలు వచ్చారు. హోండా యాక్టివా 6జీ మోడల్ బ్లూ కలర్ స్కూటీ కావాలని షోరూం సిబ్బందిని సంప్రదించారు. దీంతో హోండా యాక్టివా బ్లూ కలర్ స్కూటీని చూపించటంతో రూ.13 వేలు డౌన్ పేమెంట్ చెల్లిస్తామని, మిగిలిన మొత్తానికి లోన్ సదుపాయం కల్పించాలని అక్కడి సిబ్బందిని నమ్మించారు. దీంతో లోన్, వాహన రిజిస్ట్రేషన్ నిమిత్తం కావాల్సిన డాక్యుమెంట్స్‌ను ఇంటర్‌నెట్ సెంటర్‌కు వెళ్లి తీసుకువస్తామని కందుల రాజేష్, గుండుబోయిన భారతిరావు, మహాళీ నరేంద్ర వర్మలు బయటకు వెళ్లారు. యాక్టివా స్కూటీ వద్ద ఉన్న మోహనరావు, సత్తిబాబులు అదును చూసుకుని షోరూం సిబ్బంది వేరే పనుల్లో నిమగ్నమై ఉండగా, కొత్త స్కూటీ తీసుకుని పరారయ్యారు. ఈ ఘటనతో నిర్ఘాంతపోయిన హోండా షోరూం సిబ్బంది వారిని వెంబడించిన ఫలితం లేకపోయింది. దీంతో హోండా షోరూం సేల్స్ ఎగ్జిక్యూటివ్ జి.రాజేష్ హనుమాన్‌జంక్షన్ పోలీసులను ఆశ్రయించాడు. ఎస్ఐ ఏడీఎల్ జనార్ధన్ దర్యాప్తు ముమ్మరం చేశారు. ఐదుగురు దుండగులను, కొత్త స్కూటీతో సహా శుక్రవారం హనుమాన్‌జంక్షన్ శివారుల్లో హైవేపై పట్టుకున్నారు.

రగ్బీని ఉన్నత స్థాయిలో నిలపడానికి కృషి

ఏపీ రగ్బీ అసోసియేషన్ ఛైర్మన్‌గా కొరగంజి జగన్, ఉపాధ్యక్షురాలిగా చంద్రకళ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రగ్బీ క్రీడను రాష్ట్రంలో ఉన్నతస్థాయిలో నిలపడానికి కృషి చేస్తానని ఏపీ రగ్బీ అసోసియేషన్ చైర్మన్, కృష్ణా జిల్లా సంఘం అధ్యక్షుడు కొరగంజి జగన్నాథరావు (జగన్) చెప్పారు. ఇటీవల కర్నూలులో జరిగిన ఏపీ రగ్బీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడు కొరగంజి జగన్ రాష్ట్ర సంఘం చైర్మన్‌గా, ప్రధాన కార్యదర్శి నాగళ్ల చంద్రకళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం విజయవాడ కొత్తపేటలోని కల్యాణ మండపంలో పలు క్రీడా సంఘాలు, రగ్బీ క్రీడాకారులు జగన్, చంద్రకళను సత్కరించారు. జగన్ మాట్లాడుతూ జిల్లా కేంద్రాల్లో రగ్బీకి ప్రత్యేకంగా క్రీడా మైదానాలను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు. రగ్బీకి ప్రత్యేక కోచ్‌ల నియామకానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెజ్లింగ్ కోచ్ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు. ఎన్నికైన వారిని జిల్లా రగ్బీ అసోసియేషన్ వ్యవస్థాపకుడు ఎంవీ సత్యప్రసాద్, కోశాధికారి తులసీరావు, సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కే సుగుణారావు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి టీ శ్రీలత, వ్యాయామ ఉపాధ్యాయుడు మధు తదితరులు ఘనంగా సత్కరించారు.



రగ్బీ అసోసియేషన్ చైర్మన్ కొరగంజి జగన్, ఉపాధ్యక్షురాలు చంద్రకళలను సత్కరిస్తున్న సంఘ నాయకులు, క్రీడాకారులు

గంజాయి తరలిస్తున్న ఐదుగురి అరెస్ట్

నిందితుల వద్ద 2.67 కేజీల గంజాయి స్వాధీనం

కృష్ణలంక(విజయవాడతూర్పు): గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఐదుగురిని కృష్ణలంక పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 2.67కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను స్టేషన్ ఆవరణంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో సౌత్ డివిజన్ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ వెల్లడించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన టేకు సంతోష్, గొర్ల ఏసు కల్యాణ్, మాడెం ఆనందరావు, పెండ్లి పవన్‌కుమార్, మైనర్ బాలుడు స్నేహితులు. వీరికి గంజాయి సేవిస్తుంటారు. వీరంతా జల్సాలకు అలవాటు పడి డబ్బు చాలకపోవడంతో గంజాయిని తక్కువ ధరకు తీసుకొచ్చి చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ఎక్కువ ధరకు అమ్మాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో సంతోష్ తన స్నేహితుడు మైనర్ బాలుడిని వెంటపెట్టుకుని తుని వెళ్లి శివ అనే వ్యక్తికి రూ.12వేలు చెల్లించి 3 కేజీల గంజాయిని కొనుగోలు చేశాడు. తెలిసిన వారికి గంజాయిని విక్రయిస్తే.. సేవించడానికి ఇస్తానని ప్రలోభపెట్టగా అందుకు అతని స్నేహితులు అంగీకరించారు. కల్యాణ్, మైనర్ బాలుడు ఇద్దరూ సంతోష్ వద్ద గంజాయి ప్యాకెట్లను తీసుకుని కొంతమందికి విక్రయించారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో సంతోష్ తన వద్ద ఉన్న గంజాయిని విక్రయిద్దామనుకుని సంచిలో వేసుకుని బెంజిసర్కిల్ సమీపంలోని ఒక హోటల్ వద్దకు వెళ్లాడు. అప్పటికే అక్కడ ఉన్న తన స్నేహితులు పవన్, ఆనంద్‌రావు, కల్యాణ్, మైనర్ బాలుడు సంతోష్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి కస్టమర్లకు విక్రయించడానికి మాట్లాడుకుంటున్నారు. ఆ సమయంలో వచ్చిన సమాచారం మేరకు సీఐ ఎం.వి.దుర్గారావు, సిబ్బంది అక్కడకు వెళ్లి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చేసి 2.67కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ ఎం.వి.దుర్గారావు, ఎస్ఐలు కృష్ణసాయి, కృష్ణబాబు, రైటర్ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ డాక్టర్ రవికిరణ్

స్పోర్ట్స్ ఆర్బిట్రేషన్ మ్యూట్‌లో సెమీస్‌కి చేరిన ఆశిష్‌రెడ్డి జట్టు

విజయవాడ స్పోర్ట్స్: స్పోర్ట్స్ ఆర్బిట్రేషన్ మ్యూట్–2023 అంతర్జాతీయ పోటీల్లో రాష్ట్రానికి చెందిన ఆశిష్‌రెడ్డి జట్టు సెమీ ఫైనల్‌కు చేరింది. ఇటీవల స్పెయిన్‌లో ప్రారంభమైన పోటీలకు ఆశిష్‌రెడ్డి బృందం నల్సర్ యూనివర్సిటీ నుంచి ప్రాతినిధ్యం వహించింది. ప్రీ క్వార్టర్స్‌లో చైనా, క్వార్టర్స్‌లో నెదర్లాండ్ టీంలను ఈ జట్టు ఓడించి సెమీస్‌కు చేరింది. ఆశిష్‌రెడ్డి 2021లో జరిగిన సీఎల్ఏటీ పరీక్షల్లో జాతీయ స్థాయిలో 141, రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు కైవసం చేసుకుని నల్సర్ యూనివర్సిటీలో బీఏ ఎల్ఎల్‌బీలో సీటు సాధించారు. ఇక్కడ నుంచే అంతర్జాతీయ స్పోర్ట్స్ ఆర్బిట్రేషన్ మ్యూట్‌కు ప్రాతినిధ్యం వహించిన జట్టుకు ఆశిష్‌రెడ్డి సారథ్యం వహించారు. సెమీస్‌కు చేరిన జట్టు బృందాన్ని నల్సర్ వర్సిటీ తన ట్విట్టర్, ఇన్‌స్టాగామ్‌ల ద్వారా ప్రత్యేకంగా అభినందించారు. ఆశిష్ రెడ్డి తండ్రి ఓంకార్‌రెడ్డి కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో జాయింట్ కమిషనర్‌గా పని చేస్తున్నారు.



ఆశిష్‌రెడ్డి బృందంతో నల్సర్ వర్సిటీ అధ్యాపకులు

కనుల పండువగా కల్యాణోత్సవం

టేకుపల్లి(మోపిదేవి): టేకుపల్లి గ్రామంలోని బాల పార్వతీ సమేత రామేశ్వరస్వామి వారి దివ్య కల్యాణోత్సవం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆలయ ధర్మకర్త యడవల్లి నీలలోహిత శాస్త్రి ఆధ్వర్యంలో రాళ్లపల్లి ఆంజనేయ శాస్త్రి బ్రహ్మత్వంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారి కల్యాణం జరిగింది. ఉదయం ఆరు గంటలకు సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, పంచామృత స్నపన, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పములతో

పోలీస్ కమిషనరేట్ పరిధిలో రేపటి నుంచి 144 సెక్షన్

విజయవాడ స్పోర్ట్స్: శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 21వ తేదీ ఆదివారం నుంచి ఈ ఏడాది జూలై తొమ్మిదో తేదీ వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం, భవానీపురం, వన్‌టౌన్, టు టౌన్, ఎస్ఎన్‌పురం, అజిత్‌సింగ్‌నగర్, నున్న, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, కృష్ణలంక, మాచవరం, గుణదల, పటమట పీఎస్ పరిధిలో నిషేధాజ్ఞలు 50 రోజుల పాటు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఒకే ప్రాంతంలో గుమిగూడినా, కర్రలు, రాళ్లు, మారణాయుధాలతో సంచరించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): డ్రిల్లింగ్ చేస్తుండగా విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన గ్రామ సమీపంలో శుక్రవారం జరిగింది. జగ్గయ్యపేట చెరువు బజారుకు చెందిన బత్తుల సత్యం (26) కాంక్రిట్ డ్రిల్లింగ్ పనులు చేస్తుంటాడు. శుక్రవారం ఉదయం గ్రామంలోని ఒక పాత ఇనుము కొట్టులో డ్రిల్లింగ్ పనికి వెళ్లాడు. అక్కడ విద్యుత్ షాక్‌కు గురై కుప్ప కూలాడు. స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, ఏడాది కుమార్తె ఉన్నారు. భార్య ప్రస్తుతం గర్భిణి. తండ్రి బుజ్జి ఫిర్యాదుతో చిల్లకల్లు ఎస్ఐ దుర్గా ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో రైల్వే ఉద్యోగి, మరో ఇద్దరికి జైలుశిక్ష

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే సొత్తు చోరీకి పాల్పడ్డ రైల్వే ఉద్యోగి, అతనికి సహకరించిన మరో ఇద్దరు నిందితులకు ఆరు నెలల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ. 2వేలు జరిమానా విధిస్తూ రైల్వే కోర్టు న్యాయమూర్తి సురేష్‌బాబు శుక్రవారం తీర్పు వెల్లడించారు. వివరాల ప్రకారం నగరంలోని పెజ్జోనిపేటకు చెందిన షేక్ మొహ్మద్ అస్లామ్ రైల్వేలోని కన్జ్యూమనర్ డిపోలో కలాసీగా చేస్తున్నాడు. పాయకాపురానికి చెందిన మరుదొడ్డి వినిత్‌బాబు, పెజ్జోనిపేటకు చెందిన వీరవల్లి రవికాంత్‌తో కలసి రైల్వే ఉద్యోగి 2021 డిసెంబర్ 24న నైజాంగేటు సెంటర్ సమీపంలోని డిజిల్ డిపోలో డీజిల్ చోరీకి పాల్పడ్డారు. అందిన సమాచారం మేరకు ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం.ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సై ఎం.వెంకట్రావు, కానిస్టేబుల్ గోపాలరావు నిందితులను పట్టుకుని వారి నుంచి 20 లీటర్ల డీజిల్ స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రైల్వే కోర్టులో హాజరుపర్చగా 17 మంది సాక్షులను విచారణ చేశారు. నేరం రుజువు కావటంతో రైల్వే కోర్టు న్యాయమూర్తి పైవిధంగా తీర్పు ఇచ్చారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

కూచిపూడి(మొవ్వ): వృద్ధురాలి ఇంట్లో చొరబడి బంగారం చోరీ చేసిన ఘటనలో నిందితులను అరెస్టు చేసినట్లు గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్ తెలిపారు. చోరీ ఘటన, నిందితులను పట్టుకున్న వివరాలను శుక్రవారం గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్ కూచిపూడి పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. ఆయన మాట్లా డుతూ గత నెల 20న కూచిపూడి పీఎస్ పరిధిలోని కోసూరులో ఒంటరిగా జీవిస్తున్న వృద్ధురాలు బేబి సరోజిని ఇంట్లోకి కొందరు చొరబడి బంగారం చోరీ చేసినట్లు తెలిపారు. ఎస్పీ జాషువా ఆదేశాలతో పామర్రు సీఐ ఎన్.వెంకట నారాయణ, కూచిపూడి ఎస్ఐ డి.సందీప్ సీసీ ఫుటేజీ, ఇంతర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కేసును ఛేదించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులు దోపిడీకి ముందు ఐదు రోజులు రెక్కీ చేశారన్నారు. వృద్ధురాలి ఇంటిని ఎంచుకుని రాత్రి వేళ కిటికీ చువ్వలు తొలగించి ఇంటిలోకి ప్రవేశించారని తెలిపారు. వృద్ధురాలి నోటి లో దుస్తులు కుక్కి, చంపేస్తామని బెదిరించి దోపిడీకి పాల్పడ్డారని తెలిపారు. సుమారు రూ. 4 లక్షల విలువైన.. బంగారు గొలుసు, మూడు గాజులను రికవరీ చేశామని చెప్పారు. దొంగతనానికి వినియోగించిన మోటారు సైకిల్‌ని, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు ఇద్దరూ అదే గ్రామానికి(కోసూరు) చెందిన వారని ఒకరు కొనగళ్ల అంకాలరావు, మరొకరు మైనరు బాలుడని తెలిపారు. కేసు ఛేదించడంలో కూచిపూడి పోలీసులు చూపిన ప్రతిభను గుర్తించి ఎస్ఐ సందీప్‌కి, కానిస్టేబుల్స్ నరసింహారావు, శేషుబాబు, బి.ప్రమోద్, పి.గోపిరాజు, నాగరాజు, కేస్ శివాజీ, కేవీ సతీష్ కుమార్‌లకు ప్రోత్సాహక నగదు బహుమతిని డీఎస్పీ చేతుల మీదుగా అందజేసి అభినందించారు.

వృత్తి నైపుణ్యం పెరిగేందుకు సీఎంఈలు దోహదం

గుంటూరు మెడికల్: పీజీ వైద్య విద్యార్థులకు, జూనియర్ వైద్యులకు వృత్తి నైపుణ్యం పెరిగేందుకు నిరంతర వైద్య విద్య కార్యక్రమాలు (సీఎంఈ) ఎంతో ఉపయోగపడతాయని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి అన్నారు. శుక్రవారం జీజీహెచ్ ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో బేసిక్ నీ ఆర్థ్రోస్కోపి హ్యాండ్సాన్ కెడావరిక్ వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా ఉమాజ్యోతి హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి సీఎంఈని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీనియర్ వైద్యులు తమ వృత్తి నైపుణ్యాలు, అనుభవాల్ని సీఎంఈల ద్వారా జూనియర్ వైద్యులకు చేరవేస్తారని తెలిపారు. యువ వైద్యులంతా వీటికి హాజరై వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి సూచించారు. ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో తొలిసారిగా కెడావరిక్ లైవ్ వర్క్‌షాప్ నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఆసుపత్రిలోని శవాగారంలో నాలుగు మృతదేహాలపై పీజీ వైద్య విద్యార్థులకు మోకీలు లోపల నరాలు తెగినప్పుడు ఆర్థ్రోస్కోపి ద్వారా సర్జరీ చేసే విధానాన్ని పలువురు సీనియర్ వైద్యులు నేర్పించారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ వైద్య విభాగాధిపతి డాక్టర్ ఘంటా వరప్రసాద్, ప్రొఫెసర్లు యశస్వి రమణ, డాక్టర్ వి.వి.నారాయణరావు, డాక్టర్ అద్దేపల్లి శ్రీనివాస్, సీనియర్ వైద్యులు డాక్టర్ సూరత్ అమరనాథ్, డాక్టర్ మామిళ్లపల్లి శివకుమార్, డాక్టర్ పాపారావు, డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి, డాక్టర్ సందీప్, డాక్టర్ చెతన్య, డాక్టర్ సతీష్‌బాబు, డాక్టర్ మృదుల తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తోపుడు బండి అందజేత



కృష్ణలంక(విజయవాడతూర్పు):నిరుపేద కుటుంబానికి చెందిన మహిళకు కూరగాయలు విక్రయిస్తూ జీవనోపాధి పొందేందుకు దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా శుక్రవారం తోపుడుబండిని అందజేశారు. కృష్ణలంకలోని శ్రీ పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ పాఠశాల వద్ద జరిగిన కార్యక్రమంలో 20వ డివిజన్‌కు చెందిన ఆవుల మాణిక్యమ్మకు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కడియాల బుచ్చిబాబు రూ.15 వేలు విలువగల తోపుడు బండిని అందించి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ సుభాని, వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్.ఎస్.రాజు, పల్లెం రవి, పుప్పాల రాజా, బాషా, రాజీకమల్, రఫీ, శాస్త్రీ, సురేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్):అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే, ఏపీ ప్రణాళికాబోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు ఆకాంక్షించారు. 26వ డివిజన్ చుట్టుగుంట అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో శుక్రవారం అమావాస్యను పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి ఏ గొల్లభామ నాగేశ్వరరావు ఆధ్వర్యాన రుద్ర చండీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన అమ్మవారిని భక్తితో సేవిస్తే సకల కష్టాలు తీరుతాయన్నారు లోక కళ్యాణార్థం రుద్ర చండీ హోమం నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యాన ఎమ్మెల్యే మల్లాది విష్ణును అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు , వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పేరిణి నాట్యం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన పేరిణి సందీప్ బృందం ప్రదర్శించిన పేరిణి నాట్యం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై నిర్వహించిన ప్రదర్శనలో పలు కీర్తనలకు చక్కటి నాట్యంతో అలరించారు. బి.అపర్ణ, ఎం. ఇంద్రజ, ఎం. అభినయ, చిట్టి, మౌనిక, అక్షయ్‌లతో పాటు మరి కొందరు కళాకారులు తమ నాట్య ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం కళాకారులకు ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందచేసి దర్శనం కల్పించారు.

నేటి నుంచి చాగంటి ఆధ్యాత్మిక ప్రసంగం

విజయవాడ కల్చరల్: మల్లాది వెంకట సుబ్బారావు, సుందరమ్మ చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు నేతృత్వంలో దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో 20, 21 తేదీల్లో ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు హనుమత్ వైభవం అంశంగా ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తునట్లు 26వ డివిజన్ కార్పరేటర్ కొండాయిగుంట మల్లేశ్వరీ బలరాం తెలిపారు. సంగీత కళాశాలలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. రెండు రోజులపాటు నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమంలో నగరానికి చెందిన పలువురు కార్పొరేటర్ల, శాసనసభ్యులు పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశంలో సుధీర్, రత్నకుమార్, వంశీ, కురటి శివ, కొల్లూరి వేంకటేశ్వరరావు యర్రంశెట్టి శ్రీను, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలు సిగ్గుచేటు

- ఇళ్ల స్థలాలను సమాధులతో పోల్చడం హేయం
- వైఎస్సార్ సీపీ తూర్పు నేతల ఆగ్రహం



శిఖామణి సెంటర్‌లో చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ నేతలు, ప్రజా ప్రతినిధులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలను చంద్రబాబు సమాధులతో పోల్చడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు రావడంతో మతిభ్రమించి సైకోలా వ్యవహరిస్తూ భాష గతి తప్పిందని మండిపడ్డారు. ఇళ్ల స్థలాలపై చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం శిఖామణి సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నేత కడియాల బుచ్చిబాబు మాట్లాడుతూ అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 30 లక్షల అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇళ్ల పట్టాలు ఇచ్చే కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా నిర్వహించారని చెప్పారు. రాష్ట్రానికి 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పేదలకు ఒక్కసెంటు భూమి ఇవ్వలేదని ఆరోపించారు. చంద్రబాబు, లోకేష్‌లు ఎన్ని మాయ మాటలు చెప్పినా 2024లో టీడీపీ భూస్థాపితం కావడం ఖాయమన్నారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ మాట్లాడుతూ దేవినేని అవినాష్ గడప గడపకు తిరుగుతుంటే ప్రజలు సంక్షేమ పథకాలు తమకు అందుతున్నాయంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు ధనికులు, పెత్తందార్ల పక్షాన ఉంటే, పేదల పక్షాన జగన్ ఉన్నారన్నారు. అమరావతిలో ఇళ్ల స్థలాలను అడ్డుకునేందుకు రూ. కోట్లు ఖర్చు చేశారని, చిల్లర రాజకీయాలు చేసి కోర్టుకు వెళ్లారన్నారు. చివరకు అత్యున్నత న్యాయస్థానం కూడా ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించిందన్నారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జనరంజక పాలన సాగుతుంటే, బుద్ధి మందగించిన చంద్రబాబు ఏవేవో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కార్పొరేటర్లు తంగిరాల రామిరెడ్డి, మెరకనపల్లి మాధురి, కలపాల అంబేడ్కర్, కొండారెడ్డి, అమర్నాథ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కొరివి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

లబ్బీపేట(విజయవాడతూర్పు): పేదల ఇళ్ల స్థలాలను సమాధులతో పోల్చిన మాట్లాడటం చంద్రబాబు దురహంకారానికి నిదర్శనమని ముస్లిం డెవలప్‌మెంట్ సొసైటీ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం అన్నారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ రాజధానిలో కేవలం తన సామాజిక వర్గం వారే ఉండాలని, చంద్రబాబు పేదల ఇళ్ల స్థలాలపై అనేక ఆటంకాలు కలిగించారన్నారు. కానీ సుప్రీం కోర్టు పేదల పక్షాన తీర్పు ఇవ్వడంతో, అక్కసు వెళ్లగక్కుతూ ఇళ్ల స్థలాలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నాడని ఆరోపించారు. చంద్రబాబు తాను ముఖ్యమంత్రిగా ఉన్న 14 ఏళ్లలో పేదలకు ఒక్క సెంటు భూమి ఇచ్చారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పేదల ప్రభుత్వం అధికారంలో ఉందని, పేదలకు మేలు చేస్తుంటే ఓర్వలేని లోకేష్, చంద్రబాబులు మతిభ్రమించిన మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. పేదలు 2024లో టీడీపీని భూస్థాపితం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

నేడు మంత్రి కాకాణి గోవర్ధన్ ప్రసంగం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు):ఆంధ్రప్రదేశ్ సీ రాఘవాచారి మీడియా అకాడమీ, ఆచార్య నాగార్జున యూనివర్శిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న డిప్లొమో కోర్సు ఇన్ జర్నలిజంలో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు వివిధ మాధ్యమాలకు వార్తలు రాయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అశంపై సీనియర్ జర్నలిస్ట్ పమిడికాల్వ మధుసూదన్ మాట్లాడతారని మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 9 నుంచి 10 గంటల వరకు వ్యవసాయం రంగం- తీరుతెన్నులు అనే అంశంపై వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ ప్రసంగిస్తారని తెలియజేశారు. ఈ అవగాహన తరగతులకు డిప్లొమో కోర్సు చేస్తున్న వారితో పాటుగా ఆసక్తి ఉన్న జర్నలిస్టులు అందరూ జూమ్ మీటింగ్ ఐడీ-815 9892 6979 పాస్‌వర్డ్-12345 హాజరుకావచ్చన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కంకిపాడు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని పలువురు అధికారులు పేర్కొన్నారు. పునాదిపాడు పంచాయతీ పరిధిలో మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అవగాహన ర్యాలీ చేశారు. ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ సచివాలయ సిబ్బంది నినాదాలు చేశారు. ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు.

స్వచ్ఛమైన కృష్ణా నీటిని అందించడమే లక్ష్యం



ప్లకార్డుల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్న విద్యార్థులు



కేఎల్‌యు ప్రతినిధులతో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ కేవీ సత్యవతి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు):నగరంలోని ఏలూరు, రైవస్, బందరు కాలువలను సుందరీకరణ చేసేందుకు కేఎల్‌యూ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని విజయవాడ నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ కేవీ సత్యవతి చెప్పారు. నగరంలోని కాలువల గట్ల దగ్గర కేఎల్‌యు విద్యార్థులు కాలువల పరిరక్షణ, కాలువల నిర్వహణ-ఆధునికీకరణపై వీధి వ్యాపారులకు, కాలువ గట్లపై ఉంటున్న నివాసితులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ కాలువల సుందరీకరణకు ముందుకు వచ్చిన విద్యార్థులకు కార్పొరేషన్ పరంగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. కేఎల్‌యు విద్యార్థులు యాక్టివిటీ సెంటర్ డైరెక్టర్ సాయి విజయ్ మాట్లాడుతూ తమ విద్యాసంస్థలోని విద్యార్థులు స్మార్ట్ సిటీ అనే కార్యక్రమంలో భాగంగా నగరంలోని రైవస్, ఏలూరు, బందరు కాలువ పరిసరాల్లో సర్వే నిర్వహించారని చెప్పారు. కాలువల్లో స్వచ్ఛమైన కృష్ణానది నీరు ప్రవహించాల్సి ఉండగా అందులో ప్రయాణికులు, కాలువ గట్లపై నివాసం ఉంటున్న వారు పడవేస్తున్న వ్యర్థాల కారణంగా నీరు పూర్తిగా కాలుష్యం అయ్యిందన్నారు. అందువల్ల విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌తో తమ విద్యాసంస్థ భాగస్వామ్యం అయ్యి మిషన్ ఫర్ క్లీన్ కృష్ణా అనే కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభిమచామని చెప్పారు. విజయవాడ ప్రజలకు స్వచ్ఛమైన కృష్ణా నీటిని కాలువల్లో అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. అందులో భాగంగా నగరంలోని కాలువల స్థితి గతులను పరిశీలించడానికి తమ విద్యార్థులను బృందాలుగా చేశామన్నారు. కాలువల్లో వ్యర్థాలు వేయవద్దంటూ విద్యార్థులు ప్లకార్డులు, ఫ్లాష్‌మాబ్‌లు ప్రదర్శిస్తూ స్థానికులు అవగాహన కల్పిస్తారని చెప్పారు. కేఎల్ యూనివర్శిటీ కో-ఆర్డినేటర్ వంశీ నారాయణ తదతరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ షహర్‌లో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న వీఎంసీ సీఎంవోహెచ్ డాక్టర్ పి. రత్నావళి

పటమట(విజయవాడతూర్పు): జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేరీ లైఫ్-మేరా స్వచ్ఛ షహర్ కార్యక్రమంలో నగరాసులు భాగస్వాములు కావాలని వీఎంసీ ప్రజారోగ్యవిభాగం అధికారి డాక్టర్ పి. రత్నావళి పిలుపునిచ్చారు. నగరంలోని ఆయా ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో స్క్రూబ్రిడ్జి వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మే 20 నుంచి జూన్ 5 వరకు విజయవాడ నగరంలోని 64 డివిజన్‌లలో 15 రోజుల పాటు మేరీ లైఫ్-మేరా స్వచ్ఛ షహర్ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఆయా డివిజన్లలోని స్వచ్ఛంద సంస్థలు, అపార్టుమెంట్లు, స్కూల్స్, కాలేజి స్టూడెంట్స్, రెస్టారెంట్ల నిర్వాహకులతో కలిసి ప్రత్యేకంగా పాల్గొనాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతో నా జీవితం, నా పట్టణం పర్యావరణం కోసం జీవన విధానంలో భాగంగా లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్ ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఇందులో స్వచ్ఛ భారత్ మిషన్ చేపట్టిన ఆర్.ఆర్.ఆర్ (రెడ్యూస్ - రీసైకిల్ - రీయూజ్) ప్రక్రియలో ప్రజలను భాగస్వామ్యం చేయాలనే లక్ష్యంతో ఉపయోగపడే పాత దుస్తులు, బొమ్మలు, ప్లాస్టిక్, పుస్తకాలు ఇతర వస్తువులను పెద్ద ఎత్తున సేకరించనున్నట్లు చెప్పారు. పాత వస్తువుల సేకరణ కోసం విజయవాడ నగరంలోని 64 డివిజన్లలోని ముఖ్య ప్రాంతాల్లో 67 కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఆయా డివిజన్లలో స్థానికంగా ఉండే ప్రజలు, సంస్థలు చైతన్యవంతులై తమ వద్ద నిరుపయోగంగా ఉండి రీసైక్లింగ్‌కు ఉపయోగపడే వస్తువులను ఆయా కేంద్రాల్లో అందించాలని కోరారు. ప్రజల నుంచి సేకరించిన వస్తవులను ఆయా కేంద్రాల వద్దనే ఉపయోగపడేవారికి అందించే చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మిగిలిన వస్తువులను డ్రై వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ ద్వారా రీసైక్లింగ్ చేసి పునర్వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

115 పరుగుల తేడాతో శక్తి సీసీ గెలుపు



శక్తి సీసీ జట్టు ఆల్‌రౌండర్ ఆర్యన్‌సాయికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

విజయవాడ స్పోర్ట్స్:కేకే గ్లోబల్ క్రికెట్ టోర్నమెంట్ రెండో మ్యాచ్‌లో శక్తి సీసీ జట్టు తన ప్రత్యర్థి ప్లేయర్స్ ఎలెవన్ జట్టుపై 115 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. విజయవాడ శివారు యనమలకుదురులోని కేకే గ్లోబల్ క్రికెట్ అకాడమీ మైదానంలో శుక్రవారం జరిగిన వన్డే లీగ్ మ్యాచ్‌లో ఈ రెండు జట్ల మధ్య పోరు ఆసక్తికరంగా సాగింది. టాస్ గెలిచిన బ్యాటింగ్ ఎంచుకున్న శక్తి సీసీ జట్టు బ్యాటింగ్ ఎంచుకుని తొలి ఇన్నింగ్స్‌లో 42.4 ఓవర్లకు 265 పరుగులు చేసి ఆలౌటయింది. బ్యాట్స్‌మెన్‌లు ధీరు 47, కె.ఆర్యన్‌సాయి 44 పరుగులతో రాణించారు. రెండో ఇన్నింగ్స్‌లో ప్రత్యర్థి ప్లేయర్స్ ఎలెవన్ జట్టును శక్తిసీసీ బౌలర్లు 46.3వ ఓవర్ వద్ద 150 పరుగులకు కట్టడి చేశారు. శక్తి సీసీ బౌలర్లు ఆర్యన్‌సాయి, సాయిప్రకాష్, విగ్నేష్ రెండేసీ వికెట్లు తీశారు. 44 పరుగులు, రెండు వికెట్లు తీసిన శక్తిసీసీ జట్టు ఆల్‌రౌండర్ ఆర్యన్‌సాయి మ్యాన్ ఆఫ్ మ్యాచ్ ట్రోఫీని అకాడమి మేనేజర్ ఎస్.జానకీరామ్ చేతుల మీదుగా అందుకున్నారు. ఇదే మైదానంలో నేడు కేకే గ్లోబల్, ప్లేయర్స్ ఎలెవన్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి



సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు):రాణిగారితోటలోని పలు చోట్ల స్వాతంత్ర సమరయోదుడు, సీపీఎం అగ్ర నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సీపీఎం నగర నాయకుడు ఎస్.హరినారాయణ సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరయ్య చేసిన త్యాగం మరువలేనిదని కొనియాడారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లడమే మనమిచ్చే ఘనమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు టి.చంద్రశేఖర్, కె.వెంకటేశ్వరరావు, గురవయ్య, ఈశ్వరరెడ్డి, మోహన్‌రావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్యకు ఘన నివాళి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు):పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మొగల్రాజపురం బోయపాటి మాధవ రావు రోడ్డులోని భగత్‌సింగ్ గ్రంథాలయం దగ్గర సుందరయ్య చిత్రపటానికి సీపీఎం నాయకులు నివాళులర్పించారు. సీపీఎం తూర్పు సిటీ కమిటీ సభ్యుడు పి.మురహరిరావు, డాక్టర్ పిన్నమనేని కృష్ణారావు, శ్రీనివాసరావు, సునంద, రంగారావు, కామినేని రమేష్, వెంకటేశ్వరరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు. ఇంటింటా సుందరయ్య పేరుతో సుందరయ్య చిత్రపటానికి చేత పట్టుకుని ఆయనకు నివాళులర్పించారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు.

నిస్వార్థ రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనం

సుందరయ్య వర్ధంతి సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు నివాళి

సాక్షి, అమరావతి: నిస్వార్థ రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచే పుచ్చలపల్లి సుందరయ్యను రాజకీయ వేత్తలు ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. విజయవాడలోని సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో సుందరయ్య 38వ వర్ధంతి సభ శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన ఆర్థిక విధానాలు వచ్చిన తర్వాత ఎన్నికలు, రాజకీయాలు కూడా వ్యాపారీకరణ జరిగిన దశలో మనం ఉన్నామన్నారు. రాజకీయాలంటే పదవులు, డబ్బు అనేలా మారిపోయిందని, అన్ని రంగాలకంటే ఎక్కువ లాభదాయకమైన కార్పొరేట్ బిజినెస్ మోడల్‌గా రాజకీయాల్ని మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ విలువలను నిలబెట్టడానికి, వాటిని నేటి యువతరానికి అందించడానికి సుందరయ్య ఆనాడు వేసిన పునాది నేటికీ ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. సొంత జీవితంలో నిజాయితీ, ఆదర్శనీయమైన రాజకీయాలను పాటించడమే కాకుండా సమాజాన్ని మార్చే విప్లవ రాజకీయ విధానాన్ని, ఉన్నతమైన వ్యూహాన్ని సుందరయ్య అందించారని ప్రశంసించారు. జమీందారీ, తెలంగాణ సాయుధ పోరాటం, కూలి పోరాటాలు, భూపోరాటాల వంటి వాటికి నాయకత్వం వహించారని వివరించారు. సీపీఎం సీనియర్ నేత పి.మధు మాట్లాడుతూ సుందరయ్య చాలా చిన్నతనంలోనే దోపిడీ మీద పోరాటాన్ని ప్రారంభించారన్నారు. సుందరయ్య స్ఫూర్తితో రైతాంగం మీద జరుగుతున్న దాడిని తిప్పికొట్టాలని కోరారు. పార్టీ నాయకుడు జయరాం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, వి.వెంకటేశ్వర్లు, కె.ధనలక్ష్మి, బీఆర్ తులసీరావు, వి.ఉమామహేశ్వరరావు, ఎం.సూర్యారావు, కె.ఉమామహేశ్వరరావు, కె.స్వరూపరాణి, వై.అచ్యుతరావు పాల్గొన్నారు.

అమరావతి లేఅవుట్లలో అభివృద్ధి పనులు పరిశీలన



అమరావతిలో పేదలకు ఇస్తున్న ఇళ్ల స్థలాల అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అమరావతి ప్రాంతంలోని నిడమర్రు, కురగల్లు గ్రామాల్లోని జగనన్న కాలనీ లే అవుట్లలో అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదేశించారు. సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని పేద ప్రజలకు సీఆర్డీఏ పరిధిలోని నిడమర్రు లేఅవుట్ 5, కురగల్లు పరిధిలోని లేఅవుట్ 2, 3 లలో కేటాయించిన నివాస స్థలాలను అధికారులతో కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా త్వరలో పట్టాల పంపిణీ ఉండటంతో అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి లేఅవుట్ లోనూ మెరక పనులు, సర్వే రాళ్ల పాతే ప్రక్రియ, అంతర్గత రహదారుల నిర్మాణ పనులను పరిశీలించారు. నిడమర్రు లే అవుట్ 5 లో పనులు పూర్తికావడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. పేదల ఇళ్లను సమాధులతో పోల్చడం చంద్రబాబు దురహంకారానికి నిదర్శనమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ధ్వజమెత్తారు. దాదాపు 51 వేల మంది పేదలకు సీఆర్డీఏ పరిధిలో ఇళ్ల స్థలాలు కేటాయిస్తే.. ఇవ్వడానికి వీల్లేదని కోర్టుల ద్వారా మూడున్నరేళ్లు అడ్డుకున్నారని మండిపడ్డారు. చివరకు దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పుతో మార్గం సుగుమం అయిందన్నారు. సెంట్రల్ నియోజకవర్గానికి సంబంధించి అమరావతిలో ఇళ్ల స్థలాలు మంజూరైన 7,211 మందిలో 5,642 మంది లబ్ధిదారులకు పట్టాల పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మిగిలిన 1,569 మందికి కూడా సర్వే ప్రక్రియ పూర్తిచేసి త్వరలోనే పట్టాలు అందజేస్తామని తెలిపారు. అలాగే 90 రోజుల ప్రోగ్రాం ద్వారా కొత్తగా 2,250 మంది అర్హులకు మంజూరైన పట్టాలను త్వరలోనే అందిస్తామని చెప్పారు. అర్హత ఉండి ఇల్లు రాని వారు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సమ్మర్ కిట్‌లు పంపిణీ

విజయవాడ స్పోర్ట్స్:ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఐదో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సెక్టార్-1, 2లో పని చేస్తున్న 120 మంది సిబ్బందికి ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్ సమ్మర్ కిట్‌లను బెంజిసర్కిల్ వద్ద శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, ట్రాఫిక్ ఏడీసీపీ టి.సర్కార్, ఏసీపీ వెంకట నారాయణ ఆదేశాలతో స్టేషన్ పరిధిలోని బందరు రోడ్డు, బెంజిసర్కిల్, వారధి, నైస్‌బార్, చుట్టగుంట, గీతానగర్‌కట్ట ప్రాంతాల్లో ఎండలో విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీసుల సంక్షేమం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. నెలకు సరిపడా గ్లూకోజ్ ప్యాకెట్లు, రెండు నాప్‌కిన్స్, నెలకు సరిపడా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కూలింగ్ వాటర్‌బాటిల్, సన్‌గ్లాస్, బ్యాగ్ ఈ కిట్టులో ఉంటాయన్నారు.

నీరజ పద్మకు డాక్టరేట్ ప్రదానం



మొగల్రాజపురం(విజయవాడతూర్పు):ఎస్ఆర్‌ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఇంగ్లిష్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న తనకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందని ఎ.నీరజా పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రా యూనివర్శిటీ ఇంగ్లీషు విభాగం హెచ్ఓడీ ప్రొఫెసర్ డి.నారాయణ పర్యవేక్షణలో డోరిస్ లెస్సింగ్ అనే రచయిత ఆలోచనా విధానంలో స్త్రీవాద దృక్కోణాలు అనే అంశంపై పరిశోధనలు చేశానని పేర్కొన్నారు. ఆధ్యాపక రంగంలోకి రాకముందుగా తాను అఖిల భారత అంతర్ విశ్వ విద్యాలయం మహిళల కబడ్డీ పోటీల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తరపున ప్రాతినిధ్యం వహించి బంగారు పతకాన్ని సాధించానని తెలియజేశారు. అదే విధంగా జాతీయ స్థాయి జూనియర్ కబడ్డీ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ఆడిన జట్టులో సభ్యురాలిగా ఉన్నానన్నారు. డాక్టరేట్ పొందిన నీరజ పద్మను ఎస్ఆర్‌ఐ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నాగభాస్కర్, రీసెర్చ్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ జి.రోశయ్య, కళాశాల ప్లేస్‌మెంట్స్ విభాగం డైరెక్టర్ ఎన్వీ సురేంద్రబాబుతో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

రైల్వే కార్మికులకు మజ్జిగ పంపిణీ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):నగరంలో మండుతున్న ఎండలు దృష్ట్యా రైల్వే కార్మికులకు ఉపశమనం కోసం దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ సీ అండ్ డబ్ల్యూ హెడ్‌క్వార్టర్స్ బ్రాంచ్ ఆధ్వర్యంలో రైల్వే కార్మికులకు మజ్జిగ పంపిణీ చేపట్టారు. బ్రాంచ్ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోచింగ్ డిపో, వ్యాగన్ డిపో, యార్డులో ఎండలో విధులు నిర్వహించే రైల్వే కార్మికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

● ఆత్మీయ అభినందనలు




విజయవాడలో శుక్రవారం నిర్వహించిన వలంటీర్ల సత్కార కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆత్మీయ అభినందనలు తెలియజేస్తూ పూలమొక్కను అందిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ చిత్రమిది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శనివారం ॥ 20-5-2023

నెమలీకల టోపీ ధరించి కోలాహలంగా ఆడతారు.
రేలా... రే... రేలా అంటూ గొంతు కలిపి పాడతారు.
ప్రకృతి గురువు నేర్పిన పాఠాలకు ఆనవాళ్లు వారు.
మొన్నటి వరకు అడవి తల్లి ఒడిలో దాగిన కళారూపాలివన్నీ.
నేడవి అడవి గోడలు దాటి నగరాన్ని ఉర్రూతలూగిస్తున్నాయి.
దేశం ఎల్లలు కూడా దాటే వరకు గుస్సాడి ఆడాలంటున్నారు...
పద్మశ్రీ కనకరాజు.





గుస్సాడి గుండెచప్పుడు

పద్మశ్రీ కనకరాజు

కనకరాజు పేరులో ఇంటి పేరు కనక, ఆయన పేరు రాజు. ఇన్ని వివరాలు మాకక్కర్లేదు, గుస్సాడి నృత్యం చేస్తాడు, మా అందరి చేత అడుగు వేయిస్తాడు కాబట్టి ఆయన మాకు 'గుస్సాడి రాజు' అంటారు స్థానికులు. ఆయన పద్మశ్రీ అందుకున్నప్పటి నుంచి నాగరక ప్రపంచం ఆయన మీద దృష్టి కేంద్రీకరించింది. కనక రాజు అని ఇంటిపేరుతో కలిసి వ్యవహారంలోకి వచ్చారు. అయినప్పటికీ వారి గూడేలకు వెళ్లి కనకరాజు అని అడిగితే వెంటనే గుర్తుపట్టరు. గుస్సాడి కనకరాజు అంటే టక్కున చెప్పేస్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మర్లవాయి ఆయన ఊరు. ప్రస్తుతం కుమ్రుం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, అంతేకాదు, కుమ్రుం భీమ్ వారసులు కూడా. ఆదిలాబాద్‌లో విస్తరించిన గోండ్ తెగకు చెందిన వాళ్లందరూ భీమ్ వారసులుగా గర్వంగా భావిస్తారు. ఎనభై ఏళ్ల కనకరాజు... తండ్రి చెప్పిన మాట కోసం గుస్సాడి నృత్యం పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేశారు. గుస్సాడితో మమేకమైన తన జీవితానుభవాలను సాక్షితో పంచుకున్నారాయన.

ఆట... పాట... జీవితం!

''మా ఆదివాసీల జీవనంలో ప్రకృతి, నృత్యం, గానం కలగలిసి పోయి ఉంటాయి. బిడ్డ పుడితే పాట, పెళ్లి వేడుకకీ పాట, అంతే కాదు... మనిషి పోయినా పాట రూపంలో ఆ వ్యక్తితో మా అనుబంధాన్ని గుర్తు చేసుకుంటాం. దండారీ ఉత్సవాలంటే మాకు ఎక్కడ లేని ఉత్సాహం వచ్చేస్తుంది. మగపిల్లలకు నృత్యం, ఆడపిల్లలకు రేలా పాట చిన్నప్పటి నుంచే నేర్పిస్తాం. గుస్సాడి నృత్యంలో అడుగులు వేయడం ఎప్పుడు మొదలైందో నాకు గుర్తు లేదు. కానీ మా నాన్న ఒక మాట చెప్పేవారు. 'ఈ నృత్యమే మనకు దైవం. 'ఈ నృత్యాన్ని మరువద్దు. తరతరాలుగా మోసుకొస్తున్నాం. దీన్ని కాపాడుకుంటేనే దేవుడు మనల్ని కాపాడుతాడు' అని చెప్పేవాడు. ఆ మాట నాలో నాటుకుపోయింది. నాకు వయసొచ్చినప్పటి నుంచి నృత్యంలో తొలి ఆటగాడిగా అడుగులు వేస్తుండేవాణ్ని. ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీలు నివసించే రెండువేల గూడేలకూ నేను తెలిసిపోయాను.

గణతంత్ర వేడుక

గణతంత్ర వేడుకల్లో మా ప్రాచీన వారసత్వ కళ అయిన గుస్సాడి నృత్యాన్ని ప్రదర్శించే అవకాశం నాకు 1982లో వచ్చింది. అప్పుడు ప్రధానమంత్రి ఇందిరా గాంధీకి మా గుస్సాడి టోపీ పెట్టించి, గజ్జెలు కట్టించాం. ఆమె మాతో అడుగులు వేసింది. ఆ తర్వాత ఓసారి అబ్దుల్ కలామ్ కూడా మాతో అడుగులు వేశారు. హైదరాబాద్‌లో ఎన్ని ప్రదర్శనలిచ్చామో లెక్కే లేదు. ఢిల్లీలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో కూడా మా గుస్సాడిని ప్రదర్శించాం. మరో పది దఫాలు యువతతో చేయించాం. నాయన మాట మీద గుస్సాడి కోసం బతికినందుకే మా దేవుడు మెచ్చి గొప్ప వాళ్ల కిచ్చే పద్మశ్రీని ఇప్పించాడనుకుంటున్నా.



2021లో రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకుంటూ...



సంప్రదాయ వస్త్రధారణలో గుస్సాడి కనకరాజు

నెమలీకల టోపీ

మా నృత్యం సాధన చేయడమే కాదు, టోపీ, దుస్తులు, గజ్జెలు అన్నీ ప్రత్యేకమే. వాటిని తయారు చేయడానికి చాలా నైపుణ్యం ఉండాలి. పెద్ద టోపీకి రెండు వేల పింఛాలుంటాయి. మా ఇళ్లలో వాటిని భద్రపరుచుకోవడం పెద్ద పని. మా ముత్తాతలు ధరించిన టోపీ ఇంకా నేను ధరిస్తూనే ఉన్నాను. కొత్తవాళ్ల కోసం టోపీలు తయారు చేస్తున్నాం. పెద్ద టోపీ, దుస్తులతోపాటు మొత్తం వేషానికి ఇరవై వేల రూపాయలవుతాయి. మా ఆదివాసీ వ్యక్తి తుకారామ్ సాబ్ కలెక్టర్ అయిన తరవాత ఈ నృత్యానికి ఇంకా కొన్ని చేర్పులు చేసి బాగా మంచిగా చేశారు. పద్మశ్రీ వచ్చిన తర్వాత ఐటీడీఏ ఆఫీసర్‌లు గుస్సాడి నృత్యం నేర్పించడానికి వందకు పైగా బడులు పెట్టారు. ఒక్కో బడిలో రెండు–మూడు వందల మంది నేర్చుకుంటున్నారు. నేను పెద్ద మాస్టర్ (చీఫ్ డాన్స్ మాస్టర్)ని. గుస్సాడి, రేలా పాట నేర్పించడానికి 30 మందిని ప్రత్యేకంగా తయారు చేశాను. మరో రెండు వందల మందికి సంపూర్ణంగా శిక్షణనిచ్చాను. ఇంక మామూలుగా నేర్చుకుని ఆడే వాళ్లు ఎన్ని వేల మంది ఉన్నారో నేను ఎప్పుడూ లెక్క చెప్పుకో లేదు.

అడవి తల్లికి అందరూ ఒక్కటే!

మా ఆదివాసీల్లో మగపిల్లాడు ఎక్కువ, ఆడపిల్ల తక్కువనే ఆలోచనే ఉండదు. బిడ్డలంతా సమమే. పెళ్లిలో కట్నకానుకలు ఉండవు. ఆడబిడ్డ పుట్టిందని చింతపడడం మాకు తెలియదు. నాకు ఎనిమిది మంది కూతుళ్లు, ముగ్గురు కొడుకులు. బతకడానికి ఆశ్రమ పాఠశాలలో రోజు కూలీగా పని చేస్తూ కూడా అందరికీ చదువు చెప్పించాను. తొమ్మిది– పది తరగతుల వరకు అందరూ చదువుకున్నారు. రెండో కొడుకు వెంకటేశ్ మాత్రం డిగ్రీ చదివి టీచర్ ఉద్యోగం చేస్తున్నాడు. తరతరాలుగా అడవులకే పరిమితమైపోయిన గుస్సాడి నృత్యాన్ని నేను దేశానికి తెలియ చెప్పాను. మీరు మన ఆట, పాటలను ఇతర దేశాలకు తీసుకెళ్లాలని నా పిల్లలు, శిష్యులకు చెబుతున్నాను'' అని తన ఆకాంక్షను వ్యక్తం చేశారు గుస్సాడి కనకరాజు.

– వాకా మంజులారెడ్డి

సందర్భం

స్కూల్ రోజుల్లో నియతికి లెక్కలు అంటే లెక్కలేనంత భయం.
ఇప్పుడు ఆమెకు వ్యాపార లెక్కలు కొట్టిన పిండి.
అప్పట్లో సైన్స్ సబ్జెక్ట్ పేరు వినబడగానే ముఖం తిప్పుకునేది చిన్నారి నియతి.
ఇప్పుడు ఆమెకు వంటల శాస్త్రం లోతుపాతులు బాగా తెలుసు.
చిన్న వయసులోనే 'స్టార్ చెఫ్'గా పేరు తెచ్చుకున్న
ముంబైకి చెందిన **నియతిరావు** 'ఫోర్బ్స్ 30 అండర్ 30 ఏషియా–2023'
జాబితాలో చోటు సంపాదించింది...

సాహో రే స్టార్ చెఫ్



నియతిరావు

చిన్నప్పుడు నియతిరావు బడి అంటే భయపడేది. లెక్కలు, సైన్స్ అంటే చాలు ఆమెకు వణుకు వచ్చేది. అలాంటి నియతికి అమ్మ, అమ్మమ్మలు చేసే వంటలు అంటే ఇష్టం. వాళ్లు వంటలు చేస్తుంటే ఆసక్తిగా గమనించేది.

తల్లి గుజరాతీ. తండ్రి దక్షిణ భారతం. దీంతో అటు వంటకాలు ఇటు, ఇటు వంటకాలు అటూ వెళ్లేవి. వంటలను అమితంగా ప్రేమించే ఆ ఇంట్లో ఉత్తరాది, దక్షిణాది అనే తేడా లేకుండా ఎన్నో వంటకాలు చవులూరించేవి. 'తినరా మైమరిచి' అని ఆప్యాయంగా పిలుస్తుండేవి.

'అదృష్టాన్ని నమ్ముకోకుండా ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకోండి, అద్భుత ఫలితాన్ని సొంతం చేసుకోండి' అనే మాటను ఎన్నోసార్లు విన్న నియతి తనకు నచ్చిన రంగాన్ని ఎంచుకొని చెఫ్‌గా మారింది.

కోపెన్‌హెగన్(డెన్మార్క్)లో వరల్డ్ ఫేమస్ రెస్టారెంట్ నోమాలో ఇంటర్న్‌షిప్ తరువాత తిరిగి ముంబైకి వచ్చింది.

'ఇప్పుడు ఏ వ్యాపారమైనా రిస్క్' అనుకునే సమయం అది.

అలాంటి సమయంలో 'ఎక్కా' రెస్టారెంట్ ప్రారంభించడానికి రెడీ అయింది. ప్రాజెక్ట్ పట్టాలెక్కుతున్న సమయంలో ఇన్వెస్టర్‌లు వెనకడుగు వేశారు.

'కొన్ని సమయాల్లో డబ్బు కంటే మన మీద మనకు నమ్మకం చాలా అవసరం' అంటున్న నియతి ఆరోజు ధైర్యాన్ని కోల్పోయి ఉంటే, 'ఇక చేసేదేమీ లేదు' అనే నిర్లిప్తతకు గురై ఉంటే 'స్టార్ చెఫ్'గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునేది కాదు.

కొత్త ఇన్వెస్టర్‌లను ఒప్పించడానికి ఎంత కష్టపడిందో తెలియదుగానీ మొత్తానికైతే 'ఎక్కా' రెస్టారెంట్ కలను సాకారం చేసుకుంది.

పద్నాలుగు నెలల వ్యవధిలోనే 'ఎక్కా' ఆసియాలోని అత్యుత్తమ రెస్టారెంట్‌ల జాబితాలో చోటు సంపాదించింది.

నేను తెలుసుకున్న సత్యం





వంటకం అంటే ఆకలి తీర్చుకోవడం, రుచులను ఆస్వాదించడానికే పరిమితమైనది కాదు. అది మన సంస్కృతి. మనం పరస్పరం ఇచ్చుకునే గౌరవం. తరం నుంచి తరానికి మధ్య కదిలే జ్ఞాపకం. గత దశాబ్ద కాలంలో నేను నేర్చుకున్న ఏకైక విషయం... మన భారతీయ వంటకాలు ఎంతో గొప్పవి అని. వాటికి గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉంది అని. మన వంటకాలలో ఉపయోగించే దినుసులపై ప్రత్యేకంగా దృష్టి పెడితే ఎన్నో కాంబినేషన్‌లు, టెక్నిక్స్ గురించి తెలుసుకోవచ్చు, కొత్త రుచులను ఆస్వాదించవచ్చు.

– నియతిరావు

ఈ ఘన విజయానికి కారణం ఏమిటి?

'మెనూ చూడగానే నోరూరడం మాత్రమే కాదు, పాత జ్ఞాపకాలు మదిలో నిండి పోవాలి. ఆ రోజుల్లో మా అమ్మ ఈ వంటకాన్ని అలా చేసేది. ఎంత బాగుండేదో కదా!... ఇలాంటి జ్ఞాపకాలెన్నో దృశ్యాలై కళ్లముందు నిలవాలి' అంటున్న నియతి తన రెస్టారెంట్‌ను ఆషామాషీగా ప్రారంభించలేదు.

ఎంతో గ్రౌండ్ వర్క్ చేసింది.

ఎన్నోచోట్ల సర్వే చేసి కస్టమర్‌ల అభిప్రాయాలను, అభిరుచులను తెలుసుకుంది.

ఏ రెస్టారెంట్ ఎందుకు సక్సెస్ అయింది? ఎందుకు అట్టర్ ఫ్లాప్ అయింది? తెలుసుకోవడానికి కేస్‌స్టడీ చేసింది.

వాటన్నిటినీ ఒక దగ్గర జోడించి, దానికి రుచి జత చేసి పక్కా ప్లాన్‌తో 'ఎక్కా' మొదలుపెట్టింది.

'నేను నేర్చుకున్నాను' అనేవారు ఒక రకం.

'నేను నేర్చుకుంటూనే ఉంటాను' అనేవారు రెండో రకం.

నియతి రెండో రకం.

'భారతీయ వంటకాలలో ఉపయోగించే దినుసులు వేటికవే ప్రత్యేకమైనవి. వాటి ఘుమఘుమలు మరో లోకంలోకి తీసుకువెళతాయి' అంటున్న నియతి దినుసులతో కొత్త ప్రయోగాలు చేస్తూ, కొత్త రుచులను పరిచయం చేస్తుంటుంది.

'ఎక్కా' నిర్వహిస్తున్న బిల్డింగ్‌లోనే 'కేయంసీ' అనే కమ్యూనిటీ స్పేస్‌ను లాంచ్ చేసింది నియతి. 'కేయంసీ' అనేది సృజనాత్మక వంటల ఎగ్జిబిషన్. వాటి గురించి వివరంగా మాట్లాడుకునే చర్చా వేదిక.

'నియతి భవిష్యత్ దార్శనికురాలు. నిత్యప్రయోగశీలి. తన చురుకుదనంతో టీమ్ మెంబర్స్‌లో ఉత్సాహం నింపుతుంది. ప్రతిభ, నాయకత్వ సామర్థ్యం ఉన్న నియతి చిన్న వయసులోనే పెద్ద పేరు తెచ్చుకుంది' అంటున్నారు 'ఎక్కా' ఫస్ట్ ఇన్వెస్టర్ శిల్పా లక్ష్మీనారాయణ్.

'రెస్టారెంట్ అంటే రుచుల సమ్మేళనం మాత్రమే కాదు దానికి సామాజిక బాధ్యత కూడా ఉంది' అంటున్న 28 సంవత్సరాల నియతిరావు మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

కొత్త దారి

ఆ కట్టుబడికి తరించేను గుర్రపుడెక్క జన్మ!

25 కిలోల గుర్రపు డెక్క నుంచి ఒక ఫ్యూజన్ చీర తయారు చేయవచ్చు.

'గుర్రపు డెక్కతో సమస్యలు ఇన్నిన్ని కాదయా' అనే విషయం మనకు తెలియనిదేమీ కాదు. నీటివనరుల పాలిట శత్రువుగా పరిగణించే గుర్రపు డెక్క నుంచి అందమైన చీరలు తయారు చేస్తూ 'ఆహా' అనిపిస్తున్నాడు ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ గౌరవ్ ఆనంద్...

జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌కు చెందిన గౌరవ్ ఆనంద్ టాటా స్టీల్‌లో పనిచేస్తున్న రోజుల్లో నదుల ప్రక్షాళనకు సంబంధించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. ఆ సమయంలో నదులలో దట్టంగా పేరుకుపోయిన గుర్రపు డెక్క అతడి దృష్టిలో పడేది.

'దరిద్రపు మొక్కలు' అని దాన్ని గురించి ప్రజలు తిట్టుకోవడాన్ని ఎన్నోసార్లు విన్నాడు.

'క్లీన్ రివర్ గంగా' మిషన్‌లో పాల్గొన్న తరువాత ప్రతివారం ఎక్కడో ఒకచోట నదులు, కాలువలు, చెరువుల ప్రక్షాళనకు సంబంధించిన కార్యక్రమాల్లో తప్పనిసరిగా పాల్గొనేవాడు.

'నది లేదా చెరువులు, కాలువలను ఒకసారి గుర్తు తెచ్చుకుంటే నీళ్లు కాదు గుర్రపుడెక్క మాత్రమే కళ్ల ముందుకు వచ్చేది' అంటాడు గౌరవ్.


జలవనరుల ప్రక్షాళనకు సంబంధించిన కార్యక్రమాల్లో మరింత విస్తృతంగా పాల్గొనడానికి కార్పొరేట్ ఉద్యోగాన్ని వదిలి 'స్వచ్ఛత' అనే ఫౌండేషన్‌కు శ్రీకారం చుట్టాడు గౌరవ్. ఒకవైపు పర్యావరణ సంబంధిత కార్యక్రమాల్లో పాల్గొంటూనే మరోవైపు గుర్రపు డెక్కపై ప్రయోగాలు చేసేవాడు.

మొదట్లో...

గుర్రపు డెక్కను ఉపయోగించి ల్యాంప్ షెడ్స్, పేపర్లు, నోట్‌బుక్‌లు, మ్యాట్‌లు... మొదలైనవి తయారు చేసేవాడు. ఆ సమయంలో 'ఇంకా ఏం చేయలేమా?' అని మేధోమథనం చేస్తున్న క్రమంలో పుట్టిన ఆలోచనే... గుర్రపు డెక్క నుంచి చీర. ఇలాంటి చీర ప్రపంచంలోనే మొదటిది. అయితే 'గుర్రపు డెక్క నుంచి చీరె' అనేది అంత సులువైన పని కాదు. ఎంతో ఓపిక ఉండాలి.

కాండాలను వారం రోజులపాటు ఎండ బెట్టడం, హాట్ వాటర్ ట్రీట్‌మెంట్ ద్వారా గుజ్జు నుంచి క్రిములను తొలగించడం, ఆ తరువాత దారం తయారు చేయడం పెద్ద పనే. అయితే గౌరవ్ ఎక్కడా డీలా పడలేదు. రెట్టించిన ఉత్సాహంతో పనిచేయడం అలవాటు చేసుకున్నాడు.

ఈ ఏడాది చివరికల్లా 1000 చీరెలను తయారు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాడు గౌరవ్.





గుర్రపు డెక్క నుంచి తయారైన చీర ధరించిన మహిళ

పనికిరాని గుర్రపు డెక్క నుంచి అందమైన చీరెలను తయారు చేయడం ఒక కోణం అయితే గుర్రపు డెక్కను సేకరించి అమ్ముకోవడం ద్వారా ఎంతోమంది మహిళలు ఉపాధి పొందడం అనేది మరో కోణం.

నలభై ఏడు సంవత్సరాల రమ్యకు భర్త చనిపోయాడు. ఆమె ఒక పొగాకు ఫ్యాక్టరీలో తక్కువ జీతానికి పనిచేసేది. ఆరోగ్యం దెబ్బ తినడంతో ఉద్యోగం మానేసింది. గుర్రపు డెక్క సేకరణ ద్వారా రమ్య ఉపాధి పొందుతోంది.

'రోజుకు రెండు నుంచి మూడు గంటలు కష్టపడితే చాలు' అంటుంది రమ్య.

ప్రస్తుతం జంషెడ్‌పూర్ (జార్ఖండ్), ఖరగ్‌పూర్ (పశ్చిమ బెంగాల్)లో ఆఫ్‌లైన్ స్టోర్‌లలో ఈ చీరెలను అమ్ముతున్నారు. మధ్య తరగతిని దృష్టిలో పెట్టుకొని ధరలు నిర్ణయించారు.

'చీరెల ద్వారా లాభాలు గడించాలనేది నా లక్ష్యం కాదు. చేనేత కార్మికుల ఆర్థిక స్థాయి మెరుగు పడాలనేది నా కోరిక' అంటున్నాడు గౌరవ్ ఆనంద్.

'చెరువుల ప్రక్షాళనకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొంటున్నప్పుడు అంతూపొంతూ లేని గుర్రపు డెక్కను చూసి బాగా కోపం వచ్చేది. తిట్టుకునేదాన్ని కూడా. ఇప్పుడు అది అపురూపంగా కనిపిస్తోంది. ఉపయోగించుకుంటే ఏదైనా ఉపయోగమే' అంటుంది పర్యావరణ కార్యకర్త నళిని.

ఇప్పుడు తన ఫేవరెట్ చీర... గుర్రపు డెక్క నుంచి తయారుచేసిన ఫ్యూజన్ చీర!

*** న్యూ బిజినెస్**

ఫేస్ యోగా విత్ ఆయిల్స్



బ్యూటీ ప్రొడక్ట్స్‌తో అరోరా

తనకు వచ్చిన కష్టాన్ని తలుచుకుంటూ కుంగిపోలేదు విభూతి అరోరా. నిరాశగా అనిపించే రోజులనే అవకాశాలుగా మార్చుకొని నేడు సౌందర్య ఉత్పత్తుల వ్యాపారంలో అగ్రగామిగా నిలిచింది. దానికి ముందు అనుభవించిన శారీరక, మానసిక బాధ దానిని ఎదుర్కొన్న పరిణామాలను వివరిస్తుంది ఈ గురుగ్రామ్ వాసి.

''నాకు పాతికేళ్ల వయసులో చర్మానికి సంబంధించిన 'లూపస్' అనే ఆటో ఇమ్యూన్ సమస్య వచ్చింది. ముఖం అంతా దద్దుర్లు వచ్చాయి. చర్మం పగిలి రక్తం కారుతుండేది. ఈ పరిస్థితి ఎంత భయంకరంగా ఉండేదంటే నా రూమ్ దాటి బయటకు వచ్చేదాన్నే కాదు. నా ముఖం ఎవరూ చూడకూడదని లోపలే ఉండిపోయేదాన్ని. రోజంతా ఏడుస్తూ నిద్రపోయేదాన్ని. ఎవరిలోనూ కలవకపోవడం వల్ల నా బంధుమిత్రులకు వ్యతిరేకిని కూడా అయ్యాను. కొన్ని రోజులకు ఒంటరితనంతో నాకు పిచ్చిపడుతుందేమో అనిపించేది.

పెళ్ళిని వదిలేసి..

ఇంతలో మా ఫ్రెండ్ పెళ్లికి రమ్మని ఆహ్వాన పత్రిక వచ్చింది. చాలా సంతోషం అనిపించింది నా స్నేహితులందరినీ కలవచ్చని. ఒక రోజు ముందే ఆ పెళ్లికి వెళ్లాను. డాక్టర్ చెప్పిన మందులను ఆ రాత్రి వేసుకున్నాను. మొత్తం రియాక్షన్ వచ్చింది. ముఖంతో పాటు శరీరం అంతా దద్దుర్లు. దీంతో పెళ్లిలో ఎవరినీ కలవకుండానే ఇంటికి తిరిగివచ్చేశాను. మళ్లీ డాక్టర్ని కలిశాను కానీ, ఎలాంటి ప్రయోజనం లేకపోయింది.

అమ్మమ్మ చిట్కాతో...

ఏం తింటున్నాను, ఏం షాంపూ, ఫేస్ వాష్ ఏది వాడుతున్నాను అనేవి మళ్లీ మళ్లీ చెక్ చేసుకున్నాను. ఎందువల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుందో నాకు అర్థం కాలేదు. చాలామంది వైద్యులను సంప్రదించాను. కానీ, నా సమస్య పరిష్కారం కావడం లేదు. ఒకరోజు మా అమ్మమ్మ సూచించిన ఇంటి చిట్కాను ఉపయోగించడం మొదలుపెట్టాను. దేశీ నెయ్యితో ముఖానికి మసాజ్ చేయడం ప్రారంభించాను. దాంతోపాటు కొద్దిగా ఫేస్ యోగా చేయడం మొదలుపెట్టాను. మెల్ల మెల్లగా ఆ ప్రభావం నాకు తెలిసి వచ్చింది. దాదాపు పదేళ్లుగా పోరాడుతున్న సమస్యకు ఉపశమనం లభించింది.

కొత్త ఉత్పత్తి

దేశీ ఆవు నెయ్యి నాకు అమోఘంగా పని చేసింది. దీంతోపాటు ఫేస్ యోగాతో నా చర్మ సమస్యకు పరిష్కారం లభించింది. అంతే, ఇక నా ప్రయోగాలు మొదలయ్యాయి. ఆయుర్వేద నూనెలు, ఫేస్ యోగాతో అనుసంధానిస్తూ ఒక కొత్త ఉత్పత్తిని తయారు చేయడం మొదలుపెట్టాను. అలా, నాలుగేళ్ల క్రితం 'హౌస్ ఆఫ్ బ్యూటీ' మొదలైంది.

సెల్ఫ్ డిజైన్ ఫేస్ యోగా



ఫేస్ మసాజ్



ఫేస్ యోగా చేస్తూ...

రుగ్వేదంలో ముఖానికి 8 యోగాసనాలు ఉన్నాయి. నాకు అనారోగ్యం వచ్చినప్పుడు దాదాపు 80 ముఖ యోగా భంగిమలు చేశాను. దీంతో తేలికపాటి మచ్చలు కూడా తగ్గిపోయాయి. దాని ప్రభావం నా ముఖంపై కనిపించినప్పుడు మా కుటుంబ సభ్యులు, స్నేహితులు అడగడం మొదలుపెట్టారు. ఆ తర్వాత మాకు కూడా ఫేస్ యోగాను నేర్పించండి అని తెలిసినవారు అడుగుతుండేవారు. దీంతో ముఖం కోసం 80 యోగాసనాలతో కూడిన కోర్సును డిజైన్ చేసి, ఉత్పత్తులతో సహా మార్కెట్‌లోకి విడుదల చేశాను. మొదట జనం దీనిని సీరియస్‌గా తీసుకోలేదు. కానీ, వాడి, ఆ ఫలితాన్ని అనుభవించిన వాళ్లు నా క్లాస్‌కి రావడం, వాళ్ల ద్వారా మరికొంతమంది చేరడం మొదలుపెట్టారు. మెల్ల మెల్లగా ఫేస్‌యోగా ప్రజాదరణ పొందింది.

సౌందర్య ఉత్పత్తులు

దేశీనెయ్యి, బాదం నూనెతో మసాజ్ ఆయిల్స్ తయారు చేశాను. రసాయనాలు లేని, అన్ని రకాల చర్మ తత్వాలకు సరిపోయే వివిధ సౌందర్య ఉత్పత్తులను తయారు చేశాను. ఏ రసాయనాలు లేని ఉత్పత్తులు వాడటం వల్ల ఎలాంటి చర్మ సమస్యలూ తలెత్తవు. అయితే, అది అంత తేలికైన పనికాదని కొన్ని రోజులకే అర్థమైంది. ఇప్పటికే ఎన్నో బ్యూటీప్రొడక్ట్స్ మార్కెట్‌ని ఏలుతున్నాయి. నా సొంత ఆలోచనతో పనిచేయడానికి చాలా ప్రయత్నాలు చేయాల్సి వచ్చింది. రసాయన రహిత ఉత్పత్తుల షెల్ఫ్ కాలం రెండేళ్లు మాత్రమే ఉంటుంది. కాబట్టి, అమ్మడం కష్టంగా ఉండేది. బ్యూటీప్రొడక్ట్స్ మార్కెట్ చేసే వాళ్లు నా ప్రొడక్ట్స్‌ని తీసుకోవడానికి ఇష్టపడలేదు. దీంతో నా వ్యాపారానికి చాలా ప్రతిబంధకాలు ఉన్నాయని అని అర్థమైంది.

ఫేస్‌యోగా విత్ బ్యూటీ ప్రొడక్ట్

కానీ, నేడు ఆలియాభట్, మలైకా అరోరా వంటి సెలబ్రిటీలు నా ఉత్పత్తులు కొనుగోలు చేయడం, వాళ్లు నా ఫేస్ మసాజ్ టూల్‌తో మా ప్రొడక్ట్స్‌కు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడంతో చాలా విజయం సాధించాను అనిపించింది. ఇది నాకు ఉచితంగా లభించిన ప్రమోషన్. దీంతో నా ఉత్పత్తులకు మరింత ప్రజాదరణ లభించింది. నాలుగేళ్లలోనే నా ప్రొడక్ట్స్ సెలబ్రిటీలు ఉపయోగించే దశకు చేరుకుంది. దీంతో నాకు చాలా సంతోషంగా ఉంది. ప్రతికూల పరిస్థితుల నుంచి బయటపడి నాకు నేనుగా నిలదొక్కుకోవడానికి చేసిన కృషిలో మా కుటుంబ విజయం కూడా దాగుంది' అని వివరిస్తుంది అరోరా.